చట్టం కోరల్లో

# దేవాలయాలు



డాక్టర్ ఎం.వి.సౌందరరాజన్


**చట్టం కోరల్లో దేవాలయాలు**

- డాక్టర్ ఎం.వి.సౌందరరాజన్

తొలి ప్రచురణ : ఫిబ్రవరి 2004

వెల : **రూ. 50/-**

ప్రతులకు :

**డాక్టర్ ఎం.వి.సౌందరరాజన్**
2-2-647/77/డి, శ్రీనివాస నగర్ కాలనీ,
బాగ్ అంబర్‌పేట,
హైద్రాబాద్ - 500 013.
ఫోన్ : 27425640

ముద్రణ :

**వాగ్దేవి ప్రింటర్స్**
నల్లకుంట
హైద్రాబాద్ - 500 044.
ఫోన్ : 30912541

## లోపలి పుటల్లో...


| | | | |
|---|---|---|---|
| 1. | ప్రస్తుత చట్టం పుట్టుక | - | 01 |
| 2. | సెక్షన్ 76పై తీర్పు | - | 15 |
| 3. | వంశపారంపర్య ధర్మకర్తృత్వం రద్దు | - | 18 |
| 4. | అనువంశిక అర్చకత్వం రద్దు | - | 20 |
| 5. | మఠాధిపతుల నియామకంపై | - | 25 |
| 6. | చల్లా కొండయ్య కమిషన్ నివేదికలో గూఢాంశాలు | - | 35 |
| 7. | తమిళనాడు అనుభవం | - | 47 |
| 8. | కోర్టు తీర్పుల విశ్లేషణ | - | 66 |
| 9. | తీర్పుల పర్యవసానం | - | 86 |
| 10. | రెండు కమిటీలు - ఐదు శ్రేణులు | - | 96 |
| 11. | వాళ్ళకీ వీళ్ళకీ ఎనిమిదొందలే | - | 99 |
| 12. | ఆలయాల్లో అల్లకల్లోలం | - | 105 |
| 13. | అనుబంధాలు | - | 112 |


*దేవాలయ సంస్కృతీ పరిరక్షణాభిలాషుల గుండెలోతుల్లో*
*సుళ్ళు తిరుగుతున్న భావాలను ఇలా తెలుగులో ఒక పుస్తక రూపంలో*
*తీసుకురావటానికి నాకు త్రికరణశుద్ధిగా సహకరించిన*
*చి॥ జి. వల్లీశ్వర్ (Director, News & Services Syndicate)కి ఆశీస్సులతో...*
*- ఎం.వి. సౌందరరాజన్*



## అంకితం

1987 నాటి పాశవిక చట్టం చట్రంలో
నలిగిపోయి, నిరాశా, నిస్పృహల మధ్య
కళ్ళల్లో రక్తం చిమ్ముతుండగా,
తాను నమ్ముకున్న 'నృసింహస్వామి'ని
స్మరించుకుంటూ ఆత్మార్పణం చేసిన
మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్‌లోని
**యోగనరసింహ స్వామి ఆలయ**
అర్చకులు
**శ్రీ భీమసేనాచారికి**
శ్రద్ధాంజలి ఘటిస్తూ
**దేవాలయ పరిరక్షణ ఉద్యమ**
కార్యకర్తలందరికీ....

# ఈ పుస్తకం ఎందుకంటే....

భయంకరమైన దట్టమైన అరణ్యం. మధ్యలో ఓ చిన్నగుడి. అందులో ఓ దైవం. అట్నుంచి ఇటూ, ఇట్నుంచీ అటూ చెదురు మదురుగా వెళ్తుండే బాటసారులు ఆగి, ఆ దైవాన్ని దర్శించుకొని, ప్రశాంత చిత్తంతో ప్రార్ధనచేసి, అంతా మంచి జరగాలని భక్తితో వేడుకోవడం....

ఒక పెద్ద కొండ.... కొండ శిఖరం పైన ఓ ఆలయం. వందల కొద్దీ మైళ్ళ దూరం నుంచి జనం ఆర్తితో నడిచి, కాళ్ళు పడిపోతున్నా ఆ దైవాన్ని స్మరించుకుంటూ కొండెక్కి, భక్తి ప్రపత్తులతో మొక్కులు చెల్లించుకోవటం....

అది అడవికానీ, కొండకానీ, కుగ్రామం కానీ- ఎక్కడ దేవాలయం వున్నా, భక్తుల ప్రార్ధనలనీ, పూజలనీ వేదోక్తంగా దైవానికి నివేదించే సంధాత అర్చకుడు. ఆలయాలకి ఆదాయాలు ఏమీ లేని రోజుల్లో, రోడ్లు లైట్లు కూడా లేని కాలంలో సయితం - "సమాజం పట్ల ఇది మన కర్తవ్యం" అని భావిస్తూ - నిలువునా మంచుకురుస్తున్నా, ఆకాశం కుండపోతగా వర్షిస్తున్నా - నిర్దిష్ట విధి విధానంలో, ఖచ్చితంగా నిర్ణీత సమయాల్లో దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలను అతను నిరాటంకంగా సాగిస్తూ వచ్చాడు.

ఆలయాలు వుంటేనే అర్చకుడికి పాత్ర వుంది. అలా ఆలయాలని నెలకొల్పి, ఆ ఆలయాల ద్వారా భక్తి పరిమళాలు సమాజంలో వ్యాపించాలని ఆకాంక్షించిన చక్రవర్తులు, రాజులు, జమీందారులు, శక్తి కలిగిన దాతలు - కొండల్లో, కోనల్లో, గ్రామాల్లో, పట్టణాల్లో కూడా దేవాలయాలను నిర్మింపజేశారు. సమాజం సుఖశాంతులతో వర్ధిల్లటానికి అవసరమైన దైవభక్తికి, ధర్మ ప్రచారానికి దేవాలయాలు కేంద్ర బిందువులు కావాలని ఆ ధర్మకర్తలు ఆశించారు. ఆ కార్యక్రమం నిర్విఘ్నంగా, నిరంతరం కొనసాగాలన్న లక్ష్యంతో ఆయా దేవాలయాల్లో నిత్య ధూపదీప నైవేద్యాలు నిరంతరం జరిగేలా తగిన మాన్యాల్ని కూడా ఆ స్థాపక ధర్మకర్తలు ఏర్పాటు చేశారు. అలా దేవాలయాల ఉనికి, అర్చకుల - ధర్మకర్తల మనుగడ అనాదిగా ఒకదానికొకటి పెనవేసుకుపోయాయి. తరాల తరబడి ఆ స్థాపక ధర్మకర్తల వారసులు, వంశపారంపర్యంగా ఈ అర్చకులూ ధర్మప్రచారానికి ఆలంబనగా ఈ దేవాలయ సంస్కృతిని కాపాడుతూ వస్తున్నారు. కానీ....

*1987*లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టం (30/87) - అనే ఒక విషసర్పాన్ని సృష్టించి ఈ దేవాలయ వ్యవస్థ మీదకి వదిలింది. అది కొండచిలువలా ఈ వ్యవస్థని అడ్డదిడ్డంగా చుట్టేసి, ధర్మకర్తల - అర్చకుల పరంపరని ఎముకలు విరిగేలా నలిపేస్తూ, బుసలు కొడ్తోంది.



ఈ చట్టం ఆవిర్భావానికి మూలమైన చల్లా కొండయ్య కమిషన్ *1983*లో ఏర్పడిన నాటి నుండి ఈ కమిషన్ దురుద్దేశ్యం విస్పష్టంగానే వుంది. ఈ కమిషన్ దురాలోచనను పసిగట్టి కూడా, నిస్సహాయంగా చూస్తూ వుండిపోయిన వారిలో నేను కూడా ఒకణ్ణి. అన్ని స్థాయిలలో అధికారుల్ని, నాయకుల్ని కలిసి నచ్చజెప్పటానికి, వాస్తవ పరిస్థితిని విశదీకరించటానికి, ఈ చట్టం వల్ల దేవాలయ సంస్కృతి ధ్వంసమవుతున్న తీరుని వెల్లడించటానికి నేను గత *16* సంవత్సరాలుగా నిర్విరామంగా తాపత్రయపడుతూ వున్నాను. ఆశించిన ఫలితం లభించకపోగా, ధర్మకర్తల, అర్చకుల విధానాన్ని పూర్తిగా ఛిన్నాభిన్నం చేసే వికృత చేష్టలకు ఈ చట్టంలో లొసుగులు మరింత ఊపునిచ్చాయి.

ఇలాంటి దుస్థితి ఏర్పడటానికి - మఠాధిపతులు, ధర్మకర్తలు, ఎండోమెంట్ అధికారులు, అర్చకులు, భక్తులు.... అందరూ ఎంతోకొంత కారణభూతులయ్యారు. గతంలో ఎవరెవరు ఏ రకంగా ఈ దురదృష్టకర పరిస్థితికి కారణమయ్యారో తెలుసుకోవటానికి చరిత్ర పుటల్లోకి వెళ్ళటం కన్నా, మన సంస్కృతికి వెన్నెముక వంటి ఈ దేవాలయ వ్యవస్థని ఇప్పుడు కబళిస్తున్న కిరాతక శక్తి ఎలాంటిది? దీనికి మనమేం చేయాలి? - అని శోధించి, సాధించటమే ప్రతి హిందువు ముందున్న కర్తవ్యం.

ఈ నేపధ్యంలో రాష్ట్రంలో దేవాలయ వ్యవస్థని ఈ చట్టం ఎలా భ్రష్టు పట్టించగలదో హెచ్చరిస్తూ, ఆలయ పరిరక్షణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత, మాజీ ఎం.ఎల్.సి. శ్రీ వి.పి.రాఘవాచారి *1996*లో 'నృసింహప్రియ' పత్రికలో ఇలా రాశారు:

"...ఈ సమస్యకు సుప్రీంకోర్టు తీర్పే ముగింపు అని ఎండోమెంట్ శాఖాధికారులు భావిస్తున్నారు. కాని కాదు. మన ఆలయ సంస్కృతిని ధ్వంసం చేయగల ఈ మహమ్మారి నుంచి విముక్తి లభించటానికి '30/87 చట్టాన్ని ప్రభుత్వం సవరించటం' ఒక్కటే పరిష్కారం. వివేకవంతులయిన, భక్తి పరులయిన ప్రజలంతా ఈ సమస్యను క్షుణ్ణంగా అర్ధం చేసుకుని, మన దేవాలయాల పరిరక్షణకు నడుం కట్టి, ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగితేనే ఇది సాధ్యపడుతుంది..."

అదే స్ఫూర్తితో, దేవాలయ సంస్కృతీ పరిరక్షణాభిలాషులందరిలో ఈ చైతన్యాన్ని ఉద్దీపింపచేయటం కోసం ఈ సమస్య తాలూకు పూర్వాపరాలను యథాతథంగా, సమగ్రంగా అందరికీ తెలియజేసేలా చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం - **'చట్టం కోరల్లో దేవాలయాలు'**.

*13.2.2004*

ఎం. వి. సౌందరరాజన్.

- ఎం.వి.సౌందరరాజన్

# దేవాలయాల్ని సంక్షోభంలో ముంచిన 30/87 చట్టం

ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాలన్నీ ఇవ్వాళ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి.

మొత్తం 34 వేల ఆలయాలుండగా వాటిలో అధిక భాగం జీర్ణస్థితికి చేరుకుంటున్నాయి. లేదా పూజా పునస్కారాలు లేక మూత పడుతున్నాయి. దారి తెన్నూ తెలీని అంధకారంలో కూరుకుపోతున్నాయి....

ఈ దుస్థితికి ఎవరు కారణం?.... ఒకే ఒక్క చట్టం!

వివేకరహితంగా, పాశవికంగా, హ్రస్వదృష్టితో రూపొందించబడిన ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ చట్టం 1987 ఈ రోజు రాష్ట్రంలోని హిందూ దేవాలయాలన్నీ అంధకారంలో మ్రగ్గిపోయే పరిస్థితిని కల్పిస్తోంది.

ఈ చట్టంలోని ప్రతి సెక్షనూ రాష్ట్రంలోని హిందూ దేవాలయ వ్యవస్థని ధ్వంసం చేయటానికి ఉపకరించే ఆయుధంలా తయారైంది.

మరి ఇలాంటి వినాశకర చట్టం ఎలా రూపొందింది? దీనికి ఏమిటి ప్రాతిపదిక? ఇది ఎలా జీవం పోసుకుని దేవాలయాల్ని నిర్జీవంగా చేస్తోంది?.... ఈ ప్రశ్నలకు జవాబు తెలుసుకోవాలంటే, ఈ పాశవిక చట్టాన్ని రూపకల్పన చేయటానికి చల్లాకొండయ్య కమీషన్‌కి ఎలాంటి అవాస్తవ సమాచారం, వక్రీకరించబడిన గణాంక వివరాలు, దురుద్దేశపూర్వక విజ్ఞాపన పత్రాలు ఊతమిచ్చాయో తెలుసుకోవాలి.

## *1987 దేవాదాయ ధర్మాదాయ చట్టం కథ*

హిందూ దేవాదాయ ధర్మాదాయ సంస్థల నిర్వహణకి సంబంధించిన చట్టాలన్నింటినీ సవరించి ఒకటిగా సంకలనం చేయాలని 1965లో రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. తదనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖలోని శాసనసభ విభాగం ఒక బిల్లు తయారుచేసి, 1965 ఆగస్టు ఆరున ఆంధ్రప్రదేశ్ గజెట్‌లో ప్రచురించటం, అదేరోజున శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఆగస్టు 14 నాడు అప్పటి న్యాయశాఖ, దేవాదాయ శాఖల మంత్రి శ్రీ పి.వి.నరసింహారావు ఈ బిల్లుని ఉభయ శాసనసభల జాయింట్ సెలెక్ట్ కమిటీకి పంపించాలని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనని ఆగస్టు 16న శాసనసభ ఆమోదించింది.

అప్పటి శాసనమండలి కూడా ఈ అంశాన్ని చర్చించి, ఆ తీర్మానాన్ని ఆగస్టు 17న ఆమోదించింది. సంబంధిత ప్రకటన 1965 ఆగస్టు 20 నాడు శాసనసభలో వెలువడింది. ఆ తీర్మానం ప్రకారం 21 మంది సభ్యులతో ఏర్పడిన ఒక సెలెక్ట్ కమిటీ 1965 సెప్టెంబరు 8

నుంచి పని చేయడం ప్రారంభించింది.

ఆ కమిటీ మొత్తం 30 సార్లు సమావేశమైంది. అందులో ఎనిమిది సమావేశాలలో ఆసక్తిగా - ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరి మౌఖిక వాదనను రికార్డు చేసింది. అసంఖ్యాకంగా వినతిపత్రాలు స్వీకరించింది. మిగతా 22 సమావేశాలలో ఈ బిల్లులోని ప్రతి క్లాజుని కూలంకషంగా ఈ కమిటీ అధ్యయనం చేసింది. (ఆ కమిటీ ముందు తమ వాదన వినిపించినవాళ్ళలో ఈ పుస్తక రచయిత కూడా ఒకరు. రెండున్నర గంటల పాటు ఈ రచయిత చేసిన వాదనను, సూచనలను ఆ కమిటీ ఓపికగా విని రికార్డు చేసింది)

అలా 10 మాసాల పాటు విస్తృతంగా వాదనలు, సూచనలు విన్నాక సమగ్రంగా సవరించబడిన బిల్లుని 1966 జూన్ మూడున శాసనసభకి సెలెక్ట్ కమిటీ సమర్పించింది. ఇంత కసరత్తు జరిగాక రూపొందిన ఆంధ్రప్రదేశ్ ధార్మిక, హిందూ దేవాలయాల, ధర్మాదాయాల చట్టాన్ని 1966లో రాష్ట్ర శాసనసభ ఆమోదించింది. రాష్ట్రపతి ఆమోదంతో ఈ చట్టం అదే సంవత్సరం అమలులోకి వచ్చింది. 1987 దాకా ఇదే అమలు జరుగుతూ వచ్చింది.

ఇందుకు పూర్తి విరుద్ధంగా, ఎలాంటి సమగ్రమైన చర్చలు, సంప్రదింపులు లేకుండా రూపొందించబడిన కొత్త చట్టం 1987లో ఆదరాబాదరాగా అమల్లోకి వచ్చేసింది. మూడు షెడ్యూల్సు, 15 ప్రకరణాల క్రింద 160 సెక్షన్‌లతో రూపొందించిన (178 సైక్లో స్టైయిల్డ్ పేజీల) బిల్లుని రాష్ట్ర శాసనసభలో 1987 ఏప్రిల్ 4న ప్రవేశపెట్టారు. కేవలం ఆచార వ్యవహారాలు ప్రాతిపదికగా అనూచానంగా వస్తున్న హిందూ సంస్థల నిర్వహణ విధానాల నుంచి ఆయా సంస్థలను తప్పిస్తూ బృహత్తరమైన మార్పులు తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ బిల్లు రూపొందించబడినప్పటికీ అది అసెంబ్లీలో ఆమోదించబడటానికి ముందుగా ఎలాంటి సమగ్రమైన, విస్తృతమైన చర్చలు జరగలేదు.

1987 ఏప్రిల్ 9నాడు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల దాకా ఈ బిల్లుని అసెంబ్లీ చర్చించింది. ఈ చర్చకి అప్పటి దేవాదాయ మంత్రి రాత్రి 9 గంటలకి జవాబిచ్చారు. ఆ జవాబుతో సంతృప్తి చెందని ప్రతిపక్షాలు నిరసన ధ్వనులతో వాకౌట్ చేశాయి. అప్పుడు చట్టంలోని 2 నుంచి 160 దాకా సెక్షన్లన్నింటినీ ఒకే కట్టగా స్పీకరు ఓటింగ్‌కి పెట్టారు. అయితే ఆయా సెక్షన్‌ల మీద సవరణలు ప్రతిపాదించిన ప్రతిపక్షాలు అప్పటికే వాకౌట్ చేసి వుండటంతో ఆ సవరణల మీద ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టబడలేదు. అంతే, ఆ సెక్షన్‌లన్నీ యథాతథంగా శాసనసభ ఆమోదం పొందినట్లుగా స్పీకరు ప్రకటించారు. అప్పుడు ఆయన సెక్షన్ ఒకటిని ఓటింగ్‌కి పెట్టడం, అది కూడా ఆమోదించబడినట్లు ప్రకటించడం జరిగింది.

ఇంత హడావుడిగా బిల్లుని అసెంబ్లీలో ఆమోదింపజేయాల్సిన అవసరం ఏమొచ్చింది - అని ప్రశ్నించినవారికి ప్రభుత్వం ఇచ్చిన సమర్థన ఇది; "చల్లా కొండయ్య కమీషన్ సుదీర్ఘంగా జరిపిన చర్చల ఆధారంగా రూపొందిన బిల్లు ఇది".



అయితే కమిషన్ ఏకపక్షంగా తన తుది నివేదికను సమర్పించిన విధానాన్ని ఛాలెంజి చేస్తూ సుప్రీంకోర్టులో ఒకరిట్ పిటీషన్ దాఖలయ్యింది. కమీషన్ పని చేసిన విధానాన్ని విమర్శిస్తూ, కమీషన్ పక్షపాత ధోరణితో సిఫార్సులు చేసిందంటూ తీవ్ర ఆరోపణలు ఈ రిట్ పిటీషన్‌లో చోటు చేసుకున్నాయి. కానీ ఈ అంశాలేవీ అంతకు ముందు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చినవి కాకపోవడంతో చల్లా కొండయ్య కమీషన్ నివేదిక పరిధులేమిటో సుప్రీంకోర్టుకి అంతుపట్టలేదు.

★ ★ ★

ఈ 1987 చట్టం అసెంబ్లీ ఆమోదం పొందటానికి ఒక నాలుగు మాసాలకి ముందు అంటే 1986 డిసెంబరు 14న ఉస్మానియా విశ్వ విద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సంబంధిత బిల్లు మీద ఒక గోష్టి నిర్వహించింది. అనేక మంది ప్రొఫెసర్‌లు, విద్యావేత్తలు సుదీర్ఘంగా చర్చించారు. చివరికి, చల్లా కొండయ్య కమీషన్ నివేదిక లోపభూయిష్టమైన విధానంలో రూపొందిందని, ఆ నివేదికలో వాస్తవ దృక్పథం, దూరదృష్టి లోపించాయని ఆ గోష్టిలో పాల్గొన్న వక్తలంతా అభిప్రాయపడ్డారు.

కొండయ్య కమిషన్ ఉదహరించిన గణాంక వివరాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఆలయాలు 32,201 వున్నాయి. వీటిలో ఏడాదికి వెయ్యి రూపాయలు పైగా ఆదాయం వచ్చే ఆలయాలు 7,761. కొండయ్య కమీషన్ నివేదిక ప్రకారం ఇలా వెయ్యి రూపాయలకు పైగా వార్షిక ఆదాయం వచ్చే ఆలయాలన్నీ 'ఆదాయం మదింపు చేయదగినవి'. అంటే మిగతా 24,400 మందిరాల వార్షిక ఆదాయం వెయ్యి రూపాయలకి లోపే వుందన్నమాట.

పోతే, మదింపు చేయదగిన ఆదాయం గల 7,761 మందిరాలలో 582 ఆలయాల వార్షిక ఆదాయం 10,000 రూపాయలకు పైగా వుంది. కమీషన్ అధ్యయన మార్గదర్శక సూత్రాలలో మొదటిది ఈ పదివేల రూపాయల వార్షిక ఆదాయంలో ఆలయాల నిర్వహణ ఏ మేరకు సజావుగా సాగుతోంది. ఈ విషయం తెలుసుకోవాలంటే ఆ కేటగిరీ క్రింద వివిధ ప్రాంతాల్లోగల ఆలయాల్ని చెదురు మదురుగా ఎంపిక చేసుకొని, అధ్యయనం చేయాలిగదా! కాని అలా జరగలేదు.... తిరుమల తిరుపతి దేవస్థానాల పనితీరుని అధ్యయనం చేయటానికీ, ఏడాదికి 20 లక్షల రూపాయలకు పైగా ఆదాయం వచ్చే నాలుగు ప్రత్యేక తరహా ఆలయాల్ని అధ్యయనం చేయడానికే తన సమయాన్నంతా కమీషన్ వెచ్చించింది. చివరికి ఆ అధ్యయనం ఆధారంగా మాత్రమే తన సిఫార్సుల్ని కూడా కమీషన్ రూపొందించింది.

1972 నుండి వంశపారంపర్య అర్చకత్వం విషయంలో ప్రభుత్వపరంగా 1972 నుంచి ఏం జరుగుతూ వచ్చిందో కమీషన్ తన నివేదికలో సుదీర్ఘంగా వివరించింది. 1979లో అప్పటి ముఖ్యమంత్రి సయితం వంశపారంపర్య అర్చకత్వాన్ని నిషేధించాలని అభిలషించారని కమీషన్ తన నివేదికలో ఉటంకించింది. కాని నిజానికి 1979లో ముఖ్యమంత్రి సంబంధిత ఫైలులో వంశపారంపర్య అర్చకత్వ నిషేధం పట్ల విముఖత వ్యక్తం చేస్తూనే, "అయితే దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి?" అని లిఖిత పూర్వకంగా ప్రశ్నించారు. అనూచానంగా వస్తున్న వంశపారంపర్య అర్చక పురోహితుల్ని రద్దు చేయాలని సిఫార్సు చేసేముందు, ఈ ప్రశ్నకు మాత్రం జవాబు చెప్పకుండా కమీషన్ దాటవేసింది.

అదెలా? ఫలానా వ్యవస్థ బాగా పనిచేయటంలేదు అని అనిపించగానే, దానికి ప్రత్యామ్నాయం ఆలోచించకుండానే "దాన్ని రద్దు చేసి పారేద్దాం" అని నిర్ణయించటం సబబా? కాని చల్లా కొండయ్య కమీషన్ చేసిన పని ఇదే. ఇలా వంశపారంపర్య అర్చకత్వ హక్కుల్ని రద్దు చేయటం అవసరం అని సమర్థించుకోడానికి అనుకూలంగా ఎక్కడెక్కడ సంపన్నవంతమైన దేవాలయ నిర్వహణలో ఏయే అంశాలు అనువుగా వున్నాయో వాటన్నింటిని కమీషన్ తన నివేదికలో వాడుకుంది. అలా తగిన ప్రత్యామ్నాయం సూచించకుండా కమీషన్ రూపొందించిన నివేదికని రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిగా అమలు చేయడం వల్ల కలిగిన దుష్ఫలితమే - ఈనాడు రాష్ట్రంలో దేవాలయాలు సంక్షోభంలో చిక్కుకోవటం. చివరికి సుప్రీం కోర్టులో పిటీషన్ మీద జరిగిన వాద ప్రతివాదాలు సయితం తిరుమల తిరుపతి దేవస్థానాలలోని మిరాసీ హక్కుల మీదే కేంద్రీకృతమయ్యాయి.

ఈ 1987 నాటి చట్టం పుట్టు పూర్వోత్తరాల విషయంలో 1987 ఏప్రిల్ 20న 'ది హిందూ' పత్రికలో 'Between you and me' శీర్షికన ఏం రాశారో చూద్దాం:

*ఈ ఏప్రిల్ 9 నాడు ఆంధ్రప్రదేశ్ ధార్మిక, హిందూ దేవాదాయ, ధర్మాదాయ బిల్లుని ప్రతిపక్షాల నిరసన ధ్వనులు, వాకౌట్ల మధ్య రాష్ట్ర శాసనసభ ఆమోదించింది. ఈ బిల్లుని సెలెక్ట్ కమిటీ ఆధ్యయనానికి పంపటానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించింది. బహుశా మనకున్న నీటి సమస్య, విద్యుత్ సమస్యలకన్నా వేగంగా దేవాలయాల బిల్లు తక్షణం పరిష్కరించబడాల్సిందని హిందూ దేవాలయాలు డిమాండ్ చేసి వుంటాయి. ఈ బిల్లు ఆమోదించడం అన్నది మహా శరవేగంతో జరిగిపోయింది.*

*బిల్లు ఆమోదించబడటానికి ముందురోజున అంటే ఏప్రిల్ 8న, ఈ బిల్లు తాలుకు ప్రింటెడ్ కాపీలు సభ్యులకు పంచిపెట్టబడ్డాయి. (ఐతే, ఏప్రిల్ 4న సైక్లోస్టైల్డ్ కాపీలిచ్చారు) బిల్లులో మొత్తం మూడు షెడ్యూల్సు క్రింద 15 ప్రకరణాలలో 160 సెక్షన్‌లున్నాయి.*



*బహుశా ఈ బిల్లు మీద విస్తృతమైన చర్చ అసెంబ్లీలో అవసరంలేదేమో కూడా! ఎందుకంటే చల్లా కొండయ్య కమీషన్ అప్పటికే ఉత్తరప్రదేశ్, ఒరిస్సాల పూర్వపు గవర్నరు శ్రీ అక్బర్ ఆలీఖాన్, రామకృష్ణ మఠానికి చెందిన స్వామి రంగనాధానంద వంటి మహామహులతో హిందూ దేవాలయాలు ఎలా నిర్వహించబడాలి అని సంప్రదించటం జరిగిపోయింది గదా! మరి ఒక మసీదుని ఎలా నిర్వహించాలి అన్న విషయంలో కూడా ఒక హిందువుని రాష్ట్ర ప్రభుత్వం సంప్రదిస్తుందేమో నాకు తెలీదు. పోతే స్వామి రంగనాధానంద - హైదరాబాద్‌లో రామకృష్ణ మఠానికి అధ్యక్షులు. అయితే రామకృష్ణ మిషన్ హిందూ సంస్థకాదనీ, తమది ఒక మైనారిటీ సంస్థఅనీ రెండేళ్ళ క్రితమే రామకృష్ణ మిషన్ ప్రకటించుకొని వుంది.*

*అహోబిల మఠం, పరకాల మఠం జీయర్‌లు గానీ, శ్రీ ఆండావన్ స్వామిగానీ - కొండయ్య కమీషన్ సంప్రదించిన వాళ్ళలో లేరు. ఈ కమీషన్ నివేదిక ప్రకారం సంప్రదించబడినట్లు చెప్పబడుతున్న కంచి, శృంగేరి పీఠాధిపతులైతే తాము చెప్పని అంశాలు చెప్పినట్లుగా నివేదికలో పేర్కొనబడ్డాయని నిర్ద్వంద్వంగా ఖండించి వున్నారు.*

*ఈ ఖండనకు ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రతిస్పందన లేదు. అంటే, చివరకి ఈ బిల్లుని ఆమోదించటం ద్వారా, మన జీయర్‌ల, ఆచార్యుల మనోభావాలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. .... బహుశా ఒక సెక్యులర్ రాష్ట్రంలో, హిందువులు సాటి హిందువుల పట్ల గానీ, మైనారిటీల పట్ల గానీ, ఎలా మెలగాలో తెలుసుకోవటానికి మైనారిటీలని సంప్రదించాల్సి వుంటుందేమో?*

*1984లో చల్లా కొండయ్య కమీషన్ ఏర్పడినప్పుడు అందులో ఆరుగురు సభ్యులుండేవారు. కారణాలు తెలీదుకాని 1985 ఏప్రిల్ నాటికి ఈ సంఖ్య మూడుకి తగ్గిపోయింది. కుర్తాళం పీఠాధిపతి అయిన శ్రీ త్రివిక్రమ రామానంద భారతి స్వామి కథనం ప్రకారం, కమీషన్‌లో ఒక సభ్యుడు మొట్టమొదటి సమావేశంలోనే మిగతా సభ్యుల్ని ప్రభావితం చేయాలని ప్రయత్నించారు. అంతే కమీషన్ ముందుగానే ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చేసి, అందుకు సుముఖంగా వుండేవాళ్ళనే సంప్రదిస్తూ వచ్చిందా?*

*దేవాదాయ శాఖ ఖర్చు పెట్టే నిధులన్నీ ఆలయాలకు ప్రజలిచ్చిన సొమ్ములోదే. మత పెద్దలైన ఆచార్యులు, జీయర్‌ల వ్యవస్థ పట్ల విశ్వాసం వున్నవాళ్ళిచ్చిన కానుకలే ఆ సొమ్ము. ఈ ఆచార్యులు, జీయర్‌లు తమకు మతపరమైన, ఆధ్యాత్మిక మార్గదర్శకులని హిందువులు భావిస్తుంటారు. కాని అలాంటి భక్తులు ఆలయాల్లో కానుకల రూపంలో సమర్పించే డబ్బుని ఎలా వెచ్చించాలో నిర్ణయించేది మాత్రం హిందూ మత సంస్థల వ్యవహారాల్లో తలదూర్చటానికి తహతహలాడే సెక్యులర్ ప్రభుత్వం.*

*దేవతలు నడవటానికి కూడా భయపడే చోట రాజకీయవేత్తలు పరుగులు తీస్తారని*

*అంటుంటారు. కొత్త చట్టం ప్రకారం, హిందూ ఆలయాల నిర్వహణ కోసం ఒక సలహా మండలి నియమించబడుతుంది. ఇందులో సభ్యులెవరయ్యా అంటే - దేవాదాయ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ కమీషనర్, ఒక ఆగమ పండితుడు లేదా దాత, ఒక న్యాయశాస్త్ర నిపుణుడు, ఒక ఛార్టర్డ్ అక్కవుంటెంట్. అంటే ఆగమ పండితుడు ఖచ్చితంగా సభ్యుడిగా వుండితీరాలని లేదు.*

*ఆయనకి బదులు ఒక దాత ఎవరైనా వుంటే సరిపోతుంది. మరోరకంగా చెప్పాలంటే, ఈ సలహా మండలిలో ఒక మత పెద్ద వుండనక్కర్లేదు.*

*మత వ్యవహారాల నిర్వహణ విషయంలో సలహా మండలిని ఏర్పాటు చేస్తూ 1934 ఆగస్టు 10న అప్పటి బ్రిటీషు ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసింది. దాని ప్రకారం "ఈ సలహా మండలిలో జీయర్, అర్చక ప్రతినిధి, ఇద్దరు ఆచార్య పురుషుల ప్రతినిధులు, దేవాలయాల్లోని ఇతర మిరాసీదార్ల ప్రతినిధి ఒకరు సభ్యులుగా వుంటారు..."*

*ఎంత తేడా? రాగల పరిణామాలతో నిమిత్తం లేకుండా, బ్రిటిషువారు మన సంస్థల నిర్వహణ పట్ల శ్రద్ధ చూపించారు.*

*గత డిశెంబరులో నేను త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ గారిని కలిశాను. ఇప్పటి బిల్లులో గల లోపాల్ని ఎత్తిచూపి ప్రచారం చేయటానికి నడుం కట్టిన ప్రొఫెసర్ ఎం.వి. సౌందర రాజన్ గారితో కలిసి నేనక్కడికి వెళ్ళాను. అక్కడ రెండు గంటలపాటు చిన జీయర్‌గారితో సంభాషించే అవకాశం నాకు కలిగింది. ఈ బిల్లు పట్ల ఆయన చాలా ఆవేదన చెందుతున్నారు. పగలంతా ఆ బిల్లు గురించే ఆయన ఆలోచిస్తుంటారనీ, నిద్రలో కూడా ఆ అంశం గురించే కలలు కంటుంటారని నా నమ్మకం.*

*చిన జీయర్ గారిని మేం కలిసేసరికి రాత్రి తొమ్మిదయింది. రాత్రి 11 గంటలకి కూడా ఆయన మార్గదర్శకత్వం కోసం, ఊరడింపు కోసం సందర్శకులు వస్తూనే వున్నారు. ప్రజలలో ఆయనంటే అపారమైన గౌరవ ప్రపత్తులున్నాయి.*

*ఆయన నాతో కొండయ్య కమీషన్ నివేదిక గురించి మాట్లాడుతూ, ఆ నివేదిక తమని ఎంతటి వ్యాకులతకి గురి చేసిందో చెప్పారు. ప్రభుత్వం ఇంత విచక్షణా రహితంగా ఎలా వ్యవహరిస్తుందీ అంటూ ఆయన విస్మయం వ్యక్తం చేశారు.*

*చిన జీయర్ గారిలాగానే, ఇతర ఆచార్యులు, జీయర్‌లు ఆ నివేదికను తిరస్కరించారు. కాని ఇలాంటి స్వార్థ రహితులు, దైవాంశ సంభూతులయిన పురుషోత్తముల భావాల్ని ప్రభుత్వం పెడచెవిన పెడుతోందనీ, కొన్ని సందర్భాలలో వేళాకోళం చేస్తుంటారని విన్నాను. తమ మాటకి*



*గౌరవం దక్కాలనుకునేవాళ్ళు, ఎవరు సమాజంలో గౌరవించబడుతున్నారో వాళ్ళని ఎగతాళి చేయకూడదు.*

*ఈ బిల్లు సదాశయంతో రూపొందిందని ప్రభుత్వం చెబుతోంది. నిజంగా మనకి అలాంటి మంచి మిత్రులున్నప్పుడు, గజనీ మొహమ్మద్ వంటి శత్రువుల అవసరమేముంది?*

\- కె.ఎస్.

★ ★ ★

**1987**లో రిట్‌లు దాఖలయ్యే నాటికి, హైకోర్టు సెలవులు ప్రకటించి వుంది. హైకోర్టు తిరిగి తెరుచుకునే లోపల ఈ చట్టం అమలులోకి వచ్చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దాంతో కోర్టులో వెకేషన్ పిటీషన్‌లు దాఖలయ్యాయి.

1987 మే 26 నాడు వెకేషన్ జడ్జి వెంకట్రామిరెడ్డి ఈ పిటీషన్‌ను అనుమతిస్తూ ఒక ఉత్తర్వు చేశారు. దాని ప్రకారం "ఈ పిటీషన్‌పై తదుపరి ఉత్తర్వులు వెలువడటానికి ముందుగా, ఒక వారం రోజుల వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అర్చకులు, ధర్మకర్తల సాంప్రదాయాలు, ఆస్తుల నిర్వహణల విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలి". వేసవి సెలవుల తరువాత హైకోర్టు తిరిగి తెరిచాక, సంబంధిత అన్ని పిటీషన్ల విచారణని 1987 జూన్ ఒకటి నాటికి విచారణకు స్వీకరించేలా కూడా న్యాయమూర్తి ఉత్తర్వు చేశారు.

ఈ పిటీషన్లన్నింటినీ న్యాయమూర్తి ఆంజనేయులు విచారించి 1987 జూన్ 4న చారిత్రాత్మకమైన తీర్పునిచ్చారు.

"1987 చట్టంలోని ఏ అంశాలయినా పిటీషనర్లు కోరిన విధంగా సస్పెండు చేయదగినవా కాదా అన్నది నేను పరిశీలనకు తీసుకున్న విషయం... ఒక ప్రక్క వాళ్ళ పిటీషన్లు కోర్టు ముందు విచారణకు పెండింగ్‌లో వున్న సమయంలో వాళ్ళు ఉదహరించిన ఏ అంశాలవల్లనయినా వాళ్ళకు సంభవించగల కష్టనష్టాలను దృష్టిలో వుంచుకొని వాళ్ళ అభ్యంతరాలన్నింటినీ నేను పరిశీలించడం జరిగింది. జాగ్రత్తగా అధ్యయనం చేసిన మీదట 1987 చట్టంలోని 2, 28, 49, 51, 56, 65, 67, 71, 77, 81, 83,84, 85, 86, 146, 160 సెక్షన్‌లలోని అంశాల కారణంగా వాళ్ళకు సంభవించగల కష్టనష్టాలు ఏవో వున్నాయని నేను భావించడం లేదు. అయితే, ఈ పిటీషన్లు విచారణలో వున్నకాలంలో 16, 34, 35(3), 35(4), 36, 39, 76, 82, 144 సెక్షన్‌ల అమలు మాత్రం నిలిపి వేయదగిందని నేను భావిస్తున్నాను.

సెక్షన్ 16 - వంశపారంపర్య ధర్మకర్తల విధానం రద్దుకి సంబంధించింది. సెక్షన్ 34- మిరాసీదార్ల, అధ్యక్షులు, ఇతర స్థాయి ఉద్యోగులు, సేవకుల వంశపారంపర్య హక్కుల రద్దుకి సంబంధించినవి. సెక్షన్ 35(3), సెక్షన్35(4)లో మౌలికంగా సెక్షన్ 34 తాలూకు

పరిణామాలకి సంబంధించినవి అంటే ఉద్యోగుల, సేవకుల నియామకాలకు సంబంధించినవి. సెక్షన్ 36- అర్చకుల అర్హతలకు సంబంధించింది. సెక్షన్ 39-లో అంశాలు ఉద్యోగుల, సేవకుల బదిలీలకు సంబంధించింది. సెక్షన్ 76- అనేది ధార్మిక సంస్థలు, లేదా దేవాలయాలు లేదా ఆధ్మాతిక సంస్థలను సేవించేవారికి భూములను సంక్రమింపచేయటానికి సంబంధించింది. భూమిలేని పేదలకు వ్యవసాయ భూములను కౌలుకివ్వటం లేదా విక్రయించటానికి సంబంధించింది సెక్షన్ 82. అలాగే, హుండీ కానుకలలోనూ, ఇతర రుసుములలోనూ వాటాలు కేటాయించటాన్ని రద్దు చేయటానికి ఉద్దేశించింది సెక్షన్ 144...''

ఈ ఉత్తర్వును సవాల్ చేస్తూ, డివిజన్ బెంచ్ ముందు రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు చేసింది. 1987 జూన్ 11న, ఈ రిట్ అప్పీలుని డివిజన్ బెంచ్ అనుమతిస్తూ, సింగిల్ జడ్జి ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వుని నిలిపివేసింది. అదే నెల 22 నాడు, సుప్రీం కోర్టులో వేసవి సెలవుల జడ్జి ముందు ఒక రిట్ పిటీషన్ దాఖలయ్యింది. రాజ్యాంగంలోని 32వ అధికరణం క్రింద దాఖలయిన ఆ పిటీషన్‌ను సుప్రీం కోర్టు జడ్జి అనుమతిస్తూ ఇలా ఆదేశించారు. "అర్చకుల, ధర్మకర్తల, మిరాసీదార్ల హక్కుల విషయంలో 1987 చట్టం అమల్లోకి రాకముందు వున్న పరిస్థితి యధాతథంగా (రిట్ పిటీషన్ల విచారణ పూర్తయ్యేవరకూ) కొనసాగాలి. అయితే ఈ పిటీషన్ల విచారణ కాలంలో అర్చకులు, ధర్మకర్తలు మిరాసీదార్లు - తమకు గల వంశపారంపర్య హక్కుల కారణంగా నగదు రూపంలో గానీ, ఏ ఇతర రూపాల్లోగానీ లభించే వాటా లేదా ఆదాయం వివరాలను (చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి) ఏనెలకానెల లెక్కలు తయారు చేస్తూ, మరుసటి నెల 15వ తేదీలోగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి లేదా దేవాదాయ శాఖ కమీషనర్‌కి అందించాల్సి వుంటుంది....'

అలా రాజ్యాంగంలోని 32వ అధికరణ క్రింద దాఖలయిన పిటీషన్‌తో పాటే విచారణకు గాను హై కోర్టులో పెండింగ్‌లో వున్న పిటీషన్లన్నింటినీ తమకు బదిలీ చేయవలసిందిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని సుప్రీంకోర్టు ఆదేశించింది.

దీంతో, ఈ చట్టం అమలు చేయటం దుస్సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వానికి అర్ధమైంది. తమిళనాడు ప్రభుత్వం కూడా ఇలాంటి చట్టాన్ని తీసుకురావాలని గతంలో ఒక సాహసం చేసింది. 1971లో ఆ చట్టాన్ని సుప్రీంకోర్టు సమర్ధించింది. అయినప్పటికీ అది అమలు కాలేదు. అమలు చేయాలని జరిగిన ప్రయత్నం యొక్క పరిణామాలెలాంటి వంటే, ఆ చట్టంలోని లోపాలు ఆలయాల నిర్వహణని కుంటుపరిచాయి. ఫలితంగా అనేక ఆలయాలు మూతపడ్డాయి. 1989 ఎన్నికలలో ఈ ఆలయాల నిర్వహణ ఒక కీలకాంశంగా తయారైంది. అన్ని రాజకీయ పార్టీలు తమ తమ ఎన్నికల ప్రణాళికలలో ఆలయాల నిర్వహణలో సంస్కరణలు తీసుకొస్తామంటూ వాగ్దానాలు గుప్పించాయి.



1971లో ఈ చట్టం రూపొందటానికి కారణమైన డి.ఎం.కె. ప్రభుత్వం తిరిగి 1989లో అధికారానికి రాగానే, 1989 మార్చి 10 నాడు ఒక అయిదుగురు సభ్యుల కమిటీని నియమించి రాష్ట్రంలోని ఆలయాల నిర్వహణ మెరుగు పర్చటానికి మార్గాలు సూచించవలసిందిగా కోరింది. ఆ కమిటీ నివేదిక ఇవ్వాళ్టికి కూడా వెలుగు చూడలేదు. 1990లో డి.ఎం.కె. ప్రభుత్వం బర్తరఫ్ అయ్యాక, జరిగిన ఎన్నికలలో ఎ.ఐ.ఎ. డి.ఎం.కె. అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం - ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన విధంగా ఆలయాల నిర్వహణ కోసం స్వతంత్ర ప్రతిపత్తిగల ఒక టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ బోర్డుని 1992 మార్చిలో ఏర్పాటు చేసింది.... అంటే 1971 ప్రయోగం విషయంలో ఎదురైన ప్రజావ్యతిరేకత, చేదు అనుభవాల దృష్ట్యా ఆలయాల నిర్వహణ విషయంలో తమిళనాడు ప్రభుత్వం తన విధానాన్ని సవరించుకోక తప్పలేదు. ఇది చరిత్ర.

1990లో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కంప్యూటర్ సాయంతో ఎన్నికల ఫలితాలపై జిల్లాలో ఒక సర్వే నిర్వహించారు. ఆ సర్వేలో వెల్లడైన విషయం - "1987 దేవాలయ చట్టాన్ని రూపొందించిన కారణంగానే 1989 ఎన్నికలలో గ్రామీణ ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ పరాజయం పొందింది." 1989 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

1989-94 కాలంలో - "ఈ చట్టం అమలు చేయడంలో వున్న ఇబ్బందుల దృష్ట్యా, దీన్ని పునః సమీక్షించాలనుకుంటున్నాం" అని సుప్రీంకోర్టుకి రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది - తదనుగుణంగా ఈ చట్టానికి చేయదగిన సవరణలను సూచిస్తూ ఒక వర్కింగ్ పేపర్‌ని దేవాదాయశాఖ తయారుచేసింది.

1994 నవంబరు 15న అప్పట్లో ప్రతిపక్ష నాయకుడుగా వున్న ఎన్.టి.రామారావు, తాము అధికారంలో వచ్చిన పక్షంలో, ఈ చట్టాన్ని కూలంకషంగా పునః సమీక్షిస్తామని ఈ రచయితకి హామీ ఇచ్చారు. పర్యవసానం? అప్పుడు జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటి ఎన్.టి.రామారావు గారి మంత్రివర్గంలో సభ్యులుగా వున్న వాళ్ళు (ఇప్పటికీ మంత్రులుగా కొనసాగుతున్నవాళ్ళు) ఈ చట్టం గురించి అప్పట్లో ఈ రచయితతో మాట్లాడతూ, ఆలయాల నిర్వహణకి సంబంధించి రూపొందే ఏ చట్టమైనా ఆలయాల పనితీరుని క్రమబద్ధీకరించేదిగా మాత్రమే వుండాలి (వాటిపై ప్రభుత్వం పెత్తనం చెలాయించేదిగా వుండకూడదు) అన్న అభిప్రాయాన్ని నిర్ద్వందంగా ప్రకటించారు.

1995 ఆగస్టు 14 నాడు ఈ రచయిత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావుని కలిసి, ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు సమర్ధించే పక్షంలో రాగల దుష్పరిణామాలను గురించి వివరించారు. వెంటనే ముఖ్యమంత్రి ఒక త్రిసభ్య సంఘాన్ని ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చారు. 1987 చట్టం వల్ల రాగల దుష్పరిణామాలకు పరిష్కార మార్గాలను సూచించటమే ఈ కమిటీ చేయాల్సిన

పని. దేవాదాయ శాఖామంత్రి అధ్యక్షులుగా గల ఈ కమిటీలో మిగతా ఇద్దరు సభ్యులు - ఒకరు టి.టి.డి. చైర్మన్, మరొకరు ఎం.వి.సౌందరరాజన్ (రచయిత). కొద్ది రోజుల్లోనే ఈ కమిటీ సమావేశమైంది. సుదీర్ఘంగా చర్చించింది. చట్టంలో చేయదగిన మార్పుల్ని సూచించింది.

అయితే తన నివేదికకు తుదిరూపం ఇచ్చేముందు ఒకసారి ముఖ్యమంత్రితో చర్చించాలని కమిటీ అభిప్రాయపడింది. ఆగష్టు చివర్లో ఆ ప్రయత్నం జరిగే సమయానికి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు శ్రీకాకుళం యాత్రకు వెళ్ళటం, ఆయన తిరిగి వచ్చేసరికి ఆగస్టు 31న ప్రభుత్వం మారిపోవటం జరిగిపోయింది.

అయితే ఈ మధ్యలో - సుప్రీం కోర్టులో పెండింగ్‌లో వున్న పిటీషన్ల మీద వాదప్రతివాదాలు కొనసాగుతూ వచ్చాయి. 1995 ఆగస్టు 28న, తిరిగి ఆగస్టు 29న తుది వాద ప్రతివాదాలు జరిగాయి. తీర్పు మాత్రమే మిగిలివుంది.

ఒక ప్రక్క కేసు చివరి విచారణ పూర్తయిపోయింది. మరో ప్రక్క రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోయింది. దాంతో చట్టంలో పలు సవరణలకై పరిష్కార మార్గాలు వెతికే ప్రయత్నం స్థంభించిపోయింది.

## తీర్పు ఏం చెప్పింది?

1987 నాటి ధార్మిక, హిందూ మత సంస్థల ధర్మాదాయ చట్టాన్ని ఛాలెంజి చేస్తూ దాఖలైన పిటీషన్లలో ఒక సెట్ మీద విచారణ పూర్తి చేసుకున్న సుప్రీం కోర్టు 1996 ఆరంభంలో నాలుగు తీర్పులు వెలువరించింది. (అప్పటికింకా మరో కట్ట పిటీషన్లు మీద తీర్పు పెండింగ్‌లో వుంది)

***ఆ నాలుగు తీర్పుల వివరాలు :***

1. 1987 నాటి చట్టంలోని 76వ సెక్షన్‌ను ఛాలెంజ్ చేసిన రిట్ పిటీషన్ నెం. 1459 మీద 1996 జనవరి 12న తీర్పు.
2. వంశపారంపర్య ధర్మకర్తల హక్కుల రద్దుని ప్రశ్నించిన రిట్ పిటీషన్ నెం. 713 మీద 1996 జనవరి 17న తీర్పు.
3. మఠాధిపతుల నామినేషన్‌కి సంబంధించిన రిట్ పిటీషన్ నెం. 857 మీద 1996 ఏప్రిల్ 24న తీర్పు.
4. అర్చకుల వంశపారంపర్య హక్కుల్ని రద్దు చేయటాన్ని వ్యతిరేకించిన రిట్ పిటీషన్ నెం. 638 మీద 1996 మార్చి 19న తీర్పు.



ఈ తీర్పుల పరిధిలో 1987 నాటి చట్టాన్ని అమలు చేయటం కోసం అన్నట్లుగా దేవాదాయ శాఖ కమీషనర్ 1996 మార్చి, ఏప్రిల్ మాసాల్లో సర్క్యులర్‌లు జారీ చేశారు.

1. సర్క్యులర్ నెం. జె5/5288/96, (చట్టం, నిబంధనలు) తేది 25.3.1996.
   ఈ సర్క్యులర్ ప్రకారం వంశపారంపర్య ధర్మకర్తలకు అన్ని రకాల చెల్లింపుల్ని ఆలయాలు నిలిపివేయాలి.
2. సర్కులర్ నెం. ఆర్.సి/15/48623/95 (చట్టం, నిబంధనలు) తేదీ 29.3.1996
   మఠాధిపతులంతా తమకు సంక్రమించే పాదకానుకలకు వివరాలు తయారు చేయాల్సి వుంటుంది.
3. సర్క్యులర్ నెం. జె5/15239/96, (చట్టం, నిబంధనలు) తేది 6.4.1996
   ఆలయాల్లో వంశపారంపర్య అర్చకులకు, ఇతర ఉద్యోగులకు చెల్లిస్తున్న అన్ని రకాల వాటాలను తక్షణం నిలిపివేయాలని ఈ సర్క్యులర్ ఆదేశిస్తుంది.
4. సర్క్యులర్ నెం. ఆర్‌సి 15/15239/96 (చట్టం, నిబంధనలు) తేది 06.4.1996

   ఏయే ఆలయాలకు ధార్మిక సంస్థల తరపున దాఖలైన పిటీషన్ల మీద సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందో, ఆయా సంస్థలకు మాత్రమే ఈ సర్క్యులర్‌లలోని ఆదేశాలు వర్తిస్తాయి. ఇంకా కొన్ని పిటీషన్ల మీద సుప్రీం కోర్టు తీర్పు, ఇంకా వెలువడాల్సి వున్నందున, ఆయా సంస్థల నిర్వహణ విషయంలో యధాతధ స్థితిని కొనసాగించాలని కూడా దేవాదాయ శాఖ క్రింది అధికారులకు ఈ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

అయితే తరువాత కాలంలో మిగతా అన్ని పిటీషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దాంతో అంతకు ముందు సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్రంలోని అన్ని ధార్మిక, మత, దేవాదాయ సంస్థలకు వర్తింపచేయబడింది. ఆ రకంగా ఆ నాలుగో సర్క్యులర్‌కి కాలం చెల్లిపోయింది.

దీంతో రాష్ట్రంలోని దేవాలయాలకు ఏర్పడనున్న సంకట పరిస్థితి ఎలాంటిదో స్పష్టమైపోయింది. వెంటనే భావసారూప్యం గల భక్తులంతా కలిసి ఒక ధర్మరక్షణ సమితిని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో గల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయమే కేంద్ర స్థానంగా ఏర్పడిన ఈ కమిటీకి కాకతీయ సిమెంట్స్ చైర్మన్ శ్రీ పి.వెంకటేశ్వర్లు అధ్యక్షులు కాగా శ్రీ ఎం.వి.సౌందర రాజన్ కార్యదర్శి. ఈ కమిటీ లక్ష్యం ఒక్కటే - రాష్ట్రంలోని ఆలయాలు, మఠాలు, ఆశ్రమాలు, బృందావనాల న్యాయమైన హక్కుల్ని పరిరక్షించటం, సనాతన ధర్మం లక్ష్యాన్ని సాధించటం కోసం సాధన కొనసాగించటం.

సుప్రీంకోర్టు తీర్పు పరిధిలో 1987 నాటి చట్టాన్ని తొందరపడి అమలు చేయవద్దనీ,

రాష్ట్రంలోని చిన్న దేవాలయాల మనుగడ దృష్టిలో వుంచుకునైనా, సంబంధిత వర్గాలన్నింటితో ఒకసారి చర్చించవలసిందనీ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కమిటీ విన్నవించింది.

అయినా జరగకూడనిది జరిగిపోయింది. దేవాదాయశాఖ కమీషనర్ 1996 మార్చి 25న జారీ చేసిన సర్క్యులర్ ఆధారంగా చట్టంలోని సెక్షన్ 15 (3) క్రింద 6 (సి) కేటగిరీ క్రిందకి వచ్చే వివిధ దేవాదాయ సంస్థలకు ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్లను 'సింగిల్ ట్రస్టీలు'గా నియమిస్తూ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్లు ఆదేశాలు జారీ చేసేశారు. వంశపారంపర్య ధర్మకర్తలు తక్షణం ఈ కొత్త 'సింగిల్ ట్రస్టీ'లకు ఛార్జి అప్పగించాలని కూడా ఆ ప్రొసీడింగ్స్‌లో స్పష్టం చేశారు.

మరోసారి 1996 ఏప్రిల్ 11న రాష్ట్ర ప్రభుత్వానికి ధర్మ రక్షణ సమితి అభ్యర్థన చేసింది. మరో విడత సంప్రదింపులు జరిగే వరకూ అన్ని దేవాలయాలు, ధార్మిక సంస్థల విషయంలో యథాతథ స్థితినే కొనసాగించవలసిందిగా సమితి విజ్ఞప్తి చేసింది. సమితి ప్రయత్నాలకు స్పందించిన ప్రభుత్వం అదే ఏప్రిల్ 16న సమితికి ఒక హామీ ఇచ్చింది. ఆరోజు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆ సమితి ప్రతినిధి బృందంతో మాట్లాడుతూ, "అన్ని సర్క్యులర్ల అమలుని తాత్కాలికంగా నిలిపివేస్తున్నాం" అని ప్రకటించారు.

దేవాలయ, ధార్మిక సంస్థలన్నింటినీ ప్రభుత్వం వర్గీకరించిన తీరు ఇదీ:

1. 6(ఎ) : సెక్షన్ 65 క్రింద కంట్రిబ్యూషన్ విధించదగిన అయిదు లక్షల రూపాయలకు మించిన వార్షిక ఆదాయ కల ధార్మిక సంస్థలు, మతపరమైన ధర్మాదాయ సంస్థలు, మఠాలుగా పరిగణింపబడని ఇతర ధర్మాదాయ సంస్థలు.
2. 6(బి) : సెక్షన్ 65 క్రింద కంట్రిబ్యూషన్ విధించదగిన, 50 వేల రూపాయలకు పైబడి అయిదు లక్షల రూపాయలకు మించని వార్షిక ఆదాయం కలిగిన పై తరహా సంస్థలు.
3. 6(సి) : పై చెప్పబడిన 6(ఎ), 6(బి) కేటగిరీల క్రిందకు రాని ధార్మిక సంస్థలు, ధర్మాదాయ సంస్థలు, మతపరమైన సంస్థలు, మఠాలుగా పరిగణింపబడని ధర్మాదాయ సంస్థలు.
4. 6(డి) : ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా అన్ని మఠాలు.
5. 6(ఇ) : ఆదాయ పరిమితితో నిమిత్తం లేకుండా అన్ని రకాల ధర్మాదాయం.

ఇదిలావుండగా, అసిస్టెంట్ కమీషనర్లు జారీ చేసిన ఆదేశాలను ఛాలెంజి చేస్తూ రాష్ట్ర



హైకోర్టులో అనేక రిట్ పిటీషన్లు దాఖలయ్యాయి. వాటన్నింటిని హైకోర్టు అనుమతిస్తూ, తాత్కాలిక 'స్టే' ఉత్తర్వులు మంజూరు చేసింది. అయితే అప్పటికే, డిప్యూటీ కమీషనర్ల ఆదేశాల ప్రకారం, సెక్షన్ 29 క్రింద 6(బి) సంస్థలకు సింగిల్ ట్రస్టీలుగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నియామకం జరిగిపోయింది. ఈ నియామకాన్ని కూడా కొన్ని రిట్ పిటీషన్లలో ఛాలెంజి చేయడంతో ఆ పిటీషన్లను అనుమతిస్తూనే, ఆ ఉత్తర్వులను కూడా హైకోర్టు సస్పెండ్ చేసింది.

1987 డిసెంబరు 16 నాటి జీవో క్రింద అర్చకులకు చెల్లించవలసిన రెమ్యూనరేషన్ కన్నా ఎక్కువ (నగదుకాని, మరే రూపంలోగానీ) చెల్లించిన అన్ని కేసులలోనూ, ఆ జీవో తేదీ నుండి లెక్కకట్టి వసూలు చేయవలసిందిగా ఆదేశిస్తూ 1996 మార్చి 31 నాడు కమీషనర్ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ కూడా ఒక రిట్ పిటీషన్ దాఖలైంది. హైకోర్టు దీన్ని కూడా అనుమతించింది. పిటీషనర్ కోరిన విధంగా ఎందుకు తాత్కాలిక స్టే మంజూరు చేయకూడదో తెలియజేయమంటూ కమీషనర్‌కి ఒక స్వల్పకాలిక నోటీసును హైకోర్టు జారీ చేసింది.

అలాంటి మరో రిట్ పిటీషన్ విషయంలో హైకోర్టు స్పందిస్తూ, దేవాలయ భూములను కలిగి వున్న అర్చకులకు ఆ భూములపై హక్కులను తొలగించరాదంటూ 1996 మే ఏడున ఒక తాత్కాలిక స్టే ఉత్తర్వుని హైకోర్టు జారీ చేసింది.

విచిత్రం! సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొద్ది వారాల్లోనే ఆ తీర్పుని అమలు చేయద్దంటూ రిట్ పిటీషన్లు దాఖలవటం, వాటన్నింటినీ హైకోర్టు అనుమతించడం జరిగింది.

ఎందుకీ గందరగోళం!

సప్త మహాపాతకాల్లాగా సప్త కారణాలు ఈ అస్తవ్యస్త పరిస్థితికి దారితీశాయి.

1. పలు గొలుసుకట్టు షరతులకు లోబడి సుప్రీం కోర్టు తన తీర్పులో, పిటీషనర్లు ఛాలెంజ్ చేసిన (1987 చట్టంలోని) సంబంధిత సెక్షన్‌లు సమర్థనీయమే అని పేర్కొంది.
2. 1987 చట్టంలోని మూడు అత్యంత ప్రాధాన్యత కలిగిన సెక్షన్‌లను (సెక్షన్ 82(1), 82(2), 76) రెండు వేర్వేరు తీర్పులలో హైకోర్టు, మరో తీర్పులో సుప్రీంకోర్టు కొట్టివేశాయి. (ఇటీవల సుప్రీంకోర్టు మరో తీర్పులో సెక్షన్ 82(1), 82(2)లను అనుమతించింది.
3. ఈ మూడు సెక్షన్‌లూ - ఆలయాల ధార్మిక సంస్థల మాన్యాలతో ముడిపడి వుండటంతో 1987 చట్టం ఆచరణ సాధ్యం కాకుండా పోయింది.
4. సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించిన షరతుల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం అనేక కొత్త విధి విధానాలను రూపొందించాల్సి వచ్చింది.

5. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నిర్దిష్ట కాలవ్యవధిలో పాత వ్యవస్థ నుంచి కొత్త వ్యవస్థకు మారాల్సి వుంది. ఈ పరిణామ క్రమంలో అనేక కొత్త అవరోధాలు వాటంతట అవే తలెత్తాయి. దాంతో కొత్త వ్యవస్థ సక్రమంగా రూపుదాల్చకపోగా, పాత వ్యవస్థ పూర్తిగా అదుపు తప్పిపోయింది.

6. నిజానికి 1971 నాటి తమిళనాడు ప్రభుత్వం అనుభవాల దృష్ట్యాగానీ, 1987లో రాష్ట్రంలో కొత్త చట్టం అమలు చేయడంలో ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా గానీ, సుప్రీంకోర్టు తీర్పుల్ని అమలు చేయడం విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించుకుని వుండాల్సింది. (రాజ్యాంగపరమైన, ఆర్థికపరమైన అంశాలతో పాటు, ఇలాంటి ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు పరిధిలో - తన పాత్ర ఏ మేరకు వుండాలీ అన్న అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం క్షుణ్ణంగా అర్థం చేసుకునివుండాలి) కాని అలా జరగలేదు.

7. పైన చెప్పిన విధంగా సమగ్ర అధ్యయనం జరగకుండానే, ఏదో కొంపలంటుకుపోయినట్లు ఆఘమేఘాల మీద దేవాదాయశాఖ కమీషనర్ జారీ చేసిన అవకతవక సర్క్యులర్లు బెడిసికొట్టాయి.

ఫలితంగా ఈ రోజు రాష్ట్రంలో దేవాలయాలు, ధార్మిక సంస్థలు సంక్షోభంలో మునిగిపోయాయి. ప్రభుత్వమూ, దేవాదాయశాఖ ఎటూ పాలుపోని నిస్సహాయ స్థితిలో పడిపోయాయి. రాష్ట్రంలో అనాదిగా హిందూ సంస్కృతికి పట్టుకొమ్మగా భాసిల్లుతున్న ఆలయాల వ్యవస్థ భవిష్యత్ గురించి ప్రజలు ఆందోళనా భరితమైన ఆవేదనకు గురవుతున్నారు.

ఇప్పుడేం చేయాలి???

ఈప్రశ్న వేసుకునే ముందు, 1987 చట్టం పూర్వాపరాలు, సుప్రీంకోర్టు తీర్పులు, వాటి అమలులో ఉత్పన్నమైన అవరోధాలు, అవి రాజ్యాంగపరమైన, ఆర్థికపరమైన చిక్కుముడులకు దారి తీసిన స్థితిగతులు విశ్లేషించాల్సి వుంది.

★ ★ ★



# సెక్షన్ 76 చెల్లుబాటు మీద తీర్పు

1996 జనవరి 12 నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు - 1987 నాటి దేవాదాయ చట్టంలోని సెక్షన్ 76కి సంబంధించింది. ఈ చట్టంలోని సెక్షన్ 76 సబ్ సెక్షన్ 2(22)కి ఇచ్చిన వివరణల రాజ్యాంగబద్ధత గురించి ఈ తీర్పులో సుప్రీంకోర్టు చేసిన ప్రస్తావన ఇలా వుంది :

“ఈ సెక్షన్ ప్రకారం - ఒక మతపరమైన సంస్థకి, లేదా సమాజానికి సేవ చేయడం కోసంగానీ, దానమివ్వటం కోసం గానీ, తత్సంబంధిత కార్యాల కోసంగానీ పనిచేసే ధార్మిక సంస్థకి ఊతమివ్వటం కోసం ఇవ్వబడిన లేదా నిర్దేశించబడిన ఆస్తి (చరాస్తిసహా) సంబంధిత భవనాలు సహా మతపరమైన ఎండోమెంట్‌గా పరిగణించబడుతుంది. అర్చకులకు, ఇతర ఆలయ సేవకులకు లేదా ఉద్యోగులకు మంజూరు చేయబడిన ఇనాం భూములు సయితం మతపరమైన ఎండోమెంట్‌గా పరిగణించబడుతుంది. ఇనాముల రద్దు చట్టం క్రింద అర్చకులకు, ఇతర ఆలయ సేవకులకు, ఉద్యోగులకు ఆయా భూములపై రైతువారీ పట్టాలు మంజూరై వున్నప్పటికీ ఇనాం భూములు మతపరమైన ఎండోమెంట్‌గానే పరిగణించబడుతాయి.

సెక్షన్ 76 ప్రకారం, ఒక మతపరమైన సంస్థకి, ధార్మిక సంస్థకి లేదా ఎండోమెంటుకి, సేవల కోసం మంజూరు చేయబడిన భూమి బదలాయింపులు నిషిద్ధం. సబ్ సెక్షన్ (1) ప్రకారం - ఒక ధార్మిక సంస్థకిగాని, వితరణ సంస్థకి గాని సేవలు చేయటం కోసం ఒక ఉద్యోగికి (సేవకుడికి) ఇవ్వబడిన ఇనాం భూముల మీద ఏ వ్యక్తికయినా (ఈ చట్టం అమల్లోకి వచ్చాకగానీ, రాక ముందుగానీ) రైతువారీ పట్టా మంజూరయి వుంటే, అలాంటి భూబదలాయింపు జరగనట్లుగా పరిగణించబడుతుంది. కొత్తగా అలాంటి బదలాయింపు అనుమతించబడదు కూడా. ఇందుకు విరుద్ధంగా అన్వయించేలా ఆ సమయానికి ఏ ఇతర చట్టంలోనయినా నిర్వహించబడి వున్నప్పటికీ, ఈ సబ్ సెక్షన్‌కి లోబడి ఇలాంటి బదలాయింపులు ఎన్నడూ జరగనట్లుగానే భావించబడుతుంది. అంటే, ఇలాంటి సేవల కోసం భూములు మంజూరై వున్నప్పటికీ, ఇలాంటి మంజూర్లు లేదా జారీ అయిన రైతువారీ పట్టాలు ఆయా ధార్మిక, మత సంస్థల కోసం మంజూరు చేయబడినవే అవుతాయి తప్ప, అలాంటి భూముల్ని సేకరించే హక్కు ఏ వ్యక్తికి వుండదు.

అంతే కాదు, అలా బదలాయింపుల ద్వారా ఏ భూమి అయినా ఎవరికయినా సంక్రమించివుంటే, ఆ వ్యక్తి ఆ భూముల్ని అక్రమంగా ఆక్రమించినవాడుగా పరిగణించబడతాడు. చట్టంలోని సెక్షన్ 84, 85ల ప్రకారం అతను శిక్షార్హుడు. అలాగే అలాంటి భూముల బదలాయింపుకి సంబంధించిన రైతువారీ పట్టాను కలిగి వుండటాన్ని సబ్‌సెక్షన్ (2) స్థంభింపజేస్తుంది. ఏతావాతా, అలాంటి భూముల్ని కొనుగోలు ద్వారా గానీ, బహుమతిగా

గానీ, తనఖా క్రిందగానీ వస్తుమార్పిడి క్రిందగానీ మరే ఇతర విధానాల ద్వారాగానీ పొందిన వ్యక్తికి ఆ భూముల మీద ఎలాంటి చట్టపరమైన హక్కు వుండదు. సెక్షన్ (3) క్రింద అలాంటి భూబదలాయింపులు విలువ లేనివిగా, చెల్లనివిగా ప్రకటించబడతాయి. ఒకవేళ ఏదయినా సివిల్ కోర్టు తీర్పు లేదా మరే ఇతర ఉత్తర్వు (ఇలాంటి బదలాయింపులకి అనుగుణంగా) జారీ అయివుంటే, అది కూడా సబ్ సెక్షన్ (4) ప్రకారం విలువలేనివి, చెల్లనివి మాత్రమే అవుతాయి.

ఇక్కడే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. హైకోర్టు వ్యాఖ్య కూడా ఇదే:

ఇనాముల రద్దు చట్టాన్ని తగు విధంగా సవరించకుండా లేదా రద్దు చేయకుండా, శాసనసభ ఒక ప్రక్కదారిలోంచి సుడిగాలిగా వచ్చేసి - కోర్టు ఆమోదంతో రూపొందించిన చట్టాన్ని విలువలేనిదిగా చేసిపారేయొచ్చా? చట్టంలోని 76వ సెక్షన్‌ని చూపిస్తూ, పైన ఉదహరించబడిన రీతుల్లో భూముల మీద ఒక వ్యక్తికి సంక్రమించిన హక్కుని తొలగించి, అలాంటి బదలాయింపు రైతువారీ పట్టాకి అనర్హమైనదనీ, ఇలాంటి బదలాయింపు జరగరాదనీ, జరిగివుంటే అది ఎన్నడూ జరగనట్లుగా పరిగణించబడుతుందనీ, అలాంటి బదలాయింపుల ద్వారా భూముల్ని హక్కుభుక్తం చేసుకొనేవాళ్ళు అక్రమ ఆక్రమణదారులుగా పరిగణించబడతారనీ ప్రకటించవచ్చా?

నిజానికి ఇనాముల రద్దు చట్టం ఒక సమగ్రమైన నిబంధనా పత్రం. రైతువారీ పట్టాల జారీ ద్వారా అదృశ్యమైపోయిన ఇనాము భూముల మీద హక్కులకు సంబంధించిన ఏ చట్టం అమలుకైనా ఈ ఇనాముల రద్దు చట్టమే ఒక మార్గదర్శి.

రైతువారీ పట్టా ద్వారా సంక్రమించిన భూమిపై దాని కౌలుదారు లేదా అర్చకుడు, లేదా ఆలయ సేవకుడు లేదా ఇతర ఉద్యోగికి ఆ భూమిపై సంపూర్ణ హక్కు వుంటుంది. ఈ రైతువారీ పట్టా జారీ చేసే విధానం వల్ల - ఆ వ్యక్తికి సదరు భూములతో గతంలో వున్న సంబంధం రద్దయిపోయి, కొత్తగా ఒక సొంతదారుగా - ప్రభుత్వంతో (రెవెన్యూ శాఖతో) ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది - ఇనాముల రద్దు చట్టంలోని సెక్షన్ 12 - ప్రభుత్వానికి రైతువారీ సెటిల్‌మెంట్ తాలూకు చెల్లింపులు శీఘ్రంగా జరిగేలా చూస్తుంది. దాంతో, రైతువారీ పట్టా జారీకి ముందు అమలులో వున్న ఇనామ్ సర్వీసుకి ఎలాంటి చట్టపరమైన విలువా లేకుండాపోతుంది. ఆ రకంగా ఆయా సంస్థలకి సేవలు కొనసాగించే భారం కూడా ముగుస్తుంది. అంటే - రైతువారీ పట్టా ద్వారా ఇనాం భూముల్ని పొందిన వ్యక్తికి ఆ భూములపై సర్వహక్కులూ (వంశపారంపర్యంగా ఆ భూముల్ని అనుభవించే హక్కు లేదా విరాళం ఇచ్చే హక్కు, .... వగయిరా) సంక్రమిస్తాయి.



కాబట్టి ఈ మేరకు కొత్త చట్టంలోని సెక్షన్ 76, సెక్షన్ 2(22)కి ఇచ్చిన వివరణ (II)లు చెల్లవు. రాజ్యాంగ విరుద్ధం కూడా - అని మేం భావిస్తున్నాం."

ఈ రకంగా చట్టంలోని సెక్షన్ 76ని సుప్రీంకోర్టు, సెక్షన్ 82(1), 82 (2)లని హైకోర్టు - చెల్లనివిగా ప్రకటించటంతో, వంశపారంపర్య హక్కుల రద్దు విధానాలకు మూలమైన మౌలిక సూత్రావళి కొట్టి వేయబడింది. ఫలితంగా అర్చకుల, ఇతర ఆలయ సేవకుల ఆధీనంలో వున్న సుమారు 80 వేల ఎకరాల భూమి వారికే హస్తగతమైంది. ఆలయాలు ఆస్తిరహితంగా మిగిలాయి.

సుప్రీంకోర్టు ఈ నేపథ్యంలో - ఇటీవల సెక్షన్ 82(1), 82(2) - రెండింటినీ సమర్థనీయంగా ప్రకటించింది. ఇది ఆసరాగా తీసుకుని, ప్రభుత్వం తాను పోగొట్టుకున్న ఆలయ భూముల్ని, ధార్మిక సంస్థల భూముల్ని ఆస్తుల్ని అక్రమ ఆక్రమణదారుల (బడా భూస్వాముల, రాజకీయ శక్తుల కబంధ హస్తాల) నుండి ఏ మేరకు తిరిగి స్వాధీనం చేసుకొంటుందో కాలమే చెప్పాలి.

★ ★ ★

# వంశపారంపర్య ధర్మకర్తల హక్కుల రద్దు

**1996** జనవరి 17 నాడు 1987 నాటి రిట్ పిటీషన్‌పై ఇచ్చిన తీర్పులో - వంశపారంపర్య ధర్మకర్తృత్వపు హక్కుని రద్దు చేయటాన్ని రాజ్యాంగవిరుద్ధంగా ప్రకటించటానికి వీల్లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

కొత్త చట్టంలోని 16, 17, 19 సెక్షన్‌లకి రాజ్యాంగ పరంగా గల చెల్లుబాటుని, ధార్మిక సంస్థలకు ఆయా స్థాపకుల కుటుంబ సభ్యులొకర్ని ధర్మకర్తల సంఘం చైర్మన్‌గా నియమింపబడటంలో గల వాంఛనీయతని పరిశీలిస్తూ, సుప్రీంకోర్టు తన తీర్పులో సుదీర్ఘమైన వ్యాఖ్యానం చేసింది.

"సెక్షన్ 16 క్రింద ధర్మకర్తల మండలిలో వంశపారంపర్య సభ్యత్వాన్ని రద్దు చేయటం సమర్ధించబడినప్పటికీ, మతపరమైన లేదా ధార్మిక సంస్థల మనుగడ - వాటి స్థాపకుల వల్లనే సాధ్యపడింది కనుక అలాంటి సంస్థల సమర్ధవంతమైన నిర్వహణ విషయంలో ఆయా స్థాపకుల కుటుంబ సభ్యులే అధిక శ్రద్ధాసక్తులు చూపిస్తారు. అందుచేత భవిష్యత్‌లో అలాంటి యాజమాన్య నిర్వహణలో ఏదన్నా లోపం జరిగిందని నిరూపితమయ్యేవరకూ, వారికి స్వతంత్ర ప్రతిపత్తినివ్వటం అన్నది ఆ సంస్థల ఆశయాల సాధనకు ఒక హామీ ఇవ్వటంవంటిది. ఆ రకంగా, ఆయా సంస్థలు సక్రమంగా, సమర్ధవంతంగా నిర్వహించబడినంతకాలం, ఆ ఎండోమెంట్ అధికారుల విషయంలో గానీ, నిర్దిష్ట విధానాలు పాటించటం విషయంలో గానీ యాజమాన్య నిర్వహణలో తగిన స్వేచ్ఛ కలిగి వుండటానికి ఆ వ్యక్తి అర్హుడై వుంటాడు.

ఒక ధర్మకర్తల సంఘం ఏర్పాటు చేయబడినట్లయితే, ఆ బోర్డుకి అధ్యక్షత వహించే హక్కు ఆ సంస్థ స్థాపకుడికి గానీ అతని కుటుంబ సభ్యుడికి గానీ వున్నప్పుడే వాళ్ళకి తాము చురుగ్గా పాల్గొనాలన్న శ్రద్ధాసక్తులు జనిస్తాయి. కేవలం ఏదో స్థాపకుడి తాలూకు ప్రతినిధులుగా పాల్గొనటమేకాక, ఆయా ధార్మిక, మత సంస్థ యజమాన్య నిర్వహణ సక్రమంగా జరిగేలా వాళ్ళు ప్రభావితం చేయగలిగి వుంటారు. అంతేకాక, ఆ వ్యక్తి బోర్డులోని ఇతర సభ్యులచేత కూడా నియమాలను, నిబంధనలను, విధానాలను, ఆచార సాంప్రదాయాలను పాటించేలా చేయగలుగుతాడు.

అలాకాక (ఆ స్థాపకుడి ప్రతినిధి) ఇతర సభ్యుల లాగా కేవలం ధర్మకర్తల మండలిలో సభ్యుడిగా మాత్రమే వుండిపోతే, అది అతని స్థాయిని తగ్గించివేస్తుంది. స్థాపకుడి తాలూకు కుటుంబ సభ్యుడు చైర్మన్‌గా వున్న సందర్భాలలో - ఆ ఆలయానికి లేదా ధార్మిక సంస్థ భవనానికి ఏదన్నా మరమ్మత్తులు, విస్తరణ వంటి కార్యక్రమాలకు అవసరమైన నిధుల్ని ప్రజల నుండి సమీకరించగలుగుతారు. అలాంటి అవసరాలొచ్చినప్పుడు ప్రభుత్వోద్యోగి కావటం వల్ల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిస్సహాయుడు కావచ్చు లేదా నిరాసక్తత చూపవచ్చు.

కనుక ఆయా మత, ధార్మిక సంస్థల ఆశయాలు నెరవేరటానికి, అలాంటి పలు కొత్త సంస్థల ఆవిర్భావం ప్రోత్సహించబడటానికి వీలుగా ఆ స్థాపకుడు లేదా అతని కుటుంబ సభ్యుడ్ని ధర్మకర్తల సంఘానికి చైర్మన్‌గా చేయటం, లేదా అతని మాటకు ప్రాధాన్యత నివ్వటం అర్ధవంతంగా, ప్రయోజనకరంగా వుంటుంది. అలా చేయటంవల్ల, ఆ సంస్థ స్థాపకుడు లేదా ఆ కుటుంబ ప్రతినిధి భవిష్యత్‌లో ఆ సంస్థ యాజమాన్య నిర్వహణను సక్రమంగా, సమర్ధంగా నిర్వహింపజేయగలుగుతాడు. భవిష్యత్‌లో అలాంటి సంస్థలు మరికొన్నింటిని ఏర్పాటు చేయటానికి కూడా అతనికి ఉత్సాహం కలుగుతుంది.

"... ధర్మకర్తల పాలకవర్గానికి ఆ సంస్థ స్థాపకుడు లేదా అతని కుటుంబ సభ్యుడు అధ్యక్షుడుగా వుండాలి అన్నది మా అభిప్రాయం. ధార్మిక సంస్థల స్థాపకుడు ఆశించిన లక్ష్యం, ప్రయోజనం నెరవేరేలా చేయటంలో మా అభిప్రాయం గణనీయమైన ప్రభావాన్ని కలిగి వుంటుంది...."

"... కనుక, 17, 29(5) సెక్షన్‌లను తప్పు పట్టుకోనక్కర్లేదు. ఈ సెక్షన్‌లలో ఎలాంటి కరుకుదనం వున్నప్పటికీ, క్రమేణా స్థాపకుడు లేదా అతని కుటుంబ సభ్యులు చైర్మన్‌గా వ్యవహరించే పాలకవర్గ నిర్ణయాలతో అది మెత్తబడుతుంది.... ఈ భావాలకు లోబడి, ఈ రెండు సెక్షన్‌ల చెల్లుబాటుని మేం అంగీకరిస్తున్నాం...."

"... అన్ని ధార్మిక, మత సంస్థల నిర్మాణం ఒకేరకంగా వుండకపోవచ్చునంటూ పిటీషన్‌ల తరపు న్యాయవాది చేసిన వాదనలతో ఏకీభవించడానికి మేం సిద్ధమే. ఎలాంటి నిధుల దుర్వినియోగం, లోపభూయిష్టమైన యాజమాన్య నిర్వహణలేని మత, ధార్మిక సంస్థలు కూడా వున్నాయనటంలో మాకెలాంటి సందేహం లేదు..."

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుననుసరించి, ధర్మకర్తల మండలికి చైర్మన్‌గా ఆ ధార్మిక, మత సంస్థ స్థాపకుడు లేదా అతని కుటుంబ సభ్యుడు నియమించబడాలి. ఆ సంస్థ నిర్వహణలో పాలనా వ్యవహారాల్లో అతనికి పెద్ద పీట వెయ్యాలి. అంటే, సుప్రీంకోర్టు తీర్పుకి అనుగుణంగా వుండేలా- 1987 చట్టంలోని 15, 17, 19, 20, 29 సెక్షన్‌లను సవరించటానికి చర్యలు తీసుకోవాలి. కాని.... ఈ అయిదేళ్ళ కాలంలో ఎలాంటి చర్యలు తీసుకోబడలేదు.

ఫలితం! దేవాలయాలు, ధార్మిక సంస్థలు సంక్షోభంలో మునిగిపోయాయి.

★ ★ ★

# మఠాధిపతులు తదితరుల నియామకంపై సుప్రీంకోర్టు తీర్పు

మఠాధిపతుల నియామకం విషయంలో సుప్రీంకోర్టు ఏం తీర్పు ఇచ్చిందో చూద్దాం.

పాద కానుకల అక్కవుంట్స్ నిర్వహణలో మఠాధిపతుల ఆవశ్యకతకి, మఠాధిపతుల నియామకం ఎండోమెంట్స్ కమీషనర్ ఆమోదానికి లోబడి జరగాలన్న అంశానికి సంబంధించి చట్టంలో గల సెక్షన్‌లను సుప్రీంకోర్టు అనుమతించింది.

తీర్పులో సంబంధిత భాగాలు ఇలా వున్నాయి.

**పేరా 17:**

మఠాధిపతి స్థానాల ఖాళీలను భర్తీ చేయటం గురించి 53వ సెక్షన్ ప్రస్తావిస్తోంది. ఒక మఠానికి ఆధ్యాత్మిక పెద్దగా, మత విజ్ఞానాన్ని బోధించే మఠాధిపతి తన వ్యక్తిగత ఆసక్తుల్ని మఠ ప్రయోజనాలతో కలిపి చూస్తాడని నొక్కి చెప్పడం అవసరం. కేవలం నామినేషన్ ద్వారా వారసత్వంగా మఠాధిపతి స్థానాన్ని పొందే అర్హత, అలాంటి అర్హత పొందటానికి కావలసిన మౌలిక లక్షణాలు (Qualifications) కలిగి వుండటానికీ, మఠాన్ని, ఆస్తుల్ని సక్రమంగా సమర్థంగా నిర్వహించటానికి అవసరమైన సామర్థ్యాన్ని కలిగి వుండటానికీ సంబంధం వుండనక్కర్లేదు. ఇవి రెండూ వేర్వేరు అంశాలు. ఒక వ్యక్తిని మహంతుగా నియమించటంలో లేదా అతని (Qualifications) విషయంలో జోక్యం చేసుకునే అవకాశం వుండటం అనేది చాలా సున్నితమైన అంశం. అయితే దీనికి అపారమైన ప్రాధాన్యత వుంది. మఠం విషయంలో ఆసక్తి కలిగివున్న పూర్వపు మఠాధిపతి గానీ, ఆయన తదనంతర అనుయాయులుగానీ, మఠం తాలూకు ఆస్థిపాస్తులు, ఎండోమెంట్స్ యాజమాన్యం పట్ల, పాలనా వ్యవహారాల పట్ల చిత్తశుద్ధితో ఆసక్తి కలిగి వుంటారు.

అందుచేత, ఇలాంటి మఠాధిపతుల నియామకాలను పరిశీలించేటప్పుడు ఎండోమెంట్స్ కమీషనర్ ఈ వాస్తవాల్ని దృష్టిలో వుంచుకోవాలి.

**పేరా 18:**

సెక్షన్ 53లోని సబ్ సెక్షన్ (1) ఈ అంశానికి సంబంధించింది.

సెక్షన్ 51లో ఉదహరించినట్లుగా మఠాధిపతి స్థానంలో ఎవరయినా మరణించటం వల్లగానీ, రాజీనామా చేయటం వల్ల గానీ, లేదా తొలగించటం వల్లగానీ ఒక పర్మనెంటు (మహంతు) పోస్టు ఖాళీ అయితే, ఆ పోస్టుకి అనువంశికంగా వారసుడయ్యే అర్హతకల వ్యక్తి (ఆ సంస్థ స్థాపకుడు ఏర్పరచిన అనువంశిక వారసత్వ నిబంధనల ప్రకారమే జరిగినా, అనూచానంగా వస్తున్న విధానం ప్రకారమే జరిగినా, ఆ సమయానికి అమలులో వున్న వారసత్వ చట్టం



ప్రకారమే జరిగినా) - ఎండోమెంట్ కమీషనర్ అనుమతితో మాత్రమే ఆ పోస్టు అధిరోహించగలుగుతాడు.

**పేరా 19:**

సెక్షన్ 53లోని సబ్ సెక్షన్ (1) నిబంధనకి (అంటే మఠాధిపతి పోస్టులో వారసుడి నియామకానికి కమీషనర్ అనుమతికి సంబంధించింది) ఒక లక్ష్యం వుంది. సబ్ సెక్షన్ (2)లో ఉదహరించబడిన లక్షణాలు కలిగి, సెక్షన్ 51(1)లో ఉదహరించబడిన అనర్హతలు లేకుండా వున్న వ్యక్తి మాత్రమే ఆ పోస్టులో వారసుడిగా నియమింపబడేలా చూడటమే ఆ లక్ష్యం.

ఒక మత పెద్ద నుండి లేదా అలాంటి మరో తగిన బోధకుడి నుండి ఒక అనుయాయి తన బాల్యదశ నుండే మత పరమైన విద్యని అభ్యసిస్తాడని శ్రీ పరాశరన్ నొక్కి చెప్పడం సబబే.

**పేరా 23:**

సెక్షన్ 53లో సబ్ సెక్షన్ (2) ద్వారా, ఒక మహంతుకి వుండాల్సిన లక్షణాలు నిర్దేశించబడ్డాయి. ఒకసారి మఠాధిపతి స్థానం నుండి తొలగించబడిన మహంతు మళ్ళీ సెక్షన్ 51(2) క్రింద నామినేట్ చేయబడితే, అలాంటి నామినేషన్‌ని కమిషనర్ గుర్తించరు, మఠాధిపతిగా అతని నియామకానికి అనుమతి ఇవ్వరు అన్నది సుస్పష్టం. తాజాగా మరో నామినేషన్ పంపించవలసిందిగా కోరే అధికారం కమిషనర్‌కి వుంటుంది.

ఆ రకంగా కమిషనర్ గుర్తింపు అనేది సెక్షన్ 53లోని సబ్ సెక్షన్ (1) క్రింద ఆ నామినేషన్‌ని క్రమబద్ధీకరిస్తుంది తప్ప సెక్షన్ 53లోని సబ్ సెక్షన్ (2)లో పేర్కొనబడిన Qualifications తో మహంతు నియామకం జరిగినప్పుడు అడ్డుపడేది కాదు.

అంటే, చట్టంలోని ఆయా సెక్షన్‌లు - మఠం పరిపాలనను, మఠం నిర్వహణను దెబ్బతీసేలా వారసత్వపు హక్కు మీద సాగే అనవసరమైన లిటిగేషన్‌ను నిరోధించటానికి, మఠ ప్రయోజనాలు కాపాడటానికి, తద్వారా ఆ మఠం లేదా ఆ ఎండోమెంట్ ఏర్పాటులో గల లక్ష్యాన్ని సాధించటానికి ఉద్దేశించబడ్డాయి.

**పేరా 24:**

ఎండోమెంట్ కమీషనర్‌గా వుండే వ్యక్తి అపారమైన పరిపాలనా అనుభవం కలిగి వుండే ఉన్నత స్థాయి అధికారి. నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ, అయిదవ ప్రకరణం యొక్క ప్రయోజనాన్ని సబబైన రీతిలో నెరవేరేలా చేయాల్సి వుంటుంది. అలా చట్టం యొక్క ప్రయోజనం నెరవేరేలా చూడటం కోసం ఆ అధికారి తనకు అవసరమైన అదనపు అధికారాలను కోరే అవకాశం

వుంది. ఆయన సమంజసంగానూ, నిష్పాక్షికంగా, ముక్కుకి సూటిగానూ వ్యవహరిస్తాడు. అతను ఆ నమ్మకాన్ని వమ్ము చేసి, నిరంకుశంగా వ్యవహరిస్తే, ఆ చర్యని తగిన ఉత్తర్వుల ద్వారా సవరించాల్సి వుంటుంది.

అంటే, ఆ కమీషనర్ నిరంకుశంగా గానీ, తన ఇచ్ఛానుసారంగా గానీ వ్యవహరించి (మహంతుల నియామకాల) నామినేషన్‌లను ఆమోదించడమో, తిరస్కరించటమో చేయకూడదు. కమిషనర్ అలాంటి చర్యలకు పాల్పడితే, ఆ చర్య గర్హించదగింది. చట్టప్రకారం, తగిన చర్యలు తీసుకోదగింది. అంతేకాని, ఈ ప్రమాదం వుంది కాబట్టి అన్న కారణంగా సెక్షన్ 53ని పూర్తిగా 'అధికార పరిధిని అతిక్రమించటం'గా ప్రకటించరాదు.

**పేరా 28:**

54వ సెక్షన్ మఠాధిపతుల నామినేషన్‌కి సంబంధించింది.

ఇంతకు ముందు ఉదహరించిన వివిధ అంశాల ఆధారంగా నామినేట్ చేయబడిన మఠాధిపతుల నియామకాలకి ఆమోదముద్ర వేసే చర్య ద్వారా మహంతుల నియామకంలో కమిషనర్‌లు వేలు పెట్టడాన్ని అనుమతించరాదంటూ, (పిటీషనర్‌ల తరపున) న్యాయవాది శ్రీ పరాశరన్ గారు తీవ్ర అభ్యంతరాన్ని పదే పదే బల్లగుద్ది మరీ చెప్పారు.

వారి వాదనలోని అంశాలను, ప్రతివాదుల తరపు న్యాయవాది శ్రీ పి.పి.రావు గారి ప్రతివాదనలోని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాక, ఈ (మహంతుల నామినేషన్) విషయంలో ఎండోమెంట్ కమిషనర్ పాత్ర అల్పమైనదని మేం భావిస్తున్నాం.

**పేరా 30:**

ఈ నామినేషన్‌ల విషయంలో - పండిత నిబంధనల (Pandit rules) ప్రకారం కమిషనర్ నడుచుకొంటుంటారు. అంటే, ఒక మఠాధిపతి నియామకానికి సంబంధించి అదే సాంప్రదాయానికి చెందిన మహంతుల సమావేశం నిర్వహణలో తగిన వ్యక్తి - కమిషనర్‌కి సహాయపడతారు. మహంతు నియామకాన్ని కమిషనర్ గుర్తించాల్సి వుంటుంది. 1988 మార్చి 17 నాటి ప్రభుత్వ (రెవెన్యూ శాఖ) ఉత్తర్వు ఎం.ఎస్. నెం. 218లో మఠాల రూల్సుగా చెప్పబడే అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ మఠ్ రూల్సు (1987)లో తగిన విధానాన్ని రూపొందించినట్లు మేం గమనించాం.

సవరించబడిన రూల్ (3) తాలుకు సబ్‌రూల్ (1)లోని క్లాజ్ (5) వివరణలు, మరియు రూల్ (3)లో సబ్‌రూల్ (2)లోని క్లాజ్ (5) వివరణలు మా ముందు వుంచబడ్డాయి. వీటిని ప్రభుత్వం చేత (అఫిడవిట్‌పై ప్రమానం చేయటానికి) నియోగించబడిన ఎండోమెంట్స్ అడిషనల్



కమీషనర్ శ్రీ ఎన్.నరసింహారావు అఫిడవిట్‌తో సహా దాఖలు చేశారు.

**పేరా 31:**

పై వివరణల ప్రయోజనం ఇలా వుంది:
రూల్ 3లో సబ్ రూల్ (1)లోని క్లాజ్ (5) ప్రకారం -

"మఠాధిపతి పోస్టుకి నామినేట్ చేయబడిన వ్యక్తి నిర్దిష్ట లక్షణాలు వున్నాయని సంతృప్తి చెందటం కోసం, సదరు మఠం ఏ సాంప్రదాయానికి చెందిందో, అదే మఠానికి, విధానానికి, సాంప్రదాయానికి చెందిన అనుభవజ్ఞులైన వ్యక్తుల్ని కమీషనర్ సంప్రదించి వాళ్ళ అభిప్రాయాల్ని సేకరించాల్సి వుంటుంది".

రూల్ 3లో సబ్ రూల్ (2)లోని క్లాజ్ (5) ప్రకారం -

"మఠాధిపతి లేదా ఆ పోస్టుకి నామినేట్ చేయబడిన వ్యక్తికి, లేదా వారసుడికి కారణాలు వినిపించకుండానే ఆ నామినేషన్‌ను తిరస్కరించే, లేదా ఆ వారసత్వపు హక్కుని గుర్తించటానికి నిరాకరించే అధికారం కమీషనర్‌కి లేదు"

**పేరా 32**

ఆ రకంగా - ఒక మఠాధిపతి నామినేషన్ విషయంలో ఆ నామినేట్ చేయబడిన వ్యక్తి సెక్షన్ 5లోని సబ్ సెక్షన్ (2) ప్రకారం నిర్దేశిత లక్షణాలు కలిగి వున్నాడనీ, సెక్షన్ 51(2) ప్రకారం అనర్హుడు కాదనీ సంతృప్తి చెందటానికి వీలుగా కమీషనర్ - అదే మత సాంప్రదాయానికి చెందిన విజ్ఞులను సంప్రదించి, వాళ్ళ అభిప్రాయాల్ని తీసుకొన్నాక, అప్పుడు తన అనుమతి మంజూరు చేయటం విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది.

ఒకవేళ ఆ నామినేషన్‌కి గుర్తింపుని తిరస్కరించాలని కమిషనర్ భావించే పక్షంలో కూడా, ఆ మహంతుకి లేదా నామినేటెడ్ వ్యక్తికి తాను ఏ కారణాల వల్ల తిరస్కరిస్తున్నాడో కమిషనర్ వివరించాల్సి వుంది. నామినేషన్ తిరస్కరించదలచుకున్నప్పుడు ఆ కారణాలు రికార్డు చేయాలని వేరే చెప్పనక్కర్లేదు.

మరో రకంగా చెప్పాలంటే - ఇక్కడ జరగాల్సింది - కమిషనరు సదరు నామినేషన్‌ని పరీక్షించటమే గాని, నామినేషన్ ప్రక్రియకి ఆటంకం కలిగించటంగానీ, అర్హుడైన వ్యక్తి మఠాధిపతి కాకుండా నిరోధించటం గానీ కాదు. ఆ రకంగా ఆ మఠం తాలూకు సాంప్రదాయం, నియమాలు, ఆచార వ్యవహారాలకి లోబడి మఠాన్ని, మఠం ఆస్తుల్ని సమర్థంగా నిర్వహించగల వ్యక్తే మహంతు పోస్టుకి నామినేట్ చేయబడుతున్నాడా లేదా అని పరీక్షించే ఒక పెద్దరికపు పాత్ర మాత్రమే కమిషనర్‌ది.

### పేరా 40

సెక్షన్ 55 (సవరించబడిన విధంగా) క్రింద పాదకానుకలనేవి మఠాధిపతి అయిన మహంతుకి ఇచ్చే బహుమతులుగానీ, ఆస్థులుగానీ కానేరవు - అని ఈ కోర్టు భావిస్తోంది. అలాంటి కానుకల తాలూకు అక్కవుంట్లను ఎప్పటికప్పుడు మహంతు పక్కాగా నిర్వహించాలి. ఆ కానుకల్ని ఆ సంస్థ విధానాలకి అనుగుణంగా మాత్రమే ఖర్చు పెట్టడానికి మహంతుకి అర్హత వుంది. ఎందుకంటే - అలాంటి బహుమానాలు ఆయన ఆ మఠానికి అధిపతి అయి వుండటం వల్ల వచ్చినవి మాత్రమే.

సెక్షన్ 55లో నిర్వహించిన విధంగా పాదకానుకల అక్కవుంట్లను మహంతు నిర్వహించాలనీ, వాటిని ఆ సంస్థ అవసరాలకు, విధానాలకు తగినట్లుగా వెచ్చించాలనీ (చట్టంలో) విధించబడిన షరతులు సమంజసమైనవే.

(మఠాధిపతుల విషయాలకి సంబంధించిన తీర్పుల మీద ఎలాంటి వ్యాఖ్యలను ఈ రచయిత చేయదల్చుకోలేదు. ఆ అంశాలు చాలా సున్నితమైనవి. తీవ్ర ప్రతిస్పందనకి అవకాశం వున్నవి.

**ఏమైనప్పటికీ - ఒక్క విషయం మాత్రం వాస్తవం. ఈ చట్టం వల్ల మఠాధిపతులు ఒక కూటమిని, భజన పరుల్ని ఏర్పరుచుకొని, ఆలయాలకి, సాధారణ ప్రజలకి దూరమైపోయారు. మఠాధిపతులు వాళ్ల ప్రస్తుత కార్యకలాపాలను సమీక్షించుకొని, ఒకప్పుడు ఏ విధుల నిర్వహణలో వాళ్ళు అగ్రభాగంలో వున్నారో ఆ విధి నిర్వహణను తిరిగిచేపట్టాల్సిన అవసరం వుంది. ఆత్మ విమర్శ చేసుకొని, మారాల్సిన తరుణం ఆసన్నమైంది.)**

★ ★ ★



# అనువంశిక అర్చక హక్కుల రద్దు

అర్చకుల కేసులో 1996 మార్చి 19 నాడు సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో అధికభాగం - ఇరువర్గాలు చేసిన వాదనల విషయంలో సమకాలీన పరిస్థితులపై మేధో మథనంతో నిండిపోయింది.

ప్రస్తుత చర్చనీయాంశమైన విషయానికి సంబంధం వున్నంత మేరకే ఆ తీర్పులోని ముఖ్య భాగాలను ఇక్కడ ఇవ్వడం జరిగింది.

### పేరా 137

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 32,201 ఆలయాలు వున్నాయి. వాటిలో 7,761 ఆలయాలు మదింపు చేయదగిన ఆదాయం వున్నవి. మిగతా 24,440 ఆలయాలు వెయ్యి రూపాయలకు లోబడిన వార్షిక ఆదాయం వున్నవి. మొత్తం మీద 582 ఆలయాలు మాత్రమే 10,000 రూపాయల పైబడిన వార్షిక ఆదాయం కలిగి వున్నవి. వీటిల్లో ఎనిమిది ఆలయాలకి 20 లక్షల రూపాయలు వార్షిక ఆదాయం వుంది.

గ్రేడెడ్ వేతనాల విధానం ప్రవేశపెడుతూ, వంశపారంపర్య హక్కులు తొలగించటంతో 24,440 చిన్న ఆలయాల్లోని అర్చకులు, ఉద్యోగులు తమ జీవనభృతిని కోల్పోతారు. ఈ వేతనాల నిర్ణయంలో అవలంబించిన మార్గదర్శక సూత్రాలు, వేతనాల చెల్లింపు విధానంపై తీర్పు ఇవ్వాల్సి వుంది.

డిప్యూటీ సెక్రటరీ (ఫైనాన్స్), జాయింట్ సెక్రటరీ (రెవెన్యూ - ఎండోమెంట్స్), జాయింట్ కమీషనర్ (ఎండోమెంట్స్)లతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. వివిధ ఆలయాలలో అర్చకులకు జీతాల స్కేళ్ళు, వాటి చెల్లింపు విధానాలను హేతుబద్ధీకరించే అంశాన్ని ఈ కమిటీ అధ్యయనం చేయాలి. అలా రూపొందిన నిబంధనలను ప్రభుత్వం ఆమోదించాక, ప్రతివాదులు వాటిని కోర్టు ఆమోదానికై పంపాల్సి వుంటుంది.

### పేరా 138

అర్చకుల లేదా ఇతర స్థానాలలో వంశపారంపర్య నియామకాలను రద్దు చేయటాన్ని మేం సమర్థించినప్పటికీ, వైఖానస సాంప్రదాయం తదితర గ్రంథాలలో సూచించిన దాని ప్రకారం - అర్చకుడు అనే వ్యక్తి దైనందిన దేవతారాధనలో పూర్తి అంకితభావంతో పనిచేయాల్సి వుంటుంది. అదే సమయంలో అతను, అతని కుటుంబం తగిన సదుపాయాలతో జీవించగలిగి వుండాలి. (దేవాలయ) ఆస్థుల మీద వచ్చే ఆదాయం, లేదా దేవుడి కానుకల రూపంలో వచ్చే ఆదాయం, లేదా వేతనాల రూపేణా వచ్చే ఆదాయం - అతని కుటుంబం తగిన సదుపాయాలతో

జీవించటానికి ఉద్దేశించబడిన మార్గంగా గుర్తించబడింది.

అందుచేత, ఇంతకు ముందు మేం సమర్థించిన విధంగా (వంశపారంపర్య హక్కుల్ని రద్దు చేసి), ప్రభుత్వం తనకున్న అధికారాలనుపయోగించి అర్చకుల నియామకాల్ని క్రమబద్ధీకరించేప్పుడు, ఆ అర్చకులు దేవుడికి నిత్య ధూపదీపనైవేద్యాలు అదే అంకితభావంతో కొనసాగించటానికి వీలుగా వాళ్ళ కుటుంబాలు తగు సదుపాయాల మధ్య జీవనం సాగించేలా చూడాల్సి వుంది.

ఆలయం స్థాయిని బట్టి అర్చకుల సర్వీసు నిబంధనలను, వేతనాల స్కేళ్ళను, ఇతర పారితోషికాలను ప్రభుత్వం నిర్ణయించాల్సి వుంటుంది. వీటికి తోడు ఆలయ సేవల్ని అంటిపెట్టుకుని వుండే అర్చకులకు, ఇతర ఉద్యోగులకు, పండితులకు సంక్షేమ కార్యక్రమాలను కూడా (కమీషనర్ పర్యవేక్షణలో) చేపట్టాల్సి వుంది.

అంటే - ఈ సంక్షేమ కార్యక్రమం కోసం ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించాలి. ఈ పథకం క్రింద, అర్చకులకు, ఇతర ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు తగిన వసతిని కల్పించడం, వారి పిల్లలకు విద్యా సదుపాయాలు కల్పించడం, స్వంత గృహాలు కట్టుకొనటానికి రుణాలు ఏర్పాటు చేయడం, అవకాశమున్న ఆలయాల భవనాలలోనే న్యాయమైన అద్దెపై వసతి కల్పించడం, గ్రూపు ఇన్స్యూరెన్సు అమలు చేయడం, ప్రమాదాలు, మరణాలు వగైరా అనూహ్యమైన సంఘటనలు జరిగినప్పుడు విధవలైనవారికి, నిరుద్యోగ విద్యావంతులైన యువకులకు పునరావాసం వంటి ఏర్పాట్లు (ఎలా అవసరమైతే అలా) చేయడం జరగాల్సి వుంది.

**పేరా 139**

ఆలయ అర్చకుల సంఘ ప్రతినిధులు ఇద్దరు, ఆలయ సేవకుల ప్రతినిధి ఒకరు, ఎండోమెంట్స్ అడిషనల్ కమీషనర్, రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ జాయింట్ సెక్రటరీ లేదా డిప్యూటీ సెక్రటరీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశిస్తున్నాం. అర్చకుల సంక్షేమ పథకాల రూపకల్పనలో తమ తమ భావాలను ఆ ప్రతినిధులు సూచనలు, సలహాల రూపంలో ఈ కమిటీకి నివేదించవచ్చు.

అలా తయారైన పథకం ముసాయిదాపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని, తాను ఖరారు చేసిన పథకాన్ని ఈ ఉత్తర్వు నాటి నుండి ఆరు మాసాలలోగా ఈ కోర్టుకి సమర్పించాలి.

**పేరా 140**

ఈ పథకం కార్యరూపం దాల్చేలా చేయటం కోసం తాత్కాలికంగా 75 కోట్ల రూపాయలతో



ఒక కార్పస్ ఫండ్‌ని ఏర్పాటు చేయాలి. ఏ బ్యాంకులో, లేదా అధిక ఆదాయం వచ్చే ఏ ప్రభుత్వ సెక్యూరిటీస్‌లో పెట్టాలి, ఎవరు ఈ అక్కవుంట్‌ని నిర్వహించాలి, ఎప్పటికప్పుడు చేకూరేవడ్డీని ఎవరు ఖర్చు పెట్టాలి వంటి విధానాలను ప్రభుత్వం రూపొందించాలి. భవిష్యత్‌లో అవసరమైనప్పుడు సవరించుకునే పద్ధతిలో, తిరుమల తిరుపతి దేవస్థానాలు జూన్ 1996 లోగా (1996-97 సంవత్సరానికి గాను) రూ. 20 కోట్ల రూపాయలను ఈ కార్పస్ ఫండ్‌కి జమ చేయాలి. ఈ కార్పస్ ఫండ్ రూ. 75 కోట్లకు చేరేదాకా ప్రతి సంవత్సరం రూ. 10 కోట్లు వంతున జమ చేస్తూ వుండాలి. రూ. 20 లక్షలకు పైగా వార్షిక ఆదాయం కలిగిన ఇతర పెద్ద ఆలయాలు (యాదగిరిగుట్టలోని నరసింహస్వామి ఆలయం, కరీంనగర్‌లోని మల్లిఖార్జున స్వామి ఆలయం, విశాఖపట్నం దగ్గర సింహాచలంలోని ఉగ్రనరసింహస్వామి ఆలయం, అన్నవరంలోని సత్యనారాయణస్వామి ఆలయం, విజయవాడలోని కనకదుర్గ ఆలయం వగైరా) కూడా ఇలాగే ఏటా కొంత మొత్తాన్ని ఈ కార్పస్ ఫండ్‌కు జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించాలి. అయితే ఈ ఆలయాలు అయిదేళ్ళ వ్యవధిలో ఏటా కోటి రూపాయలు వంతున ఈ నిధికి జమ చేయాల్సి వుంటుంది. 1996-97 సంవత్సరంలో మాత్రం ఒక్కొక్క పెద్ద ఆలయం రూ. 5 కోట్లు జమ చేయాలి.

ఈ ఆదేశాన్ని అమలు చేయటం విషయంలో ఏవన్నా ఇబ్బందులు ఎదురైన పక్షంలో తగు మార్పులు, చేర్పులు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం వారు ఈ కోర్టుకి మనవి చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో గాని బయటగానీ వుండే వితరణ సంస్థల నుండి గానీ ప్రవాస భారతీయుల నుండి గానీ విరాళాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం సేకరించవచ్చు. అలా రూపొందే కార్పస్ ఫండ్‌కి జమ చేయబడే మొత్తాలను, ఆ నిధి మీద వచ్చే వడ్డీని ఆదాయపు పన్ను నుండి మినహాయించవలసిందిగా ఆదాయపు పన్ను శాఖను, కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరాల్సి వుంటుంది....”

ఆ రకంగా అప్పుడు దేవాలయాల్లో అనాదిగా అమల్లో వున్న అర్చకుల అర్చన విధానం స్థానే వచ్చే కొత్త విధానంలో, తమ తీర్పుకి, చట్టానికి, సంబంధిత నిబంధనలకి అనుగుణంగా రావాల్సిన పరిణామాలు సమగ్రంగా, సామనస్య పూర్వకంగా చోటు చేసుకునేలా తగు సూచనలను, మార్గదర్శక సూత్రాలను సుప్రీంకోర్టు సూచించింది.

తాను సూచించిన పథకం దృష్ట్యా, చెల్లింపుల విధానాన్ని రద్దు చేసే 144వ సెక్షన్‌ను అనుమతించినట్లయింది. ఈ విశ్లేషణకు ఆధారమేమిటంటే, వంశపారంపర్య ధర్మకర్తలకు సంబంధించి కేసు తాలూకు తీర్పులో - 144వ సెక్షన్‌ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇలా పేర్కొంది:

“144వ సెక్షన్ పరిధి, అవకాశాలను - అర్చకులకు సంబంధించిన నెం. 638/87 తదితర రిట్ పిటీషన్‌ల విచారణలో చర్చిస్తాం.”

అంటే, అర్చకులకు ఇవ్వజూపిన ప్రయోజనాల మొత్తాన్ని కలిపి చూడనట్లయితే, 144వ సెక్షన్ అర్థానికి విలువ లేకుండా పోతుందని సుప్రీంకోర్టు భావించింది. అందుకే సుప్రీంకోర్టు తనకున్న అధికారాలనుపయోగించి రాజ్యాంగంలోని 142వ అధికరణ క్రింద ఆ పథకాన్ని ఆదేశించింది.

"142వ అధికరణ, Discovery వగయిరా అంశాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, ఆదేశాలు అమలు చేయటం:

తనముందు పరిష్కరింపబడాల్సి వున్న కేసుల విషయంలో పరిపూర్ణమైన న్యాయం చేయటం కోసం సుప్రీంకోర్టు తన పరిధిలోగల అధికారాలనుపయోగించి తగు తీర్పులను, ఆదేశాలను జారీ చేయవచ్చు. ఆ తీర్పులు, ఆదేశాలు - పార్లమెంటుచే రూపొందించబడిన చట్టాలకు లోబడి, లేదా అలాంటి చట్టబద్ధత వచ్చేదాకా రాష్ట్రపతి జారీ చేసే ఆదేశాలకు లోబడి భారతదేశమంతటా అమలు చేయబడాల్సినవి"

అందుచేత, పైన ఉదహరించిన (అర్చకులకు సంబంధించిన) రిట్ పిటీషన్‌ల కట్ట విషయంలో సుప్రీంకోర్టు 'పరిపూర్ణ న్యాయం' జరగడం అవసరమని భావించింది. అందుకే అలాంటి ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 144 యొక్క పరిధి, ఆవశ్యకతలను అర్చకుల కేసులో చర్చించాలని సుప్రీంకోర్టు ఉద్దేశ్యపూర్వకంగానే భావించి ప్రక్కనబెట్టింది.

రాజ్యాగంలోని 142వ అధికరణ క్రింద తనకుగల అపూర్వమైన అపారమైన, రాజ్యాంగ హక్కులను వినియోగిస్తూ, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు కొట్టిపారేసేవి కావు.

ఆలయాలలో జరిగే సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక వేతన విధానాన్ని ప్రవేశపెట్టింది. కనుక ఆలయ ఆదాయంలో వాటా కోరే హక్కు అర్చకులకు లేదు. చట్టంలోని 144వ సెక్షన్ క్రింద అర్చకులకు వాటాలు రద్దు చేయటాన్ని అనుమతిస్తూనే, వాళ్ళ జీవన ప్రమాణాలు పడిపోయే ప్రమాదం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర స్పందన వ్యక్తం చేసింది. దైవాన్ని కొలిచే సేవ ద్వారా వారు జీవిస్తున్నారు కనుక వారికి వారి కుటుంబ సభ్యులకు తగిన సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సుప్రీంకోర్టు మాటల్లో - "... రాష్ట్ర ప్రభుత్వం తనకున్న సెక్యులర్ అధికారాలను ఉపయోగిస్తూ ఇక్కడ అనుమతించిన విధంగా అర్చకుల నియామకాన్ని క్రమబద్ధీకరిస్తోంది. కనుక అర్చకుడు అంకితభావంతో ఆలయంలో నిత్య ధూపదీపనైవేద్యాలు నిర్వహించటానికి అనువుగా అతని కుటుంబానికి తగిన సదుపాయాలు కల్పించాలి. మేం ముందే చెప్పినవిధంగా, అర్చకుడి సేవా నిబంధనావళిని, వేతనాల స్కేళ్ళను, ఇతర చెల్లింపులను ఆయా ఆలయాల గ్రేడ్‌కి తగిన విధంగా ప్రభుత్వం నిర్ణయించాల్సి వుంటుంది. అతని విధులనూ, విధుల వేళలను



కూడా నిర్ణయించాలి..."

దీనికితోడు అర్చకుల కోసం సంక్షేమ చర్యలను కూడా సుప్రీంకోర్టు సూచించింది. ఎందుకంటే, ఒక వ్యక్తి అర్చకుడుగా రూపొందాలంటే అతను ఎంత కఠోరమైన శిక్షణతో వేదాలను, ఆగమశాస్త్రాన్ని అభ్యసించాల్సి వుంటుందో సుప్రీంకోర్టు అర్థం చేసుకొంది.

ప్రభుత్వంలో పనిచేసే నిరక్షరాస్యుల కన్నా పై స్థాయిలో, వేదాలలో నిర్వచించబడిన విజ్ఞులైన వారిగా అర్చకులకు వుండాల్సిన స్థాయి ఏమిటో కూడా సుప్రీంకోర్టు గుర్తించింది.

## *1996 మార్చి 31న జారీ అయిన ఎండోమెంట్ కమీషనర్ సర్క్యులర్‌కి వ్యతిరేకంగా 1996 ఏప్రిల్ 24న అర్చకులు దాఖలు చేసిన రిట్ పిటీషన్‌లోని అంశాలను పరికించండి :*

1. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, ఎండోమెంట్ కమీషనర్ గారి సర్క్యులర్‌ని విశ్లేషించాల్సి వుంది. ఇందులో మూడు పేరాలున్నాయి.

మొదటి పేరాలో - ఎండోమెంట్ చట్టంలోని 34, 35, 37, 39, 144 సెక్షన్‌ల చెల్లుబాటును సుప్రీంకోర్టు అనుమతిస్తున్నట్లుగానూ, సర్వీసు నిబంధనలు నిర్ణయించటానికి ఒక కమిటీ వేయాలనీ, అర్చకులు తదితర సేవకుల సంక్షేమం కోసం మరో కమిటీ వేయాలనీ, తాత్కాలికంగా రూ. 75 కోట్ల రూపాయలతో ఒక (సంక్షేమ) నిధిని ఏర్పాటు చేయాలనీ కూడా సుప్రీంకోర్టు ఆదేశించినట్లుగానూ సమాచారం మాత్రమే ఇవ్వబడింది. కాని వీటిని అమలు చేయటానికి తీసుకుంటున్న చర్యల ప్రస్తావన లేదు.

రెండవ పేరాలో - 144వ సెక్షన్ క్రింద (వాటాల) చెల్లింపుల రద్దు గురించిన ప్రస్తావనా, ఆ మేరకు వాటిని తక్షణం ఆపేయవలసిందిగా అధికారులకు ఆదేశాలూ వున్నాయి. 1987-1996 మధ్య కాలంలో జరిగిపోయిన వాటాల అధిక చెల్లింపులను ఎలా సవరించాలీ అన్న అంశం గురించి కూడా ఈ పేరాలో వుంది.

మూడవ పేరాలో - "ఈ తీర్పు పరిధిలోకి వచ్చే అన్ని 6(ఎ) కేటగిరీ సంస్థల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లూ ఈ ఆదేశాలను తు.చ తప్పకుండా, అమలు చేయాలి.

డిప్యూటీ కమిషనర్లూ, అసిస్టెంట్ కమిషనర్లు కూడా తమ తమ నియంత్రణలో గల ఈ తీర్పు పరిధిలోకి వచ్చే ఆలయాల్లో ఈ ఆదేశాలు అమలు జరిగేలా చూడాల్సి వుంది".

2. ఈ సర్క్యులర్‌లోని రెండవ పేరాలో - 1987 డిసెంబరు 16 నాటి జి.ఓ. ఎం.ఎస్. నెం. 1171 ప్రకారం అర్చకులకు, ఇతర సేవకులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు

తీసుకోవాలని కూడా చెప్పబడింది.

అర్చకులకు వేతనాల చెల్లింపుకి సంబంధించి ఈ జీవోలో ఉదహరించబడిన అంశాలను పరిశీలిద్దాం. రద్దు చేయబడిన చట్టం 17/66 క్రింద, అర్చకులు రెండే వర్గాలు - వంశపారంపర్యంగా చేస్తున్నవారు, ఈ తరగతి క్రిందకిట రాని ఇతర అర్చకులు. వంశపారంపర్య అర్చకులకు వేతనాలు సెక్షన్ 37 క్రింద రెండవ షెడ్యూలు ప్రకారం చెల్లించబడ్డాయి.

1987 మే 23 వరకు, రద్దు చేయబడిన చట్టంలోని సెక్షన్ 37లోని రెండవ షెడ్యూలు ప్రకారం అన్ని మత సంస్థలలోని అర్చకులకు వేతనాలు చెల్లించబడేవి. ఈ చట్టంలోని సెక్షన్ 34 ప్రకారం అర్చకుల వంశపారంపర్య హక్కులు రద్దుచేయబడ్డాయి. సెక్షన్ 35(3) ప్రకారం - నిర్దేశిత విధానంలో అర్చకులకు వేతనాలు చెల్లించాల్సివుంది.

సెక్షన్ 35(3)లో నిర్దేశించబడిన సూత్రావళి ప్రకారం, 1987 డిసెంబరు 16 నాటి జీవో ఎం.ఎస్. నెం. 1171 (రెవెన్యూ-సి)లో ప్రభుత్వం - అర్చకులకు, ఇతర సేవకులకు నెలవారీగా చెల్లించాల్సిన మొత్తాలను, అర్చకుల అర్హతలను స్పష్టం చేసింది.

అర్చకులకు ఈ క్రింది విధంగా వేతనాలను చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

పేరా 14

| ఆలయం కేటగిరీ | అర్చకుల గ్రేడ్ | నెలవారీగా చెల్లించాల్సిన సమీకృత మొత్తం |
|---|---|---|
| 6(a) | I | రూ. 1500 |
| (రూ. 5 లక్షల రూపాయలకు | II | రూ. 1,250 |
| మించిన వార్షిక ఆదాయం | III | రూ. 1,100 |
| కల ఆలయాలు) | | (కరువు భత్యం వగైరాలు లేవు) |
| 6(b) | IV | రూ. 900 |
| (రూ. 50 వేలకు పైబడి | V | రూ. 750 |
| రూ. 5 లక్షల లోపు వార్షిక | VI | రూ. 600 |
| ఆదాయం కల ఆలయాలు) | | (కరువు భత్యం వగైరాలు లేవు) |
| 6(c ) | VII | రూ. 500 |
| (రూ. 50 వేల లోపు | VII | రూ. 400 |
| వార్షిక ఆదాయం కలవి) | IX | రూ. 300 |
| | | (కరువు భత్యం వగైరాలు లేవు) |



నోట్ :

1. జీవన వ్యయం ఎంత పెరిగినప్పటికీ, రాష్ట్రంలో అర్చకులకు ఇవే చెల్లింపులు చేయబడతాయి. వేరే ఇంకేమీ చెల్లించబడవు.

2. ఈ జీవో, సబార్డినేట్ శాసనసభా సంఘం ముందు పరిశీలనకు వచ్చినప్పుడు, ఈ సర్క్యులర్‌లో నిర్ణయించిన వేతనాలు చాలా అధమ స్థాయిలో వున్నాయని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

3. 1996 మార్చి 31 నాటి ఈ సర్క్యులర్ కనుక అమలు జరిగినట్లయితే, అర్చకుల స్థాయి ఒక కట్టుబానిస స్థాయికి దిగజారిపోతుంది.

సర్క్యులర్ ఇలా చెబుతోంది :

“సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు ముందున్న ‘యధాతధస్థితి’ ప్రకారం - అర్చకులకు నగదు రూపంలో గానీ మరే రూపంలోగానీ (కానుకలలో, ఆర్జిత సేవల రుసుములలో) వాటాలు చెల్లించబడివుంటే, వాటిని ఈ సర్క్యులర్ జారీ అయిన నాటి నుండి చెల్లించబడే వేతనాల లోంచి మినహాయించాల్సి వుంటుంది. 1987 డిసెంబరు 16న ఎండోమెంట్స్ చట్టంలోని సెక్షన్ 35(3) ప్రకారం జారీ అయిన జీవో ఎం.ఎస్. నెం.1171లో నిర్దేశించబడిన నిబంధనలకు లోబడి, అధికంగా ఏవన్నా చెల్లింపులు జరిగివుంటే ఆ చెల్లింపులను ఈ వేతనాల నుండి మినహాయించాల్సి వుంటుంది.

అంటే - వంశపారంపర్య అర్చక విధానం కొనసాగితే తప్ప, గడచిపోయిన కాలంలో చేయబడిన (అధిక) చెల్లింపులకు కొత్తగా చెల్లించే వేతనాల లోంచి మినహాయించటం సాధ్యపడదు. ముఖ్యంగా చిన్న ఆలయాల్లో ఈ సర్క్యులర్ ప్రకారం నెలకి రూ. 300 రూపాయలు చెల్లించబడే అర్చకుడికి, ఆ 300 రూపాయల్లోంచే అతనికి గతంలో (ఆలయ కానుకలు, ఆర్జిత సేవల రుసుముల నుండి) చెల్లించబడిన వాటా సొమ్మును ప్రభుత్వం రాబట్టుకుంటుంది. మరి అర్చకుడికి తన కుటుంబాన్ని పోషించుకోవడానికి మిగిలేదేమిటి? అతను ఏం తిని జీవించాలి?

సుప్రీంకోర్టు - ఈ వంశపారంపర్య అర్చకత్వం రద్దుని అనుమతిస్తూ ఏం చెప్పింది? అర్చకుడు ఆలయంలో నిత్య ధూపదీప నైవాద్యాది ప్రక్రియలను సక్రమంగా, అంకితభావంతో నిర్వహించేలా చేయటానికి అనువుగా అతని కుటుంబానికి తగిన వసతి సదుపాయాలు కల్పించాలి.

కాని సర్కారు వారి సర్క్యులర్‌లో ఈ సదుపాయాల గురించి ప్రస్తావన లేకపోగా, గడచిన

కాలానికి (1987 నుండి 1996 వరకు) అర్చకులకు ఈ వేతనాల పరిమాణానికి మించి అధికంగా చెల్లించబడిన మొత్తాన్ని ఈ 300 రూపాయల జీతాల నుంచే రాబట్టుకోవాలని నిర్ద్వందంగా ఆదేశించబడింది. అంటే, కడుపు మాడ్చుకుని అయినా 300 రూపాయల నెల జీతంలోంచే గడచిన కాలానికి తీసుకొన్న మొత్తానికి గాను బాకీ చెల్లించినట్లుగా ప్రతినెలా అర్చకుడు చెల్లిస్తూ పోవాలి. ఇంక అతని కుటుంబం ఏం తిని బ్రతకాలి?

ఎండోమెంట్ కమిషనర్ జారీ చేసిన ఈ సర్క్యులర్ ఎంత అన్యాయమో, అమానుషమో వేరే వివరించాలా?

4. దీనికి భిన్నమైన పరిస్థితి ప్రభుత్వ సర్వీసుల్లో ఎలా వుందంటే - ఎలాంటి విద్యార్హతలు, శిక్షణ కూడా లేకుండా, బంట్రోతు ఉద్యోగం చేసేవాడికి వచ్చే నెలజీతం 3000 రూపాయలు. అతను అర్చక పండితుల మాదిరిగా కంఠనాళాలు తెగిపోయేలా పన్నెండేళ్ళు అభ్యాసం చేసి వేదపఠనం చేయనక్కర్లేదు. దేశమూ - ప్రజలూ సుభిక్షంగా వుండాలంటూ అనునిత్యం దైవప్రార్థన చేస్తూ మంత్రాలు వల్లెవేయనక్కర్లేదు. కాని ఎంతో నియమబద్ధంగా కఠోరమైన అభ్యాసంతో అర్చకుడిగా తయారై, "లోకాస్సమస్తాః సుఖినోభవంతు" అంటూ సమస్త ప్రజల కోసం దేవాలయాల్లో శెలవులు లేకుండా దైవారాధన చేసే అర్చకుడికి మాత్రం ఎండోమెంట్ శాఖలో బంట్రోతుకొచ్చే జీతంలో నాలుగోవంతు కూడా రాదు.

ఏ ఇతర విద్యలోనయినా ఏ ఏడాది చదువు ఆ ఏడాది పరీక్షలతో ముగుస్తుంది. కాని వేద ఆగమ శాస్త్రాల అభ్యాసం ఒక అర్చక బాలుడికి ఎనిమిదేళ్ళ వయస్సులో మొదలవుతుంది. ఎన్నో సంవత్సరాల పాటు నిరంతర అభ్యాసం చేస్తేగాని అపస్వరం లేకుండా, ఉచ్చారణ దోషం లేకుండా వేదాలను, ఆగమాలను, శాస్త్రాలను పఠించడం సాధ్యంకాదు. ఇంత శ్రమపడి అర్చకుడైనవాళ్ళు - ఎండోమెంట్ శాఖలోని అతి క్రింది స్థాయి ఉద్యోగులకు విధేయులుగా పరిగణించబడుతున్నారు. కాని- ఇలా అధిక అర్హతకల వారిని, అర్హత లేనివారితో సమానంగా లేదా అంతకన్నా తక్కువగా పరిగణించడం రాజ్యాంగంలోని 14వ అధికరణని ఉల్లంఘించడమే. ఇది ఎంత ఛండాలమైన వివక్షతతో కూడిన పరిస్థితి?

(సమాజంలో ఒక వ్యక్తి యొక్క సాంఘిక స్థాయి అతని ఆదాయం, ఉద్యోగం మీద ఆధారపడి వుంటాయన్నది వేరే చెప్పనక్కర్లేదు)

5. ఈ నేపథ్యంలో - ఈ విషయంలో ముందుకు వెళ్ళేముందు ఈ పథకాన్ని ప్రభుత్వం పునస్సమీక్షించాల్సి వుంటుంది. లేని పక్షంలో-

దేవాలయాల్ని నమ్ముకుని జీవిస్తున్న వేలాది అర్చక కుటుంబాలు వీధిన పడతాయి. ప్రజల భక్తి విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాలలో పూజా పునస్కారాలు జరపటానికి కడుపు



మాడ్చుకుంటూ ముందుకు రావటానికి ఏ అర్చకుడూ సాహసించలేడు. ఈ పరిస్థితి చూస్తూ, మరే అర్చకుడూ తన పిల్లలు కూడా అర్చకులు కావాలని కోరుకోడు. క్రమేణా, అర్చక వ్యవస్థకి కాలం చెల్లిపోతుంది. "సర్వేజనాస్సుఖినోభవంతు" అంటూ ఆలయాల్లో వినిపించే కంఠాలు మూగపోతాయి.

అర్చక వ్యవస్థకి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో పరస్పరం ముడిపడుతున్న రెండు కీలకమైన అంశాలు వున్నాయి.

1. ఆలయ సేవలలో వుండే అర్చకులు, ఇతర సేవకుల వంశపారంపర్య విధానాన్ని రద్దు చేయటానికి సంబంధించి (చట్టంలోగల) సూత్రావళిని ఛాలెంజి చేయటాన్ని తిరస్కరించటం,

మరియు

2. అంతకు ముందు అమలులో వున్న అర్చకుల ఆదాయ విధానం స్థానే - తగిన వేతనాల స్కేళ్ళతో కూడిన జీతాల విధానాన్ని ప్రవేశపెట్టడం, ఈ పరిణామానంతరం కూడా అర్చకులు అంకితభావంతో ఆలయాలలో సేవలందించేలా చేసేందుకుగాను వారి కుటుంబాలకు తగిన వసతి సదుపాయాలు కల్పించటం.

ఈ రెండు అంశాలూ ఒకదానితో ఒకటి ముడిపడి వున్నాయనీ, వాటిని ఒక ప్యాకేజిగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందనీ రాష్ట్ర ప్రభుత్వానికి వివరించడం జరిగింది. అంతేకాక, అంతకుముందున్న (అర్చకుల) ఆదాయ విధానాన్ని రద్దు చేస్తూ రూపొందిన సెక్షన్ 144ని పై షరతులు ఆధారంగా మాత్రమే సుప్రీంకోర్టు అనుమతించిందనికూడా ప్రభుత్వానికి వివరించడం జరిగింది. కాని, 1996 మార్చి 31న జారీ అయిన సర్కారు వారి సర్క్యులర్ - పైన పేర్కొన్న (తీర్పు తాలూకు) రెండు అంశాలలో రెండవ భాగాన్ని (అర్చక కుటుంబాలకు కనీస సదుపాయాలు కల్పించడం ద్వారా ఆలయాలలో దైనందిన ఆరాధనా కార్యక్రమాలు ఎటువంటి అవాంతరం లేకుండా అదే క్రమశిక్షణ, కట్టుబాటు, ఆచారాలతో కొనసాగేలా చేయటం) గాలికి వదిలేసింది.

అలా ఒకే తీర్పులో - పరస్పరం ముడిపడి వున్న రెండు అంశాలలో ఒక భాగాన్ని వదిలేసి, ఒక భాగాన్ని మాత్రమే అమలు చేయటం - సదరు సుప్రీంకోర్టు తీర్పుని అక్షరాలా ఉల్లంఘించటమే.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇప్పటివరకూ ఆలయాలలోని నగలు, ఆభరణాల రక్షణకు అర్చకుడిదే జవాబుదారీ. కాని 1989 జూన్ 30 నాటి జీవో ఎం.ఎస్.నెం. 630 (రెవెన్యూ - ఎండోమెంట్-1) ప్రకారం సవరించబడిన నిబంధనలను పరిశీలిద్దాం.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం - అర్చకుడు ఒక జీతగాడు మాత్రమే అయినప్పుడు వంశపారంపర్య అర్చకత్వ వ్యవస్థలో వుండే జవాబుదారీతనం అతనికి ఇప్పుడు వుండదు. వంశపారంపర్య అర్చకత్వ వ్యవస్థలో - దైవం వేరు, ఆ దైవానికి అలంకరించే ఆభరణాలు వేరు - అని అర్చకుడు ఏనాడూ భావించలేదు. ఏ రోజూ దైవాన్ని అలంకార రహితుడుగా వుంచలేదు. ఎన్నో వందల సంవత్సరాల క్రితం రాజులు, వదాన్యులు బహూకరించిన ఆభరణాలను సయితం (అర్చక వంశంలో ఎన్ని తరాలు మారినా) అర్చకులు అత్యంత పవిత్ర భావంతో, భక్తి శ్రద్ధలతో కాపాడుకుంటూ వస్తున్నారు. - ఆయా సందర్భాలకు తగినట్లుగా తాము సేవిస్తున్న దేవుడికి లేదా దేవతకి శోభాయమానంగా అలంకరిస్తూ వస్తున్నారు. ఆ అలంకారంలో ఆ దైవం దేదీప్యమానంగా ప్రకాశిస్తూ భక్తుల్ని తరింపజేస్తాడన్న విశ్వాసమే వారి ఆ అంకిత భావానికి, జవాబుదారీతనానికి మూలాధారమైంది.

.... ఇప్పుడు జీతాల అర్చక వ్యవస్థ వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. కేవలం 300 రూపాయల జీతానికి పనిచేసే అర్చకుడు లక్షల రూపాయల విలువ చేసే జవ్వారీ భద్రతకి ఎలా బాధ్యత వహించగలడు?... కాని ప్రభుత్వ సర్క్యులర్ ఈ కీలకాంశాన్ని పూర్తిగా విస్మరించింది.

పై కారణాల వల్ల, 1996 మార్చి 31న ప్రతివాదులు (ప్రభుత్వం) జారీ చేసిన సర్క్యులర్ రాజ్యాంగంలోని 14, 19 (1)(సి), 21 అధికరణాలనూ, సుప్రీంకోర్టు తీర్పునూ ఉల్లంఘిస్తున్నట్లే అని స్పష్టం చేస్తున్నాం. సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించటం ద్వారా 144వ అధికరణను కూడా ఉల్లంఘించినట్లే.

ఎప్పుడయితే సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘించబడిందో, కోర్టు తీర్పును అమలు చేసి తీరాల్సిందేనంటూ (144వ అధికరణ క్రింద) ఆదేశాలను జారీ చేసే హక్కు సుప్రీంకోర్టుకి వుంది. ఆ రకంగా ఈ సర్క్యులర్-న్యాయవిరుద్ధమైంది, చెల్లనిది, అధికార పరిధిని అతిక్రమించి జారీ చేయబడింది. కనుక ఈ సర్క్యులర్ కొట్టివేయదగింది.''

★ ★ ★



# కొండయ్య కమీషన్ నివేదికలో గూఢాంశాలు

1. అర్చకుల కేసు విషయంలో సుప్రీంకోర్టు తన తీర్పులో (10వ పేజీలో) చల్లా కొండయ్య కమిషన్ గురించి ఏమని పేర్కొందో చూద్దాం :

''ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వపు ప్రధాన న్యాయమూర్తి చల్లా కొండయ్య అధ్యక్షతన ఒక కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే కొంత కాలం తరువాత ఈ కమిషన్ స్వరూపం మారింది. చివరికి ఈ కమిషన్ ముగ్గురు సభ్యులకు కుదించబడింది. ఇందులో తిరుమల తిరుపతి దేవస్థానాల పాలనా నిర్వహణలో ఒక దశాబ్ద కాలపు అనుభవం కలిగిన ఆ దేవస్థానాల పూర్వపు ఛైర్మన్ డాక్టర్ అన్నారావు ఒక సభ్యుడిగా, మద్రాసు (ఎండోమెంట్స్) చట్టం, తెలంగాణా చట్టం, ఆంధ్రప్రదేశ్ హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థల చట్టం - 1966ల రూపకల్పనలో అనుభవం కలిగిన శ్రీ ఎ.వి.సూర్యారావు మెంబర్ సెక్రటరీగా ఈ కమిషన్ రూపొందింది. ఈ కమిషన్ మూడు ప్రకరణాలుగా తయారుచేసి, దాఖలు చేసిన నివేదిక మా ముందుంచబడింది.

2. ఈ నివేదిక - ప్రస్తుతం అమలులో వున్న దేవాదాయ, ధర్మాదాయ వ్యవస్థ తీరుతెన్నులపై ఒక విశ్లేషణను ఈ కమిషన్ తయారు చేసిందనటంలో సందేహం లేదు. ఇందులో కొన్ని సుగుణాలున్నాయి. కొన్ని పక్షపాత ధోరణిలో వున్నాయి.

ఉస్మానియా యూనివర్సిటీలో ఈ కమిషన్ నివేదికపై 1986 డిసెంబరు 14న జరిగిన గోష్ఠిలో ప్రస్తావించబడిన సంబంధిత అంశాలు ఇలా వున్నాయి :

ఎ) ఆలయాల నిర్వహణ అనేది ఇంతవరకు క్షుణ్ణంగా శోధించబడని విషయం. ఇందులో మరింత లోతుగా అధ్యయనం అవసరం. ఆలయాల నిర్వహణ అనేది ఇంతకాలం ఒక 'స్వపరిపాలన' విధానానికి అద్దం పడుతూ వచ్చింది. ఇంతకాలం ఆలయాల పాలనా నిర్వహణ అనేది న్యాయబద్ధంగా నడుస్తూ వచ్చింది. కాని ఇటీవల కాలంలో అది అధికారుల నియంత్రణలోకి వెళ్ళిపోయింది. ఆలయాలపాలనా నిర్వహణలో ఏ మేరకు ప్రజల పాత్రకు అవకాశముందో అధ్యయనం చేయాల్సి వుంది. అధికార నియంత్రణను తగ్గించటం అనేది అన్ని విషయాలలోనూ ప్రస్తుత విధానం కనుక, ఈ ఆలయాల విషయంలో ప్రభుత్వం తొందరపడి అధికంగా అధికార నియంత్రణకు అవకాశమివ్వకూడదు.

బి) ఆలయాల నిర్వహణను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవటం అనేది - ఆలయాల నిర్వహణ లోపభూయిష్టంగా తయారైనప్పుడు మాత్రమే జరగాల్సింది. దీనికి ఉదాహరణ - తిరుమల తిరుపతి దేవస్థానాలు. 1930కి ముందు మహంతుల యాజమాన్యంలో

వున్న టి.టి.డి.ని ఒక చట్టం ద్వారా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకువచ్చింది. ఎప్పుడైనా ఆలయాల సెక్యులర్ అంశాల వరకే ప్రభుత్వం కల్పించుకోవాలి గానీ, మతపరమైన అంశాల విషయంలో కాదు.

సి) ఆలయాల నిర్వహణ విషయంలో 1960 నాటి సి.పి.రామస్వామి అయ్యర్ కమిషన్ నివేదిక ఒక ఆదర్శంగా తీసుకోదగింది. చల్లా కొండయ్య కమిషన్ నివేదికలో నిష్పాక్షికత, దూరదృష్టి కొరవడ్డాయి. కేవలం ఒక కమిషన్ నివేదిక ఆధారంగా ఒక చట్టం రూపొందించబడుతుందంటే, అది మత వ్యవహారాల్లో రాజకీయ జోక్యానికి దారి తీస్తుంది.

డి) అర్చకత్వాన్ని కేవలం ఏదో ఒక వర్గం వారి ఏకచ్ఛత్రాధిపత్యంలాగా భావించరాదు. అర్చకత్వంలో కావలసింది అంకితభావం, త్యాగగుణం. కొంతమంది దృష్టిలో అర్చకత్వం వాణిజ్య లక్షణాలను సంతరించుకుంటోంది కనుక ఇందులో సామాజిక పరివర్తన రావాలి. అయితే అలాంటి పరివర్తనని ఒక చట్టం ద్వారా తీసుకురావాలా, లేక అది ఆయా వర్గాల్లో అంతర్గతంగా రావలసిందా అన్న విషయంలో ఎవరి అభిప్రాయం వారికుండొచ్చు. ఏమైనప్పటికీ పరివర్తన అనేది మనుషులలో రావలసిందే. (అధికార శక్తితో బయటనుండి రుద్దబడేదికాదు)

ఇ) అసలు కమిషన్ రూపొందించిన ప్రశ్నాపత్రమే లోపభూయిష్టంగా వుంది. తన అధ్యయనం ద్వారా ఈ వ్యవస్థలో సామాజిక పరివర్తన తీసుకురావటం కమిషన్ లక్ష్యంలాగా కనిపించదు. కమిషన్ లక్ష్యం అదే అయి వుంటే, ఆ విషయమే ప్రశ్నాపత్రంలో ప్రస్తావించివుండేది, ప్రశ్నలు కూడా తదనుగుణంగా రూపొందివుండేవి.

కమిషన్ ముందుగానే ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చేసి, అందుకు అనుగుణంగానే తన ముందుకి వచ్చిన సాక్ష్యాన్ని వక్రీకరించింది. అనేక గొలుసుకట్టు పరిణామాలకు దారి తీసే ఇంత సంక్లిష్టమైన అంశాన్ని నిర్లక్ష్య ధోరణిలో కమిషన్ చేపట్టి వుండాల్సింది కాదు.

ఎఫ్) ఆ కమిషన్‌లో ఒక సభ్యుడు కమిషన్ నుండి బయటకు వచ్చేసి, నిర్భాంతపరచే ప్రకటనలు చేసిన నేపథ్యంలో, కమిషన్‌ను పునర్నిర్మించిన కారణాలేమిటో కమిషన్ పేర్కొని వుండాల్సింది. కాని అలా జరగలేదు. దాంతో కమిషన్ నిర్మాణం వెనుక ప్రభుత్వ ఆంతర్యం విషయంలో ప్రజలలో అనేక సందేహాలు ఉత్పన్నమయ్యాయి. ఇలాంటి స్థితిలో మౌలికమైన హిందూ సంస్కృతి, సంప్రదాయాల విషయంలో మార్పులు తీసుకువచ్చే చర్యలకు ప్రభుత్వం పూనుకోవడం సమంజసం కాదు.



జి) దేశంలో ఆలయాలు వుండాలి. ఆలయాల నిర్వహణ నిరంతరాయంగా జరిగి తీరాలి. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఆలయాల ఉనికి కారణంగానే భారతదేశ సమగ్రత అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. కనుక ఆలయాల మనుగడకి భంగం కలిగించే చర్యల వల్ల భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, దేశ సమైక్యతకి భంగం వాటిల్లే ప్రమాదం వుంది.

హెచ్) దేశ పరిపాలనకి 'సెక్యులర్' విధానాన్ని ఒక మార్గదర్శక సూత్రంగా మన రాజ్యాంగ విధాతలు ఎంతో దూరదృష్టితో రూపొందించారు. దురదృష్టవశాత్తు మన ప్రభుత్వం హిందూమత విషయాల్లో చీటికి మాటికి తలదూరుస్తూ, ఇతర మత వ్యవహారాల్లో మాత్రం ఈ సెక్యులర్ విధానాన్ని పాటిస్తోంది. మనదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యకరమైన మనుగడకి ఇది మంచిదికాదు.

ఇప్పటికే దేశంలో అనేకచోట్ల మత మౌఢ్యం పడగవిప్పి నాట్యం చేస్తుంటే, ఇలాంటి (కొండయ్య కమిషన్ నివేదిక) చర్యలు తీసుకోవటం వల్ల అలాంటి పరిస్థితులను మరింత ప్రోత్సహించినట్లవుతుంది. ఈ కారణంగా కూడా - ఇలాంటి నివేదికలు లోపభూయిష్టంగా, విషయాన్ని వక్రీకరించేవిగా రూపొందకూడదు.

ఐ) ఆ రకమైన సామాజిక పరివర్తన అనేది మానవ సమాజంలో అంతర్గతంగా రావలసిందే కాని చట్టపరమైన చర్యల ద్వారా కాదు.... ఇలాంటి తొందరపాటు చర్యలను మేధావులు వ్యతిరేకించాలి.

టఆలయాల నిర్వహణ సంస్కరింపబడటం అవసరమే. కాని అందుకోసం పీఠాధిపతుల, మఠాధిపతుల వంటి మత పెద్దల అభిప్రాయాల్ని విస్తృతంగా సేకరించాలి. ఇది (మత విశ్వాసాలకు, సాంప్రదాయాలకు సంబంధించిన) సున్నితమైన అంశం కనుక ఈ విషయంలో ప్రభుత్వం అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. అలాకాక, ఏ మాత్రం అజాగ్రత్తగా తప్పటడుగులు వేసినా, అవి విపరీత పరిణామాలకు దారి తీయవచ్చు. నియంత్రించలేకపోతే, ఆ పరిణామాలు దేశ సమగ్రతనీ, ప్రజాస్వామిక స్వరూపాన్ని కూడా ఛిన్నాభిన్నం చేయవచ్చు.

జె) ఆలయాన్ని కూడా ఇతర ప్రభుత్వ శాఖల మాదిరిగా నడపాలా, లేక వాటి నిర్వహణకి వేరేదైనా విధానం అవసరమా అన్నదే ప్రశ్న. ఈ సందర్భంగా 'ఆముక్తమాల్యద' గ్రంథంలో శ్రీ కృష్ణ దేవరాయలు ఇలా అన్నారు - ''రెవెన్యూ అధికారులకి ఆలయాల నిర్వహణతో ఎలాంటి సంబంధం వుండకూడదు.''

కె) వంశపారంపర్య అర్చకత్వాన్ని ఏదో ఒక వంశం యొక్క హక్కులా చూడటం సమంజసం

కాదు. ఈ విధానం అనాదిగా ఒక సామాజిక అవసరంగా వస్తోంది. కనుక దాన్ని అలాగే చూడాలి తప్ప పటేల్, పట్వారీ వ్యవస్థని చూసినట్లు చూడకూడదు. మామూలుగా బైటకు కనిపించేదాని కన్నా, అర్చకత్వంలో సంక్లిష్టత చాలా ఎక్కువ.

ఎల్) అర్చకులకు వాళ్ళ వాటా క్రింద తిరుమల తిరుపతి దేవస్థానాలు చెల్లించే పెద్ద మొత్తాన్ని వాళ్ళ నిజమైన ఆదాయంలాగా పరిగణించకూడదు. ఇదే విషయాన్ని అర్చకులుకూడా కమిషన్‌కి నివేదించారు.

ఉదాహరణకి, 1983-84 సంవత్సరంలో అనువంశిక అర్చకులకు తి.తి. దేవస్థానాలు చెల్లించిన మొత్తం రూ. 18,55,710. అన్ని ఖర్చులూ పోగా వాళ్ళకు మిగిలింది రూ. 4,97,210. ఈ మొత్తాన్ని అనువంశిక అర్చక కుటుంబాలు పంచుకుంటాయి. తరాలు గడిచినకొద్దీ ఈ అర్చకుల కుటుంబాల సంఖ్య (కొడుకులు, మనుమలు, మునిమనుమలుగా) పెరుగుతూ వచ్చింది. ఫలితంగా ఒక ఏడాది అర్చకత్వం చేసిన కుటుంబానికి మరో ఎనిమిది నుండి పన్నెండేళ్ళు గడిచాక గానీ, మళ్ళీ అర్చకత్వం నిర్వహించే అవకాశం రాదు.... అర్చకులు సవివరంగా ఈ అంశాలన్నీ నివేదించినప్పటికీ, కొండయ్య కమిషన్ మాత్రం తన నివేదికలో వీటిని ప్రస్తావించలేదు.

ఎం) ఆలయంలోని దేవుడికి అలంకరించే అత్యంత విలువైన ఆభరణాలను కాపాడటం విషయంలో అర్చకులకున్న రిస్క్ సామాన్యమైంది కాదు. వెయ్యి కోట్ల రూపాయలకు పైగా విలువైన శ్రీవారి ఆభరణాల భద్రతకు అర్చకులదే బాధ్యత. నిజానికి అత్యంత పురాతనమైన ఆ నగలకు విలువ ఎలా కట్టగలం?

భవిష్యత్‌లో అర్చకులుకూడా జీతగాళ్ళుగా నియమింపబడితే, వాళ్ళకీ బదిలీ విధానం (కొండయ్య కమిషన్ సిఫార్సు చేసిన విధంగా) అమలు జరిగితే, ఈ అమూల్యమైన ఆభరణాలకు జవాబుదారీ ఎవరిది? అసలు అర్చకులకు బదిలీ విధానం అమలు చేయటం అన్నది ఆచరణ సాధ్యం కాని విషయం. అదలా వుంచి, కమిషన్ సిఫార్సు చేసినట్లుగా, ఈ ఆభరణాలను భీమా చేయించాలనుకుంటే, దానికి ప్రీమియమ్ మొత్తమే లక్షలు, కోట్లల్లో వుంటుంది. ఈ ప్రీమియమ్ వ్యయం ఎవరు భరించాలి? నెలకి 300 రూపాయల జీతంతో బ్రతికే అర్చకులు ఈ ప్రీమియమ్ చెల్లిస్తారా?

ఎన్) చల్లా కొండయ్య కమిషన్ నివేదిక చదివితే స్పష్టంగా అర్థమయ్యే విషయం ఒకటుంది. అది - కమిషన్ ఇచ్చిన సుదీర్ఘ ప్రశ్నా పత్రానికి జవాబిచ్చినవారిలో అధిక శాతం కేవలం తిరుమల తిరుపతి దేవస్థానాలను దృష్టిలో వుంచుకొని మాత్రమే వంశపారంపర్య అర్చకత్వాన్ని రద్దు చేసే ప్రతిపాదనను సమర్థించారు.



నిజానికి తన నివేదికలో ఒక చోట - రాష్ట్రంలో ఆదాయం లేని దేవాలయాలు చాలా వున్నాయనీ, కాబట్టి అలాంటి ప్రతి ఆలయంలోనూ అర్చకులకి నెలకి 200 రూపాయల వంతున చెల్లించాలనీ కమిషన్ ప్రతిపాదించింది. అయితే 24,440 దేవాలయాలు ఈ కేటగిరీ క్రిందకే వస్తాయి. అంటే, ఈ దేవాలయాలన్నింటిలోనూ నెలకి 200 రూపాయల జీతానికి అర్చకుడు పనిచేయాలన్న మాట. అసలీ 200 రూపాయల లెక్క ఎక్కడ్నుంచి వచ్చింది? అదొక మిస్టరీ!

సుప్రీంకోర్టు షరతులతో పాటు చట్టంలోని వివిధ అంశాలను విశ్లేషించేటప్పుడు పరిగణనలోకి తీసుకోదగిన (కొండయ్య కమిషన్ నివేదికలోని)అధ్యయనాంశాలు ఇలా వున్నాయి:

## 1. ప్రకరణం 1లో 34వ పేజీ

ఈ నామమాత్రపు వార్షిక భృతిని, కౌలు మొత్తాన్ని కూడా (ధార్మిక) సంస్థలకు కొన్ని ప్రభుత్వ సంస్థలు సక్రమంగా చెల్లించటంలేదని కూడా కమిషన్ దృష్టికి వచ్చింది. గ్రామీణ ప్రాంతాలలో వుండే ఈ సంస్థలకి వచ్చే ఆదాయమే అంతంత. దానికి తోడు వాటి మాన్యాల కౌలు మీద కౌలుదారులు ఇచ్చే మొత్తం కూడా అత్యల్పం. ధరల సూచి ఎంత పెరిగిపోతున్నా, ఈ కౌలు పరిమాణంలో మాత్రం పెరుగుదల లేదు. ఫలితంగా ఆలయాలలో కనీస నిర్వహణ, సేవల కొనసాగింపు నానాటికీ దుర్భరంగా తయారైంది. ఇలా భూములు కనుక కౌలుకి ఇచ్చి వుండకపోతే, ఈ దేవాదాయ సంస్థలకి ఆ భూముల మీద నుంచి ఆదాయం వచ్చివుండేది. పరిస్థితి ఎంతో మెరుగ్గా వుండేది.

ఇవన్నీ ప్రజా సంస్థలు కనుక పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్నిబట్టి ఈ సంస్థలకివ్వాల్సిన చెల్లింపులను పెంచుతూ రావటం న్యాయం, ధర్మం, సమంజసం. ఈ మత సంస్థల ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మేం ఆశిస్తున్నాం, విశ్వసిస్తున్నాం.

## 2. ప్రకరణం-1లో 34వ పేజీ

కొరుకొండలోని శ్రీ రంగరాజస్వామి ఆలయ పరిస్థితి కూడా ఇలాగే తయారైంది. ఏనాడో - భూపతిపాలెం ఇనాం గ్రామంలో 1100 ఎకరాలు శ్రీరంగరాజస్వామి ఆలయానికి మంజూరైంది. ఎస్టేట్‌ల రద్దు చట్టం వచ్చినప్పుడు, ఈ ఇనాం గ్రామం మొత్తం ప్రభుత్వ స్వాధీనం అయింది. అప్పట్లో నష్టం పరిహార భృతిగా (Tasdic allowance) రూ. 228లను నిర్ణయించటం జరిగింది. కాని ఈ సొమ్ము - ఆలయంలో నిత్య దీపారాధనకు గాని, ఎలాంటి సేవలు చేయటానికి గానీ సరిపోదు.

### 3. ప్రకరణం-1లో 54వ పేజీ

ఈ ధార్మిక సంస్థల తాలూకు మాన్యాల్ని కౌలుకిచ్చేటప్పుడు - ఆయా ధార్మిక, మత సంస్థలకు రాగల ప్రయోజనాలకు, లబ్ధి ప్రమాణాలకే అత్యంత ప్రాధాన్యతనివ్వాల్సి వుంటుంది తప్ప, భక్తుల ప్రయోజనాలు, సాంఘిక రాజకీయ ప్రయోజనాలకు కాదు.

### 4. ప్రకరణం-1లో 54వ పేజీ

వివిధ నగరాలలో, పట్టణాలలో, గ్రామీణ ప్రాంతాలలో ఈ కమిషన్ ఎదుట నిష్కర్షగా తమ భావాలు వ్యక్తం చేసిన వేలాది సాక్షులు ఒకే రకమైన ప్రశ్న వేస్తూవచ్చారు : "ఏ ఇతర రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే ప్రభుత్వం ఎందుకు ఇలాంటి కసరత్తు చేస్తోంది? - అదైనా ఒక్క హిందూ మత, ధార్మిక సంస్థల విషయంలోనే ఎందుకు చేస్తోంది?.."

వాళ్ళు బాహాటంగా మరో ప్రశ్న కూడా అడుగుతూ వచ్చారు : "ఇస్లాం, క్రైస్తవం తదితర మత సంస్థల తాలుకు మాన్యాల విషయంలో కూడా ఇలాంటి కసరత్తుని రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందా?"

### 5. ప్రకరణం-1లో 54వ పేజీ

హిందూ మతస్థులైన ఈ సాక్షుల వాదనలను, మనో భావాలను నిశితంగా, జాగ్రత్తగా పరిశీలించిన మీదట, వాళ్ళ ఆందోళనాపూరిత వాదనలో గణనీయమైన శక్తి, బలం వున్నాయని కమిషన్ మనస్ఫూర్తిగా భావిస్తోంది.

### 6. ప్రకరణం-1లో 54వ పేజీ

తాను పరిశీలించిన అన్ని రకాల వాదనలు, రికార్డుల ఆధారంగానూ, వాస్తవ పరిస్థితులు ఆధారంగానూ, ఆయా సంస్థల సంక్షేమం, ప్రయోజనాల దృష్ట్యానూ - ఈ పవిత్ర ప్రజాహిత సంస్థలు సాంఘిక, రాజకీయ శక్తులకు విధేయులుగా వుండరాదని ఈ కమిషన్ భావిస్తోంది. అలాగే, సాంఘిక రాజకీయ పరిస్థితుల ముసుగులో ఈ ఆస్థులు - అధికారంలో వుండే పార్టీల రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించబడరాదు.

### 7. ప్రకరణం-1లో 54వ పేజీ

ఈ (భూముల కౌలుకి సంబంధించిన) నిబంధనని తొలగించాలని, దానికి బదులుగా భూముల కౌలుని బహిరంగ వేలం ద్వారా మాత్రమే అనుమతించాలనీ (క్రమబద్ధీకరించాలనీ) ఈ కమిషన్ సిఫార్సు చేస్తోంది. అలాంటి వేలం విధానం అమలు



చేసేటప్పుడు, ఎలాంటి (లోపాయికారీ అవగాహనతో) కూటములు ఏర్పడటానికిగానీ, దొంగపేర్లతో వేలంలో పాల్గొనటానికి గానీ అవకాశమివ్వకుండా, అతి జాగ్రత్తగా, శ్రద్ధగా ప్రభుత్వం ఈ వేలంపాటలను నిర్వహించాల్సివుంది. వేలంపాటలకు తగిన నిబంధనలను ఏర్పరచటానికి వీలుగా కూడా ఇప్పటి నిబంధనలను సవరించుకోవాల్సి వుంటుంది.

### 8. ప్రకరణం-1లో 72వ పేజీ

చెప్పుకోవటానికి విస్తారమైన భూములు ఈ సంస్థలకి వున్నా, ఆ భూములు మీద ఈ సంస్థలకి వస్తున్న ఆదాయం అత్యల్పం. కొన్ని సందర్భాలలో శూన్యం.

ఈ దుస్థితికి కారణం - పైన పేర్కొన్న కౌలుదారీ చట్టంలోని కొన్ని సూత్రాలు, అనేక దశాబ్దాలుగా (సంవత్సరాలుగా) ఈ భూములను అనుభవిస్తున్న కౌలుదారుల (స్వార్థ) వైఖరి.

### 9. ప్రకరణం-1లో 72వ పేజీ

ఈ సంస్థలకు సంభవించిన ఈ నష్టానికి, ఆర్థిక దుస్థితికి ప్రభుత్వ అధికారులు కూడా బాధ్యులే. ఎందుకంటే, వాళ్ళ మద్దతు, రాజకీయ పలుకుబడి, వత్తిడి, జోక్యం లేకపోతే ఈ సంస్థల ఆర్థిక స్థితి ఇంతలా దిగజారిపోయివుండేది కాదు.

### 10. ప్రకరణం-1లో 79వ పేజీ

ఆగమ శాస్త్రాలలో నిర్దేశించిన విధంగా నిత్య ధూపదీపనైవేద్యాలు, కైంకర్యాలు, సేవలు జరపటానికి ఆలయాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించటానికి ఉద్దేశించబడిన వార్షికభృతిని రాబట్టేలా ఆయా మాన్యాల నిర్వహణ నానాటికీ దుస్సాధ్యమైపోతున్నందున ఈ భూములన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డాక్టర్ అయ్యర్ ఆధ్వర్యంలో గతంలో ఏర్పడిన Hindu Religious Endowments Commission సిఫార్సు చేసివుంది. 1974-75 నాటి (శాసనసభలోని) అంచనాల సంఘం కూడా ఇదే సిఫార్సు చేసింది.

ఆ కమిషన్ సభ్యులపట్లా, ఆ కమిటీ సభ్యుల పట్లా మాకు అపార గౌరవం వుంది. అయితే వారి భావాలతో మేం ఏకీభవించలేకపోతున్నాం. ఎందుకంటే, ఆ సిఫార్సులు - ఈ మత, ధార్మిక సంస్థల ప్రయోజనాలకు భంగకరమైనవి.

### 11. ప్రకరణం-1లో పేజీ 79

అంతేకాదు, ఈ సంస్థలు కేవలం అధికారంలో వుండే వ్యక్తుల, పార్టీల అభిప్రాయాలు, విధానాల మీదనే ఆధారపడాల్సి వస్తే - వాటి స్వాతంత్ర్యం, మనుగడ, గుర్తింపు పూర్తిగా ధ్వంసమైపోతాయి. నిజానికి అధికారంలో వుండే పార్టీని బట్టే ప్రభుత్వ విధానాలు, భావాలు

మారుతూ వుంటాయి. తదనుగుణంగా ఈ సంస్థలు అవస్థలు పడుతూ వుంటాయి.

కాని, మా దృక్పథంలో - ఈ మత, ధార్మిక సంస్థలనేవి రాజకీయాలకు కేంద్ర స్థానాలు కాకూడదు. అధికారంలో వుండేవారి విధానాలు, విశ్వాసాల మీద వీటి మనుగడ ఆధారపడి వుండరాదు.

### 12. ప్రకరణం-3లో పేజీ 152

తిరుమల తిరుపతి దేవస్థానాలలోని కొందరు అధికారులు ఈ ఆభరణాల భద్రతా భారాన్ని అర్చకులకే వదిలేస్తుంటారన్నది నగ్న సత్యం. ఎందుకంటే వాటిని కాపాడటంలో ఏదన్నా తేడాపాడా వస్తే తాము బాధ్యత వహించాల్సి వస్తుందన్న భయంతో.

### 13. ప్రకరణం-1లో 178వ పేజీ

ఆలయాలు పవిత్రత, భక్తి భావనలతో మాత్రమే నిండివుండాలంటే, ఆ ఆలయాలతో సంబంధం వున్న ప్రతి ఒక్కరికి వాటిని కాపాడాల్సిన బాధ్యత వుంది.

అందుచేత ఆలయంలో పని చేసే ప్రతి ఉద్యోగి అక్కడి సేవలలో పాల్గొనేటప్పుడు వస్త్ర ధారణకి సంబంధించిన నిబంధనలను పాటించాలి. ఆలయ సాంప్రదాయాన్ననుసరించి బొట్టు పెట్టుకోవడం, ఆచార నియమాలను అనుసరించడం, ఉత్సవాలలో నిర్దిష్ట విధానాలకు లోబడి పనిచేయడం జరగాలి. అలాగే ఆలయాల్ని దర్శించేటప్పుడు అధికారులు కూడా ధోవతీ, కండువాలు (నిర్దిష్ట వస్త్రధారణ) ధరించి వుండాలి.

అధికారులు, సిబ్బంది ఇలా నిర్దిష్టమైన వస్త్రధారణ చేయటం, ఆలయ సాంప్రదాయానుసారం అక్కడి ఆచార నియమాలను పాటించటం అనేవి ఆలయాలలో మతపరమైన (పవిత్ర) వాతావరణం నెలకొనటానికి దోహదపడతాయి.

### 14. ప్రకరణం-2లో 68వ పేజీ

తమ పూర్వీకులు స్థాపించారన్న కారణంగానో, లేక ఆస్తులను దానమిచ్చారన్న కారణంగానో కొందరు అనువంశిక ధర్మకర్తలు ఈ మత, ధార్మిక సంస్థల నిర్వహణలో అత్యంత శ్రద్ధాసక్తులు చూపుతున్న సందర్భాలు కూడా వున్నాయి. కనుక ధర్మకర్తల సంఘాన్ని నియమించేటప్పుడు ప్రభుత్వ అధికారులు అలాంటి విశిష్ట వ్యక్తులను వారి శ్రద్ధాసక్తులు ఆధారంగా గుర్తించి, ధర్మకర్తల మండలిలో స్థానం కల్పించటానికి వారి అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

ఎక్కడెక్కడైతే ఆయా ఆలయాలు, ధార్మిక సంస్థల స్థాపకుల, స్థాపనకాలపు దాతల



వారసులలో తగిన వ్యక్తులు వుండివుంటారో, అలాంటివారిని (ఆయా కుటుంబాల మత విశ్వాసాలను, ఆ సంస్థలతో ఆ కుటుంబాల అనుబంధాన్ని దృష్టిలో వుంచుకొని) ధర్మకర్తల మండలిలో సభ్యులుగా నియమించాలి.

### 15. ప్రకరణం-2లో 75వ పేజీ

ఆలయాల నిర్వహణలో ధర్మకర్తల పాత్ర ముఖ్యమైంది. అందుచేత ఈ బాధ్యత నిర్వర్తించేవాళ్ళు - స్థానిక వర్గాలకు చెందినవారై వుండటం, అంకితభావంతో భక్తి, నేర్పు, క్రమశిక్షణలతో తమ పాత్రను సమర్థంగా నిర్వహించగల నిజాయితీ పరులై వుండటం అవసరం. కాని, జరుగుతున్నది వేరు. ఇలా ధర్మకర్తల నియామకం విషయంలో ఆయా సంస్థల ప్రయోజనాలను ప్రక్కనబెట్టి, అనేక ఇతర కారణాలతో (ప్రభుత్వం) వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆలయాలకు అనేకమంది భక్తులు వస్తున్నారు. గ్రామాల్లో పలు భజన మండలులు పని చేస్తుంటాయి. ఇలాంటి భజన మండలులే - ధర్మకర్తలుగా నియమించదగిన మంచి వ్యక్తులపేర్లను సూచించవచ్చు.

కమిషన్ దృష్టికి వచ్చిన తీవ్ర ఆరోపణ ఏమిటంటే - ఆలయాలు, తదితర ధార్మిక సంస్థలకు ధర్మకర్తల పోస్టులలో సరైన అర్హత గల వ్యక్తుల నియామకం జరగటంలేదు. రాజకీయ, తదితర కారణాల వల్ల సచ్చరిత్ర, నిజాయితీ, సామర్థ్యంలేని వాళ్ళుకూడా ఆలయాల ధర్మకర్తలుగా నియమింపబడుతున్నారు. ఏతావాతా ఇలా నియమితులైన ధర్మకర్తలు కూడా ఎంతసేపూ తమ రాజకీయ సంబంధాలు మెరుగుపర్చుకోడానికి (ఈ పదవిని) ఉపయోగించుకుంటున్నారే తప్ప సంస్థల ప్రయోజనాలు పట్టించుకోవటంలేదు.

మాకు లభించిన ఆధారాల ప్రకారం - ఆలయాలు తదితర ధార్మిక సంస్థల నిర్వహణకి రెండు రకాలుగా భంగం కలుగుతోంది. ఒకటి - ఇతర అర్హతల్ని ప్రక్కనబెట్టి, రాజకీయ పార్టీల కార్యకర్తల్ని ఈ ధర్మకర్తల సంఘాల్లోకి చొప్పిస్తుండటం వల్ల, రెండోది - అలా నియమితులైన ధర్మకర్తలు తమ పాత్రకు న్యాయం చేయకపోగా, బయట తమ రాజకీయ ప్రతిష్టను మెరుగుపర్చుకోటానికి తాపత్రయపడుతూండటం.

### 16. ప్రకరణం -2లో 81వ పేజీ

సంబంధిత (ప్రభుత్వ) అధికారులకు - తమ ఇచ్ఛానుసారం ఎవర్ని పడితే వారిని (అర్హతలతో నిమిత్తం లేకుండా) ధర్మకర్తలుగా నియమించే అపారమైన విచక్షణాధికారాలున్నాయన్నది మా దృష్టికి వచ్చిన మరో ఆరోపణ.

సెక్షన్ 82 క్రింద అలాంటి నియామకాల్ని సవరించే అధికారం కమిషనర్‌కి వుంది. సంబంధిత అధికారులు మాత్రం ఈ నియామకాల విషయంలో తమ నిర్ణయాన్ని సమర్థించుకునే ఎలాంటి కారణాలనూ రికార్డులలో వివరించటంలేదు.

### *17. ప్రకరణం-2లో 83వ పేజీ*

సెక్షన్ 15 క్రింద quasi-judicial ఉత్తర్వులు జారీ చేయటానికి సంబంధిత ఉన్నతాధికారులకు అధికారాలు వుండటం న్యాయం, ధర్మం, సమంజసం. అనర్హులైన వారిని వివిధ వత్తిళ్ళకు లోబడి ధర్మకర్తలుగా నియమించటాన్ని నిరోధించటానికి ఈ ఆదేశాలు ఉపయోగపడతాయి. ఇప్పటికే ఇలా అధికారేతర వర్గాల వత్తిళ్ళకారణంగా అనర్హుల్ని ట్రస్టీలుగా నియమిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.

ఇలాంటి ఆదేశాలు రాజకీయ వత్తిళ్ళని నిరోధించటానికి కూడా ఉపయోగపడతాయి. ఎందుకంటే, ఇలాంటి quasi-judicial ఉత్తర్వులు జారీ చేసేటప్పుడు, అందుకు గల సమర్థనీయాంశాలు ఏమిటో కూడా వివరించాల్సి వుంటుంది.

ఈ విషయంలో మేం ప్రజాభిప్రాయంతో ఏకీభవిస్తున్నాం. అధికారులకు quasi-judicial అధికారాలని కట్టబెట్టేలా సెక్షన్ 15ని సవరించాలని సిఫార్సు చేస్తున్నాం.

### *18. ప్రకరణం-2లో 116వ పేజీ*

సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం క్రింద నమోదు కాబడి, వితరణ కార్యక్రమాల అమలు కోసం స్థాపించబడిన వితరణ సంస్థలు కూడా కొన్ని వున్నాయి. ఈ సంస్థలు కూడా చట్టంలో సెక్షన్ 2(4) క్రింద నిర్వచనంలోకే వస్తాయి.

ఖచ్చితమైన పాలనా నిర్వహణ, ఆర్థిక నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ వుండాలని చట్టంలోని సూత్రావళి స్పష్టం చేస్తున్నది. ఈ వితరణ సంస్థల పాలనా యంత్రాంగ నిర్వహణలో ధర్మకర్తలకుండే స్వేచ్ఛ తక్కువ.

### *19. ప్రకరణం-2లో 117వ పేజీ*

వితరణ సంస్థల పాలనా వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం అత్యల్ప స్థాయికి తగ్గించబడాలని కొందరు వితరణ సంస్థల ధర్మకర్తలు, అధికారులు, పాత్రికేయులు, సమాజంలోని ఇతర ప్రముఖులు (మా ముందు) వ్యక్తం చేశారు.

ఈ సంస్థలకొచ్చే నిధులు, ఆస్థి పాస్తులు - అవి ఉద్దేశించబడిన లక్ష్యాలకోసం కాక ఇతర విధాలుగా దుర్వినియోగమవుతున్నప్పుడు మాత్రమే ప్రభుత్వం జోక్యం



చేసుకోవచ్చును అనికూడా వారు అభిప్రాయపడ్డారు.

ఈ ధార్మిక సంస్థలు ఏ ప్రయోజనం కోసమైతే స్థాపించబడ్డాయో ఆ లక్ష్యాల సాధన విషయంలో సంబంధిత ప్రభుత్వ శాఖ సహకరించటం లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. క్రమంగా ధార్మిక సంస్థలకు సలహాలివ్వటం సహకరించటం పోయి, వాటి నిర్వహణలో జోక్యం చేసుకొనే వైఖరిని ప్రభుత్వ శాఖలు సంతరించుకున్నాయి. ఇది ఏ స్థాయికి చేరుకుందంటే, ధర్మకర్తలుగా నియమితులైన వారు, లేదా స్థాపకులకుటుంబ ప్రతినిధులు ఈ ప్రభుత్వ జోక్యానికి బెంబేలెత్తిపోతున్నారు.

అసలు ధర్మకర్తల నియామకం చేసేటప్పుడే మంచి వ్యక్తిత్వం వున్నవాళ్ళని నియమించటం జరగటంలేదు. దీనికి తోడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల నియామకాలు. అవసరం వున్నా లేక పోయినా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లని నియమించేస్తున్నారు. ఈ పరిస్థితి క్రమంగా, స్థాపకుల కుటుంబ ప్రతినిధులలో - "మా తాతముత్తాతలు ఎందుకు ఈ ధార్మిక సంస్థల్ని ఏర్పరచార్రా భగవంతుడా?" అని గగ్గోలు పెట్టే పరిస్థితికి దారి తీస్తోంది. వాళ్ళ పూర్వీకులు స్థాపించిన సంస్థల నిర్వహణలో వాళ్ళకి స్వేచ్ఛ లేకపోవటం వాళ్ళని మరింత నైరాశ్యానికి గురి చేస్తోంది.

### *20. ప్రకరణం-2లో 118వ పేజీ*

ఈ వితరణ సంస్థల విషయంలో ప్రభుత్వ నియంత్రణగానీ, జోక్యంగానీ పరిమితంగా వుండాలి. బడ్జెట్ కాపీలు, ఆడిట్ రిపోర్టులు తెప్పించుకోవటం వరకే జరగాలి. అవసర మైనప్పుడు తనిఖీలు చేయటానికి మించి, పోకూడదు. ఈ మేరకు ప్రభుత్వ జోక్యం వుం డటం పట్ల ఆయా సంస్థల స్థాపకులకు ఎలాంటి అభ్యంతరం వుండబోదు. ఎందుకంటే, సంస్థల లక్ష్యాలకు విరుద్ధంగా వుండే విధానాలను సమర్థించటం వాళ్ళ ఉద్దేశ్యం కాదు. ఆ పరిమితులకు లోబడి వుండే 'నియంత్రణ'ను వాళ్ళు స్వాగతిస్తారు కూడా.

ఏది ఆగ్రహం తెప్పిస్తుందంటే - ప్రభుత్వ శాఖలో నియంత్రణ ఒక పరిధిని మించిపోయి చిరాకు పెట్టేదిగా, వేధించేదిగా, చీటికీమాటికీ అడ్డు పడేదిగా తయారై, ఈ ట్రస్టు మనుగడకి ఆధారమైన దానధర్మాల స్ఫూర్తిని నీరుగార్చేయటం.

### *21. ప్రకరణం-2లో 119వ పేజీ*

ఈ కమిషన్ సందర్శించిన అనేక వితరణ సంస్థలలో ఒకే రకమైన ఫిర్యాదు మాటిమాటికీ వినిపించింది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల అధికార దుర్వినియోగం, రోజువారీ పాలనా వ్యవహా రాల్లో వాళ్ళు ప్రవేశపెడుతున్న అడ్డగోలు విధానాల గురించే వీళ్ళంతా ఫిర్యాదు చేశారు.

సంస్థల స్థాపకుల, లేదా సంబంధిత దాతల కుటుంబ సభ్యుల్ని ఈ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లు సేవకుల మాదిరిగా హీనంగా చూస్తున్నారనీ, వాళ్ళ పట్ల కనీస మర్యాద కూడా చూపించటంలేదనీ కూడా కొంతమంది ఫిర్యాదు చేశారు.

నిజానికి అనేక ధార్మిక సంస్థలలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లకి చెప్పుకోదగినంత పనే వుండటంలేదు. చాలామంది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లు (వాళ్ళ ప్రవర్తన కారణంగా) ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్‌కి చెడ్డపేరు తీసుకువచ్చారు.

### *22. ప్రకరణం-2లో 116వ పేజీ*

ఈ చట్టం అమలులోకి వచ్చిన (1967 జనవరి 26) నాటి నుండి ధార్మిక సంస్థలన్నీ 17/66 చట్టం పరిధిలోకి తీసుకు రాబడ్డాయి. వాటిలో చాలా సంస్థలు చట్టంలోని సెక్షన్ 38 క్రింద నమోదు చేయబడ్డాయి. గత రెండు దశాబ్దాలుగా (ఆ చట్ట ప్రకారం రూపొందిన) పాలనా నిర్వహణకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లు అలవాటు పడిపోయారు. అందుచేత, ఈ ధార్మిక సంస్థల పాలనా వ్యవహారాన్ని 1966 నాటి 17వ చట్టం పరిధిలోంచి పూర్తిగా తప్పించటం సమంజసం కాదు.

### *23. ప్రకరణం-2లో 116వ పేజీ*

ఆయా సంస్థల నిర్వహణకి సంబంధించిన విధానాలు, లేదా మార్గదర్శక సూత్రాలను వివరించే ట్రస్టు దస్తావేజులు సెక్షన్ 36 క్రింద ఒక విధానం (Scheme) మాత్రమేననీ, కాబట్టి ఈ సంస్థల ట్రస్టుల నిర్వహణకు ఛాప్టర్-3 సూత్రావళే వర్తిస్తుందని (కొందరు) వ్యాఖ్యానిస్తున్నారు.
కాని సెక్షన్ 36ని అధ్యయనం చేసినప్పుడు, అక్కడ ఉదహరించబడిన scheme ఒక న్యాయపరమైన విధానం మాత్రమే. అందుచేత కోర్టుపరంగా (వాటి నిర్వహణకు) ఏదన్నా విధానం అమల్లో వుంటే తప్ప, ట్రస్టు దస్తావేజుల్లో వున్న సూత్రావళి ప్రకారమే సంస్థల పాలనా నిర్వహణ జరగాల్సి వుంటుంది.

### *24. ప్రకరణం-2లో 169వ పేజీ*

10. 'వితరణ సంస్థల' యాజమాన్య నిర్వహణలో ప్రభుత్వ జోక్యం కనిష్ట స్థాయిలో వుండాలని కమిషన్ చేసిన సిఫార్సు దృష్ట్యా, 15 నుండి 36 వరకూ గల సెక్షన్‌లలో 'వితరణ సంస్థ' అన్న పదాల్ని తొలగించాలని సూచించడమైంది. కనుక ఒక్క సెక్షన్ 15(7) మినహా మిగతా సెక్షన్‌లన్నింటిలో ఎక్కడెక్కడ 'వితరణ సంస్థ' అన్న పదాలుంటాయో వాటన్నింటినీ తొలగించాల్సి వుంది.

★ ★ ★



# తమిళనాడు అనుభవం

1. 1987 నాటి చట్టానికి ఆధారం-అదే రకంగా 1971లో తమిళనాడులో రూపొందిన చట్టం.

ఈ తమిళనాడు చట్టాన్ని (70/1971) ఛాలెంజి చేస్తూ శేషమ్మాళ్, మరికొందరూ కలిసి 1971లో ఒక రిట్ పిటీషన్ దాఖలు చేశారు.

1996లో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఈ తమిళనాడు కేసు ప్రస్తావన వచ్చింది. ఆ ప్రస్తావన ఏమిటో చూద్దాం :

### పేరా 120

"శేషమ్మాళ్ కేసు (సుప్రా) విషయానికి ఈ కేసులో వాద, ప్రతివాదుల న్యాయవాదులు ఇద్దరూ అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వాదించారు. వాళ్ళ వాదనలు విన్నమీదట, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం కోసం ఆలయాల్లో నిత్య దేవతార్చనకి గల ప్రాధాన్యతని ఈ కోర్టు నొక్కి వక్కాణిస్తోంది. అదే సమయంలో, ఆయా ఆలయాల్లో దేవుళ్ళకు తగిన మంత్ర పఠనంతో విస్తృతంగా నిత్య పూజాది సేవలు జరగాల్సిన అవసరాన్ని కూడా ఈ కోర్టు స్పష్టం చేస్తోంది. అర్చకుడి పాత్రను ఈ కోర్టు గుర్తించింది.

ఆలయాలలో ఆయా ఆలయ ఆచార, సాంప్రదాయానుబద్ధంగా ఆగమ శాస్త్రానుసారం నిత్యం ధూపదీప నైవేద్యాలను ఇతర సేవలను అందిస్తూ వుండే అర్హతగల అర్చకుడికి - ఆలయ సేవలలో గల ప్రాధాన్యతాపూర్వక స్థానం విశిష్టమైంది. ప్రతివాదుల న్యాయవాది శ్రీ పి.పి.రావు కూడా ఈ విషయంలో విభేదించటంలేదు."

2. డివిజన్ బెంచ్ ఇచ్చిన పై తీర్పే ఇవ్వాళ్టికీ దేశమంతటా శిరోధార్యంగా వున్నందువల్ల, శేషమ్మాళ్ కేసుని మనం మరింత లోతుగా పరిశీలించాల్సి వుంది.

ఒకరకంగా, ఆంధ్రప్రదేశ్ చట్టానికి, తమిళనాడు చట్టానికి లక్ష్యాల విషయంలో వ్యత్యాసం వుంది. శేషమ్మాళ్ కేసు తాలూకు పిటీషన్‌లోని ఈ క్రింది పేరాలు ఇప్పటి ఆంధ్రప్రదేశ్ సమస్యకి ప్రస్తుతాంశాలు. (2002 ఆగస్టు ఆరునాడు సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట విచారణకు వచ్చిన రివ్యూ పిటీషన్‌పై (పిటీషనర్‌ల తరపున) వాదించిన శ్రీ కె.పరాశరన్ కూడా ఈ శేషమ్మాళ్ కేసు తీర్పుని ఎక్కువగా ప్రస్తావిస్తూ వచ్చారు)

### పేరా 6

1959 నాడు తమిళనాడు దేవాదాయ ధర్మాదాయాల చట్టాన్ని (××ii) సవరించటం కోసం ఉద్దేశించిన ఒక బిల్లుని తమిళనాడు విధాన సభ ఇటీవల ఆమోదించింది. దీని ఫలితంగా

హిందూ ఆలయాల్లో అర్చకులుగా, పూజారులుగా వంశపారంపర్యంగా కొనసాగుతున్న విధానం రద్దు కావలసి వుంటుంది.

దక్షిణ భారతదేశంలోని పురాతన ఆలయాలను అంటిపెట్టుకొని వున్న వేలాది అర్చక, గురుక్కళ్ళుల కుటుంబాలకు ఈ చట్టం ఒక అశనిపాతం. అంతేకాదు, హిందూ ఆలయ వ్యవస్థ, వ్యవస్థ పట్ల భక్తులకు గల విశ్వాసాలకు గొడ్డలిపెట్టు.

## పేరా 7

ఈ (తమిళనాడు) చట్టంలో వివరించబడిన లక్ష్యాలు, ఆశయాల ప్రకారం - అనువంశిక అర్చకత్వం స్థానే ఒక ఆలయ నిర్వహణ సంస్థ ఏర్పాటు కావలసి వుంటుంది. ఈ సంస్థలో వుండే వ్యక్తులు తగిన విద్యార్హతలు, అర్చకత్వంలో శిక్షణ పొందినవాళ్ళు అయి వుండాలి. ఇలాంటి సంస్థలోకి ప్రవేశం విషయంలో అన్ని కులాల, జాతుల, వర్ణాల వారికి అవకాశం వుండాలి.

తమిళనాడులో హిందూ ఆలయాలలో పని చేసే అర్చకులు, గురుక్కళ్ళులు పూజారులు కూడా ఉల్తురై సేవకులే. ఈ ప్రధానంగా మంత్ర పఠనం, వేద పఠనం, ప్రబంధ వచనం, దేవారం తదితర విధాలుగా ఆలయాలలో స్తోత్ర పాఠాలు చేయటం, నిత్య దేవతార్చనకి సంబంధించిన ధూపదీప నైవేద్యాది సేవలందించటం - ఈ ఉల్తురై సేవకుల విధులు.

అయితే, సంస్కరణల దిశగా - ఆలయాలలోని ఈ అనువంశిక సేవకుల హోదాలన్నింటినీ రద్దు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని చెబుతున్నారు.

## పేరా 8

ఈ లక్ష్యాలలో మరో విషయం పేర్కొంటున్నారు. దాసుల దశరథ రామారావు కేసు (54/1961 - సుప్రీంకోర్టు) విషయంలో మద్రాసు అనువంశిక గ్రామాధికారుల చట్టం (3/1895)లోని సెక్షన్ 6(1)ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇందుకు రెండు కారణాలను కోర్టు ఉదహరించింది. 1. ఈ చట్టం రాజ్యాంగంలోని 16(2) అధికరణకి విరుద్ధంగా వుండే వివక్షతతో కూడి వుండటం, 2. అస్పృశ్యతా నివారణ సంఘం చేసిన సిఫార్సులు.

సుప్రీంకోర్టు ఇచ్చిన పై తీర్పు దృష్ట్యా, (సాంఘిక సంస్కరణల దిశగా) హిందూ ఆలయాల్లో వంశపారంపర్యంగా నియామకాలు జరిపే విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం భావించింది.

## పేరా 9

బిల్లులో ఉదహరించబడిన పై లక్ష్యాలను సాధించటానికి అనువుగా, 22/1959 చట్టంలోని



సెక్షన్ 55లో "... అన్ని కేసులలో" అని వున్నచోట, "ఎక్కడెక్కడైతే, ఆ సేవ, ఉద్యోగం వంశపారంపర్యమైనది కాదో ఆ కేసులలో...." అని చదువుకోవాలని సవరించబడిన చట్టం పేర్కొంటోంది.

సెక్షన్ 55లోని సబ్ సెక్షన్-1కి ఈ క్రింది వివరణ ఇవ్వబడింది:

"సేవకుల, ఉద్యోగుల హోదా అని వున్న ప్రతిచోటా అర్చకులను, పూజారులను కూడా కలిపి చదువుకోవాలి..."

ఇదే సెక్షన్ 55లోని సబ్ సెక్షన్-2 స్థానే ఈ క్రింది సబ్ సెక్షన్‌ని చేర్చుకోవాలి :

"సబ్ సెక్షన్-1లో ఉదహరించబడిన ఏ ఖాళీ పోస్టులో నియమింపబడటానికైనా - ఆ పోస్టుకి తానే తదుపరి వారసుడ్ని అన్న కారణంగా నియమింపబడటానికి ఏ వ్యక్తీ అర్హుడు కాడు."

తదనుగుణంగా సెక్షన్ 56కి సవరణలు జరిగాయి. ప్రధాన చట్టంలో సెక్షన్ 116లోని సబ్ సెక్షన్-2లో 22వ క్లాజులో - దేవాలయాలలో వివిధ అధికారుల, సేవకుల పోస్టులలో నియమింపబడటానికి అవసరమైన యోగ్యతలు, అలాంటి సేవలకి సంబంధించిన నిబంధనలు సవరించబడ్డాయి. ఈ సంస్థలలో అప్పటికే ఏర్పడిన, భవిష్యత్‌లో (చట్టం అమల్లోకి వచ్చిన తరువాత) ఏర్పడగల ఖాళీల విషయంలో ప్రధాన చట్టంలోని సెక్షన్-6 ఇప్పుడెలా సవరించబడిందో అలాగే వర్తిస్తుంది.

ఆ రకంగా, ఈ సవరించబడిన చట్టం - వారసత్వపు అర్చకత్వ హక్కుని రద్దు చేయటానికి అవకాశం కల్పిస్తోంది. అయితే అర్చక పోస్టులలో ఏ కులానికి, వర్ణానికి చెందిన వ్యక్తయినా నియమింపబడటానికి కూడా అవకాశం కల్పిస్తోంది. అంతేకాక, అలాంటి నియామకానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం తయారు చేయటానికి కూడా ఈ చట్టం అధికారమిస్తోంది.

ఈ బిల్లుకి 1971 జనవరి 8న గవర్నర్ ఆమోదం లభించింది. దీన్ని 1971 జనవరి 12 నాడు 2/1971 మద్రాసు చట్టంగా ప్రభుత్వ సెయింట్ జార్జి (అసాధారణ) గజెట్‌లో ప్రచురించారు.

## పేరా 25

బిల్లుకి జతపరచబడిన లక్ష్యాలు, కారణాలలో మద్రాసు వంశపారంపర్య గ్రామాధికారుల చట్టం (2/1895) విషయంలో దాసుల దశరథ రామారావు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గురించి ప్రస్తావించబడింది.

నిజానికి ఆ ప్రస్తావన పూర్తిగా అప్రస్తుతం. ఎందుకంటే - ఆ కేసులో - ప్రభుత్వ యంత్రాంగంలోని ఒక స్థాయి ఉద్యోగ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే దక్షిణ భారతదేశంలోని అర్చకులు ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఉద్యోగాలలో లేరు. అందుచేత అనువంశిక అర్చకత్వం హక్కు వుండటం అనేది రాజ్యాంగంలోని 16వ అధికరణాన్ని ఉల్లంఘించినట్లవదు. ఆ రకమైన విశ్లేషణ (పోలిక) తప్పుదారి పట్టించేదిగా వుంది.

ఇప్పుడు - శేషమ్మాళ్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులోని సంబంధిత అంశాలను పరిశీలిద్దాం. ఇవి చాలా ముఖ్యమైన అంశాలు. ఎందుకంటే - రాజ్యాంగంలోని 141వ అధికరణ ప్రకారం, ఇప్పుడు అమలులో వున్న చట్టం - ఈ కేసు మీద ఆధారపడి వుంది.

2002 ఆగస్టు ఆరు, ఏడు తారీఖులలో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట రివ్యూ పిటీషన్ల (నెం. 2350/1997, నెం. 2375/1997, నెం.డి. 18695/1997) మీద వాదుల తరపున సీనియర్ న్యాయవాది శ్రీ కె.పరాశరన్ వాదిస్తూ, 1996 నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వు 1972 నాటి రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా లేదు కనుక ఆ ఉత్తర్వుని ఉపసంహరించాలని కోరారు.

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం (1972 మార్చి 14న) ఇచ్చిన తీర్పులో (ఎఐఆర్ 158 ఎస్‌సి 1972) సంబంధిత అంశాలు ఇలా వున్నాయి :

## పేరా 6

1971 జనవరి 8న అమల్లోకి వచ్చిన సవరణ చట్టం 1971 ద్వారా 1959 నాటి ప్రధాన చట్టంలో కొన్ని మార్పులు తీసుకురాబడ్డాయి. ప్రధాన చట్టంలోని 55, 56, 116 సెక్షన్‌లకు సవరణలు చేశారు. తదనుగుణంగా చట్టంలో కొన్ని కొత్త సూత్రాలనుకూడా చొప్పించడం జరిగింది.

అస్పృశ్యత, షెడ్యూల్డు కులాల ఆర్థిక, విద్యా విషయిక అభివృద్ధి మీద ఏర్పాటైన కమిటీ చేసిన సాంఘిక సంస్కరణల సిఫార్సుల దిశగా ఈ సవరణల చట్టం మనుగడలోకి వచ్చింది.

తమిళనాడు ప్రభుత్వం తరపున ఈ సవరణల చట్టం విషయంలో దాఖలైన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న లక్ష్యాలు, కారణాలు ఇలా వున్నాయి :

"1969లో అస్పృశ్యత, షెడ్యూల్డు కులాల ఆర్థిక, విద్యా విషయక అభివృద్ధి కమిటీ తన నివేదికలో - హిందూ వ్యవస్థలోని అనువంశిక అర్చకత్వాన్ని రద్దు చేయాలని - సిఫార్సు చేసింది. ఈ అనువంశిక అర్చకత్వం స్థానే ఆలయ వ్యవహారాల సంస్థనొకదానిని ఏర్పాటు



చేయాలనీ, దాని ద్వారా తగిన విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు కుల, జాతి, వర్ణ వివక్షతా రహితంగా - శిక్షణనిచ్చి అర్చకులుగా నియమించాలని కూడా ఈ కమిటీ సూచించింది.

తమిళనాడులోని హిందూ ఆలయాలలో అర్చకులు, గురుక్కళ్ళు, పూజారులు అంతా ఉల్తురై సేవకులు. ఆలయంలో మూల విరాట్‌కి దైనందిన పూజలు, సేవలు, కైంకర్యాలు చేయటం, మంత్ర పఠనం, వేద పఠనం, ప్రబంధ ప్రవచనం, దేవార ప్రవచనం తదితర సేవలు అందించటమే ఉల్తురై సేవకుల విధులు.

1959 నాటి తమిళనాడు హిందూ దేవాదాయ, ధర్మాదాయ చట్టం (22/1959)లోని 55, 56 సెక్షన్‌లు - ఈ దేవాలయాల్లో, వితరణ సంస్థలలో మత పరమైన సేవలందించే సేవకులను వంశ్య వరంపార్య విధానంలో నియమించే అవకాశాన్ని ధర్మకర్తల మండలికి కల్పిస్తున్నాయి. అయితే సాంఘిక సంస్కరణలలో భాగంగా ఇప్పటికే హిందూ ఆలయాలలో సేవకుల నియామకం విషయంలో హిందూ వ్యవస్థలోని అన్ని కులాలవారికి అవకాశం కల్పిస్తున్నారు."

## పేరా 10

చట్టం స్వరూప స్వభావాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలంటే, హిందూ వ్యవస్థలో అనూచానంగా వస్తున్న విశ్వాసాన్ని, ఆచార వ్యవహారాలకు సంబంధించిన కొన్ని కోణాలను పరిశీలించాల్సి వుంది.

మనం మాట్లాడుకుంటున్న ఆలయాలన్నీ పురాతన కాలంలో స్థాపించబడిన బహిరంగ మత సంస్థలు. కొన్ని శివాలయాలు, కొన్ని విష్ణాలయాలు. అంటే ఆయా ఆలయాలలో వివిధ నామాలతో లేదా అవతారాలలో వెలసిన శివుడ్ని లేదా విష్ణువుని పూజిస్తారు. అలా శివాలయాలలో శివుడ్ని ఆరాధించేవారిని శైవులనీ, విష్ణాలయాల్లో విష్ణువుని ఆరాధించేవారిని వైష్ణవులనీ అంటారు. ఆలయాల్లో విగ్రహారాధన అనేది అత్యంత పురాతన సాంప్రదాయంగా వస్తోంది.

చరిత్రకారుడు డాక్టర్ కానె సమాచారం ప్రకారం, క్రైస్తవ శకం ఆరంభానికి ముందు నాలుగో శతాబ్ద కాలంలో కూడా ఈ విగ్రహారాధన జరిగేది. ('ధర్మశాస్త్ర చరిత్ర' గ్రంథంలోని రెండవ ప్రకరణంలోని ద్వితీయ భాగంలో పేజీ 710).

ఆలయాల నిర్మాణం జరిగిన నాటి నుంచే అర్చక వ్యవస్థ కూడా ఉనికిలోకి వచ్చింది. ఈ వ్యవస్థలో - మూల విరాట్‌కి అర్చక సేవలందించడం ద్వారా అర్చకులకు జీవనోపాధి లభించేది. అప్పుడే, హరి, హరుల్ని వేర్వేరుగా ఆరాధించే విధానం కూడా వాడుకలోకి వచ్చింది. ఎప్పట్నుంచి ఈ వైరుధ్యం ఆరంభమయిందన్నది ఖచ్చితంగా చెప్పడం కష్టం. అయితే మహాభారత కాలంలో కూడా ఈ శివ, విష్ణు రూపాల్ని వేర్వేరుగా ఆరాధించే విధానం వుండేదని, అలా ఆరాధించే

వారి (శైవ, వైష్ణవుల) మధ్య తీవ్రమైన శత్రుత్వం నెలకొని వుండేదనీ, కాగా మహాభారతంలోనూ, ఇతర పురాణాలలోనూ హరిహరుల మధ్య తేడా లేదనీ, రెండు రూపాల్లోని శక్తి ఒక్కటేనని సందేశం ఇచ్చే ప్రయత్నం జరిగిందనీ స్పష్టంగా తెలుస్తోంది.

"ఆలయాలు, అర్చక వ్యవస్థ మనుగడలోకి వచ్చినప్పుడే, ఆలయ సంబంధమైన ఆచారాలు, ఆరాధనా విధానాలు, సేవలు కలిపి ఆగమాలుగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ ఆగమాల ఉనికిని, ఆధిపత్యాన్ని గతంలోని జరిగిన అనేక కేసులలో నిర్ధారించటం జరిగింది. మైసూరు రాష్ట్రానికి చెందిన శ్రీ వెంకటరమణ దేవార్ వారు మధ్య జరిగిన కేసులో - 1958 ఎస్‌సిఆర్ 895 (ఎఐఆర్ 1958 ఎస్‌సి 255) - ఈ కోర్టు (సుప్రీంకోర్టు) ఇచ్చిన తీర్పులో కూడా ఆగమశాస్త్రాల ఆధిపత్యాన్ని నిర్ధారించటం జరిగింది.

ఆలయ నిర్మాణాలు, మూలవిరాట్ ప్రతిష్ఠాపన, నిత్య పూజాది సేవలకు సంబంధించి అనాదిగా పాటించబడుతూ వస్తున్న నిర్దిష్ట ఆచార విధానాలకు ఒక శాసనరూపంగా ఈ ఆగమాలను - గతంలో ఒక కేసులో వర్ణించడం జరిగింది.

ఈ ఆలయ సేవలకు రెండు ప్రయోజనాలు వున్నాయి. ఒకటి - ఆలయంలో అర్చకుడు నిర్వహించే ఆరాధనా కార్యక్రమంలో సామాన్య భక్తులు పాల్గొనేలా ఆకర్షించడం, రెండు - కాలుష్యం, అపవిత్రత, అపరిశుభ్రతల నుండి మూలవిరాట్‌ని కాపాడటం.

మూలవిరాట్‌కి కాలుష్యం సోకినా, అశౌచం అంటినా ఆ విగ్రహం శక్తి క్షీణిస్తుందని హిందూ భక్తులు విశ్వసిస్తారు. అందుకే అలాంటి అపవిత్ర వాతావరణం నెలకొనటాన్ని భక్తులు కలలో కూడా ఊహించలేరు..."

''...ఆగమ శాస్త్రాలకు విరుద్ధంగా ఆలయంలో ఏం జరిగినా మూల విరాట్ మైలపడిపోతుందనీ, అందులోని దైవశక్తి క్షీణిస్తుందనీ భక్తుల మనస్సుల్లో నాటుకుపోయి వుంది. గర్భగుడి యొక్క పవిత్రతను కాపాడాలనుకోవటానికి ఇదికూడా ఒక కారణం. ఏయే ఆలయాల్లోనయితే మూల విరాట్‌కి ఆగమశాస్త్రానుసారం ప్రతిష్ట జరుగుతుందో, అక్కడంతా అర్హత కలిగిన, నిర్దిష్ట ఆచారాల్ని కఠోరంగా పాటించే అర్చకులు మాత్రమే నిత్య ధూపదీపనైవేద్యాదిసేవలు నిర్వహించాలని ఆగమ శాస్త్రాలు స్పష్టం చేస్తున్నాయి.

".... ఆ రకంగా, ఈ కోర్టు ముందే చెప్పినట్లుగా, ఆలయాలకు సంబంధించిన ఆచార విధానాల ప్రకారం, ఆలయంలోని గర్భగుడిలో ఎవరు ప్రవేశించాలీ, ఎవరు నిత్యపూజా పునస్కారాలు సాగించాలీ, ఎవరు ఎంతవరకు (ఆలయంలో) వెళ్ళవచ్చు వగయిరా అంశాలన్నీ మతపరమైన విషయాలు.... వాళ్ళు (అర్చకులు) మాత్రమే విగ్రహాల్ని తాకవచ్చు. దైనందిన అభిషేకాది సేవలు నిర్వహించవచ్చు. వారు మినహా, వేరెవ్వరికీ - ఆచార్యులు, మఠాధిపతులు



సహా సమాజంలో ఎంత ఉన్నత స్థానంలో వారికి కూడా - విగ్రహానికి పూజ చేసే అధికారం, విగ్రహాన్ని స్పృశించే అధికారం, కనీసం గర్భగుడిలో ప్రవేశించే అధికారం లేదు...

"మూలవిరాట్ మైలపడేలా, పవిత్రతను కోల్పోయేలా ఆగమశాస్త్రాలు అనుమతించని అర్చకుడ్ని గర్భగుడిలోకి అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకునే ఏ చర్య అయినా - హిందూ భక్తుల మత విశ్వాసాలలో మొరటుగా జోక్యం చేసుకోవడమే అవుతుంది. కనుక రాజ్యాంగంలోని 25(1) అధికరణ క్రింద అలాంటి చర్యలు చెల్లవు అని వేరే చెప్పనవసరం లేదు..."

అనువంశిక అర్చకత్వం అమల్లో వున్న ఆలయాలలో మూలవిరాట్ అపవిత్రం కారాదు - అని ప్రధాన చట్టంలోని సెక్షన్ 55, మద్రాసు హిందూ మత సంస్థల (అధికారులు, సేవకులు) సర్వీసు రూల్సు - 1964లోని పన్నెండవ నిబంధన స్పష్టం చేస్తున్నాయి. అర్చకత్వం గానీ, సేవగానీ అనువంశికంగా వస్తున్న చోట, వారసుడెవరయితే అతను ఆ విధులు నిర్వర్తించటానికి అర్హుడై వుంటాడు - అని స్పష్టం చేయటం ద్వారా, సెక్షన్ 55లోని సబ్ సెక్షన్ (2) - అర్చకత్వ బాధ్యత స్వీకరించేవాడు ఆగమ శాస్త్రంలో నిర్వచించిన విధంగా అర్చక కులంలోని అదే శాఖకు చెందినవాడై వుండేలా చూస్తోంది.

12వ నిబంధనలో - అర్చకుడనేవాడు మంత్ర, వేద, ప్రబంధ, దేవారనామాల పఠనంలో నిష్ణాతుడై వుండాలనీ, ఆ రకంగా ఆలయంలో నిత్య పూజాది సేవలందించగలిగి వుండాలనీ కూడా స్పష్టంగా చెప్పబడింది. అంటే - అలాంటి అర్చకుడే ఆలయంలో దేవుడికి అన్ని రకాల పూజలు, సేవలు, ఉత్సవాలు నిర్వహించటానికి పరిపూర్ణ అర్హత కలిగి వుంటాడు.

నిత్య అర్చనాది సేవలలో ఏదన్నా లోపం జరిగితే, మూల విరాట్ అపవిత్రమయ్యే ప్రమాదం వుంది. అందుకని అలా జరక్కుండా వుండటం కోసమే అర్చకుడు తన విధులు నిర్వర్తించటంలో నిష్ణాతుడై వుండాలి అని చెప్పబడింది.

సవరించబడిన చట్టంలో ఈ వారసత్వపు (అర్చకత్వ) హక్కు రద్దు చేయబడింది. చట్టం సవరణ లక్ష్యాలలో కూడా, ఆలయాలలో వివిధ సేవలు నిర్వర్తించే వారి విషయంలో వారసత్వపు హక్కుని రద్దు చేయటం, అర్చకత్వాన్ని - గుర్తింపు పొందిన సంస్థలలో శిక్షణ పొందిన, అర్హులైన అభ్యర్థులందరికీ అందుబాటులోకి తీసుకురావటం కోసమే సవరణ చేస్తున్నట్లు పేర్కొనబడింది.

పన్నెండవ నిబంధన ప్రకారం తగిన శిక్షణ పొంది అర్హత సంపాదించుకున్న వ్యక్తిని శివాలయంలోగానీ, విష్ణాలయంలో గానీ అర్చకుడిగా నియమించే అధికారం (సవరించబడిన సెక్షన్ 55 ప్రకారం) ధర్మకర్తలకి వుంటుంది. (పన్నెండవ నిబంధన అనేది ప్రధాన చట్టంలో ప్రభుత్వం రూపొందించిన రూలు. ఇదిఎప్పుడైనా ఎలాగైనా మారుతూ వుండవచ్చు.)

సవరించిన చట్టం ప్రకారం - అర్చకుడుగా నియమింపబడే అభ్యర్థికి నిర్దిష్టమైన శిక్షణ, విద్యార్హత వుండి తీరాలని నిర్దేశించటం నిర్దేశించకపోవటం అనేది ప్రభుత్వ ఇష్టం. అంటే చివరికి జరిగేదేమిటి?- ఏ వ్యక్తి అయినా - (శైవుడు గానీ, వైష్ణవుడు గానీ) ఆగమ శాస్త్రంలో పేర్కొన్న శాస్త్ర పరిజ్ఞానం, మంత్ర పరిజ్ఞానం వున్నవాడు గానీ లేనివాడు గానీ అర్చకుడుగా నియమింపబడవచ్చు. నిర్దిష్టమైన యోగ్యతలతో నిమిత్తం లేకుండా ఒక అర్చకుడ్ని నియమించటంలో ధర్మకర్తల విచక్షణాధికారం మీద ఎలాంటి నియంత్రణా వుండదు.

ధర్మకర్తలు మాత్రం ప్రభుత్వ నియంత్రణకి లోబడి పని చేయాలి. ప్రధాన చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం - ప్రభుత్వం జారీ చేసే అన్ని ఉత్తర్వులను, ఆదేశాలను ధర్మకర్తలు పాటించి తీరాలి. సంబంధిత శాఖ కమీషనర్ లేదా డిప్యూటీ కమీషనర్ లేదా అసిస్టెంట్ కమీషనర్‌లు జారీ చేసే ఆదేశాలకు కూడా ఇదే వర్తిస్తుంది.

ఏతా వాతా, సాదాసీదాగా కనుపించే సవరణ ఏకంగా ప్రభుత్వాన్నే - ధర్మకర్తల ద్వారా, అర్చకుల ద్వారా - గర్భగుడిలోకి తీసుకొచ్చేసిందని కక్షిదారులు వాదిస్తున్నారు.

## పేరా 15

ఆలయంలో నిర్దిష్టమైన వంశానికి (శాఖ)కి చెందిన అర్చకుడు నిర్వహిస్తేనే తప్ప, దైనందిన పూజాది కార్యక్రమాల ప్రయోజనం సిద్ధించదని చాలాకాలం క్రితమే గుర్తించబడింది. కాని ఇప్పుడు సవరించబడిన చట్టం ప్రకారం (ఆ చట్టంలో ఉదహరించబడిన లక్ష్యాలననుసరించి), ఆలయాలలో ఆగమబద్ధమైన విధానాలను తుంగలో తొక్కి, ఆగమ విరుద్ధమైన శాఖలకు చెందిన వేర్వేరు శాఖల వాళ్ళని - ఏకీకృత దేవతార్చన పేరుతో - ఆలయాలలో చొప్పించేలా చేసే ప్రభుత్వ చర్యలను నిరోధించగల అవకాశం ఈ సవరించబడిన చట్టంలో ఎక్కడా లేదు.

ఇలాంటి ఆగమ విరుద్ధమైన చర్య - విగ్రహాల పవిత్రతకు భంగం కలిగిస్తుంది కనుక, అలాంటి అధికారాలను సవరించబడిన చట్టం ద్వారా ప్రభుత్వం హస్తగతం చేసుకోవటం అనేది రాజ్యాంగంలోని 25, 26 అధికరణలు హామీ ఇచ్చే మతస్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోవటమే అవుతుంది.

★ ★ ★ ★ ★

**సు**ప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎదుట వాదించేటప్పుడు ప్రభుత్వం కనుక తాను బిల్లు తయారు చేసినప్పుడు ఉదహరించిన లక్ష్యాలతోనే చట్టాన్ని రూపొందించినట్లుగా కనుక వాదించి వుంటే, కేసులో ఓడిపోయివుండేది. అలాంటి వాదనతో ప్రభుత్వం వచ్చివుంటే రిట్ పిటీషన్లు కూడా అనుమతించబడేవి.

కాని, ఆ సవరణ చట్టం రాజకీయ కారణాలతో రూపొందింది. అందువల్ల ఆ చట్టాన్ని



సుప్రీంకోర్టు కొట్టివేసివుంటే, దాని ప్రభావం తీవ్రమైన రాజకీయ పరిణామాలకు దారి తీసి వుండేది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదన దగ్గరకొచ్చేసరికి తన పంథా మార్చుకుంది. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ ఏమని అర్థించారంటే- బిల్లులో ఉదహరించబడిన లక్ష్యాలు, కారణాలతోనూ, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌తోనూ నిమిత్తం లేకుండా, సవరించబడిన సెక్షన్‌ల ఆమోద యోగ్యతని పరిగణనలోకి తీసుకోవాలి.

ఎంతలో ఎంత మార్పు?

చివరికి సుప్రీంకోర్టులో అడ్వొకేట్ జనరల్ చేసిన వాదనలు అసలు విషయాన్ని గాలికి వదిలేసి, అప్రస్తుతాంశాల మీద నడిచాయి. బిల్లుని విధాన సభలో ప్రవేశపెట్టినప్పుడు గానీ, తరువాత చట్టం ఆమోదింపబడటానికి ముందు జరిపిన సమావేశంలో గానీ తమిళనాడు ప్రభుత్వం వివరించిన సైద్ధాంతిక కారణాలు వేరు. సుప్రీంకోర్టుకి వచ్చేసరికి వాదించిన కారణాలు వేరు.

సుప్రీంకోర్టులో ముందు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌కి, అడ్వొకేట్ జనరల్ వాదనలకి సంబంధం లేదు.

సుప్రీంకోర్టు తీర్పులో మిగతా పేరాలు చూద్దాం :

★ ★ ★ ★ ★

## పేరా 16

పిటీషనర్‌ల తరపు వాదనలలోని శక్తి - రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదించిన అడ్వొకేట్ జనరల్ ముందు వృధాపోలేదు.

అయినప్పటికీ, సవరించబడిన చట్టంలోని సెక్షన్ 55 ఒక్కదాన్నే మనం విడిగా పరిగణనలోకి తీసుకునే పక్షంలో మాత్రమే పిటీషనర్‌లు వాదిస్తున్న పరిస్థితి ఉత్పన్నమవుతుంది - అంటూ అడ్వొకేట్ జనరల్ విషయాన్ని ప్రక్కదారి పట్టించారు. బిల్లులో ప్రస్తావించబడిన లక్ష్యాలు, కారణాలకు గానీ, రాష్ట్ర ప్రభుత్వం తరపున దాఖలైన కౌంటర్ అఫిడవిట్‌కి గానీ తాను నిబద్ధుడై వుండాలని ఆయన అంగీకరించలేదు. ఆయన వాదనల్లా - సవరించబడినాక ప్రధాన చట్టం యొక్క సమగ్ర స్వరూపాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, దాని ప్రభావం ఏమిటో పరిశీలించాలి.

ఆయన వాదన ప్రకారం, ధర్మకర్తలకు సవరించబడిన సెక్షన్ 55 క్రింద సంక్రమింపజేసిన అధికారం - అనర్థమైనదేమీ కాదు. ఎందుకంటే, ఆ అధికారాన్ని - దాన్ని నియంత్రించే సెక్షన్ 28 పరిధిలో చూడాలి. సరే, సెక్షన్ 28 (1) ఏం చెబుతోంది :

"... 1947నాటి తమిళనాడు ఆలయ ప్రవేశ ఆమోదచట్టం సూత్రావళికి లోబడి, ప్రతి మత సంస్థ యొక్క ధర్మకర్తా - ఆ సంస్థ నియమనిబంధనలకు అనుగుణంగా, ఆ సంస్థ విధానాలకు తగినట్లుగా, సంబంధిత అధికారుల చట్టబద్ధమైన ఆదేశాలకు లోబడి - ఆ సంస్థని, దాని నిధులను, ఆస్తులను నిర్వహించాలి. ఆ ఆస్తులు, సంస్థా తన స్వంతమే అయి వుంటే ఒక సాధారణ వివేకవంతుడు ఎంత జాగ్రత్తగా వాటిని నిర్వహిస్తాడో అంత బాధ్యతగా వాటిని ధర్మకర్తలు నిర్వహించాల్సి వుంటుంది..."

సెక్షన్ 28(11)లోని ఈ మార్గదర్శక సూత్రానికి లోబడి, ట్రస్టు నియమ నిబంధనలనూ, విధానాలనూ పరిగణనలోకి తీసుకుంటూ ధర్మకర్తలు ఆయా సంస్థని నిర్వహించాల్సి వుంటుంది. నిర్దిష్టమైన శాఖకి చెందిన వ్యక్తే అర్చకుడిగా, పూజారిగా వుండటం అనేదే ఆ సంస్థ విధానం అయివుంటే, తదనుగుణంగా సెక్షన్ 55ని అనుసరించి సంబంధిత శాఖకి చెందిన వ్యక్తినే (అర్చకుడిగా, పూజారిగా) ఆ ధర్మకర్తలు నియమించి తీరాల్సి వుంటుంది. ఆయా సంస్థల విధానానికి అనుగుణంగానే అలాంటి నియామకాన్ని చేయాలనే షరతుని సడలించే అవకాశం ఏదీ సెక్షన్ 55లో లేదని కూడా ఆయన వాదించారు...

## పేరా 17

ప్రధాన చట్టంలోని సెక్షన్ 28(1) ప్రకారం ఆయా సంస్థల విధానాలకి అనుగుణంగా అర్చకులని నియమించేలా ధర్మకర్తలకి సంక్రమించిన అధికారాన్ని సవరించబడిన సెక్షన్ 55 నియంత్రిస్తుందన్న అడ్వొకేట్ జనరల్ వాదనతో అంగీకరించడానికి మాకు ఇబ్బంది లేదు.

## పేరా 20

... అభ్యర్థికి (అర్చకత్వానికి) వారసత్వపు హక్కు వుందన్న కారణంగా, అతన్ని సంబంధిత పోస్టులో ధర్మకర్తలు నియమించి తీరాలని లేదు. అంతవరకూ, కేవలం ఆ మేరకు - ప్రధాన చట్టంలోని సెక్షన్ 28 విధించే ఆంక్షల (వంశపారంపర్య అర్చకత్వ విధానాన్ని పాటించే ఆలయ వ్యవహారాలను నిర్వహించటం విషయంలో) నుండి సడలింపు లభిస్తోంది.

## పేరా 21

సెక్షన్ 116(2)లోని క్లాజ్ (21) క్రింద అర్చకులకు కనీస యోగ్యతలను నిర్దేశించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం హస్తగతం చేసుకుందని (పిటీషనర్లు) పేర్కొన్నారు. అంతేకాక, కుల జాతి వర్ణ భేదాలతో నిమిత్తం లేకుండా అర్చకుల్ని నియమించాలన్న లక్ష్యానికి అనుగుణంగా - ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా - అర్చకులకు కనీస యోగ్యతలు నిర్ణయించే విచక్షణాధికారాన్ని ప్రభుత్వం వుంచుకొంది.



మద్రాసు హిందూ మత సంస్థల (అధికారులు, సేవకుల) సర్వీసు రూల్సు - 1964లోని పన్నెండవ రూలు క్రింద అర్చకులకు అవసరమైన కనీస యోగ్యతలు సూచించబడ్డాయి. వీటి విషయంలో పిటీషనర్లకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఆ రూలు ఇప్పటికీ కొనసాగుతూనే వుంది.

అయితే ప్రభుత్వం ఏ క్షణంలోనయినా ఆ రూలు స్థానంలో మరో రూలుని (ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా అర్చకులకు కనీసార్హతలను నిర్ణయించేలా) ప్రవేశపెట్టవచ్చునని పిటీషనర్లు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకి - ఇప్పుడు అమలులో వున్న రూలు ప్రకారం - ఆలయాలలో నిత్యపూజలు చేస్తూ, వేదమంత్రాలను పఠించే ఉల్తురై సేవకులు - ఆగమ శాస్త్రంలో నిత్య పూజా పునస్కార విధులలో శిక్షణనిచ్చే సంస్థ నుండి - తాము తగిన యోగ్యత కలిగి వున్నామని ధృవపరిచే పత్రాన్ని దాఖలు చేయాల్సి వుంటుంది. ఒకవేళ రేపు ప్రభుత్వం ఈ రూలుని మార్చేసి ఆగమ శాస్త్ర పరిజ్ఞానంతో నిమిత్తం లేని విధంగా కొత్త రకంగా కనీసార్హతలను నిర్ణయించవచ్చు అన్న అనుమానాన్ని కూడా వారు వ్యక్తం చేశారు.

పిటీషనర్ల వాదన ప్రకారం - నిత్య పూజలు చేసే అర్చకులుగా నియమితులయ్యే వారి యోగ్యతాయోగ్యతలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శక సూత్రాలను చట్టం సూచించటంలేదు. కనుక ప్రభుత్వం - ఆగమశాస్త్రబద్ధమైన యోగ్యతా విధానానికి స్వస్తి చెప్పి, సులభంగా వుండే పాఠ్యాంశాలతో కూడిన కనీస విద్యార్హతలను నిత్యపూజలు చేసే అర్చకులకు వుండాల్సిన యోగ్యతలుగా నిర్ణయించవచ్చు.

అయితే మా అభిప్రాయంలో - పిటీషనర్ల భయాందోళనలు ఆధారరహితమైనవి.

రూలు-12 ఇంకా ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. అయినప్పుడు, ప్రభుత్వం ఆలయాలలో అమల్లో వున్న అర్చక విధానానికి విరుద్ధంగా కొత్త పద్ధతులు ప్రవేశపెట్టి, విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందనుకోవటానికి తగిన కారణాలు కనబడటం లేదు....

పైగా, ఆలయ సేవలు, ఉత్సవాలు వగైరాల విషయంలో జోక్యం చేసుకునే విధంగా ప్రభుత్వం ఏదైనా రూలు ప్రవేశపెడితే, అనూచానంగా వస్తున్న ఆలయ విధులలో ఆసక్తి కలవారు ఆ కొత్త రూలుని (కోర్టులో) ఛాలెంజి చేయవచ్చుకదా! కాబట్టి పిటీషనర్లు ఇప్పుడు వ్యక్తం చేసిన భయాందోళనలు అకారణంగా, అకాలంలో చేయబడుతున్నవి మాత్రమే.."

★ ★ ★ ★ ★

**సు**ప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 1972లో వెలువరించిన ఈ తీర్పు - ఎవరైతే ఆలయ వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలిగించాలనుకున్నారో, ఇంకావీలైతే మత విశ్వాసాలనూ ఆలయాలలో (విగ్రహం) ఆరాధననూ సర్వనాశనం చేయాలనుకున్నారో - వారి ప్రయత్నాలకు ఒక గొడ్డలిపెట్టు అయింది.

దాంతో 1971 నాటి సవరణ చట్టాన్ని అమలు చేయరాదని తమిళనాడు ప్రభుత్వం నిశ్చయించింది. ఇప్పటికీ, 1971 సవరణ చట్టానికి ముందున్న పరిస్థితే తమిళనాడు ఆలయాలలో కొనసాగుతోంది.

1971 నాటి సవరణ చట్టం అమలు జరపకపోయినప్పటికీ, వారసత్వపు (అర్చకత్వంలో) హక్కుని తొలగించటం వల్ల, అర్చకత్వ వృత్తిలో అభద్రతా భావం కొత్తగా నెలకొంది. దీనికితోడు, భూ సంస్కరణల తాలూకు చట్టాలు ఈ ఆలయ, ధార్మిక వ్యవస్థల్ని మరింత నిస్తేజంగా, నిర్వీర్యంగా తయారు చేశాయి.

1972 నుంచీ నడిచిన సుదీర్ఘమైన చరిత్ర పరిశీలిస్తేనే ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్స్ చట్టం 30/87 తాలూకు సంక్లిష్టత అర్థమవుతుంది.

★ ★ ★ ★ ★

**త**మిళనాడులో మొత్తం 34,401 బహిరంగ మత సంస్థలు వున్నాయి. ఆదాయాన్ని బట్టి వాటిని ఇలా వర్గీకరించారు:

1. రూ. 200లు లేదా అంతకన్నా తక్కు వార్షిక ఆదాయంకల మత సంస్థలు 8,368
2. రూ. 200 కన్నా పైన, రూ. 2000 లోపు వార్షిక ఆదాయం కల మత సంస్థలు 17,687
3. రూ. 2000 లకు పైన, రూ. 10,000లకు లోపు వార్షిక ఆదాయం కల సంస్థలు 6,509
4. రూ. 10,000లకు పైన, రూ. 50,000లకు లోపు వార్షిక ఆదాయం కల సంస్థలు 1,469
5. రూ. 50,000లకు పైన లక్ష రూపాయలకు లోపు వార్షిక ఆదాయం కల సంస్థలు 166
6. లక్ష రూపాయలకు పైబడిన వార్షిక ఆదాయం కల సంస్థలు 202

ఆ రకంగా వీటిల్లో చివరి నాలుగు కేటగిరీలలోని 8,346 సంస్థలు మాత్రమే (ఆదాయం) మదింపు చేయదగిన సంస్థలుగా పరిగణించబడ్డాయి.

తమిళనాడులో ఆలయాల పరిస్థితి ఎలా వుందో తెలుసుకోవటానికి మచ్చుతునకగా పత్రికలలో వచ్చిన రిపోర్టులు చూద్దాం :

ఎ) 1979లో హిందూ మత, ధార్మిక సంస్థల ఎండోమెంట్ అధికారులు మద్రాసులోని కపాలేశ్వర స్వామి ఆలయానికి చెందిన 116 స్థలాల్ని రూ. 3.5 లక్షలకు, పురస వాక్కంలో గంగాదీశ్వర స్వామి ఆలయానికి చెందిన 147 స్థలాల్ని రూ. 4.5 లక్షలకు విక్రయించాలని ప్రతిపాదించారు. అయితే దీనిని రాష్ట్ర ఆలయ పరిరక్షణ కమిటీ వ్యతిరేకించింది.

బి) నాగపట్నం తాలూకాలోని అక్షయ లింగేశ్వరస్వామి ఆలయానికి 950 ఎకరాల భూమి



వుంది. వీటిలో 300 ఎకరాలను సహకార సంఘాలు కౌలుకి తీసుకుని సాగు చేస్తున్నాయి. ఏటా 5000 బస్తాల ధాన్యం కౌలుక్రింద రావల్సి వుండగా, ఎనిమిదేళ్ళ కాలంలో పేరుకుపోయిన కౌలు బకాయిల మొత్తం 36,000 బస్తాలు.

సి) మద్రాసులోని కోడంబాకంలో ఒక ఆలయానికి చెందిన 40 స్థలాలతో కూడిన విస్తీర్ణం మీద వస్తున్న వార్షిక అద్దె నాలుగు రూపాయలు మాత్రమే. అలాగే సైదాపేటలో కూడా ఇలాంటిదే మరో 40 ప్లాట్లతో కూడిన విస్తీర్ణం నామ మాత్రపు అద్దెకు ఇవ్వబడింది. ఆ స్థలంలో ఇప్పుడు ఖరీదైన భవంతులు లేచాయి. కాని ఆలయ ఆదాయం పడిపోయింది.

డి) మైనర్ ఇనాములను రద్దు చేయటంతో, 60 సంవత్సరాలకు పైబడి కౌలు చేస్తున్న రైతులందరికీ ఆ భూములపై హక్కు సంక్రమింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తరువాత ఇందులో చిన్న మార్పు చేశారు. ఎవరైతే పన్నెండేళ్ళ కాలానికి కౌలుని చెల్లించి వుంటారో అలాంటి వారు గత 30 ఏళ్ళుగా కౌలు చేస్తుంటే చాలు, ఆ భూములు వారి హక్కు భుక్తమైపోతాయి.... ఆ రకంగా రెండున్నర కోట్ల రూపాయలు విలువ చేసే 13,825 ఎకరాల ఆలయ భూములు 5000 మందికి హక్కుభుక్తం చేయబడ్డాయి. సరే చేసింది, మరి ప్రభుత్వం ఆ సొమ్ముని ఆయా ఆలయాలకు అందజేసిందా? చేయలేదు. ఇనాములు రద్దు చేయటం వల్ల ఆలయాలు కోల్పోతున్న భూములకు, లేదా ఆదాయానికి ఎలాంటి నష్ట పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించలేదు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యల వల్ల తమిళనాడులో 2600 ఆలయాలు ఘోరంగా నష్టపోయాయి.

ఇ) ఏటా 80 వేల బస్తాల ధాన్యం ఆదాయం వచ్చేలా తంజావూరులోని బృహదీశ్వరాలయానికి రాజరాజ చోళమహారాజు భూములు బహూకరించారు. కాని ఆ భూములు ఇప్పుడు ఆలయం ఆధీనంలో లేవు. ఫలితం?.... అనేక మాసాల పాటు జీతనాతాలు లేనందువల్ల, నిత్య ధూపదీప నైవేద్యాలకు కైంకర్యాలకు అవసరమైన కనీస బియ్యం, నూనె కూడా కొరవడటంవల్లా తమ సేవలను కొనసాగించటానికి అశక్తత వ్యక్తం చేస్తూ, బృహదీశ్వరాలయ అర్చకులు 1983 అక్టోబర్ 20 నాడు నిత్య పూజలు సయితం నిలిపి వేయాల్సి వచ్చింది.

ఎఫ్) 1985 ఏప్రిల్ ఏడున అప్పటి తమిళనాడు దేవాదాయ శాఖామంత్రి మధురైలో ఒక పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మధుర మీనాక్షి ఆలయం తాలూకు భవనాల్ని ఒక ప్రముఖ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు, అక్రమంగా ఆక్రమించుక్కూర్చున్నాడని ప్రకటించారు. ఆ భవనాల్ని మొదట అద్దెకు తీసుకున్న

వ్యక్తి వాటిని ఈ రాజకీయ నాయకుడికి బదిలీ చేశారని కూడా ఆయన వెల్లడించారు. తంజావూరు, తిరుచ్చి జిల్లాల్లోని ఆలయాలలో అర్చకులకు అనేక మాసాలుగా జీతాలు చెల్లించటంలేదని తాను ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడు వెలుగులోకి వచ్చిందని కూడా ఆయన చెప్పారు.

జి) 1979 నవంబరు 26న ఆలయాల సిబ్బంది సంఘ మహాసభలో బయటపడిన భయంకర సత్యం ఏమిటంటే - 1,87,712 మంది కౌలుదారుల చేతుల్లో ఆలయ భూములుండగా వారిలో 20 శాతం మంది మాత్రమే నిఖార్సయిన కౌలుదారులు. మిగతావారంతా కౌలుదారులుగా చలామణి అవుతున్న దళారీలు మాత్రమే.

ఆలయ మాన్యాలన్నింటినీ భూ సంస్కరణ చట్టాలు, కౌలుదారీ చట్టాలు, సముచిత అద్దె చట్టం పరిధుల నుండి మినహాయించాలని ఆ మహాసభ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. "ఈ చట్టాల చట్రాలలో పడిపోయి, మాన్యాల మీద వచ్చే ఆదాయాన్ని ఆలయాలు 40 శాతం నుంచి 25 శాతం దాకా కోల్పోతున్నాయి" అని కూడా ఆ సంఘం వాపోయింది.

హెచ్) కాల్పాటి ఆలయంలో నిత్య పూజల్ని - అవరోధం లేకుండా కొనసాగించడం కోసం - ఆలయ రథాన్ని 20,000 రూపాయలకు అమ్మేశారు.

ఐ) 1992 మార్చి తొమ్మిదిన పత్రికల వారితో మాట్లాడుతూ, ఆలయ రథాలను తగులబెట్టడం, ఆలయాలలో దొంగతనాలు, హత్యలు జరగడం వంటి దుర్ఘటనల పట్ల కంచి పరమాచార్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేరాలన్నింటికీ నగలు, ఆభరణాలు దోచుకోవాలన్న దురాశ మాత్రమే కారణం కాదనీ, తమిళనాడులో విస్తృతంగా విస్తరిస్తున్న భక్తి ఉద్యమానికి వెన్నుపోటు పొడవడం కోసం ఏదో అసాంఘిక శక్తి పని చేస్తున్నట్లు కనుపిస్తోందని అన్నారు.

జె) తమిళనాడులో ఆలయాల నిర్వహణ ఒక పెద్ద ప్రజా సమస్యగా మారింది. అన్నిచోట్లా ప్రజలు ఈ సమస్య పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు-

1985 జూన్ 13న అసెంబ్లీలో దేవాదాయ శాఖామంత్రి మాట్లాడుతూ, ఆలయాలు తగిన ఆదాయం లేక పేదరికంలో మ్రగ్గిపోతున్నాయన్నారు. 1984 నాటికి ఈ ఆలయాలకి రావలసిన రెవెన్యూ బకాయిలు 33.35 కోట్ల రూపాయలకు చేరుకున్నాయన్నారు.

1989 జూన్ 25న తమిళనాడు ఆలయ సిబ్బంది సంఘ సమావేశంలో మాట్లాడుతూ, ఆలయాలకి రావలసిన రెవెన్యూ బకాయిలు 52 కోట్ల రూపాయలకు చేరుకున్నాయని దేవాదాయ శాఖామంత్రి ప్రకటించారు. ఆలయాలకి న్యాయంగా రావలసిన ఆదాయానికి



గండికొడుతూ అనేక ఆలయాల ఆస్తుల్ని ప్రైవేటు వ్యక్తులు హస్తగతం చేసుకున్నారని కూడా ఆయన వెల్లడించారు.

1989 ఎన్నికలలో తమిళనాడులో ఆలయాల నిర్వహణ ఒక ప్రధానాంశంగా తయారైంది. అన్ని రాజకీయ పార్టీలు తమ తమ ఎన్నికల ప్రణాళికలలో ఆలయ సంస్కరణలని ఒక ముఖ్యాంశంగా చేర్చారు. 1988 డిసెంబరు 29 నాడు కాంగ్రెసు పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో ఇలా పేర్కొంది-

"హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థల శాఖని, దాని పరిధిలోకి వచ్చే అన్ని ఆలయాలని సక్రమంగా నిర్వహించటంకోసం మత పెద్దలు, పండితులతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఒక సంస్థని ఏర్పాటు చేస్తాం... సచ్ఛీలత కలిగిన భక్తుల్ని మాత్రమే ధర్మకర్తలుగా నియమిస్తాం... ఆదాయం కోల్పోయిన ఆలయాలలో నిత్య పూజా పునస్కారాలకు ఎటువంటి లోపం జరక్కుండా చర్యలు తీసుకుంటాం.... అర్చకులు, పూజారుల కోసం సంక్షేమ చర్యలు చేపడతాం. వాళ్ళ జీతాల చెల్లింపుకి ఎలాంటి అవరోధం లేకుండా చూస్తాం.."

ఇలాంటి హామీలనే డి.ఎం.కె, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. తదితర పార్టీలు కూడా గుప్పించాయి.

చివరికి ఆ ఎన్నికలలో డి.ఎం.కె. పార్టీ గెలుపొందింది. అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ తన ఎన్నికల ప్రణాళిక అమలు చేయడం ప్రారంభించింది. దీనిమీద 'ది హిందూ' ఏం రాసిందో చూద్దాం.

## 'ది హిందూ' (11.3.1989)

*"తమిళనాడులోని ఆలయాల నిర్వహణను మెరుగు పర్చటానికి, వాటి ఆస్తులను కాపాడటానికి వారి ఆర్థిక వనరులను అభివృద్ధి చేయటానికి తీసుకోదగిన చర్యల విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సలహాలిచ్చేందుకుగాను ఒక అయిదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి ఈరోజు ప్రకటించారు.*

*ఈ కమిటీ రాష్ట్రమంతా పర్యటించి, మత పెద్దలతోనూ, ఆధ్యాత్మిక గురువులతోనూ, ఆలయ వ్యవస్థ పరిరక్షణలో ఆసక్తికల ఇతర ప్రజానీకంతోనూ సంప్రదించి, ఒక సమగ్ర నివేదికను ఈ కమిటీ మూడు మాసాల లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ కమిటీ సిఫార్సులననుసరించి, హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ పనితీరుని మెరుగుపర్చటానికి అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది.*

*శ్రీ కుంద్రాకుడి అడిగళార్, మద్రాసు హైకోర్టు పూర్వపు న్యాయమూర్తి శ్రీ కృష్ణస్వామి రెడ్డియార్, శ్రీరంగంకి చెందిన శ్రీ తిరుమలై అయ్యంగార్, కంచి పీఠం ప్రతినిధి*

*శ్రీకె.ఎం.జయశెంతిలనాథన్, అలగప్ప విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీమతి రాధా త్యాగరాజన్ (కారైకుడి)లతో కూడిన ఈ కమిటీకి దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా వుంటారు.*

*ఎన్నికల ప్రణాళికలో డి.ఎం.కె. పార్టీ చేసిన హామీకి అనుగుణంగా ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ప్రభుత్వంతో చర్చించాలని వచ్చిన మత పెద్దలు, మఠాధిపతులు, ఇతర ప్రముఖ పౌరులను ఉద్దేశించి ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి ప్రసంగించారు.*

*తన పరిచయ వాక్యాలలో, గతంలో డి.ఎం.కె. అధికారంలో వుండగా రాష్ట్రంలోని ఆలయాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిత్య పూజలు, ఉత్సవాలు, కైంకర్యాలు, పాలనా వ్యవహారాలు కొనసాగేలా చేయటం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన గుర్తు చేశారు. "ఇప్పుడు కూడా మా ప్రభుత్వం అలాగే పని చేయాలని కోరుకుంటున్నాం. ఆలయ పాలనా వ్యవస్థలో తగిన మార్పులు చేయటం ద్వారా ఆలయాల నిర్వహణ మెరుగుదలకి ఎలాంటి చర్యలు తీసుకోవాలీ అన్న అంశంపై మీ ఆలోచనలను సేకరించటం కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది" అని ముఖ్యమంత్రి వివరించారు.*

*సెక్రటేరియెట్‌లో సుమారుగా మూడున్నర గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో 20 మందికి పైగా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆలయాల ఆర్థిక వనరుల మెరుగుదలకు, ఆలయాల పరిసరాలలో పరిశుభ్రతకి, భక్తులకు మెరుగైన సదుపాయాలు అందించటానికి తీసుకోదగిన చర్యలు సూచించారు. ఈ ప్రసంగాలను శ్రద్ధగా వింటూ వచ్చిన ముఖ్యమంత్రి, పలుసార్లు వక్తల ప్రసంగాల మధ్యలో (వారు వ్యక్తం చేసిన భావాలపై) సందేహ నివృత్తి కోరుతూ వచ్చారు.*

*ఇంచుమించు ప్రతివక్తా - లోపభూయిష్టమైన ఆలయాల నిర్వహణ, నిధుల దుర్వినియోగం, ఆలయ మాన్యాల మీద ఆస్తిపాస్తుల మీద అల్పాదాయాలు మాత్రమే వస్తున్న దుస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రసంగించారు. వేలాది ఎకరాల మాన్యాలుండి కూడా అనేక ఆలయాలు కనీస ఆదాయం కూడా లేకపోవటంతో రోజుకి ఒక్కసారి కూడా ధూపదీప నైవేద్యాలు చేయలేని పరిస్థితి, సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితి కొనసాగుతుండటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.*

*భక్తులు పాల్గొనే వివిధ సేవలలో మంత్రాలను సంస్కృతంలో కాక తమిళంలో పఠించాలనీ, అందువల్ల భక్తులకు ఆధ్యాత్మికమైన సంతృప్తి పెరుగుతుందనీ కూడా పలువురు వక్తలు వాదించారు. అయితే, అదే సమయంలో నిర్దిష్ట విధానాలకు, ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా మాత్రం ఏమీ జరగరాదని కూడా వారు నొక్కి చెప్పారు. అర్చకులు, పూజారులు, ఒధువార్లకు (Odhuvars) శిక్షణా సదుపాయాలు మెరుగు పర్చాలని వారు కోరారు.*



***(నోట్ : ఈ అయిదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను సందర్శించి వివిధ సంస్థల ప్రతినిధులతో పాటు అసంఖ్యాక ప్రజల భావాలను సేకరించింది. ఈ కమిటీ రూపొందించిన ప్రశ్నా పత్రానికి జవాబులను కూడా ఈ కమిటీ రాబట్టుకుంది. నిర్ణీత కాల వ్యవధిలోపల (1989 ఆగస్టులో) తన నివేదికను ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది.... కాని.... ఈ నివేదిక ఇంతవరకు వెలుగు చూడలేదు!)***

1990లో తమిళనాడులో డి.ఎం.కె. ప్రభుత్వం బర్తరఫ్ చేయబడింది. జూన్ 1991లో తాజాగా ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో మరోసారి ఆలయాల నిర్వహణ ప్రధానాంశంగా మారింది. జయలలిత నేతృత్వంలోని అఖిలభారత అణ్ణా డి.ఎం.కె. తన ఎన్నికల ప్రణాళికలో హిందూ దేవాదాయ ధర్మాదాయ సంస్థను ఏర్పాటు చేస్తామనీ, ఇది ప్రభుత్వ అనుబంధ శాఖగా కాక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా వుంటుందనీ పేర్కొంది...

ఆ ఎన్నికలలో ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. అధికారంలోకి వచ్చింది. 1991 జూలై 4న అసెంబ్లీలో మాట్లాడుతూ, ఆలయాల సక్రమ, సమర్థ నిర్వహణ కోసం ఒక ప్రత్యేక ఆలయ నిర్వహణా మండలిని ఏర్పాటు చేస్తున్నట్లు గవర్నరు ప్రకటించారు. తదనుగుణంగా, హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టం సవరణకి 1992 మార్చి 13న ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సవరణ ద్వారా ఆలయ నిర్వహణా మండలిని ఏర్పాటు చేయాలనీ, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వం సంకల్పించింది... ఆ ప్రయత్నాలు ఫలించి, మొట్టమొదటి సారిగా తమిళనాడులో ఆలయాల పవిత్రతను కాపాడటం, నిర్వహణను క్రమబద్ధం చేయటం, సేవలు మెరుగు పర్చటం, ఆలయాలు తదితర మత సంస్థలను అభివృద్ధి చేయటం వగైరా లక్ష్యాలతో ఈ బోర్డు అవతరించింది.

'ముఖ్యమంత్రి ఆలయ పునరుద్ధరణ, నిర్వహణనిధి'ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమిళనాడులోని అన్ని ప్రాంతాల నుండి భావసారూప్యం గల ప్రజలంతా ఈ నిధికి విరివిగా విరాళాలిచ్చారు. 1992 మార్చి 10 నాటికి ఈ నిధి రూ. 3.51 కోట్లకు చేరుకుంది. ఆలయ వ్యవస్థ పట్ల ప్రజలకు గల అపారమైన గురి, విశ్వాసాలకు, ఈ ఆధ్యాత్మిక కేంద్రాలను కాపాడుకోవాలీ, అభివృద్ధి చేసుకోవాలీ అన్న వారి తపనకు ఈ పరిణామాలు దర్పణం పడుతున్నాయి.

***... అంటే, 1971లో జరిగిన హిందూ దేవాదాయ ధర్మాదాయ (ప్రధాన) చట్టం సవరణ ఎన్ని రకాల చిక్కుముడులను సృష్టించిందో, ఎన్ని మలుపులు తిరిగిందో, రాజకీయ చరిత్రను ఎలా మలుపు తిప్పిందో - పై సంఘటనల నుంచి మనకు అర్థమవుతోంది.***

***తమిళనాడు కథ ఇలా కళ్ళకు కట్టినట్లుగా కనుపిస్తుంటే, 1971 నాటి తమిళనాడు చట్టం సవరణ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ చట్టంలో మార్పులు తేవాలని సిఫార్సు చేసిన చల్లా కొండయ్య***

***కమిషన్‌కి మాత్రం - తమిళనాడులో 1971 సవరణ సృష్టించిన సంచలనం, సంక్షోభం, రాజకీయ దుమారం అస్సలు కనబడనేలేదు. 1971 సవరణ చట్టం అమలు చేయటం అసాధ్యంగా తయారైందని గానీ, ఆలయాల దురవస్థ తమిళనాడులో "నానాటికీ తీసికట్టు నాగంబొట్లు"గా తయారైందని గానీ, ప్రతీ రాజకీయ పార్టీ తమ తమ ఎన్నికల ప్రణాళికలలో ఆ 'తప్పు' సరిచేసుకోవడం కోసం కొత్త హామీలను గుప్పించాల్సి వచ్చినంత ప్రజా ఉద్యమం ఆవిర్భవించిందని గానీ- చల్లా కొండయ్య కమిషన్ తన నివేదికలో ఎక్కడా నామ మాత్రపు ప్రస్తావన కూడా చేయలేదు!!!***

1972 నాటి సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా, 1971 సవరణ చట్టం ఆచరణ సాధ్యం కాదని తమిళనాడు ప్రభుత్వానికి అర్ధమైపోయింది. ఇవ్వాళ్టి వరకూ అది అమలు కాలేదు.... 1971 సవరణ చట్టం అమలు జరగని నేపథ్యంలో తమిళనాడు ఆలయాలలో అర్చకులను ఎలా నియమిస్తున్నారు - వంశ పారంపర్య హక్కు ఆధారంగానా? యోగ్యతను బట్టి బయట నుండి ఎంపిక చేసి తీసుకువస్తున్నారా? కుల, వర్ణ వివక్షతా రహితంగా చేస్తున్నారా?... ఇలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని గానీ, పట్టించుకోవాలని గానీ, సిఫార్సులు చేసేముందు తమిళనాడులోని వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలని గానీ చల్లా కొండయ్య కమిషన్‌కి అనిపించకపోవటం విచిత్రం!

అర్చకుల నియామకం అనువంశిక హక్కు కానఖ్ఖర్లేదని 1972లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చాక తమిళనాడులోని అర్చకుల ఆదాయాల పరిస్థితి ఏమిటి? నెలవారీ జీతాల మీద బ్రతుకుతున్నారా? ఆలయ ఆర్జిత సేవలలో వచ్చే వాటాల మీద జీవిస్తున్నారా? వారి బ్రతుకుతెరువు ఇప్పుడెలా వుంది?.... ఇలాంటి అంశాల గురించి కూడా చల్లా కొండయ్య కమిషన్ తన నివేదికలో ఇసుమంతైనా ప్రస్తావించలేదు.

అయినప్పటికీ, కేవలం ఆ కమిషన్‌కి ఒక హైకోర్టు పూర్వపు ప్రధాన న్యాయమూర్తి ఛైర్మన్‌గా వున్నారు కనుక ఆ కమిషన్ నివేదికని అప్పటి ప్రభుత్వం గుడ్డిగా ఆమోదించింది. తమిళనాడు పరిణామాలు సహా ఆలయాల నిర్వహణకి అన్ని అంశాలను ఈ కమిషన్ పరిగణనలోకి తీసుకుని పరిశీలించిందన్న నమ్మకంతో అప్పటి ప్రభుత్వం ఈ బిలుని - సెలెక్ట్ కమిటీకి కూడా పంపకుండా - యధాతథంగా హుటాహుటిన చట్టంగా చేయటానికి నడుంకట్టింది.

***(1995 ఆగష్టు 14న అప్పటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు ఈ రచయితతో మాట్లాడుతూ, తనను కమిషన్ తప్పుదోవ పట్టించిందనీ, నమ్మకద్రోహం చేసిందనీ వాపోయారు.)***

* * * * *

**1990**లో ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్స్ శాఖకి చెందిన అధికారుల బృందం ఒకటి తమిళనాడులోని ఆలయాలు, మత సంస్థల నిర్వహణ తీరుతెన్నుల్ని అధ్యయనం చేసి వచ్చింది. తమ అధ్యయన ఫలితాలను ప్రభుత్వానికి వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో కూడా 1987 నాటి



చట్టం ఆచరణ సాధ్యమైంది కాదు" అని తేల్చింది.

ఎండోమెంట్ శాఖాధికారుల సమావేశంలో ఈ బృందం సభ్యులు మాట్లాడుతూ, 1987 నాటి చట్టాన్ని సమగ్రంగా సమీక్షించాలని సిఫార్సు చేశారు.

మేం (ఈ గ్రంథ రచయిత ప్రభృతులు) కూడా ఈ చట్టం వాస్తవ పరిస్థితి గురించి ప్రభుత్వంతో జరిగిన మా చర్చలలో వివరించాం... నిజానికి, ఈ చట్టాన్ని సమీక్షించాలని ప్రభుత్వం కూడా నిర్ణయించింది. చివరికి సుప్రీంకోర్టు ముందు కూడా 1993 లో ఇదే విషయం ప్రభుత్వం తరపున వ్యక్తం చేయబడింది.

ఇదే విషయాన్ని ఎండోమెంట్స్ కమీషనరు కూడా వేరొక పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

తమిళనాడులోని ఆలయాల నిర్వహణ అధ్యయనం జరిగిన నేపథ్యంలో - ఆంధ్రప్రదేశ్ ఆలయాలలో అర్చకులకు లభిస్తున్న పారితోషికాలు, వారి ఇతర సాధక బాధకాల అధ్యయనానికి ఎండోమెంట్స్ కమీషనర్ నియమించిన కమిటీ నివేదిక సారాంశాన్ని ఇక్కడ ప్రస్తావించి తీరాలి:

".... గ్రామీణ ప్రాంతాలలో వుండే ఆలయాలలోని అర్చకులు, ఇతర సేవకుల దైన్య స్థితి గురించి వివరించడం అవసరం. ముఖ్యంగా, ఎక్కడైతే ఆలయాలకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవో, వున్నా వాటి మీద ఆదాయం అల్పంగా వుందో, మాన్యాలు స్వార్థ పరుల చేతుల్లో ఇరుక్కుపోయాయో - అలాంటి చోట్ల అర్చకుల పరిస్థితి దీనాతి దీనంగా వుంది.... కొన్ని చోట్ల, నిత్య ధూపదీప నైవేద్యాలు స్తంభించిపోయాయి. ఆలయాలు క్రమంగా శిధిలావస్థకి చేరుకుంటున్నాయి... పొరుగు రాష్ట్రాలలోని ఆలయాల్లో అర్చకుల దుస్థితి వర్ణనాతీతం. రెండు పూటలా తిండి కూడా దొరకని దైన్య స్థితిలో ఆలయ ఉద్యోగులు గడుపుతున్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (1992 జనవరి 30)లో - అర్చకుల దుస్థితి గురించి ప్రచురితమైనదంతా వాస్తవమే. కొన్ని ఆలయాలలో చీకటి పడ్డాక నూనె దీపాలు వెలిగించటానికి తైలం కూడా లేకుండా పోయింది.... ఆంధ్రప్రదేశ్‌లో సయితం ఈ ఘోరకలిని వీక్షించటానికి ఎక్కువకాలం పట్టకపోవచ్చు. అందువల్ల ఆలయాలను కాపాడటానికి, ఆలయాలలో నిరాటంకంగా నిత్య దేవతారాధన కొనసాగటానికి - అవసరమైన వనరుల్ని సమకూర్చాలి, అర్చకులకు ఆర్థికంగా కనీస వెసులుబాటుని కల్పించాలి..."

1992లో ఈ కమిటీ చేసిన ఊహాగానాలు 2003 నాటికి వాస్తవ రూపం ధరించాయి.

పర్యవసానం?...

రాష్ట్రంలో 32,000 ఆలయాలు క్రమంగా శిధిలావస్థకి చేరుకుంటున్నాయి.

* * * * *

# కోర్టు తీర్పుల విశ్లేషణ

**సు**ప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పులలో ఈ క్రింది అంశాలకు సంబంధించిన ముఖ్యాంశాలు పరిశీలనార్హమైనవి.

1. చట్టంలోని సెక్షన్ 76
2. ధర్మకర్తల వంశపారంపర్య హక్కుల రద్దు
3. మఠాధిపతుల నామినేషన్ విధానం
4. అనువంశిక అర్చకత్వం రద్దు

**చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సులు, తమిళనాడు (చేదు) అనుభవాల నేపథ్యంలో - ఈ సుప్రీంకోర్టు తీర్పుల వల్ల ఉత్పన్నమైన పరిణామాలేమిటో విశ్లేషిద్దాం :**

సెక్షన్ 76ని చెల్లకుండా చేయటంతో - ఆ చట్టంలో 1987లో ఉద్దేశించిన స్ఫూర్తి పూర్తిగా దెబ్బతినిపోయింది. దీనికితోడు, 82(1), 82(2) సెక్షన్‌లకు కూడా విలువ లేకుండా పోవటంతో, ఆలయాలన్నీ తమ మాన్యాల్ని నష్టపోయే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది.

ఆలయ భూములు మూడు రకాలు :

1. కౌలుకివ్వబడిన భూములు

2. వివిధ సేవల క్రింద మంజూరైన ఇనాములుగా చెప్పబడుతూ, తర్వాత కాలంలో ఆయా సేవల సిబ్బందికి పట్టాలు మంజూరు కాబడిన భూములు

3. ఆలయం పేరు మీదే వున్నప్పటికీ, అర్చకుల సేవలకు పారితోషికంగా అర్చకులు అనుభవిస్తున్న భూములు.

సెక్షన్‌లు 76, 82(1), 82(2) రద్దు కావటంతో, పై మొదటి రెండు రకాల భూములకి నూకలు చెల్లిపోయాయి. ఇక, వంశపారంపర్య అర్చకత్వ హక్కులు రద్దవటంతో, ఆలయ భూముల అజమాయిషీ అర్చకుల నుండి తిరిగి ఆలయాలకు బదిలీ అవుతుందా అన్న సందేహం మొలకెత్తింది. నిజానికి అర్చకుల కుటుంబాలు అనేక దశాబ్దాలుగా, కొన్ని కేసులలో అనేక శతాబ్దాలుగా (తరతరాలుగా) ఆ భూముల మీద అజమాయిషీ చేస్తూ వస్తున్నారు. కాబట్టి, మహా అయితే వాళ్ళని ఆ భూములకు కౌలుదారులుగా పరిగణించవచ్చు.

ఈ సందర్భంలో - 1954లో మద్రాసు హైకోర్టు వెలువరించిన ఒక తీర్పులో వ్యాఖ్యలు గమనార్హం :

**"…. ఈ ఆలయాలు, ధార్మిక సంస్థలు ఇంకా మనగలుగుతున్నాయంటే అందుక్కారణం - వాటి స్థాపకులు ఆయా ఆలయాలలో, సంస్థలలో నిత్య సేవలు, పూజలు జరగటం కోసం, అర్చకులు తదితర సేవకులకు జరుగుబాటు వుండేలా చేయటం కోసం శాశ్వత ప్రాతిపదికన ఆర్థిక వనరులు ఏర్పాటు చేసి వుండటం. అంటే, అక్కడ ఈ 'గ్రాంట్లు' అనే వాటిని పై రెండు ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన వనరులుగా నిర్వచించి తీరాలి. ఎందుకంటే ఆ రోజుల్లో (వందలాది సంవత్సరాల క్రితం) ఈ ఆలయాల్లో సేవల కోసం, అర్చకుల వేతనాల కోసం నెలనెలా డబ్బు పంపిణీ చేయటానికి తగిన వ్యవస్థ ఏదీ అమల్లో లేదు. అప్పట్లో సాధ్యపడే విషయం కూడా కాదు. ఈ వాస్తవ పరిస్థితి దృష్టిలో వుంచుకునే, అప్పటి స్థాపకులు, వదాన్యులు శాశ్వతంగా ఆదాయం లభించేలా ఆయా సంస్థలకు, ఆలయాలకు భూముల్నే 'గ్రాంట్లు'గా ఇచ్చారు - ఒకవేళ, అర్చకులకు వేరే జీతాల పంపిణీ, ఆలయాల నిర్వహణకి విడిగా నిధుల ఏర్పాటు జరిగి వుంటే, ఏనాడో అర్చకులు ఈ ఆలయాల్ని, గ్రామాల్ని వదిలేసి వలస వెళ్ళిపోయి వుండేవారు, దాంతో ఆలయ వ్యవస్థ కూడా కాలక్రమేణా కనుమరుగైపోయేది. కాని అలాకాక, ఆలయ భూముల అజమాయిషీ అర్చకుల కుటుంబాల చేతుల్లో వుండటం వల్లనే, వారి కుటుంబాలు ఆయా ఆలయాలనే అంటిపెట్టుకుని ఆ గ్రామాల్లోనే కొనసాగుతూ వచ్చారు. గ్రామాన్ని (ఆలయాల్ని) వదిలేసి వెళితే ఆ భూములపై ఆదాయం మీద తమ హక్కుని వాళ్ళు కోల్పోవాల్సి వచ్చేది. అలా ఆలయ భూములు వాళ్ళ ఆధీనంలోనే కొనసాగుతుండటం వల్ల, వాళ్ళ కుటుంబాల్లో కనీసం ఒక్కరైనా (అర్చక విధులను అనునిత్యం తు.చ. తప్పకుండా నిర్వర్తించేవాళ్ళు) ఆలయాన్ని అంటిపెట్టుకుని వుండటం తప్పనిసరి అయింది…"**

1965లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక మహాసభ - జాయింట్ సెలెక్ట్ కమిటీకి సమర్పించిన వినతిపత్రంలో తమ అజమాయిషీలోగల గ్రాంట్లు (మాన్యాలు) కేవలం తమ ఆలయ సేవలతో ముడిపడి వున్న గ్రాంట్లే అని నిరూపించుకోగల ధృవపత్రాలు దాఖలు చేయటం దుస్సాధ్యమైన విషయం - అని పేర్కొంది. అయితే, అదే సమయంలో - కొన్ని వందల, వేల సంవత్సరాల తరువాత ఇప్పుడు ఆ భూముల అజమాయిషీ నుండి తమని తప్పించటం, తద్వారా తమ జీవన భృతిని, ఆలయాలలో నిత్య దేవతార్చన ఖర్చుని కోల్పోయేలా చేయటం "అన్యాయం, అక్రమం" అని కూడా సెలెక్ట్ కమిటీ ముందు అర్చకులు వాపోయారు.

మరి ఇదే దేవుడిమాన్యాల విషయంలో చల్లా కొండయ్య కమిషన్ 1987లో ఏం చెప్పిందో చూడండి :

"… ఈ దేవాలయ, వితరణ సంస్థలన్నీ భూములు కలిగి వున్నవి కావు. చట్టంలోని సెక్షన్-6 క్రింద గుర్తించబడిన ఆలయాలు 31,937. వీటిల్లో - ఆంధ్ర ప్రాంతంలోని 5,330 ఆలయాలకు, తెలంగాణ ప్రాంతంలోని 4,467 ఆలయాలకు మాత్రమే వ్యవసాయ భూములున్నాయి. మొత్తం 216 మఠాలకూ కూడా భూములున్నాయి. మిగతా ఆలయాలకు ఎలాంటి దేవాదాయ

వనరులూ లేవు. ఈ ఆలయాలన్నీ భక్తులిచ్చే హుండీ విరాళాలతోనూ, ఆర్జిత సేవల మీద వచ్చే ఆదాయంతోనూ నిర్వహించబడుతున్నాయి...” (ప్రకరణం-1లో 32వ పేజీ)

**మూడు కీలకాంశాలు :**

1. వంశపారంపర్య ధర్మకర్తల హక్కుల రద్దు విషయంలో - సుప్రీం కోర్టు మాత్రం స్థాపక ధర్మకర్తల వాదాన్ని సమర్థించింది. వాళ్ళకి మరింత చేయూతనివ్వాలని అభిలషించింది. ఈ విషయంలో సంబంధిత సెక్షన్‌కి ప్రత్యేకంగా జోడించబడిన షరతుకి లోబడి మాత్రమే వంశపారంపర్య ధర్మకర్తృత్వం రద్దు ఆమోదించదగిందిగా సుప్రీంకోర్టు భావించింది. ఫలితంగా, సుప్రీంకోర్టు ఆదేశించిన విధంగా ఆ షరతుని అమలు చేయటానికి అనువుగా ఆ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించాల్సి వుంది.
2. మఠాధిపతుల నియామకం ప్రతిపాదనలకు సంబంధించి, 1988 నాటి మఠాల రూల్సులోని మూడవ రూలుకి కొన్ని చేర్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ ఆధారంగా సెక్షన్ 54ని సమర్థించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. (మరి, సెక్షన్ 54లోని ఆ చేర్పుల్ని శాసనసభా సంఘం కమిటీ ఆమోదించిందో లేదో మనకి తెలీదు.) ఇప్పుడు శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి మఠాధిపతి నియామకం విషయంలో వివాదం చెలరేగిన సందర్భంగా సెక్షన్ 54లోని ఈ ‘చేర్పు’కి చాలా ప్రాధాన్యత చేకూరింది.
3. ఇక ‘వంశపారంపర్య అర్చకత్వ హక్కుల రద్దు’ కేసు విషయంలో - ఆ అంశాన్ని సుప్రీంకోర్టు కూలంకషంగా చర్చించింది. అర్చకుల కేసు తాలూకు తీర్పులోని 129వ పేరా ఈ సమస్య విషయంలో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం :

## పేరా 129

ఆ తరువాత (భాగాలను) కలిపి చదివినట్లయితే అవన్నీ ఇప్పటివరకూ అమల్లోవున్న ఆచారాలు, విధానాలు, అర్చకత్వ రూపాలు, ఉత్సవాలు, సేవలు వగయిరాల ఉనికిని ఆయా సంస్థలలో పాటించబడుతున్న సాంప్రదాయాలు, ఆగమాలకు అనుగుణంగా కాపాడుతున్నాయి. అలాంటి ఆచార వ్యవహారాలలో అధికారుల జోక్యాన్ని సెక్షన్ 142 నిరోధిస్తోంది. అంతమాత్రాన చట్టంలోని సెక్షన్ 34 (1) (బి) క్రింద రద్దు చేయబడిన అంశాలు పునరుద్ధరించబడినట్లుకాదు.

సాంప్రదాయం, ఆనవాయితీల ఆధారంలో ఒకవ్యక్తి (ఆలయసేవలో) ఒక పద్ధతిలో వంశపారంపర్యత్వం ఆధారంగా కొనసాగటాన్ని రద్దు చేయటం ఒక ఎత్తు. ఆలయంలో ఉత్సవాలు, కైంకర్యాలు, సేవలు వగయిరాలు మరోఎత్తు. రెండింటినీ ముడివేసి చూడలేం. రెండూ వేర్వేరు అంశాలు. దేని లక్షణం దానిదే. కనుక, ఆచారాలు, ఆనవాయితీల ఆధారంగా



ఆ పోస్టులో ఆ వ్యక్తి కొనసాగే హక్కు దానికదే కొనసాగుతుందని పిటీషనర్లు చేసిన వాదనను అంగీకరించటం అసంబద్ధం అవుతుంది.

పిటీషనర్ల మరో వాదన ఏమిటంటే - సెక్షన్ 2(23)లో ఉదహరించిన మత సంస్థలలో ఆచారాలు, ఆనవాయితీలతో ముడిపడి వున్న అంశాలలో జోక్యం చేసుకోవటం అనేది వ్యక్తుల అంతఃకరణ (వ్యవహారాల్లో)లతోనూ, మత స్వేచ్ఛతోనూ జోక్యం చేసుకోవటమే అవుతుంది. ఆ రకంగా 25(1) అధికరణను ఉల్లంఘించినట్లవుతుంది. ఆ చర్య చట్టబద్ధత లేనిది అవుతుందని కూడా వాదించారు.

అయితే ఇంతకుముందే చెప్పినట్లుగా, అవన్నీ సెక్యులర్ చర్యలు కనుక అవి మతంలోగానీ, మత వ్యవహారాల్లోగానీ భాగం కాదు.

## పేరా 130

మరో అభ్యంతరం ఏమిటంటే - ఆగమశాస్త్రంలో నిర్దేశించబడిన నిబంధనల ప్రకారం - ఆలయంలో సంబంధిత అర్చకుడికి మాత్రమే గర్భగుడిలో ప్రవేశించటానికి, మూలవిరాట్‌ని తాకటానికి అధికారం వుంటుంది. మరో వ్యక్తి ఎవరన్నా విగ్రహాన్ని తాకటమంటే దాన్ని మైలపరచటమే అవుతుంది.

అంటే, అర్చక కుటుంబానికి, ఆ వంశానికి, ఆ శాఖకి చెందిన వ్యక్తికి మాత్రమే ఆలయంలో నిత్య పూజలు గానీ, ఉత్సవాలు గానీ నిర్వహించే అధికారం వుంటుంది, కనుక వంశపారంపర్య అర్చకత్వం రద్దు చేయటమంటే, 25(1)వ అధికరణకి విరుద్ధంగా మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటమే అవుతుంది.

ఒకరకంగా, వినటానికి ఈ వాదన ఆకర్షణీయంగానే వుంది. అయితే, (పిటీషనర్‌ల న్యాయవాది) శ్రీ పరాశరన్ గారిని మేం ఒక ప్రశ్న అడిగాం. విద్యావకాశాలు పెరిగాయి. పిల్లలకు తమకిష్టమైన రంగంలో ఉన్నత విద్యనభ్యసించే స్వేచ్ఛ పెరిగింది. అయినప్పుడు, ఒక అర్చక కుటుంబంలోని పిల్లలు పై చదువులు చదివి ఏ ఇతర దేశాలకో వెళ్ళిపోయి అక్కడే అధికాదాయం వచ్చే వృత్తిలో స్థిరపడటం జరిగితే, అదే పరిస్థితుల్లో ఆ అర్చక శాఖకి చెందిన తగినంత అర్హులైన వ్యక్తులెవరూ (అర్చకత్వ బాధ్యతను చేపట్టడానికి) లభించకపోతే, ఆ ఆలయంలో నిత్యపూజలు, ఉత్సవాల సంగతి ఏమిటి?

..... ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, పిటీషనర్‌ల న్యాయవాది తన జవాబులో - అలాంటి పరిస్థితి ఉత్పన్నమైనప్పుడు, ఆ సంస్థ యాజమాన్యం - వేరొక శాఖకి / ఉపశాఖకి చెందిన మరో తగిన వ్యక్తికోసం ప్రయత్నించవచ్చని అభిప్రాయపడ్డారు.

విద్యావకాశాలు విస్తరిస్తూండటం, మంచి ఆదాయాన్ని కల్పించగల వృత్తి విద్యలు అందుబాటులోకి వస్తూండటం వల్ల వైదిక కుటుంబాలలోని పిల్లలు - తమ తండ్రుల లాగానే తాము కూడా అర్చకత్వంలో కొనసాగటానికి ఇష్టపడకపోవచ్చు. వాళ్ళని ఎవరూ వత్తిడి చేయటానికి వీల్లేదు కూడా. అందుచేత, ఇక్కడ మనం ఆలోచించాల్సింది - అర్చకత్వం చేపట్టే అభ్యర్థి అదే కుటుంబం, అదే వంశం, అదే శాఖ వగైరాలకి చెంది వుండాలని కాదు, ఆగమ నిబంధనల ప్రకారం అర్హత కలిగినవాడు, ఆయా ఆలయ సాంప్రదాయ రీతులలో భక్తి, విశ్వాసం వున్నవాడు, ఆ ఆలయానికి తగిన ఆచారాలు, ఆనవాయితీల ప్రకారం సేవలు, పూజలు, ఉత్సవాలు నిర్వహించటంలో పరిజ్ఞానం గలవాడు అయివుండాలని. మరోరకంగా చెప్పాలంటే, ఆ ఆలయ సాంప్రదాయంలో, మతంలో, ఆచారాలలో, పూజా రీతులలో విశ్వాసం, సంబంధిత మూలవిరాట్‌కి తగిన రీతిలో ధూపదీప నైవేద్యాది సేవలు చేయగల పరిజ్ఞానం వుండటమే ఒక వ్యక్తి ఆ అర్చకత్వ బాధ్యతను చేపట్టడానికి అవసరమైన అర్హతలు అవుతాయి. ఈ లక్షణాలు కలిగివున్న వ్యక్తే - అర్చకత్వం పోస్టుకి లేదా అలాంటి మరోపోస్టుకి అర్హుడవుతాడు. అందుచేత, ఇలాంటి సెక్యులర్ కార్యక్రమ నిబంధన - ఏ రకంగా కూడా సంబంధిత అర్చక కుటుంబం నుండి కాక ఇతర శాఖ, లేదా కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి - ఆలయంలో (అర్చక) విధులను నిర్వహించటంలో చూపే విశ్వాసాన్ని ఏ రకంగానూ దెబ్బతీయదు.

గతంలో అయితే, ఒక అర్చకుడి నియామకం అనేది ఒకే ఒక్క కుటుంబానికో, వంశానికో, శాఖకో పరిమితమై వుండేది. కాని చట్టపరంగా వచ్చిన (కొత్త) నిబంధన ప్రకారం - ఇప్పుడీ అవకాశం విస్తృతమైంది. అదే కుటుంబానికి చెందినవాళ్ళు సహా అర్హులైన అభ్యర్థులందరూ పరిగణించబడతారు. వాళ్ళ సామర్థ్యం పరీక్షించబడుతుంది. వాళ్ళలో యోగ్యతగల వ్యక్తి లభించినప్పుడు, నిర్దిష్ట విధానం ప్రకారమే ఆ వ్యక్తి అర్చకుడిగా నియమించబడతాడు. కాబట్టి సెక్షన్ 34 క్రింద వంశపారంపర్య అర్చకత్వ విధానాన్ని రద్దు చేయటం - 25(1)వ అధికరణాన్ని గానీ, 26(బి) అధికరణాన్ని గానీ ఉల్లంఘించటం అవదని మేం అభిప్రాయపడుతున్నాం.''

* * * * *

**సు**ప్రీంకోర్టు తీర్పులోని పై పేరాలు ఆలోచింపచేసేవిగా వున్నాయి. ఈ పేరాలను విశ్లేషణాత్మక దృష్టితో మళ్ళీ మళ్ళీ చదివినప్పుడు, ఆయా అంశాల ప్రత్యేకత మనకు స్పష్టంగా అవగతమవుతుంది. ఆలయ సంస్కృతిని పరిరక్షించి తీరాలనే సుప్రీంకోర్టు భావిస్తోందని చెప్పటానికి ఈ క్రింది పేరాలు తార్కాణం :

### పేరా 111

''దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాంఘిక కార్యకలాపాలకు ఆలయం ఒక కేంద్ర స్థానంగా భాసిల్లుతోంది. ఆలయాన్ని మానవ శరీరంతో పోల్చవచ్చు. ఆలయ నిర్మాణంలో భాగాలకు కూడా మానవ శరీరంలో భాగాల లాగానే పేర్లు వున్నాయి. అంటే, అన్నీ కలిపి ఒకే భౌతిక రూపం (ఆలయం)గా స్పష్టమవుతుంది.

దేశంలో అధిక శాతం ప్రజలు - హిందూ దేవుళ్ళయిన విష్ణు, శివ, శక్తి, గణపతి, హనుమాన్‌లను ఆరాధిస్తున్నారు. ఈ విగ్రహారాధనలో అంతర్లీనంగా వున్న సిద్ధాంతం - ఆత్మ సాక్షాత్కార మార్గాలు నాలుగింటిలో ఒకటి.

దేవుడికి ప్రతిరోజూ జరగాల్సిన అర్చనాది సేవలన్నీ అతి ఖచ్చితంగా జరిగే అభిషేకం, వస్త్రాలంకరణ, నైవేద్యం, పవళింపు సేవలతో కూడివున్నాయి. ఆ కారణంగానే మన జీవితాలలో మతానికి ఒక విశిష్టమైన స్థానం, పాత్ర వున్నాయి.

అందుకే మతం అనేది మనుషుల్ని ఆలోచనల్లోనూ, మనుగడలోనూ ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళగల అత్యవసరమైన, శక్తివంతమైన అంశంగా హిందువులు విశ్వసిస్తారు. అర్చకుడనే వ్యక్తి - ఆగమ సూత్రాల ప్రకారం, నిర్దిష్ట పూజా రీతులలో, సాంప్రదాయబద్ధంగా ఆలయ సేవలు నిర్వహిస్తుంటాడు.''

* * * * *

**ఇ**ప్పటి వాస్తవం ఏమిటంటే - ఆధునిక విద్యావకాశాలు, సమాజంలో వస్తున్న సాంఘిక, ఆర్థిక పరిణామాల కారణంగా, అర్చకత్వాన్ని వారసత్వంగా స్వీకరించటం పట్ల కొత్తతరం వారిలో ఆసక్తి అంతగాలేదు. అనువంశికంగా అర్చకత్వ హక్కుల్ని అనుభవిస్తున్న కుటుంబాలలో సయితం ఇదే పరిస్థితి.

అయితే, ఈ పరిస్థితి కారణంగా అర్చకుల పరిణతి, పరిమాణం క్షీణించటం పట్లగానీ, ఆ పర్యవసానంగా ఆలయ దేవతారాధనలో పవిత్రత, స్వచ్ఛతలకు ఏర్పడగల ప్రమాదం పట్లగానీ (బాధ్యత వహించాల్సిన) సంబంధిత మఠాధిపతులకు చీమకుట్టినట్లయినా లేదు.

ఆగమ పాఠశాలలను ఆదర్శవంతంగా నడపాలనీ, విద్యార్థుల్ని విశేషంగా ఆకర్షించాలనీ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు చెప్పుకోదగినంతగా ఫలించలేదు.

ఇప్పుడు మన ముందున్న ప్రశ్న : ఈ దుస్థితిలో ఆలయాల్ని ఇలాగే మూతపడిపోనివ్వాలా? లేక వాటిని నిలబెట్టడానికి, బలోపేతం చేయటానికి ఏమన్నా చేయాలా?

ఈ విషయంలో ఆలయ సంస్కృతి పరిరక్షించాల్సిన ఆవశ్యకతపై సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుని సరైన దృక్పథంలో చూడాలి. 129, 130, 111 పేరాలను ఈ క్రింది పేరాలతో కలిపి చూడాలి :

## పేరా 96

'మత, వితరణ సంస్థల హిందూ చట్టం' మీద తానిచ్చిన 'ఠాగూర్ లా ప్రసంగాల'లో మొదటి పేజీలో న్యాయమూర్తి బి.కె.ముఖర్జీ ఇలా అన్నారు.

"హిందువులు పవిత్రంగా భావించే అన్ని అంశాలకు మూలాధారం, శక్తి - వేదాలే అయినప్పటికీ ఆధునిక కాలంలోని హిందూమతం - నిజమైన వేదకాలం నాటి హిందూ మతంకాదు. కాలానుగుణమైన పరిణామక్రమంలో హిందూ మతం అనేక మార్పులను చవి చూసింది. ఈ పరిణామాలు ఆయా కాలాల్లోని సాంఘిక వ్యవస్థను ప్రభావితం చేశాయి. తదనుగుణంగా సాంఘిక, మత సంస్థలలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి.

ఇలా కాలానుగుణంగా వచ్చిన మార్పులు ఏవైనప్పటికీ, కొన్ని కాలాల్లో అవి విప్లవాత్మక ధోరణి కలిగి వున్నాయన్న విషయంలో భేదాభిప్రాయం వుండదు. విప్లవాత్మక ధోరణి అనేది - హిందువుల మౌలిక, నైతిక, మత భావాలలో ప్రస్ఫుటమైంది. వితరణ సంస్థలు చాలా వరకు అలాగే వుండిపోయాయి. చివరికి ఇవ్వాళ మనం చూస్తున్న హిందూ సమాజం - వారి సాంస్కృతిక అభివృద్ధి తాలూకు విభిన్న మార్గాలలోంచి రూపాంతరం చెందుతూ వచ్చిన స్ఫూర్తి, స్వరూపంగా చెప్పవచ్చు"

(ఈ పై పేరాను, ఈ క్రింద ఉదహరించిన 76వ పేరాతో కలిపి చదవాల్సి వుంటుంది)

## పేరా 76

"వివిధ మతాలను, సంస్కృతిని అనుసరించే భారతీయులలో 'భిన్నత్వంలో ఏకత్వం' కనుపిస్తుంది. ఈ నేపథ్యంలో మానవ హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం, భావస్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలతో ఈ భారతీయులందరిని సమీకృత శక్తిగా రూపొందించటానికి (వారి వ్యక్తిగత గుర్తింపుని కాపాడుతూ) మతపరమైన ఆధ్యాత్మిక చింతన అనేది ఒక టంకంగా పనిచేస్తుంది.

1954 ఆగష్టు 28 నాడు 'సైన్స్, ప్రజాస్వామ్యం, మతం' అనే అంశంపై కలకత్తాలోని రామకృష్ణ మిషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కల్చర్‌లో ప్రసంగిస్తూ స్వామిరంగనాధనంద ఇలా అన్నారు : ***పారిశ్రామికీకరణ ఉధృతమవటంతో, శతాబ్దాల తరబడి చెక్కు చెదరకుండా వున్న మన భూస్వామ్య వ్యవస్థ బాగా దెబ్బతింటోంది. సాంఘిక చలనం పెరిగి, అది కుల వ్యవస్థ వంటి పురాతన సాంఘిక సంబంధ బాంధవ్యాలను చెదరగొడుతోంది. అంతే వేగంగా సాంఘిక కట్టుబాట్లు సయితం చెరిగిపోతున్నాయి. ఒక యుగ కాలంలో చెక్కు చెదరకుండా నిల్చివున్న విలువలు - మారుతున్న ఈ శక్తివంతమైన సమాజం అవసరాలకు ఏమాత్రం సరిపోవటంలేదు.***

ప్రతిచోటా సనాతన విలువలు, కట్టుబాట్లు, సాంఘిక ఆర్థిక సంబంధాలు కూలిపోతున్నాయి.



ఇదంతా పారిశ్రామికీకరణ ఆరంభంలో పరిస్థితి మాత్రమే. ఇలాంటి పరిణామ దశలో చూస్తూ వూరుకోవడం (ఈ సమస్యకి) పరిష్కారం కాదు.

అయితే భారతీయ ఆధ్యాత్మికత మాత్రం - ఈ ఆటుపోట్లనన్నింటినీ తట్టుకుని నిలబడింది. కారణం - భారత జాతీయ సంస్కృతి పునాదుల్లో ఈ దేశం నిలుపుకున్న మౌలిక ఆధ్యాత్మిక విలువల శక్తి. ఎలాంటి శుభాశుభాల్లో ఆచరించే వివిధ క్రియల్లో కూడా ఇదే విశ్వాసం చెదిరిపోకుండా కొనసాగుతూ వచ్చింది.

మానవుడు ప్రకృతిలోని రహస్యాలని ఒకటొకటిగా ఛేదించేలా సైన్సు అతడ్ని శక్తివంతుడ్ని చేసింది. తాను మనుగడ సాగిస్తున్న ప్రపంచం గురించిన విజ్ఞానాన్ని అతడు అపారంగా సముపార్జించేలా చేసింది.

***భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి ఆయన (స్వామి రంగనాధానంద) ఇలా అన్నారు: ఈ ప్రజాస్వామ్యం నిలబడుతుంది. అయితే భారతదేశం తన వారసత్వ సంస్కృతితో ఈ ప్రజాస్వామ్య విలువలని ఎలా అనుసంధానం చేస్తుంది? ఎలాగంటే - ప్రజాస్వామ్యానికి విశ్వజనీనమైన విలువ కలిగిన లక్షణం వుండాలి. అది - రాజకీయ, సాంఘిక, జాతీయ వాదాలకు అతీతమై వుండాలి. అదే - నైతిక, ఆధ్యాత్మిక సంపద.*** ఆ సంపదే (లక్షణం) లేకపోతే, మన ప్రజాస్వామ్యం - పాశ్చాత్యదేశాల్లోని ప్రజాస్వామ్యాలకు కార్బన్ కాపీ మాత్రమే అవుతుంది.

సైన్సు, ప్రజాస్వామ్యం అనేవి మానవ సంస్కృతి, నాగరికతల విస్తరణను, అభివృద్ధిని తీర్చిదిద్దుతున్నాయి. అయితే సైన్సు అభివృద్ధి చెందుతున్నకొద్దీ, దానితో పాటే మానవ సంస్కృతి, నాగరికత కూడా వృద్ధి చెందుతూండటంతో, వైజ్ఞానిక, రాజకీయాల ఉధృతం, శక్తీ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఇందువల్ల కొత్త ఉద్రేకాలు, అస్థిరత, అభద్రత ఉత్పన్నమవుతున్నాయి. అందుచేత జాతి - ఈ పరిస్థితిని అదుపు చేయటం ద్వారా అధికారంలో వున్నవారిలో అవినీతి పెరక్కుండా, అధిక శాతం ప్రజలకు హాని కలిగించగల అయోమయ పరిస్థితి ఏర్పడకుండా చేయాల్సివుంది. భారతదేశం సైన్సుకీ, ఆధ్యాత్మిక చింతనకీ మధ్య సౌహార్దాన్నీ, సహజీవన లక్షణాన్నీ సాధించటం ద్వారా మానవ విలువల్ని విస్తరింపచేసింది.

వేదాంత తత్త్వ జ్ఞానం వల్లనే భారతీయులు - సైన్సు వల్ల ఉత్పన్నమైన శక్తుల్ని ఇముడ్చుకోగలిగారు. ప్రాచీన, ఆధునిక యోగులు బోధించిన మానవుల ఆధ్యాత్మిక సమైక్యతని మనం స్వీకరించాలి. సాటి మానవుల ఆలోచనా విధానంలో, వారి దినచర్యలో దానిని ఉద్దీపింపజేయాలి. శక్తివంతమైన దాని ప్రభావాన్ని కొత్త రూపాలలో తలెత్తిన వైజ్ఞానిక, సాంఘిక శక్తుల మీద ప్రసరింపజేయాలి. తద్వారా, ఆ శక్తులకు ఒక ఉన్నత స్థాయి దిశా నిర్దేశాన్ని, విశాలమైన, ఆధ్యాత్మిక మానవతా లక్ష్యాలను కల్పించాలి.... ఇదే మతం యొక్క పరమార్థం. దీన్ని ప్రత్యేకంగా నొక్కి చెప్పాల్సి వుంది."

★ ★ ★ ★ ★

**సు**ప్రీంకోర్టు ఆరకంగా భారతీయ మత, సంస్కృతిల మూల సూత్రాలకీ, ఆధునిక కాలంలో మారుతూ వస్తున్న అవసరాలకీ మధ్య పొంతన కూర్చే ప్రయత్నం చేసింది. అదే సమయంలో, ఆలయ ఆరాధనా పవిత్రతను కూడా సమర్ధించింది.

కనుక ఇప్పుడు పరిష్కరింపబడాల్సిందల్లా సెక్షన్ 144.

## పేరా 133

"…. అనువంశిక మిరాసీదార్లు లేదా ఇతర ఉద్యోగులకు వంశపారంపర్యంగా ఆ పదవిలో కొనసాగే హక్కు వున్నంతకాలం వాళ్ళు చేస్తున్న సేవలకుగాను, మూల విరాట్‌కి లేదా ఇతర దేవతలకి నివేదించే ప్రసాదంలో, హుండీ కానుకలలో వాటా పొందే హక్కు కూడా వుంటోంది. ఈ సేవలు, కైంకర్యాలలో వాటా ఆయా ఆలయాలలో ఆనవాయితీలను బట్టి, లేదా యాజమాన్యానికి, ఆయా బాధ్యతలు నిర్వర్తించే వారికి మధ్యగల ఒప్పందాన్ని బట్టి వుంటుంది. ఎప్పుడైతే 'వంశపారంపర్య హక్కు' రద్దు అయిందో, దాంతో - సహజంగానే - ప్రసాదాలలో, ఇతర కానుకలలో వాటా కూడా స్తంభించిపోతుంది. వంశపారంపర్య హక్కు వల్ల కాకపోతే, ఆ కైంకర్యాలలో వాళ్ళకి మరేరకంగానూ వాటా పొందే హక్కు లేదు.

కాబట్టి వంశపారంపర్యహక్కు ఎప్పుడైతే రద్దయిపోయిందో, అంతవరకూ ఆ పదవిని అంటిపెట్టుకుని రివాజుగా వస్తూ వున్న వాటాలు కూడా సెక్షన్ 144 క్రింద రద్దయిపోతాయి. సెక్షన్ 34ని బట్టీ,సెక్షన్ 16లోని అలాంటి హక్కులను బట్టే సెక్షన్ 144 ఉనికిలోకి వస్తుంది. ఫలితంగా, ప్రసాదాలూ వగైరాలలో వాటా తీసుకునే హక్కు రద్దయిపోయింది. అక్కడ్నుంచి సంబంధిత అర్చకాది ఏ పోస్టుల్లో వున్న వారైనా వారు చేసే సేవలకు గాను, నిర్దిష్ట నిబంధనల మేరకు జీతం పొందటానికి అర్హులవుతారు. తత్ఫలితంగా (ఎప్పుడైతే జీతం పొందటానికి మాత్రమే అర్హులవుతారో) అంతవరకూ యాజమాన్యంతో ఒక ఒప్పందం ప్రకారం ప్రసాదాలలో, ఇతర కైంకర్యాలలో ఆనవాయితీగా వస్తున్న వాటాల హక్కు కూడా రద్దయిపోతుంది. వారందరి సేవలూ, నిర్దిష్ట నిబంధనలు ఎలా రూపొందించబడితే అలా చెల్లించబడే వేతనాలతో క్రమబద్ధం చేయబడతాయి."

★ ★ ★ ★ ★

**సు**ప్రీంకోర్టు ఇక్కడితో ఆగలేదు. రాజ్యాంగంలోని 142వ అధికరణ క్రింద దానికిగల అధికారాన్ని ఉపయోగించి, పరిపూర్ణ న్యాయం చేయటం కోసం ఈ సమస్యకి ఒక పరిష్కారాన్ని కూడా సుప్రీంకోర్టు అందించింది.

తెలంగాణా అర్చక సమాఖ్య తన పిటీషన్‌లో చేసిన ఒక వాదనను సుప్రీంకోర్టు ప్రస్తావించింది.



అనువంశిక అర్చకత్వాన్ని రద్దు చేసి, ఆలయాల వర్గీకరణ ప్రాతిపదికగా జీతాల చెల్లింపు విధానం ప్రవేశపెడితే, 24,440 చిన్న ఆలయాలలోని అర్చకులు, ఇతర ఉద్యోగులూ వాళ్ళ జీవనాధారాన్ని కోల్పోతారని అర్చక సమాఖ్య వాదించింది.

***సుప్రీంకోర్టు ఈ వాస్తవాన్ని గుర్తించటం వల్లనే, వివిధ ఆలయాలలో అర్చకుల వేతనాలను క్రమబద్ధీకరించటానికి, వారికి వేతనాలు చెల్లించటానికి తగిన విధానాలు రూపొందించటానికి ఒక కమిటీని ఏర్పాటు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం జరిగింది. ఆ రోజు అలా లిఖితపూర్వక వాదనను అర్చక సమాఖ్య దాఖలు చేసివుండకపోతే, సుప్రీంకోర్టు ఈ ఆదేశాలను జారీ చేసే అవకాశంలేదు. ఫలితంగా ఆలయాలకు పెనుముప్పు వాటిల్లి వుండేది.***

ఈ తీర్పులో కూడా సుప్రీంకోర్టు ఇలా చెప్పింది: "అర్చకుడి పోస్టులో లేదా మరే ఇతర పోస్టులోగానీ వంశపారంపర్య హక్కు ఆధారంగా నియామకాలు జరిపే విధానాన్ని రద్దు చేయటాన్ని మేం సమర్ధించినప్పటికీ, అర్చకుడు పరిపూర్ణమైన అంకితభావంతో ఆలయ అధి దేవతకి నిత్య ధూపదీపనైవేద్యాలను నిర్వహించాల్సి వుంటుందనీ, అలాగే అతనూ అతని కుటుంబమూ కనీస సదుపాయాలతో జీవించగల పరిస్థితి కల్పించబడాలనీ - వైఖానసాది శాఖల గ్రంథస్థ సమాచారం తెలియజేస్తోంది. అతని సేవలకోసం వుంచబడిన మాన్యాలు గానీ, కైంకర్యాల నుండి లభించే వాటాగానీ, చెల్లించబడే జీతాలు గానీ - అతని కుటుంబం కనీస సదుపాయాలతో జీవించటానికి ఉద్దేశించబడిన ఆధారంగా గుర్తించబడింది. …. మేం ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం తనకున్న మతాతీత అధికారాన్ని ఉపయోగించి అర్చకుల నియామకాన్ని క్రమబద్ధీకరిస్తోంది. అదే సమయంలో, అర్చకుడు దైనందిన అర్చనాది సేవలను ఏకాగ్రతతో, అంకితభావంతో ఆలయ దైవానికి అందించటానికి వీలుగా అతని కుటుంబానికి కనీస వసతి సదుపాయాలను కూడా ప్రభుత్వమే కల్పించాల్సివుంది.

…. ముందే చెప్పినట్లుగా అర్చకుల సర్వీసు నిబంధనలను, జీతనాతాలను, ఇతర భత్యాలను అక్కడ అతని విధులు, సేవలను ఆయా ఆలయాల శ్రేణిని బట్టి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాల్సి వుంది….

ఇదేకాక, ఆలయాన్ని అంటిపెట్టుకుని వున్న అర్చకులు, పండితులు ఇతర సేవకుల సాంఘిక సంక్షేమం కోసం దేవాదాయ శాఖ కమిషనర్ పర్యవేక్షణలో సంక్షేమ చర్యలను కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి వుంటుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించాలి. అర్చకులు, తదితర సేవకుల కుటుంబాలకు తగిన వసతి సదుపాయం, వారి పిల్లలకు విద్యావకాశాలు, స్వంత ఇళ్ళు నిర్మించుకోటానికి రుణాలు, ఒకవేళ ఆలయ ప్రాంగణంలోనే వసతి కల్పించే అవకాశం వుంటే సమంజసమైన అద్దెతో దానిని వారికి కేటాయించటం, గ్రూప్ ఇన్స్యూరెన్సు, అనుకోని అవాంతరాలు (ప్రమాదం, మరణం వగైరా)

సంభవించిన పక్షంలో విధవలైనవారికి పునరావాసం, వారి (విద్యావంతులైన) పిల్లలకు ఉపాధి అవకాశాలు వగయిరా సంక్షేమ చర్యలు కల్పించేలా ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టాలి. ఇప్పటికే ఇలాంటి సదుపాయాలు ఏవైనా అమలులో వుండి వుంటే, వాటిని ఈ పథకం నుండి మినహాయించి, మిగతా సంక్షేమ చర్యలను ప్రభుత్వం రూపొందించాల్సి వుంటుంది...."

***ఈ పథకం కనుక సుప్రీంకోర్టు ప్రతిపాదించిన విధంగా తు.చ. తప్పకుండా అమలు జరిగి వుంటే మన ఆలయాలు ఆరోగ్యవంతంగా మనగలుగుతాయన్న ఆశ వుండేది. కాని అలా జరగలేదు.***

*నిజానికి ఆలయాలను పరిరక్షించే బాధ్యత ఒక్క ప్రభుత్వానిది మాత్రమేనని భావించనక్కర్లేదు. మఠాధిపతులు, ఇతర హిందూ మత గురువులందరూ ఈ పథకం సక్రమంగా అమలు జరిగేలా చూడటం కోసం కృషి చేసి వుండాల్సింది. ప్రజల మతపరమైన మనోభావాలను దృష్టిలో వుంచుకుంటూ నాయకులు చొరవ తీసుకుని అధికార యంత్రాంగాన్ని ఈ పథకం అమలు చేసే విషయంలో సక్రమంగా నడిపించి వుండాల్సింది. కోర్టు తీర్పులకు భాష్యం చెప్పే బాధ్యతను (ఈ నాయకులు) పూర్తిగా అధికారులకు వదిలి వుండాల్సింది కాదు.*

దురదృష్టవశాత్తు, చల్లా కొండయ్య కమిషన్ నివేదికలో ఈ దూరదృష్టి కొరవడింది. సమస్యతో ముడిపడి వున్న వాస్తవ దృక్పథం లోపించింది. చివరికి ఈ లోపాన్ని సరిచేయటానికి సుప్రీంకోర్టు ప్రయత్నించాల్సి వచ్చింది. అయినప్పటికీ, సుప్రీంకోర్టు జారీ చేసిన సానుకూల ఆదేశాలను అమలు చేసే విషయంలో ప్రభుత్వం కూడా విఫలమైంది. పర్యవసానం? వేలాది దేవాలయాలు అధోగతిపాలయ్యే దుస్థితి ఉత్పన్నమైంది.

★ ★ ★ ★ ★

**ఇ**లా 1987 నాటి చట్టం అమలు చేయటం వల్ల గానీ, సుప్రీంకోర్టు తీర్పు వల్లగానీ ఉత్పన్నమవుతున్న అన్ని రకాల చిక్కుముడులను ఇప్పటిదాకా విశ్లేషించాం. అయితే ఈ విశ్లేషణలోంచి జనించే సారాంశం ఏమిటో చూద్దాం :

1. వితరణ సంస్థల నిర్వహణలో ప్రభుత్వం, దేవాదాయ శాఖల కనీస ప్రమేయం వుండాలని చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సు చేసింది. 15 నుండి 36 వరకూ గల సెక్షన్‌లలో 'వితరణ సంస్థలు' ... అని వున్న పదాల్ని - ఒక్క సెక్షన్ 15 (7)లో తప్ప మిగతా - అన్ని సెక్షన్‌లలోనూ తొలగించాలని కూడా ఈ కమిషన్ ప్రతిపాదించింది.
2. వితరణ సంస్థలను ఏర్పాటు చేసినవారు మాత్రమే వితరణ అధికారాన్ని కలిగి వుంటారు. ఎందుకంటే వాళ్ళు ఎవరిదగ్గరా విరాళాలు తీసుకుని ఈ సంస్థలు ఏర్పాటు చేయలేదు. తమ సొంత నిధులతో ఈ సంస్థల్ని సృష్టించారు. ఈ ట్రస్టుల లబ్ధిదారులు ప్రజలు.



ఆలయాలు, ధార్మిక సంస్థల ఏర్పాటు విషయంలో ఈ వితరణశీలతను ఆ దాతలు ఒక మతపరమైన సామాజిక బాధ్యతగా భావించారు. ఈ ట్రస్టుల్ని తమ తదనంతర వారసులు నిర్వహించాలని వీలునామా వ్రాసేటప్పుడు వాటిల్లో, వారు తమ లక్ష్యాన్ని నొక్కి చెప్పారు. వారి కోరిక ప్రకారం - వారి తదనంతర వారసులు కూడా ఈ ట్రస్టుల నిర్వహణ బాధ్యతలో భాగం పంచుకోవాలి. తమలాగే వారు కూడా వితరణ భారాన్ని స్వీకరించాలి. తద్వారా ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని పొందాలి.

ఇలాంటి ట్రస్టులన్నీ సజావుగానే నిర్వహించబడుతున్నాయని కమిషన్ గుర్తించింది. ట్రస్టుల నిర్వహణ ఎలా వుండాలి - అన్న విషయంలో ట్రస్టుల నిర్మాణ పత్రాలే మార్గదర్శక పత్రం కావాలని కూడా చల్లా కొండయ్య కమిషన్ అభిప్రాయపడింది. ఈ విషయంలో కమిషన్ ఇలా చెప్పింది :

"ఆయా సంస్థల నిర్వహణకు మార్గదర్శక సూత్రాలను నిర్దేశించే ట్రస్టు నిర్మాణ పత్రాలు సెక్షన్ 36 ప్రకారం ఒక నిర్దిష్ట కార్యక్రమంగా అభివర్ణించబడుతున్నాయి. అందువల్ల, ఈ వితరణ సంస్థల ట్రస్టుల నిర్వహణ విషయంలో ఛాప్టర్-3లోని సూత్రావళి వర్తిస్తుంది. అయితే, సెక్షన్ 36లో ఉదహరించిన 'నిర్దిష్ట కార్యక్రమాన్ని' కోర్టు ఆదేశించిన కార్యక్రమంగా పరిగణించాలని ఆ సెక్షన్‌లో స్పష్టం చేయబడింది. అందువల్ల, ఆయా సంస్థల నిర్వహణకి కోర్టు రూపొందించిన కార్యక్రమం ఏదీలేని పక్షంలో ట్రస్టు నిర్మాణ పత్రాలే సంస్థ నిర్వహణని నియంత్రిస్తాయి."

3. అయితే చల్లా కొండయ్య కమిషన్ నివేదికలోని ఈ భాగాన్ని అప్పటి (1987 నాటి) ప్రభుత్వం అమలు చేయలేదు. ఫలితంగా 1987 చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి వితరణ సంస్థలేవీ ఆంధ్రప్రదేశ్‌లో నమోదు కావటంలేదు. అంటే, ఈ చట్టం పర్యవసానంగా రాష్ట్రంలో భవిష్యత్‌లో కొత్తగా వితరణ సంస్థలు ఉద్భవించే అవకాశాన్ని ఈ రాష్ట్ర ప్రజలు పోగొట్టుకున్నారు.

   ఈ వాస్తవ పరిస్థితిని గుర్తించే సుప్రీంకోర్టు ఇలా పేర్కొంది :

   "ధార్మిక సంస్థల స్థాపకుడు గానీ ఆయన కుటుంబ సభ్యులు గానీ సక్రమమైన, సమర్థవంతమైన, క్రియాశీలకమైన పాలనా, నిర్వహణా విధానంతో ఆయా ఆలయాల్ని లేదా ధార్మిక సంస్థల్ని నిర్వహించిన పక్షంలో అలాంటి మరిన్ని సంస్థలు ఉద్భవించటానికి అది ఒక ప్రోత్సాహకం కాగలదు...."

4. ఈ సందర్భంలో ఒక విషయం గమనార్హం. 1962 నుండీ నిజాం ఛారిటబుల్ ట్రస్టు మాత్రం ఒక ప్రత్యేక సంస్థగా పరిగణించబడుతూ, 1987 నాటి చట్టం నుండి, ఇంకా

అంతకుముందున్న చట్టాల పరిధి నుండి మినహాయించబడింది.

నిజానికి రాష్ట్ర ప్రభుత్వానికీ, నిజాం ట్రస్టు ధర్మకర్తలకూ మధ్య కుదిరిన అవగాహన ప్రకారం 1966 నాటి చట్టం (17/1966) పరిధిలోకి నిజాం ఛారిటబుల్ ట్రస్టుని తీసుకురావలసి వుంది. కాని ట్రస్టు నిర్మాణ పత్రాల ప్రకారం - నిజాం నియమించిన ధర్మకర్తల చేతనే ఆ ట్రస్టు నిర్వహించబడుతోంది కనుక, అదొక ప్రత్యేక సంస్థగా పరిగణించబడుతోంది. ప్రభుత్వానికి, నిజాం ట్రస్టుకి మధ్య కుదిరిన అవగాహన ప్రకారం - మొదట ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధులను ట్రస్టీలుగా నియమించాలని ప్రతిపాదించబడింది. దేవాదాయశాఖ కమిషనర్ పరిధిలోంచి తప్పించి, (ట్రస్టు) ఇన్‌స్పెక్షన్ అధికారాలను ప్రభుత్వం హస్తగతం చేసుకుంది. ఇంకా, సెక్షన్ 15, సెక్షన్ 139లు ఈ ట్రస్టుకి వర్తించకుండా చేసింది. ఇదేవిధంగా చట్టంలోని వివిధ సూత్రావళి నుండి మినహాయించబడిన ధార్మిక సంస్థలు మరికొన్ని కూడా వున్నాయి... సమాజంలో పలుకుబడి కలిగిన వారు నిర్వహిస్తున్న ఈ ట్రస్టులకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించటాన్ని మేం వ్యతిరేకించటంలేదు. కాని, అదే రకమైన ఔదార్యాన్ని అన్ని వితరణ సంస్థలపట్లా ఒకేరకంగా చూపించాలి కదా? నిజాం ట్రస్టు వంటి (పలుకుబడి గలవారు నిర్వహించే) ట్రస్టులకూ, ఇతర హిందూ ధార్మిక సంస్థలకూ మధ్య ఇంతటి వివక్షత చూపించడం ఏ రకంగా సమంజసం? సమర్ధనీయం?

5. వైద్య, విద్యా సేవలందించే ధార్మిక సంస్థలు, ట్రస్టులూ ఆయా ప్రభుత్వ శాఖల చేత నియంత్రించబడుతున్నాయి. అయితే చల్లా కొండయ్య కమిషన్ చెప్పిందేమిటంటే - ఇలాంటి సంస్థల రోజువారీ నిర్వహణ విషయంలో దేవాదాయ శాఖ కల్పించుకోనక్కర్లేదు. మరి సాయిబాబా ఆలయాల్ని నిర్వహించే ట్రస్టుల విషయంలో ఇదే సూత్రాన్ని (కమిషన్) ఎందుకు వర్తింపజేయలేకపోయింది?

6. ఆ రకంగా ఇప్పుడు అమల్లో వున్న (వితరణ సంస్థల పట్ల ప్రభుత్వ) విధానం రాష్ట్రం యొక్క దీర్ఘకాలిక ప్రయోజనాలకు భంగకరంగా వుంది కనుక ఈ విధానాన్ని పరిపూర్ణంగా సమీక్షించాల్సి వుంది.

7. దేశం మొత్తం మీద ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఇలా వితరణ సంస్థల్ని 1987 చట్టం యొక్క వినాశకర, అస్తిత్వ రాహిత్య ప్రభావం క్రిందకు తీసుకురావటం జరిగింది. 1987 తరువాత ఒక్క ధార్మిక సంస్థ కూడా ఈ రాష్ట్రంలో నమోదు కాలేదు.

సంపన్నుల మనస్సుల్లో దాతృత్వ గుణాన్ని ప్రోత్సహించినట్లయితే, ఈ ధార్మిక సంస్థలు ప్రభుత్వాలు చేయలేని అనేక మంచి కార్యాల భారాన్ని వహిస్తాయన్నది అందరికీ



తెలిసిన విషయమే. కాని జరుగుతున్నదేమిటి? ఈ 30/87 చట్టం వేధింపులకి బెదిరిపోయి, దాతలంతా కొత్త ట్రస్టుల్ని పొరుగు రాష్ట్రాలలో నమోదు చేసుకుంటున్నారు. ఇందువల్ల లబ్ధిదారులు ఆయా రాష్ట్రాలలోని ప్రజలవుతున్నారు.

ప్రభుత్వానికి ఏమాత్రం ఆత్మ విమర్శనా దృష్టి వున్నా, ఈ ధార్మిక సంస్థలను కూడా ఎండోమెంట్స్ చట్టం (1987) నుంచి వెంటనే మినహాయించాలి. అందువల్ల మధ్యాహ్న భోజనం, ఉచిత విద్య, వైద్య - ఆరోగ్య సేవలు, త్రాగునీటి పథకాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనం వంటి కార్యక్రమాలకు ఈ వితరణ సంస్థల చేయూత విరివిగా లభించే అవకాశం వుంటుంది.

**సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయడంలో వస్తున్న ఆర్థిక చిక్కులు ఇలా వున్నాయి :**

ఎ) సెక్షన్ 82(1), 82(2)లు చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం రూపొందించబడ్డాయి :

"కమిషన్ - ప్రజా అభిప్రాయంతోఏకీభవిస్తూ, మత, ధార్మిక సంస్థల మాన్యాలను కౌలుదారీ చట్టం నుండి మినహాయించాలని సిఫార్సు చేస్తున్నాం. లేనట్లయితే, (కౌలుదారీ చట్టం వర్తింపజేయటం వల్ల కలిగే ఆర్థిక సమస్యల వల్ల) ఈ సంస్థలు మూత పడాల్సి వస్తుంది."

బి) అలాగే సెక్షన్ 76 కూడా కమిషన్ సిఫార్సు ప్రకారం రూపొందించబడిందే. ఈ సెక్షన్ 76 ప్రకారం ఆయా మత, ధార్మిక సంస్థల పేరు మీదనే (వాటికి గల భూములపై) రైతువారీ పట్టా - గడిచిపోయిన కాలానికి కూడా వర్తించేలా - జారీ చేయబడాల్సి వుంటుంది.

సి) కమిషన్ చేసిన మరో సిఫార్సు ప్రకారం సెక్షన్ 144 రూపొందింది. ఈ సెక్షన్ ప్రకారం - అప్పటివరకూ అర్చకుల అజమాయిషీలో వున్న - ఆలయ భూములన్నీ ఆలయ కమిటీ, ఆధీనంలోకి బదలాయించబడాలి. ఏదన్నా రాజీ సూత్రం ప్రకారం గానీ, 'సుల్సే- సుల్హాన్' సూత్రం ప్రకారం గానీ, మరే ఇతర రకమైన పద్ధతిలోగానీ ఈ భూముల బదలాయింపుని పరిష్కరించి, అర్చకులకు (ఆ భూములపై వచ్చే ఆదాయం స్థానే) జీతాల చెల్లింపుని ప్రవేశపెట్టాలి.

డి) దురదృష్టవశాత్తు, సెక్షన్ 82 (1), 82(2)లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. సెక్షన్ 76ని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. (ఇటీవల సెక్షన్ 82(1), సెక్షన్ 82(2)లను సుప్రీంకోర్టు పునరుద్ధరించింది. ఇప్పుడీ భూముల్ని

ఆక్రమణదారుల హస్తాల్లోంచి తప్పించి స్వాధీనం చేసుకోవటానికి ప్రభుత్వం యత్నిస్తోంది.)

ఇ) వాస్తవానికి, ఈ ఆలయ భూములలో అధిక శాతం ఆలయ సేవ చేస్తున్నందుకుగాను అర్చకులకు, ఇతర సేవకులకు ఇనాములుగా మంజూరు చేయబడినవి. కాలక్రమేణా ఆ భూములపై (శాశ్వత హక్కుని కల్పిస్తూ) రైతువారీ పట్టా మంజూరయింది. దాంతో భూములపై హక్కుకి, ఆలయ సేవలకి మధ్యనున్న ముడి విడిపోయింది. సేవలు చేస్తేనే భూముల ఆదాయంపై హక్కు వుంటుందన్న షరతుకి కాలం చెల్లిపోయింది.

అంటే, వంశపారంపర్య అర్చకత్వం రద్దు కావటం, (ఆయా సంస్థలకు) రైతువారీ పట్టాలు జారీని నిర్దేశిస్తున్న సెక్షన్ 76ని సుప్రీంకోర్టు కొట్టివేయటంతో అర్చకులు తమభుక్తి కోసం వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆలయాలను అంటిపెట్టుకుని వుంటూ అర్చకులు సేవలు కొనసాగించే పరిస్థితికి చరమగీతం పాడినట్లయింది. ఒకవేళ ఏ ఆలయ కమిటీ అయినా వేరే అర్చకులెవరన్నా నియమింపజేద్దామనుకున్నా, వారి సేవలకు పారితోషికం చెల్లించే వెసులుబాటు (భూములు) లేకుండా పోయింది.

ఎఫ్) అర్చకుల వంశపారంపర్య హక్కుల రద్దు వల్ల మరో తీవ్రమైన చిక్కు వచ్చిపడింది. "ఇప్పుడు అనువంశిక అర్చకత్వం చెల్లదని మా చట్టం చెబుతోంది. కాబట్టి అర్చకులుగా కొనసాగే హక్కు మీ వంశంవారు కోల్పోయారు. ఆలయాలు వదిలిపోండి" అంటూ అన్యాపదేశంగా అర్చకులకు ప్రభుత్వం చేసిన ఛీత్కారంతో అనేక చోట్ల అర్చకులు ఎదురు తిరిగారు. (గత వందలాది సంవత్సరాలుగా ఆలయ భూములపై అజమాయిషీ అర్చకుల చేతుల్లో వుంటూ వచ్చింది. ఇప్పుడు ఒక్క కలంపోటుతో వారికా హక్కు రద్దు చేయబడింది) దాంతో అనేక చోట్ల ఈ భూముల నుండి వారిని ఖాళీ చేయించటం దుస్సాధ్యమైపోయింది.

జి) క్లుప్తంగా చెప్పాలంటే, ఆలయాలన్నీ తమ భూముల్ని, వాటి మీద ఆదాయాన్ని కోల్పోయాయి. ఆ రకంగా భూముల ఆదాయంపై ఆధారపడి నడుస్తున్న ఆలయాలూ, ధార్మిక సంస్థలూ బతికి బట్టకట్టే అవకాశం లేనందువల్ల అవన్నీ మూతపడాల్సి వస్తోంది.

హెచ్) అర్చకుల జీతాల చెల్లింపు పద్ధతిని క్రమబద్ధీకరించటంకోసం ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అర్చకుల



వేతనాల్ని క్రమబద్ధీకరించటంతో పాటు, వేతనాల చెల్లింపు విధానాన్ని కూడా ఈ కమిటీ రూపొందించాల్సి వుంది.

ఐ) ఒక్కో అర్చకుడు రూ. 700-20-1000-15-1175 కనీస స్కేలు మీద జీతానికి నియమించబడతాడు అనుకుంటే, మొత్తం 25,000 ఆలయాలలో అర్చకులకూ కలిపి జీతాల క్రింద చెల్లించాల్సిన వార్షిక మొత్తం రూ. 30 కోట్ల రూపాయలు. ఒక్కో ఆలయంలో నెలకి వెయ్యి రూపాయల వంతున పడితరం క్రింద కాగల మొత్తం (25 వేల ఆలయాల) వార్షిక ఖర్చు మరో రూ. 30 కోట్ల రూపాయలు. అంటే, ఈ ఆలయాల్ని నడపటానికి ఏటా 60 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది.

జె) ఇది కాక, సెక్షన్‌లు 82(1), 82(2), 76లను రద్దు చేయటంతో దాదాపు 10,000 ఆలయాలకు భూ ఆదాయ వనరులు శాశ్వతంగా మృగ్యమైపోతాయి. అందువల్ల ఈ ఆలయాల నిర్మాణాల నిర్వహణా వ్యయం కూడా ప్రభుత్వం మీదే పడుతుంది. ఇదీ - చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సుల ప్రయోగ పర్యవసానం!!

కె) ఈ అర్చకులందర్నీ ఇక ముందు రోజుల్లో ప్రభుత్వం జీతగాళ్ళ క్రింద పరిగణిస్తుంది కనుక వాళ్ళు కూడా కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండు చేస్తారు.

ఇది సహజం. ఎందుకంటే, దేవాదాయ శాఖలో ఒక అటెండరు జీతం స్కేలు రూ. 1375-25-1474-30-1625-40-1825-50-2075-60-2375. ఈ అటెండరు జీతం ఎండోమెంట్ పరిపాలనా నిధి నుంచి చెల్లించబడుతోంది. ఈ నిధి ఎక్కడ్నుంచి వస్తోంది? ఒక అర్చకుడికి నెలకి రూ. 300 చెల్లించే నిరుపేద ఆలయం సహా అన్ని ఆలయాలు వార్షిక విరాళాలు చెల్లించటం వల్ల నడుస్తున్నదే ఈ నిధి.

ఎల్) 1333 ఫసలీ (వ్యవసాయ సంవత్సరం)లో నిజాం జారీ చేసిన ఫర్మానా ప్రకారం, తెలంగాణాలోని అనేక ఆలయాలకు నగదు రూపేణా గ్రాంట్లు చెల్లించబడుతూ వున్నాయి. ఈ గ్రాంట్లను 'సుల్సేసుల్సాన్' నిబంధనలతో క్రమబద్ధీకరించారు.

ఆ ఫర్మానా, సుల్సేసుల్సాన్ నిబంధనలు ఒక శాసనం వంటివి. ఎందుకంటే - అవి ఒక చట్టబద్ధమైన సర్వసత్తాక (హైద్రాబాద్) ప్రభుత్వంచే జారీ చేయబడినవి.

అయితే, సెక్షన్ 144 క్రింద ఈ సుల్సేసుల్సాన్ నిబంధనలు రద్దయిపోయాయి. దాంతో ఆ నిబంధనల క్రింద అంతవరకూ అర్చకులకు లభిస్తున్న నగదు గ్రాంట్లకు కూడా నూకలు చెల్లిపోయాయి.

1959 నాటి ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా) నగదు గ్రాంట్ల రద్దు చట్టం (14/59)లోని సెక్షన్ 3(2) ఇలా చెబుతోంది :

"…. ప్రజా ప్రయోజనార్థం ఏదయినా ఆలయానికీ, ధార్మిక సంస్థకూ సేవ చేయటం కోసం లేదా వితరణ క్రింద (ఆ సంస్థ పేరు మీద) మంజూరు చేయబడిన నగదు గ్రాంటుకి ఈ చట్టంలోని ఏ సూత్రావళీ వర్తించదు. ఇందులో సబ్ సెక్షన్‌లో ఉదహరించబడిన నగదు గ్రాంటు - సంబంధిత సేవచేసే వ్యక్తికి ఆ సంస్థ వున్నంతకాలం కొనసాగుతుంది…"

అయితే 1987 నాటి చట్టంలోని సెక్షన్ 144 మాత్రం ఈ శాసనంలోని ఈ అంశం విషయంలో ఎలాంటి వివరణ ఇవ్వలేదు. సెక్షన్ 82(1), 82(2)లను కొట్టి వేస్తున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇలా పేర్కొంది :

"… ఈ చట్టం - పాత చట్టాలను తొలగిస్తున్నట్లుగా ఎక్కడా చెప్పలేదు. ఒక్క సెక్షన్ 160లో మాత్రం ధార్మిక సంస్థల్ని నియంత్రించే ఆచారాలు, ఆనవాయితీలకు సంబంధించిన - అంతవరకు అమల్లో వున్న - అన్ని రకాల రాజీ సూత్రాలు, ఒప్పందాలు, పథకాలు, తీర్పులు, ఆదేశాలను తొలగిస్తున్నట్లు వుంది…."

సెక్షన్ 144 దృష్ట్యా - అంతవరకూ తమ వ్యక్తిగత పేర్ల మీద నగదు గ్రాంట్లు పొందుతున్న ఆలయ సేవకులు ఆ సదుపాయాన్ని (ఈ 1987 చట్టంతో) కోల్పోతారు. అంటే, ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా) నగదు గ్రాంట్లు రద్దు చట్టం - 1959లోని సెక్షన్ 3(2)ని తగు విధంగా సవరిస్తే తప్ప, ఈ సంస్థలకు నగదు గ్రాంట్లు కొనసాగవు. ఆ రకంగా అవన్నీ నష్టాల ఊబిలోకి నెట్టివేయబడ్డాయి.

**మరి అంతవరకు సుల్తేసుల్తాన్ నిబంధనల క్రింద (హిందూ ఆలయాలతో పాటుగా) నగదు గ్రాంట్లు పొందుతూ వస్తున్న ముస్లింలు తదితర ఆయా (మత) సంస్థల సేవకుల సంగతేమిటి? …. విచిత్రమేమిటంటే, ఇవ్వాళ్టికీ ఆయా సంస్థలలో ముస్లిం సేవకులకి ఆ నగదు గ్రాంట్లు కొనసాగుతూనే వున్నాయి. హిందూ (ఆలయాల్లో) సేవకులకి మాత్రమే ఈ నగదు గ్రాంట్లు సెక్షన్ 144 క్రింద నిలిపివేయబడ్డాయి.**

ఎం) ఎస్టేట్‌ల రద్దు చట్టం ప్రకారం ఆలయాలకి ప్రభుత్వం జారీ చేసిన వార్షిక భృతిని పెరిగిన ద్రవ్యోల్బణం దృష్ట్యా పెంచాల్సివుంది. అలాగే పెరిగిన జీవన వ్యయం ప్రకారం కూడా ఈ వార్షిక భృతిని పెంచాల్సి వుంది. అస్సాం ప్రభుత్వం 1993లో ఇలాగే చేసింది.



8. ఉల్లురై సిబ్బందికి నామమాత్రపు వేతనాల చెల్లింపు ఆమోద యోగ్యం కాకపోవటంతో నానా రకాల ప్రతికూల (ట్రేడ్ యూనియన్) ధోరణులు తలెత్తాయి.

9. రాజ్యాంగం ప్రకారం, ఈ వ్యయాన్ని ప్రభుత్వ ఖజానా (Consolidated fund of Inda) మీద రుద్దటానికి వీల్లేదు. ఎందుకంటే, ఎండోమెంట్స్ శాఖ పరిపాలనా వ్యయం అంతా (ఏటా రూ. 15 కోట్ల మేరకు) ఎండోమెంట్స్ పరిపాలనా నిధి నుంచే చెల్లించబడుతోంది. ఈ నిధి మొత్తం ఆలయాల విరాళాలతో నిర్వహించబడుతోంది.

10. "ఈ మత, ధార్మిక సంస్థల మనుగడ కనుక అధికారంలో వుండే వ్యక్తుల వ్యక్తిగత భావాలు, అభిప్రాయాలు, విధానాల మీదనే ఆధార పడాల్సివస్తే, ఈ సంస్థల స్వాతంత్ర్యం, ఉనికి, గుర్తింపు సర్వనాశనమైపోక తప్పదు…" ఇది చల్లా కొండయ్య కమిషన్ వ్యక్తం చేసిన అభిప్రాయం.

11. కాబట్టి, అర్చకుల జీతాలను ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించటం సమర్ధనీయం కాబోదు. ఇప్పటికే, 1996 మార్చి 26 నాటి జీ.వో. (ఎం.ఎస్) నెం. 307 ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల జీతాల చెల్లింపు ఆలయాలకి శిరోభారాన్ని సృష్టించింది.

జీ.వో. నెం. 307లో సంబంధిత పేరాలు ఇలా వున్నాయి :

### పేరా 7

"… ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల జీతాల చెల్లింపు బాధ్యత అసిస్టెంట్ కమిషనర్‌లదే. వారు సకాలంలో నిధులు డ్రా చేసి తమ తమ సబ్ డివిజన్‌లలోని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లకు చెల్లించాలి. అదేవిధంగా ఆ జీతాల చెల్లింపు మేరకు సంబంధిత దేవాలయాలు / ధార్మిక సంస్థల నుండి (ఆ ఖర్చుని) రాబట్టి ఖజానాకు జమ చేసే బాధ్యత కూడా వాళ్ళదే. ఏనెలకానెల ఇలా రాబట్టిన సొమ్మును మరుసటినెల 15వ తేదీలోగా నిర్దిష్ట నిబంధనల ప్రకారం (కమీషనర్‌కి తెలియజేస్తూ) అసిస్టెంట్ కమీషనర్‌లు ఖజానాకి జమ చేయాల్సి వుంటుంది.

### పేరా 8

ఒకవేళ ఏ ఆలయ, ధార్మిక సంస్థ నుండైనా అలాంటి ఖర్చుని రాబట్టడంలో జాప్యం జరిగిన పక్షంలో - (అది రాబట్టే వరకూ) ఆ సంస్థలో సిబ్బందికి తరువాత నెల జీతాల కోసం ప్రభుత్వ కోశాగారం నుండి జరగాల్సిన నిధుల విడుదల స్తంభింపజేయబడుతుంది…"

ఇక, ఈ జీవో సృష్టించిన సమస్యలు వర్ణనాతీతం. అర్చకుల, ఇతర ఆలయ ఉద్యోగుల జీతాలు, పడితరం ఖర్చుల వ్యవహారం గందరగోళంలో పడిపోయింది.

కాబట్టి, ప్రభుత్వ ఖజానా నుంచి అర్చకుల, ఇతర ఉద్యోగుల జీతాలను చెల్లించటం అనేది అసంభవం. ఈ జీతాల ఖర్చు అంతా దేవాదాయంలోంచి భరించాల్సిందే.

మరి సుప్రీంకోర్టు చెప్పినదాని ప్రకారం - "అర్చకుల నియామకాన్ని క్రమబద్ధీకరించటం కోసం తనకుగల సెక్యులర్ అధికారాల్ని ఉపయోగిస్తున్న ప్రభుత్వం, అదే స్థాయిలో తన అధికారాల్ని ఉపయోగించి, అర్చకులు అంకితభావంతో, ఏకాగ్రతతో ఆలయ దైవానికి నిత్యపూజలు సేవలు చేయటానికి అనువుగా అతనూ అతని కుటుంబం కనీస సదుపాయాలతో జీవించేలా చూడాల్సి వుంది" కదా? ఈ ఖర్చంతా ఎక్కడ్నుంచి భరించాలి?... ఆ రకంగా రాజ్యాంగం జవాబు చెప్పలేని ఆర్థిక భారం ప్రభుత్వం మీద పడుతోంది!

సుప్రీంకోర్టు ఇంకా ఏం చెప్పింది?

".... ప్రభుత్వం సంబంధిత రాష్ట్రంలోని లేదా ఇతర రాష్ట్రాలలోని వితరణ సంస్థల నుండి విరాళాలు సేకరించవచ్చు. అలా సేకరించిన విరాళాలను, అలాంటి విరాళాల వల్ల సమకూరే నిధుల తాలూకు డిపాజిట్‌ల మీద వడ్డీలను ఆదాయపు పన్ను పరిధి నుండి మినహాయించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని (ఆదాయపు పన్ను శాఖను) కోరవచ్చు..."

ముందే చెప్పినట్లుగా ఆలయాల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. సమాజం కూడా చొరవ తీసుకోవాల్సి వుంది.

ఉదాహరణకి తమిళనాడులో, 6238 నిరుపేద ఆలయాలలో కనీసం రోజుకొక్కసారయినా ధూపదీప నైవేద్యం సమర్పించటానికి వీలుగా ధర్మాదాయ వనరులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ పథకం క్రింద రూ. 15.16 కోట్ల రూపాయలు డిపాజిట్ చేయబడ్డాయి. ఇంతకాలం ఉపేక్షించబడిన గ్రామీణ ఆలయాల నిర్వహణ విషయంలో శ్రద్ధ వహించేందుకూ, అర్చకుల సంక్షేమాన్ని చూసేందుకూ తగిన చర్యల్ని ప్రభుత్వం తీసుకుంది. ఈ 'కనీసం ఒక్కపూట పూజ' పథకం క్రిందకి అన్ని గ్రామీణ ఆలయాలు తీసుకురాబడ్డాయి. సంబంధిత వర్గాలలో అర్చకత్వ వృత్తి పట్ల గౌరవం, విశ్వాసం నెలకొనేలా చేయటం కోసం వృద్ధ అర్చకులకు నెలకు రూ. 400 పెన్షన్ సదుపాయం కల్పించబడింది. ... ఈ ఖర్చులన్నీ ప్రజల విరాళాలతో ఏర్పాటైన మూల నిధి నుండే జరుగుతున్నాయి.

12. కొత్త దేవాదాయ ధర్మాదాయ చట్టాన్ని (30/87) తీసుకువచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాన్ని రూపొందించి వుండాల్సింది. విప్లవాత్మకంగా ప్రభుత్వం



భావించిన ఈ చట్టాన్ని అమలు చేసేముందు అర్చకుల సంక్షేమ నిధినొకదానిని ప్రారంభించి వుండాల్సింది. సుప్రీంకోర్టు తీర్పుల పర్యవసానం ఎలావుంటుందో అధ్యయనం చేయటానికి ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసివుండాల్సింది. తగిన వ్యవధి తరువాత ఆ కమిటీ అధ్యయన ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటూ, రాజ్యాంగపరమైన, ఆర్థిక పరమైన చిక్కులకు అవకాశం లేని విధంగా ఈ మత, ధార్మిక సంస్థల నిర్వహణ విషయంలో తాను నిర్వహించదగిన పాత్రపై ఒక నిర్దిష్ట విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి వుండాల్సింది.

## కాని అలా జరగలేదు....

***ఆలోచనా రహితంగా, హ్రస్వదృష్టితో రూపొందిన ఈ 30/87 పాశవిక చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం తొందరపాటుతో రంగంలోకి దూకింది. అంతే! మన పవిత్ర దేవాలయాలు, రాజకీయ ప్రభుత్వమూ కూడా పద్మవ్యూహంలో ఇరుక్కుపోయాయి.***

★ ★ ★

# తీర్పుల పర్యవసానం

అర్చక వ్యవస్థని కూలదోస్తూ, ఆలయాల ఉనికికే పెనుముప్పుని తీసుకు వచ్చిన 30/87 ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ చట్టం మన ముందుంది.

1996 నాటి సుప్రీంకోర్టు తీర్పు నాటి నుంచి సంభవించిన పరిణామాలకు ఆరంభం అన్నట్లుగా 'ది హిందూ' పత్రిక మధ్య పేజీల్లో ఒక వ్యాసం వెలువడింది. ఈ తీర్పు పట్ల పత్రికా రంగం ఎలా స్పందించిందీ అన్నదానికి, ఈ వ్యాసం దర్పణం పడుతుంది.

అక్కడ్నుంచి - ఆలయ వ్యవస్థని ధ్వంసం చేయటానికి ఈ చట్టం ఎలా ఒక ఆయుధంగా వాడబడిందో వివరించే సంఘటనలన్నీ (వరుస క్రమంలో) పరిశీలిద్దాం.

## ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల నిర్వహణ

- ఆర్.జె.రాజేంద్రప్రసాద్

*సుప్రీంకోర్టు గత జనవరిలో ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్, హిందూ రెలిజియస్, ఎండోమెంట్స్ ఆక్టు - 1987ని సమర్థించింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకా తిరుమలలో గ్రామకరణం వంశపారంపర్య హక్కుని రద్దు చేసినట్లే, ఆలయాల్లోని అర్చకులు, మిరాసీదార్లు, గమేకార్లు, ఇతర ఉద్యోగుల, సేవకుల వంశపారంపర్య హక్కుని రద్దు చేయటానికి ఈ చట్టం ఉద్దేశించబడింది. అయితే సుప్రీంకోర్టు తీర్పులో అనేక గొలుసుకట్టు షరతులు వుండటంతో ఆ చట్టాన్ని అమలు చేయటం దుస్సాధ్యమైపోయింది. తీర్పు నేపథ్యంలో ఎండోమెంట్ కమిషనరు జారీ చేసిన పలు ఆదేశాలను ఇటీవలికాలంలో కోర్టులు స్థంభింపజేశాయి.*

*న్యాయమూర్తి రామస్వామి తన తీర్పులో ఇలా పేర్కొన్నారు : "అర్చకుడిగా నియమించబడటానికి ఒక వ్యక్తికి గల వంశపారంపర్య హక్కుని రద్దు చేయటాన్ని మేం సమర్థించినప్పటికీ, వైఖానస శాఖకి సంబంధించిన గ్రంథస్థ సమాచారం, తదితర ఆధారాల ప్రకారం అర్చకుడు అనేవ్యక్తి ఆలయంలోని దైవానికి నిత్య అర్చనాది సేవల్ని పరిపూర్ణమైన అంకితభావంతో అందించాల్సి వుంటుంది. అదే సమయంలో అతనూ, అతని కుటుంబ సభ్యులు తగిన వసతి సదుపాయాలతో జీవించేలా చూడాల్సి వుంటుంది. తనకున్న సెక్యులర్ అధికారాలను ఉపయోగించి అర్చకుల నియామకాన్ని నియంత్రించే ప్రభుత్వం, అంతే శ్రద్ధతో అర్చకుడు, అతని కుటుంబం కనీస వసతి సదుపాయాలతో జీవించేలా చూడాల్సివుంది. అలాగే అతని సర్వీసు నిబంధనలని, జీతనాతాలను, ఇతర చెల్లింపుల్ని ఆయా ఆలయాల శ్రేణిని బట్టి నిర్ణయించాలి. అతను పనిచేయాల్సిన వేళల్ని, చేయాల్సిన విధుల్ని క్రమబద్ధీకరించాలి.*

*అర్చకుల కుటుంబాల కోసం తగిన వసతి కల్పించటానికి, ఆగమాలలో పునశ్చరణ*



*తరగతులను నిర్వహించటానికి, వైద్య, విద్యా సదుపాయాలు కల్పించటానికి, అలాగే ఇళ్ళు నిర్మించుకోటానికి అవసరమైన రుణాల్ని కల్పించటానికి, ఇళ్ళవసతి వున్నచోట సరసమైన రీతిలో వారికి అద్దెకివ్వటానికి, అనుకోని అవాంతరాలు ఎదురయితే తట్టుకునేలా గ్రూపు ఇన్‌స్యూరెన్సు పథకం అమలు చేయటానికి, ప్రమాదాలు వగైరా సంభవించినప్పుడు అర్చకుల భార్యలకు, విద్యావంతులై నిరుద్యోగులుగా వున్న వారి పిల్లలకు పునరావాసం కల్పించటానికి, ఇటువంటి అవసరమైన సంక్షేమ చర్యల్ని తీసుకోవటానికి ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించాల్సి వుంది."*

*రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో (ఈ పథకం రూపొందించటానికి) ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కూడా కోర్టు ఆదేశించింది. ఈ కమిటీలో ఎండోమెంట్స్ అడిషనల్ కమిషనర్, రెవెన్యూశాఖ జాయింట్ సెక్రటరీ, ఇద్దరు అర్చక సంఘాల ప్రతినిధులు, ఒక ఆలయ సేవకుల ప్రతినిధి వుండాలి. ఈ పథకం రూపొందాక, దానిమీద ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకుని, ఆ నిర్ణయాన్ని ఈ తీర్పు వెలువడిన ఆరు మాసాలలోగా తన ముందుంచాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది.*

*ఆంధ్రప్రదేశ్‌లో 32,201 దేవాలయాలున్నాయి. వాటిల్లో 582 దేవాలయాలు మాత్రమే 10,000 రూపాయలకు పైబడిన వార్షికాదాయం కలిగి వున్నాయి. వీటిల్లో ఎనిమిది దేవాలయాలు రూ. 20 లక్షలకు పైగా వార్షికాదాయాన్ని కలిగి వున్నాయి. (1985 గణాంక వివరాల ప్రకారం)*

*1987లో రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు ఈ క్రింది విధంగా జీతాల స్కేళ్ళను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన ప్రకారం - దేవాలయాలను మూడు శ్రేణులుగా విభజిస్తారు. అర్చకుల జీతాల స్కేళ్ళను మూడు గ్రేడులలో వుంచుతారు. ఏటా రూ. 5 లక్షలు అంతకన్నా ఎక్కువ ఆదాయం కలిగిన ఆలయాల అర్చకుడికి గ్రేడ్-1 స్కేలు అంటే నెలకి రూ. 1500 లభించాలి. అత్యంత దిగువస్థాయి (గ్రేడ్-3) అర్చకుడికి - అంటే రూ. 50,000 కన్నా తక్కువ వార్షిక ఆదాయం లభించే ఆలయాల్లోని అర్చకుడికి నెలకి రూ. 300 జీతం లభించాలి.*

*ఈ పథకం అమలు జరగటం కోసం తాత్కాలికంగా రూ. 75 కోట్లతో ఒక మూలనిధిని ఏర్పాటు చేయాలనీ, ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానాలు ఈ ఏడాది జూన్‌లోగా రూ. 20 కోట్లు ఈ నిధికి జమ చేయాలనీ, ఆ తరువాత ఏటా రూ. 10 కోట్లు జమ చేయాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. ఏటా రూ. 20 లక్షల వార్షిక ఆదాయం కలిగిన దేవాలయాలు 1996-97లో అయిదు కోట్ల రూపాయలను, ఆ తరువాత ఏటా కోటి రూపాయలను ఈ మూల నిధికి జమ చేయాల్సి వుంటుంది. యాదగిరిగుట్టలో నరసింహస్వామి ఆలయం, కరీంనగర్‌లోని మల్లిఖార్జునస్వామి ఆలయం, విశాఖపట్నం దగ్గర గల ఉగ్ర*

నరసింహస్వామి ఆలయం, అన్నవరంలోని సత్యనారాయణ స్వామి ఆలయం, విజయవాడలోని కనకదుర్గ ఆలయాలను ఈ కేటగిరీ క్రింద సుప్రీంకోర్టు గుర్తించింది. ఈ విషయంలో ఏవయినా ఇబ్బందులు ఎదురైన పక్షంలో, తగిన వివరణలు, మార్పులు, ఆదేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ కోర్టును కోరవచ్చు" అని కూడా కోర్టు పేర్కొంది.

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ కాలంలో ఎండోమెంట్ కమిషనర్ నాలుగు సర్క్యులర్‌లు జారీ చేశారు. ఈ సర్క్యులర్‌లు - తీర్పుని అమలు చేయటానికి, వంశపారంపర్య ధర్మకర్తలకు అన్ని రకాల చెల్లింపులు నిలిపివేయటానికి, మఠాధిపతులు పాదకానుకల లెఖ్ఖల తయారు చేయాలని ఆదేశించటానికి, అర్చకులకు దేవాదాయంలో వాటలు చెల్లింపులు ఆపి వేయటానికి సంబంధించినవి.

మార్చి 31 నాటి సర్క్యులర్‌లో కమిషనర్ ఇలా చెప్పారు. "గతంలో సుప్రీంకోర్టు, వెలువరించిన 'యథాతథ పరిస్థితి కొనసాగింపు' కాలంలో నగదూ రూపేణా గానీ మరే రూపంలో గానీ అర్చకులకు ఏవన్నా చెల్లింపులు జరిగివుంటే, అలాంటి చెల్లింపులన్నింటినీ వాళ్ళకి (గతకాలానికి) చెల్లించే జీతాలలోంచి నిబంధనల ప్రకారం మినహాయించాలి."

అయితే ఈ ఉత్తర్వుని శాసనమండలి పూర్వపుసభ్యులు, ఇప్పటి తెలంగాణా అర్చక సమాఖ్య అధ్యక్షులు అయిన శ్రీ వి.పి.రాఘవాచారి హైకోర్టులో ఛాలెంజి చేశారు. సుప్రీంకోర్టు తీర్పులోని ఒక భాగాన్ని (అర్చక కుటుంబాల సదుపాయాల్ని పట్టించుకోవటం) వదిలేసి, అనువంశిక అర్చకత్వ హక్కుల్ని రద్దు చేసే మరో భాగాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఎలా అమలు చేస్తుంది - అని ఆయన ప్రశ్నించారు. నెలకి రూ. 300 జీతం తీసుకునే అర్చకుడి విషయాన్నే తీసుకుందాం. 1987-1996 మధ్య కాలంలో అతనికి ప్రసాదాలు వగైరా కైంకర్యాల నుంచి చెల్లించబడిన వాటాల మొత్తాన్ని అదే కాలానికి అతనికి రావలసిన (నెలకి రూ. 300) జీతం మొత్తం నుండి మినహాయించాల్సి వస్తే, ఆ అర్చకుడు అనాథ కాక తప్పదు -అని ఆయన తన పిటీషన్‌లో వాదించారు. ఈ పథకాన్ని బహు జాగ్రత్తగా రూపొందించాల్సి వుంటుంది. లేని పక్షంలో - "వేలాది అర్చకులు, వారు సేవిస్తున్న దేవాలయాలు, ప్రజా బాహుళ్యం యొక్క ఆధ్యాత్మిక మనోభావాలను దెబ్బతీసే విధంగా అంతరించిపోక తప్పదు" అని కూడా ఆయన వాదించారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎ.గోపాలరావు ఏప్రిల్ 25 నాడు ఈ రిట్ పిటీషన్‌ను అనుమతిస్తూ, కమిషనర్ (ఎండోమెంట్స్)గారి సర్క్యులర్‌లని ఎందుకు తాత్కాలికంగా స్థంభింపచేయకూడదో తెలుపవలసిందంటూ ఒక నోటీసుని జారీ చేశారు.

1987లో ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ చట్టం ఛాలెంజి చేయబడింది. చట్టం అమల్లోకి వచ్చిన



నాటి నుండి దాని అమలుని స్తంభింపజేస్తూ 'యథాతథ స్థితిని కొనసాగించాలని' సుప్రీంకోర్టు ఆదేశించింది. అర్చకులు, ధర్మకర్తలు, మిరాసీదారులు ఆరోజు నుండి తమకు ప్రతినెలా లభించే అన్ని రకాల వాటాలు, చెల్లింపుల తాలూకు లెఖ్ఖలన్నీ మరుసటి నెల 15వ తేదీలోగా సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి గానీ, ఎండోమెంట్ కమిషనర్‌కి గానీ దాఖలు చేయాలని కూడా సుప్రీంకోర్టు ఆదేశించింది. 1987 అక్టోబరు 13 నాడు ఈ ఆదేశాన్ని సవరించారు. నెలకి రూ. 10,000 పైబడిన దేవాదాయపు వాటా పొందే అర్చకుల విషయంలో మాత్రమే పై ఆదేశం వర్తిస్తుందని ఆ సవరణలో సుప్రీంకోర్టు పేర్కొంది.

1987 ఆగస్టు 25 నాడు తిరుమల తిరుపతి దేవస్థానాల, అర్చకుల, గమేకార్‌ల ప్రయోజనాలను కాపాడటం కోసం కోర్టు వేరొక ఉత్తర్వు జారీ చేసింది. దాని ప్రకారం - ఈ రెండు వర్గాలవారు తలొక రూ 20 లక్షలు తిరుపతిలోని అడిషనల్ జడ్జి కోరిన విధంగా సెక్యూరిటీ క్రింద డిపాజిట్ చేయాలని అందులో పేర్కొంది. అంటే ఈ కేసు 1988 నాటికి పరిష్కారం కాగలదన్న ఉద్దేశ్యంతో తదనుగుణంగా ఈ మొత్తాన్ని నిర్ణయించారు. మళ్ళీ ఇటీవల సుప్రీంకోర్టు ఇలా చెప్పింది. "అర్చకులకు, గమేకార్లకు, మిరాసీదార్లకు చేయాల్సిన చెల్లింపుల్ని, చట్టప్రకారం వాళ్ళకు వుండగల హక్కుల్ని రూపొందించి, తదనుగుణంగా తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛను తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ అధికారికి వదలిపెడుతున్నాం."

1987లో ఎన్.టి.రామారావు ప్రభుత్వం పరిపాలిస్తున్నప్పుడు ఈ చట్టం రూపొందింది. 1994లో శ్రీ ఎన్.టి.రామారావు ప్రతిపక్ష నాయకుడుగా వుండగా ఆయనని ఉస్మానియా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వి.సౌందరరాజన్ కలిశారు. 1987 చట్టం యథాతథంగా అమలు జరగటం వల్ల ఉత్పన్నం కాగల చిక్కు సమస్యల గురించి ప్రొఫెసర్ సౌందరరాజన్ చేసిన వివరణలను శ్రీ ఎన్.టి.రామారావు సావధానంగా విన్నారు.

ఆ తరువాత (1994 చివర్లో) శ్రీఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అప్పుడు మరోసారి సౌందరరాజన్ గారు వెళ్ళి శ్రీ ఎన్.టి.రామారావుని కలిసి ఈ చట్టం అమలు చేస్తే రాగల క్లిష్ట సమస్యలని సవివరంగా తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. దానిపై స్పందిస్తూ, 1995 ఆగస్టులో దేవాదాయశాఖామంత్రి శ్రీ సింహాద్రి సత్యనారాయణ సారథ్యంలో ఒక కమిటీని ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అన్ని చిక్కుముడుల్ని పరిశీలించి, వాటి పరిష్కారానికి మార్గాలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే 1995 ఆగస్టు 31న ముఖ్యమంత్రి స్థానం నుండి శ్రీ ఎన్.టి.రామారావు తొలగించబడ్డారు. దాంతో ఆ ప్రయత్నం (కమిటీ ఏర్పాటు - దాని లక్ష్యం) ఫలించలేదు.

హైద్రాబాద్ అశోకనగర్‌లోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం కేంద్రస్థానంగా ఒక ధర్మరక్షణ సమితి ఏర్పాటైంది. కాకతీయ సిమెంట్స్ ఛైర్మన్ శ్రీ పి.వెంకటేశ్వర్లు ఛైర్మన్‌గా,

*ప్రొఫెసర్ సౌందరరాజన్ కార్యదర్శిగా వ్యవహరించే ఈ కమిటీ - మఠాలు, ఆశ్రమాలు, బృందావనాల న్యాయమైన హక్కుల్ని కాపాడటం, సనాతన ధర్మస్ఫూర్తిని బలోపేతం చేయటం అనే లక్ష్యాలతో పనిచేస్తుంది. సుప్రీంకోర్టు తీర్పుని హడావుడిగా అమలుచేయవద్దనీ, చిన్న దేవాలయాల మనుగడకి భంగం వాటిల్లని విధంగా ఈ సమస్యపై సంబంధిత వర్గాలన్నింటితో చర్చలు జరపాలనీ ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది.*

(ది హిందూ 20.5.1996)

★ ★ ★ ★ ★

ఆంధ్రప్రదేశ్ దేవాలయాలు, వాటి స్థితిగతులపై ఒక 'వాస్తవ పరిస్థితి' నివేదిను ఈ గ్రంథ రచయిత తయారుచేశారు. దాన్ని 1996 ఆగస్టు 23న వానమామలై మఠం అధిపతి పరమపూజనీయ శ్రీ కళ్యాణ్ వానమామలై రామానుజ జీయర్‌గారు విడుదల చేశారు.

వివిధ సందర్భాలలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల మీద, వాటి వల్ల ఏర్పడుతున్న చిక్కుముడుల మీద నిశితమైన విశ్లేషణే ఈ 'వాస్తవ పరిస్థితి' నివేదిక సారాంశం. అక్కడ్నుంచీ ఈ నివేదిక ప్రజలలో చర్చనీయాంశమైంది. ఆలయాల ప్రస్తుత స్థితి, మున్ముందు ఏర్పడగల దుస్థితి, చేతులు ముడుచుక్కూర్చుంటే చేజారిపోగల మన ఆలయ సంస్కృతి... తదితర అంశాలన్నీ ఈ నివేదిక కారణంగా అనేకమంది విజ్ఞుల, మేధావుల, భక్తుల సమూహాల్లో చర్చకు వచ్చాయి. వస్తున్నాయి. ఈ 'వాస్తవ పరిస్థితి' నివేదికను సుప్రీంకోర్టులో కూడా దాఖలు చేయడం జరిగింది. ప్రభుత్వంలోని ఉన్నతాధికార వర్గాలలో ఈ వాస్తవాలపై ఒక పునరాలోచన ఆరంభమైంది.

'ది హిందూ' పత్రికలో 1996 సెప్టెంబరు 9న 'Between you and me' శీర్షికన శ్రీ కె.ఎస్ ఈ 'వాస్తవ నివేదిక' గురించి ఇలా వ్యాఖ్యానించారు :

*"ఆంధ్రప్రదేశ్‌లో దేవాలయాలు, వితరణ సంస్థల నిర్వహణపై ప్రొఫెసర్ ఎం.వి.సౌందర రాజన్ కూలంకషంగా అధ్యయనం చేసి తయారు చేసిన 'వాస్తవ నివేదిక'ను ఇటీవల నేను చదవటం తటస్థించింది. మన అనేక దేవాలయాలలో అర్చకుల దురవస్థ గురించి అందులో విశదీకరించబడింది. మనలో చాలామంది ఈ అంశాలు చర్చించటానికి ఇష్టపడం - ఎందుకంటే మనం మతాతీతంగా వ్యవహరిస్తున్నామని అందరూ అనుకోవాలి గదా!*

*ప్రొఫెసర్ రాజన్ మాత్రం - దీర్ఘకాలంగా అర్చకులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను ఈ నివేదిక ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. అందులోని కొన్ని అంశాలు ఇలా వున్నాయి:*

1. *వివిధ దేవాలయాలలో అర్చకులకు జీతాల స్కేళ్ళను క్రమబద్ధీకరించటానికి, ఆ చెల్లింపు*



*విధానాలు నిర్ణయించటానికి గాను ఒక కమిటీని ఏర్పాటు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.*

2. *రాబోయే రోజుల్లో ఈ అర్చకులంతా జీతాలకి పనిచేసే ప్రభుత్వోద్యోగులు అవుతారు కాబట్టి వాళ్ళు కనీస వేతన చట్టం క్రింద తమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తారు. ఆ డిమాండ్ సమంజసం అవుతుంది కూడా. ఎందుకంటే, ప్రభుత్వ ఎండోమెంట్ శాఖలో అటెండరు జీతం స్కేలు రూ. 1375-25-1474-30-1625-40-1825-50-2075-60-2375. పైగా అటెండరుకిచ్చే జీతాన్ని ఎండోమెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుంచి చెల్లిస్తున్నారు. ఈ ఫండ్‌కి వచ్చే విరాళాలన్నీ ఆలయాల నుంచి వస్తున్నవే. వీటిల్లో నెలకి రూ. 300 జీతం మీద అర్చకులు పనిచేస్తున్న నిరుపేద ఆలయాలు కూడా వున్నాయి.*

*అర్చకులకు వేరే ఎలాంటి అలవెన్సూ చెల్లించబడదట. ఎందుకంటే వాళ్ళు వుండేదెప్పుడూ 'లక్ష్మి' సన్నిధిలోనే గదా! దాంతోనే సంతృప్తి చెందాలిట. వాళ్ళు ఆరాధించి, సాధించుకోవలసింది 'సరస్వతీ కటాక్షమే' కాని 'లక్ష్మీ కటాక్షం' కాదట.*

*కేవలం 'నాన్ - సెక్యులర్' అని పిలవబడతామేమోనన్న భయంతో మనం మన ఆలయాల్లో అర్చకుల్ని ఇలా హీనంగా చూస్తున్నాం. ఎంత సిగ్గుచేటు? ఈ భయం వల్లనే ఉపేక్షాభావాన్ని పెంచేసుకున్నాం.*

*హైదరాబాద్‌లోని అహోబిలమఠం వారి 'శ్రీ నృసింహప్రియ' పత్రికకు అనుబంధంగా ఈ 'వాస్తవ నివేదిక' -1996 మేలో ప్రచురితమైంది. సమస్యలేమిటో మనం అర్థం చేసుకోవాలి. "సెక్యులర్‌గా వుంటున్నాం" అని అనిపించుకోవటం కోసం అర్చకుల సమస్యల పట్ల గౌరవ ప్రదమైన అశ్రద్ధని మనం చూపనక్కర్లేదు. ఈ 'వాస్తవ పరిస్థితి' నివేదికలో అన్ని అంశాలు సుస్పష్టంగా రాయబడ్డాయి. కనుక అవన్నీ చర్చనీయాంశాలే."*

1996 సెప్టెంబరు 9 నాడు హైదరాబాద్‌లో ఎండోమెంట్ కమిషనరు కార్యాలయం ఎదుట ఒకరోజు నిరాహారదీక్షతో ఆరంభించి రాష్ట్రవ్యాప్త ఆందోళనను అర్చకులు ప్రారంభించారు. ధర్మరక్షణ సమితి చైర్మన్ శ్రీ పి.వెంకటేశ్వర్లు ద్వారా విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు అదేరోజు సాయంత్రం అర్చక ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. చర్చల ఫలితంగా, ఈ సమస్య పరిష్కారానికి ఒక కమిటీని నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి తరపున ఆయన జాయింట్ సెక్రటరీ, రెవెన్యూ జాయింట్ సెక్రటరీ (ఎండోమెంట్స్), ఎండోమెంట్స్ కమిషనర్‌లతో ఏర్పాటైన ఈ కమిటీ రెండు రోజులపాటు అర్చకులతో కూలంకషంగా చర్చలు జరిపింది.

ఈ చర్చలలో అర్చకులు ఈ క్రింది డిమాండ్లను కమిటీ ముందుంచారు :

1. ఎండోమెంట్ కమిషనరు జారీ చేసిన సర్క్యులర్‌లను వెంటనే ఉపసంహరించాలి.
2. ఇంత వరకు అర్చకుల అజమాయిషీలో వుంటూ వచ్చిన భూములను - వారి అజమాయిషీలోనే వుంచాలి.
3. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అర్చక కుటుంబాల సంక్షేమం కోసం ఒక పథకం అమల్లోకి తీసుకురావటం విషయంలో ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకునే వరకూ, అందుకు తగినట్లుగా 1987 నాటి చట్టాన్ని సవరించేవరకూ - ఈ సర్క్యులర్‌ల జారీకి ముందు అర్చకులకు లభిస్తున్న చెల్లింపులను (ప్రసాదాలలో, ఆర్జిత సేవలలో వాటాలు వగైరా) యథాతథంగా కొనసాగించాలి.
4. సుప్రీంకోర్టు తీర్పుల అమలులో ఏర్పడుతున్న చిక్కులను గురించి సమగ్రంగా చర్చించి, శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు - దేవాదాయ మంత్రి సారధ్యంలో ఒక రౌండుటేబుల్ సమావేశాన్ని నిర్వహించాలి.

సమస్య తీవ్రతను, వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు పరిష్కార చర్యలు తీసుకోవటానికి ఉపక్రమించారు. "అర్చకుల అజమాయిషీలో వున్న భూములకు సంబంధించిన ఫైలులో నేను ఏం వ్యాఖ్యానించానో సౌందరరాజన్ గారికి ఒకసారి చూపించండి" అని తన జాయింట్ సెక్రటరీని ముఖ్యమంత్రి ఆదేశించారు. (ముఖ్యమంత్రి లిఖితపూర్వకంగా ఇచ్చిన ఆదేశాలను(?) ఖాతరు చేయనందుకు ఎండోమెంట్స్ శాఖాధికారులపై ముఖ్యమంత్రి జాయింట్ సెక్రటరీ మండిపడ్డారు)

1996 సెప్టెంబర్ 25న వివిధ అర్చక సంఘాల వారు ముఖ్యమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో ఈ క్రింది అంశాలు గమనార్హం :

"అయ్యా..... సుప్రీంకోర్టు తీర్పులోని స్ఫూర్తి, సారాంశం మీ ఎండోమెంట్ కమిషనరేట్ జారీ చేసిన సర్క్యులర్‌లలో ఎక్కడా ప్రతిఫలించటంలేదు. ఎండోమెంట్ శాఖవారి ఈ సర్క్యులర్‌లు, ఆ తరువాత వారు తీసుకున్న చర్యలు - అర్చకులకూ, ఎండోమెంట్ శాఖకీ మధ్య అగాధాన్ని సృష్టించాయి. రాష్ట్రంలోని ఆలయాల నిర్వహణ సాఫీగా సాగటానికి ఈ సర్క్యులర్‌లూ, చర్యలూ ఏమాత్రం అనుకూలించేవి కావు. ఈనెల 9, 10 తేదీలలో మా సమస్యని అర్థం చేసుకోవటానికి, పరిష్కార మార్గాలు అన్వేషించటానికి ముఖ్యమంత్రి ఒక కమిటీని ఏర్పాటు చేయటం మాకు కొంత ఊరట కలిగించింది. అర్చకుల నిజమైన సమస్యలను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తరపున ఈ కమిటీ హామీ ఇచ్చింది. ... ఈ హామీ వాస్తవరూపం ధరించి, సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని ప్రసాదిస్తుందని విశ్వసిస్తున్నాం..."



నిజానికి, అప్పటికే ఎండోమెంట్ కమిషనరు చర్యలను (సర్క్యులర్‌లను) నిరసిస్తూ తెనాలి, రాజమండ్రి, గుంటూరు, విజయవాడ, ఒంగోలు, భీమవరం, నర్సారావుపేట, సత్తెనపల్లి, అమలాపురం, పొణ్యం, నంద్యాల, వరంగల్లు, ఖమ్మం తదితర పట్టణాలలో బహిరంగ సభలు, సమావేశాలూ జరిగాయి. 1996 అక్టోబరు రెండున సికింద్రాబాద్‌లో ఒక గోష్టి కూడా జరిగింది.

**ఈ గోష్టి గురించి *'ది హిందూ'* పత్రికలో 1996 అక్టోబరు 7న 'Between you and me' లో ఏం రాశారో చూద్దాం :**

*సికింద్రాబాద్‌లోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వానమామలై మఠం అధిపతిని నేను కలవటం, ఆంధ్రప్రదేశ్‌లోని అర్చకుల పరిస్థితి విషయంలో ఆయన అభిప్రాయాలు తెలుసుకోవటం జరిగింది.*

*వీలైనంతవరకు ప్రభుత్వం మత వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. సంస్కరణలనేవి ప్రజల నుండి రావలసినవే కాని (ప్రభుత్వంచేత) రుద్దబడేవి కావు....*

*గతవారం నగరంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఈ అంశంపై ఒక సమావేశం జరిగింది. అందులో అనేకమంది అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. అర్చకుల దుర్భర పరిస్థితుల పట్ల ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తూ పలువురు ప్రసంగించారు....*

*ఇటీవలి కాలం వరకూ - ఏ కథ అయినా "అనగనగా చాలాకాలం క్రితం ఒక ఊళ్ళో ఒక పేద బ్రాహ్మణుడుండేవాడు..." అంటూ ప్రారంభమయ్యేది. రాబోయే రోజుల్లో కథలు మరోరకంగా ప్రారంభమవుతాయి : "అనగనగా కొద్దికాలం క్రితం ఓ గతిలేని అర్చకుడుండేవాడు..."*

*"ఆ, అప్పుడతనికి ఏమయింది?"*

*"ఏమయిందంటే... అతను ఇంకా ఎలా వుంటాడు? దైవ సాన్నిధ్యం చేరుకున్నాడు.."*

*ఆంధ్రప్రదేశ్‌లో రెండు అర్చక కుటుంబాలు గర్భదారిద్ర్యాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నారని పత్రికలలో వచ్చింది. వాళ్ళు కేవలం భక్తి, విశ్వాసాల మీద ఆధారపడి జీవించలేకపోయారు. అర్చకత్వం బ్రతికి బట్టకట్టడానికి ఏదో ఒకటి శీఘ్రంగా జరగాలి. "సర్వేజనాః సుఖినోభవంతు" అన్నప్పుడు ఆ సర్వజనుల్లో అర్చకులు కూడా వుండాలి గదా!*

- కె.ఎస్.

అర్చకుల ఉద్యమాల ప్రభావం వల్ల, అర్చకుల అజమాయిషీలోని భూముల విషయంలో పూర్వపు ఆదేశాలను కొంత మార్పు చేస్తూ ఎండోమెంట్స్ కమీషనర్ 1997 జనవరి 31న ఒక సర్క్యులర్ విడుదల చేశారు. దాని సారాంశం ఇది :

సర్క్యులర్ నెం. జెబి/15239/96 తేది 31.01.97

అంశం : ఎండోమెంట్స్ - అర్చకులకు చెల్లింపులు - వారి సేవకులకు చెల్లింపులకు బదులుగా వారి ఆధీనంలో భూములు - తొలగించబడరాదు -

రిఫరెన్స్ : 1. ఈ కార్యాలయం 1996 మార్చి 31 నాడు జారీ చేసిన సర్క్యులర్ నెం. ఆర్.సి. నెం. జె. 5/15239/96 (చట్టం-నిబంధనలు)

2. ఆర్.సి. నెం. జె5/15239/96 తేది 6.4.1996

3. 1996 ఏప్రిల్ 23న విజయవాడలో, ఏప్రిల్ 24న తిరుపతిలో, ఏప్రిల్ 21 సింహాచలంలో, ఏప్రిల్ 22న కాకినాడలో కమీషనర్ జరిపిన సమీక్షా సమావేశం వివరాలు -

1987 నాటి చట్టంలోని సెక్షన్ 144 క్రింద అర్చకులకు వంశపారంపర్య హక్కులను, ప్రసాదం వగైరాలలో వారికి రాగల వాటాలను నిషేధించటానికి సంబంధించిన సూత్రావళిని రిట్ పిటీషన్ నెం. 638/87 మీద ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు సమర్థించింది. పైన ఉదహరించిన ఒకటి, రెండు రిఫరెన్సులలోనూ, కమీషనరు జరిపిన సమీక్షా సమావేశాలలోనూ అర్చకులకు నిబంధనల ప్రకారం జీతాలు చెల్లించాలనీ, వారు చేసే సేవలకు చేస్తున్న చెల్లింపులకు బదులుగా వారికివ్వబడిన భూముల అజమాయిషీలో ఎలాంటి మార్పు చేయవద్దని ఆదేశించడం జరిగింది.

కొంతమంది ఎగ్జిక్యూటివ్ అధికారులు - అర్చకులకు ఆయా చెల్లింపుల్ని నిలిపివేయటంతో పాటు, వారికి నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన జీతాలను కూడా ఇవ్వటంలేదని, కొన్ని సందర్భాలలో అర్చకుల ఆధీనంలోంచి భూములను లాక్కునే ప్రయత్నాలు కూడా చేస్తున్నారని తెలియవచ్చింది.

ఈ ఆదేశాల ప్రకారం - ఎగ్జిక్యూటివ్ అధికారులు ఎలాంటి పరిస్థితుల్లోనూ అర్చకులకు జీతాల చెల్లింపుని ఆపటానికి వీల్లేదు. అమల్లో వున్న నిబంధనల ప్రకారం వారికి సక్రమంగా జీతాలు చెల్లించాలి.



అర్చకులు చేస్తున్న సేవలకు చెల్లించదగిన పారితోషికాలకు బదులుగా వారికి (అనాదిగా) ఇవ్వబడిన భూములను లాక్కునే ప్రయత్నం చేయకూడదు. ఈ వరకే సమీక్షా సమావేశాలలోనూ, పైన ఉదహరించిన మూడవ రిఫరెన్సులోనూ ఈ విషయం స్పష్టం చేయబడింది. మళ్ళీ ఆదేశాలు వెలువడే వరకూ ఎగ్జిక్యూటివ్ అధికారులు ఈ ఆదేశాలను పాటించాలి....

**దురదృష్టవశాత్తూ, కమీషనర్ లిఖితపూర్వకంగా జారీ చేసిన ఈ ఆదేశాలు సయితం ఉల్లంఘించబడ్డాయి.**

వంశపారంపర్య అర్చకత్వం రద్దు విషయంలో 'నృసింహప్రియ' సంపాదకులు, శాసనమండలి పూర్వపు సభ్యులు శ్రీ వి.పి.రాఘవాచారి తమ పత్రికలో రాసిన భావాలనే తెలంగాణా అర్చక సమాఖ్య న్యాయవాది శ్రీ సుబోధ్ మార్కండేయ 1995 సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు ఎదుట దాఖలు చేశారు. హైకోర్టు నుండి బదిలీ అయిన సమాఖ్య వారి రిట్ పిటీషన్ (నెం. 19869/87) మీద చేసిన వాదనలో భాగంగా శ్రీ మార్కండేయ 'నృసింహప్రియ' పత్రిక సంపాదకీయాన్ని సుప్రీంకోర్టు ముందుంచారు. గమనార్హమైన విషయమేమంటే శ్రీ మార్కండేయ వాదనలను పరిగణనలోకి తీసుకునే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

శ్రీ మార్కండేయ దాఖలు చేసిన సంపాదకీయం ఇలా వుంది :

"ఒక పత్రికా విలేకరి ఈ సంపాదకుడ్ని ప్రశ్నించారు - పెత్తందారీ వ్యవస్థకి అవశేషంగా మిగిలిన అనువంశిక అర్చకత్వాన్ని మీ వంటి ప్రజాస్వామ్య వాది ఎలా సమర్థిస్తున్నారు?.... నిజానికి, రాజకీయ ప్రజాస్వామ్యం, మతం అనేవి రెండూ వేర్వేరు అంశాలు. మత వ్యవహారాలకు ప్రజాస్వామ్యాన్ని గుడ్డిగా వర్తింపజేయలేం. ఎందుకంటే మతం అనేది భగవంతుడిపట్ల విశ్వాసం, వేద విజ్ఞానం ఆధారంగా రూపొందిన జీవన విధానం. వేదాలు భగవంతుడిచే ప్రవచించబడినవి. మన ఋషులు, యోగులు, గురువుల చేత భాష్యం చెప్పబడినవి. వాటిని మీరు విశ్వసించి అనుసరించవచ్చు అనుసరించకపోవచ్చు. ప్రజాస్వామ్యపు ప్రాథమిక లక్షణాలలో ఒకటైన 'అసమ్మతి' అనే దానికి మతం అనే నిఘంటువులో చోటులేదు. విశ్వాసంలేని వాళ్ళ గురించి మాకు సమస్యలేదు. అలాగే మత సంస్కర్తలు కూడా మాకు సమస్యకాదు. గతంలో అనేకమంది సంఘ సంస్కర్తలు బోధించినట్లే ఈ సంస్కర్తలకి కూడా వాళ్ళ వాళ్ళ విశ్వాసాల్ని ప్రచారం చేసుకునే స్వేచ్ఛ వుంది. కాని ప్రభుత్వంలో వుండేవాళ్ళు తాము సెక్యులర్ అని చెప్పుకుంటూ సంస్కర్తల్లాగా వ్యవహరిస్తూ, అనూచానంగా వస్తున్న ఆచారాలు, ఆనవాయితీలు, అర్చన విధానాలలో ఎలా జోక్యం చేసుకుంటారు? వేదాలు, శాస్త్రాలు, సమ్మతించని ఏవో కొన్ని కోర్టు తీర్పుల పేరు చెప్పి తమ చర్యలకి న్యాయబద్ధతని ఎలా ఆపాదించుకోగలరు?..."

అలా, 30/87 చట్టం విఫలమవటానికి కారణాలను విశ్లేషించేటప్పుడు, పై సంపాదకీయాన్ని దృష్టిలో వుంచుకోవాలి.

★ ★ ★ ★ ★

# రెండు కమిటీలు - ఐదు శ్రేణులు

వివిధ ఆలయాలలో జీతాల స్కేళ్ళను హేతుబద్ధీకరించటం కోసం ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి - రెవెన్యూ శాఖ (ఎండోమెంట్స్) జాయింట్ సెక్రటరీ డాక్టర్ సి.ఉమా మల్లేశ్వరరావు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ డి.దేవరాజులు నాయుడు ఒక మెంబరుగానూ, ఎండోమెంట్స్ రీజినల్ జాయింట్ కమిషనర్ మెంబరు - కన్వీనరుగానూ వ్యవహరిస్తారు.

దేవాలయాలలోని అర్చక కుటుంబాల సంక్షేమం కోసం ఒక పథకాన్ని రూపొందించటం కోసం వేరొక కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీలో రెవెన్యూ శాఖ (ఎండోమెంట్స్) జాయింట్ సెక్రటరీ డాక్టర్ సి.ఉమామల్లేశ్వరరావు, ఎండోమెంట్స్ అడిషనల్ కమిషనర్ శ్రీ జి.కృష్ణమూర్తి, తెలంగాణా అర్చక సమాఖ్య ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.వి. సౌందర రాజన్, ఆంధ్రప్రదేశ్ అర్చక కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ ఎస్.సుబ్రహ్మణ్య శాస్త్రి (గుంటూరు), ఆంధ్రప్రదేశ్ దేవాలయాల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమారి ఎన్.రజనీ కుమారి సభ్యులు.

★ ఈ రెండు కమిటీలూ కూడా 1996 అక్టోబరు 6న రాష్ట్ర ప్రభుత్వానికి తమ నివేదికలను సమర్పించాయి.

★ ఈ రెండు కమిటీల సిఫార్సులు పరిశీలించాక, రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలకు ఒక తుది రూపం ఇచ్చి, దానిని సుప్రీంకోర్టుకి నివేదించింది.

★ ఈ కార్యక్రమాల తుదిరూపం విషయంలో తెలంగాణా అర్చక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ అర్చక కాంగ్రెస్‌లు కూడా తమ తమ అభిప్రాయాలను 1997 మార్చి 3న సుప్రీంకోర్టుకి సమర్పించాయి.

★ అయితే వీటికి జవాబుగా రాష్ట్ర ప్రభుత్వం 1997 మార్చి 17న ఒక అఫిడవిట్ దాఖలు చేస్తూ, అర్చక సంఘాలు వ్యక్తం చేసిన కొన్ని భావాలతో ఏకీభవించింది.

★ 1997 ఏప్రిల్ 24న అర్చక సంఘాలు సుప్రీంకోర్టులో తమ లిఖితపూర్వక వాదనలను దాఖలు చేశాయి.

★ అంతా విన్నాక ప్రభుత్వ పథకం మీద సుప్రీంకోర్టు తన తీర్పుని 1997 మే 9న వెలువరించింది.

'రిట్ పిటీషన్ నెం. 638/87 తదితర రిట్ పిటీషన్‌ల మీద సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల్లో అర్చకుల వేతనాల హేతుబద్ధీకరణపై రాష్ట్ర ప్రభుత్వం



ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక'గా చెప్పబడే ఈ నివేదిక నిష్పక్షపాతంగా, వాస్తవ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని తయారైంది. అందులోని ఈ క్రిందిపేరాలు ఇక్కడ ప్రస్తావించవలసిన అంశాలు:

"... అందుచేత, చట్టంలోని సూత్రావళి, ఆ చట్టం ప్రకారం రూపొందిన నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన విరాళం, ఆడిట్ ఫీజులకు - రూ. 5000 లేదా అంతకు పైబడిన వార్షిక ఆదాయం కలిగిన దేవాలయాలు, ధర్మాదాయ సంస్థలు మాత్రమే పరిగణనలోకి తీసుకోబడతాయి. మిగతా సంస్థలు - చట్టంలోని సెక్షన్ -6 పరిధిలోకి వస్తాయని ప్రకటించబడినప్పటికీ, అవి ఎండోమెంట్ శాఖవారి నియంత్రణ క్రిందకు రావు.... ఇంకా, ఏయే ఆలయాలలో, వితరణ సంస్థలలో, మఠాలలో అర్చకులే నిత్యపూజలు నిర్వహిస్తుంటారో - అలాంటిచోట్ల అర్చకులు నియమింపబడాలి.

ఎండోమెంట్ కమిషనరు సమర్పించిన సమాచారం ప్రకారం, ఎండోమెంట్ చట్టంలోని 6(ఎ), 6(బి), 6(సి), 6(డి), 6(ఇ) సెక్షన్‌ల క్రింద ప్రకటించబడిన వితరణ సంస్థలు, మత సంస్థల వివరాలు ఇలా వున్నాయి :

| | | | | |
|---|---|---|---|---|
| 6 (ఎ) | : వితరణ సంస్థలు | - 9, | మత సంస్థలు | - 64 |
| 6 (బి) | : వితరణ సంస్థలు | - 134, | మత సంస్థలు | - 590 |
| 6 (సి) | : వితరణ సంస్థలు | - 918, | మత సంస్థలు | - 25,419 |
| 6 (డి) | : మఠాలు | - 218 | | |
| 6 (ఇ) | : ధర్మాదాయ సంస్థలు | - 02 | | |

| వరుస నెం | ఆదాయం | వితరణ సంస్థల సంఖ్య | దేవాలయాలు, ధర్మాదాయ సంస్థల సంఖ్య |
|---|---|---|---|
| 1. | 6(ఎ) క్రింద రూ. 5 లక్షలు, ఆపైన ఆదాయం కలవి | 09 | 64 |
| 2. | 6(బి) క్రింద రూ. 50 వేలకు పైబడి రూ. 5 లక్షలకు లోపు ఆదాయం కలవి | 134 | 590 |
| 3. | 6(సి) క్రింద రూ. 50 వేలు, అంతకన్నా తక్కువ ఆదాయం కలవి | 918 | 25,419 |
| 4. | 6(డి) క్రింద ఆదాయంతో నిమిత్తం లేని మఠాలు | - | 218 |
| 5. | 6(ఇ) క్రింద ధర్మాదాయం | - | 02 |

పై గణాంక వివరాల ప్రకారం, కేవలం 5,533 దేవాలయాలు మాత్రమే ఏటా రూ. 5000కు పైబడిన వార్షిక ఆదాయంతో ఎండోమెంట్ శాఖ నియంత్రణ, పర్యవేక్షణల క్రిందకు వస్తున్నాయి....

ఈ దేవాలయాల విషయంలో మాత్రమే, డిపార్ట్‌మెంట్ అధికారుల నుండి గణాంక వివరాలు లభ్యమైనాయి. తదనుగుణంగా అవి ఆదాయాల ఆధారిత శ్రేణులుగా వర్గీకరించబడ్డాయి. అర్చకుల వేతనాల హేతుబద్ధీకరణ, ఆయా సంస్థల పనిభారం, అవసరాలను బట్టి అక్కడ సిబ్బంది సంఖ్యను ఖరారు చేయటం వంటి అంశాల అధ్యయనం కోసం ఈ వర్గీకరణ జరిగింది....

(పిపి 22, 23)

పైన పేర్కొనట్లుగా అర్చక సంఘాల అభ్యర్థనలలోగానీ, వ్యక్తిగతంగా అర్చకులు తెలిపిన అభిప్రాయాలలో గానీ వ్యక్తమయిన ఒక ఏకాభిప్రాయం ఏమిటంటే - అన్ని ఆలయాలలోనూ ప్రస్తుత పరిస్థితి యథాతథంగా కొనసాగాలని. అంతే కాక, ఆలయసేవలకు చెల్లించాల్సిన పారితోషికానికి బదులుగా రాజీ ఒప్పందం క్రింద అర్చకులకు కేటాయించబడిన (దీర్ఘకాలంగా వారి ఆధీనంలో వున్న) భూములను అలాగే కొనసాగనివ్వాలి. హారతిపళ్ళెంలో వచ్చే కానుకలు, టెంకాయ చిప్పలు, తెలంగాణా ప్రాంతంలో సుల్సేసుల్సాన్ వాటాలను కూడా యథాతథంగా కొనసాగనివ్వాలి.

...తమకు ప్రభుత్వోద్యోగులతో సమానంగా - అధమాధమం - ఆలయాలలో పనిచేసే 'సెక్యులర్' సిబ్బందితో సమానంగానైనా సమంజసమైన వేతనాల స్కేళ్ళను అమలు చేయాలన్న కోరికను వారు వ్యక్తం చేశారు. కొన్ని అర్చక సంఘాల సభ్యులైతే తమ జీతాలను తమకు నేరుగా చెక్కుల రూపంలో చెల్లించాలని కోరారు. ఇందువల్ల తాము తమ జీతాలను మధ్యవర్తుల బెడదలేకుండా నేరుగా తీసుకోగలుగుతామన్నారు...

ప్రభుత్వోద్యోగులు ఇప్పుడు అనుభవిస్తున్న అన్ని రిటైర్‌మెంట్ ప్రయోజనాలను తమకు కూడా వర్తింపజేయాలని కూడా అర్చకులు అభ్యర్థించారు...."

(పిపి 30, 31)

★ ★ ★ ★ ★



# వాళ్ళకీ, వీళ్ళకీ ఎనిమిదొందలే!

**ఈ** పరిస్థితిని సమీక్షించి, విశ్లేషించినప్పుడు అర్చకులకు ఆయా ఆలయాల శ్రేణిని బట్టి, అక్కడి సాంప్రదాయాలనుబట్టి విభిన్న పద్ధతులలో వేతనాలు చెల్లిస్తున్నారనీ, వీటిలో ఏకరీతి విధానం అంటూ ఏదీ లేదనీ వెల్లడవుతోంది.

ఈ నేపథ్యంలో అర్చకుల జీతాల హేతుబద్ధీకరణ, చెల్లింపు విధానం స్థిరీకరణ, అర్చకుల వినతి పత్రాలు, ఆలయాలలో నెలకొన్న పరిస్థితులను అధ్యయనం చేయటం లక్ష్యంగా ఏర్పడిన ఈ కమిటీ వివిధ ఆలయాలను సందర్శించింది.

అర్చకులు చేస్తున్న సేవలకుగాను, వారికి పారితోషికం విభిన్న రకాలుగా చెల్లించబడుతుండటం గురించి చట్టంలోని సెక్షన్ 144 పరిధిలో, సెక్షన్ 35(3) క్రింద జారీ అయిన జీవో (ఎం.ఎస్) నెం. 1171కి (తేది 16.12.1987)కి అనుగుణంగా చర్చించబడింది. ఈ వరకే చెప్పినట్లుగా, రూ. 5000 లోబడిన ఆదాయంకల దేవాలయాలు - ఎండోమెంట్ శాఖ 'తప్పనిసరి నియంత్రణ' క్రిందకురావు. ఎందుకంటే వాటి ఆదాయాల్లోంచి విరాళాలు తీసుకోవటం లేదు కనుక. ఈ ఆలయాల నిర్వహణ అనేది ఆయా అర్చకుల చేతుల్లో గానీ, స్థానికంగా ఏర్పాటైన కమిటీ చేతుల్లోగానీ వుంటోంది.

అలాంటి ఆలయాల్లో అర్చకులకు వేతనాలను హేతుబద్ధీకరించటం సాధ్యపడదు కనుక, అక్కడి నిర్వహణను ఎప్పటి లాగా ఎండోమెంట్ శాఖే చూసుకోవాలి... (పి 46)

.... రూ. 5000 వార్షికాదాయం కల ఆలయాల విషయం (పైన వివిధ అభ్యర్థనల్లో ప్రస్తావించినట్లుగా) చూస్తే- కొన్ని ఆలయాలలో అర్చకులకు నిర్దిష్ట మొత్తం మాత్రమే నెలనెలా చెల్లించబడుతోంది. కొన్ని చోట్ల జీతాల స్కేళ్ళు అమలు జరుగుతున్నాయి. మరికొన్నిచోట్ల కోర్టు ఉత్తర్వులననుసరించి గానీ, ఎండోమెంట్ శాఖ ఉత్తర్వులననుసరించిగానీ రూపొందిన రాజీ ఒప్పందం ప్రకారం - జీతాలు, పారితోషికాలకు బదులుగానూ, డిట్టం ప్రకారం జరిగే పడితరం ఖర్చులకుగానూ ఆలయ భూములపై ఆదాయాన్ని అర్చకులు తీసుకోవటాన్ని అనుమతిస్తున్నారు. ఇంకొన్ని ఆలయాలలో రద్దయిపోయిన 1966 నాటి (17/66) చట్టానికి అనుబంధంగా వున్న షెడ్యూలు -2లో నిర్ణయించబడిన రేట్ల ప్రకారం అర్చకులకు పారితోషికం చెల్లించబడుతోంది. మరోరకం కేసులలో పారితోషికంతో బాటుగానీ, పారితోషికం లేకుండా గానీ ఆర్జిత సేవల రుసుములో వాటా చెల్లించబడుతోంది. కొన్నికొన్ని ఆలయాల్లో హుండీ కానుకలలో వాటా ఇస్తున్నారు.

తెలంగాణా ప్రాంతంలో ఒక ప్రత్యేకమైన 'పారితోషికం చెల్లింపు' విధానం అమల్లో వుంది. ఇదే 'సుల్సేసుల్సాన్' విధానం. లేదా నగదు గ్రాంట్ల రూపంలో కూడా ఈ చెల్లింపు విధానం

కొనసాగుతూ వుంది. ఇంకా కొన్ని మందిరాల్లో పారితోషికాలతో పాటు హారతి పళ్ళెం కానుకలలో, ప్రసాదాలలో వాటాలు కూడా అర్చకులకు అనుమతించబడుతున్నాయి.... (పి.47)

... నిజానికి అర్చకుల నియామకాల విషయంలోనూ, వాళ్ళకి పారితోషికాల చెల్లింపుల విషయంలోనూ, ఏ దేవాలయానికి ఆ దేవాలయం ఒక ప్రత్యేకత కలిగి వుంది. ఎందుకంటే ఈ నియామకాలు, పారితోషికాలు అనేవి ఆయా ఆలయాల సాంప్రదాయాలు, ఆదాయం, అర్చనావసరాలు, పనిభారం వగైరాలనుబట్టి వుంటుంది. వేతనాల హేతుబద్ధీకరణ కమిటీ ఈ అంశాలన్నింటినీ ఆమూలాగ్రం అధ్యయనం చేసింది. ... వర్గీకరించింది... విశ్లేషించింది... చివరికి, రూ. 5000 పైబడిన వార్షికాదాయం కల దేవాలయాలన్నింటినీ కొన్ని గ్రూపులుగా విభజించాలని అభిప్రాయపడింది. చట్టంలోని 6(ఎ), 6(బి), 6(సి) సెక్షన్‌లతో సంబంధం లేకుండా జీతాల స్కేళ్ళను, సిబ్బంది సంఖ్యను హేతుబద్ధీకరించటం కోసం, పారితోషికాలను నిర్ణయించటం కోసం ఇలా గ్రూపులుగా వర్గీకరించటం సమంజసమని కమిటీ భావించింది''

(పి. 49)

**ఎ) రూ. 5000 లోపు వార్షికాదాయం గల ఆలయాలలో అర్చకులకు పారితోషికాలు :**

ఇలాంటి ఆలయాలన్నింటినీ ఈకమిటీ పరిధి నుండి తప్పించాలని కమిటీని అభ్యర్థించడం జరిగింది. వాళ్ళ వాదన ప్రకారం - రూ. 5000 లోపు వార్షికాదాయం గల ఆలయాల్లో పనిచేసే అర్చకుడి కుటుంబానికి కనీసావసరాలు తీరేలా జీతాలు చెల్లించటం ఆయా ఆలయ కమిటీలకు సాధ్యపడే విషయం కాదు. అలాంటి ఆలయాల విషయంలో ఆయా స్థానిక కమిటీలే తమ శక్త్యానుసారం అర్చకులకు చెల్లించే విధానాన్ని అనుమతించాలని సూచించబడింది.

ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ, అలాంటి ఆలయాలు స్థానిక కమిటీల చేతనే నిర్వహించబడటాన్ని, ఎండోమెంట్ శాఖ పర్యవేక్షణను మాత్రమే - అనుమతించాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది.

**బి) ఏటా రూ. 5000లపైన, రూ. 50 వేలకు లోపు ఆదాయం కల ఆలయాలు :**

ఏ దేవాలయం యొక్క ప్రధాన లక్ష్యమైనా, అక్కడి మూల విరాట్‌కి నిత్య ధూపదీప నైవేద్యాలు, బ్రహోత్సవాలు, తదితర సేవలను ఆయా సాంప్రదాయాలు, ఆచారాలు, ఆనవాయితీల ప్రకారం నిర్వహించటం. కాబట్టి అర్చకుడికి చెల్లించే పారితోషికాన్ని అతి ముఖ్యమైన ఖర్చుగా పరిగణించాల్సి వుంది. దేవాదాయంలో మొదటి ఖర్చు అదే అవుతుంది కూడా.



నివేదికలో వివరించిన విధంగా రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు ఎండోమెంట్ చట్టం పరిధిలోకి వస్తాయి. వాటి వాటి ఆదాయాన్ని బట్టి ఆ ఆలయాలన్నీ సెక్షన్ 6 క్రింద ప్రకటించబడతాయి. కాని, రూ. 5,000 గానీ అంతకు పైబడిన వార్షిక ఆదాయంగానీ గల ఆలయాలు మాత్రమే ఎండోమెంట్ నిధికి విరాళాలిచ్చే శ్రేణిలోకి వస్తాయి. ధర్మకర్తల్ని, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌లని నియమించటం విషయంలోనూ, బడ్జెట్ అంచనాలను ఆమోదించటం విషయంలోనూ ఆయా ఆలయాలు ఎండోమెంట్ శాఖవారి నియంత్రణ, పర్యవేక్షణ క్రిందకి వస్తాయి. సెక్షన్ 15లో ఉదహరించిన విధంగా ధర్మకర్తల నియామకాలు (ఆయా ఆలయాల స్థాయినిబట్టి) ప్రభుత్వంచేత, లేదా ఎండోమెంట్ కమిషనర్ చేత, లేదా డిప్యూటీ కమిషనర్ చేత, లేదా అసిస్టెంట్ కమిషనర్ చేత చేయబడతాయి.

అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల నియామకాలు కూడా ఆయా ఆలయాల స్థాయి, లేదా కొన్ని చిన్న ఆలయాల సమూహం యొక్క స్థాయిని బట్టి - ఎక్కడెక్కడ వార్షికాదాయం రూ. 50,000 నుండి ఒక లక్ష రూపాయల వరకు వుంటుందో తదనుగుణంగా - జరుగుతాయి.

ప్రతి ధర్మకర్త, లేదా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (అక్కడి నిబంధనలను బట్టి) ఆయా ఆలయాల యొక్క బడ్జెట్ ఎస్టిమేట్‌ను సంబంధిత అధికారికి ఏటా సమర్పించాల్సి వుంటుంది. ఈ బడ్జెట్‌లో - ఆ ఆలయం, లేదా ఆ ధర్మ సంస్థలో వస్తు సామగ్రి, నిర్వహణ, నిత్య దేవతార్చనాది కార్యక్రమాల ఖర్చులు, సేవలు చేసేవారికి పారితోషికాలు, ప్రసాదాలకి కావలసిన దినుసులు, బకాయిలు చెల్లింపులు, పారిశుధ్యం, భద్రత వగైరాల ఖర్చులు, రిజర్వు ఫండ్‌కి విరాళం, నిర్మాణాలకి - మరమ్మత్తులకి ఖర్చులు వగైరా అన్నింటికీ కేటాయింపులు చూపించాలి.

మత, సెక్యులర్ సంస్థలలో జీతాలకు సంబంధించి, చట్టంలోని 65వ సెక్షన్‌లో - ఆయా సంస్థలలో ఖర్చు అక్కడి వార్షికాదాయంలో 30 శాతానికి మించకూడదు అని నిర్దేశించబడింది. ఎండోమెంట్ నిధికి విరాళం చెల్లింపు వెసులుబాటు కోసం ఈ నిబంధన విధించబడింది. కాబట్టి అర్చకుల, ఇతర సేవకుల వేతనాలను నిర్ణయించేటప్పుడు, చట్టప్రకారం - ఈ మొత్తం ఖర్చు 30 శాతానికి మించకుండా, చూసుకోవాల్సి వుంటుంది. అర్చకులు, ఆలయ సేవలలో పాల్గొనే సహాయకులే కాక, అక్కడి గుమాస్తాలు, అటెండర్లు వగైరా కార్యాలయ సిబ్బంది కూడా ట్రస్టుబోర్డుకి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కి సహాయపడటం కోసం పనిచేస్తుంటారు. (వీరి జీతాలు కూడా 30 శాతం ఖర్చు క్రిందకి వస్తాయి).....

చట్టంలో సెక్షన్ 6(సి) క్రింద వర్గీకరించబడిన దేవాలయాలలో పనిచేస్తున్న అర్చకులకు చెల్లిస్తున్న అత్యల్ప, అత్యధిక జీతాల వివరాలతో కూడిన పట్టికలను జిల్లాలవారీగా క్రిందిస్థాయి అధికారులు దాఖలు చేసినప్పుడు వాటిని ఇతర స్టేట్‌మెంట్లతోపాటు పరిశీలించటం జరిగింది.

అలా చూసినప్పుడు - రూ. 5,000, అంతకు పైబడి రూ. 25,000 రూపాయలకు లోపు వార్షికాదాయం కలిగిన ఆలయాలలో అర్చకులకు చెల్లిస్తున్న అత్యల్ప, అత్యధిక జీతాలు ఏక రీతిలో లేవని వెల్లడైంది.

ఉదాహరణకి, విశాఖపట్నం జిల్లాలోని వెంకటనగరం గ్రామంలో బంగారమ్మ గుడి వార్షికాదాయం రూ. 5,228 కాగా, అక్కడ అర్చకుడికి చెల్లించబడుతున్న నెలజీతం రూ. 15గా చూపించబడింది. ఆ శ్రేణి ఆలయాలలో అదే అత్యల్పం. అలాగే, అదేశ్రేణి ఆలయాలలో చెల్లించబడుతున్న అత్యధిక నెల జీతం - కరీంనగర్ జిల్లాలోని మోతె (వి)లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడికి రూ. 800. ఆ గుడి వార్షికాదాయం రూ. 15,942.

ఇదే రూ. 25,000 - రూ. 50,000 వార్షికాదాయ శ్రేణిలో గల ఆలయాలలో అర్చకుడికి అత్యల్ప నెలజీతం చెల్లించబడుతున్న పరిస్థితి పశ్చిమ గోదావరి జిల్లా ఆలమూరులోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వుంది. అక్కడి వార్షికాదాయం రూ.37,447 కాగా అర్చకుడికిచ్చే నెల జీతం రూ. 30 మాత్రమే.

ఇదే శ్రేణిలోకి వచ్చే ఖమ్మంలోని శ్రీ అన్నపూర్ణా సహిత కాశీవిశ్వేశ్వర స్వామి గుడి ఆదాయం ఏటా రూ. 48,000. ఈ శ్రేణి ఆలయాల్లోకెల్లా అర్చకుడికి అత్యధిక జీతం లభించేది ఈ ఆలయంలోనే. ఎంత అంటే - రూ. 800.

అంటే ఏమిటయింది? రూ. 5000 - రూ. 25,000 శ్రేణిలోని గుడిలో సేవ చేసే అర్చకుడి అత్యధిక ఆదాయమూ (రూ. 800), రూ. 25,000 - రూ. 50,000 శ్రేణిలోని గుడిలో దేవుణ్ని సేవించే అర్చకుడి అత్యధిక ఆదాయమూ (రూ. 800) ఒక్కటే!

ఈ ఉదాహరణలను బట్టి, రూ. 50,000 లోపు వార్షికాదాయం కల దేవాలయాల్లో అర్చకులకు చెల్లింపబడే జీతం ఎంత తక్కువుందో కూడా అర్థమవుతోంది.

పైగా సుప్రీంకోర్టు సమర్థించిన (చట్టంలోని) సెక్షన 144 ప్రకారం, దేవాలయంలో వచ్చే హారతిపళ్ళెం కానుకలు, ఆర్జిత సేవల రుసుములు, ప్రసాదాలు, హుండీ కానుకలు, గతంలో వారికి కేటాయించబడిన భూములపై ఆదాయం వగైరాలలో వాటా పొందటానికి అర్చకులకు ఎలాంటి హక్కూ లేదు. అంటే, సెక్షన్ 144 కనుక అమలు చేసినట్లయితే, ఈ రూ. 50,000 వార్షికాదాయం కల దేవాలయాల్లో అర్చకుడికి లభించగల జీవనభృతి (జీతం) అతని చిన్న కుటుంబాన్ని పోషించుకోవడానిక్కూడా సరిపోనంత అల్పమైందిగా మిగిలిపోతుంది. ఈ విషయాన్నే పలు అర్చక సంఘాలు నొక్కి చెబుతూ, చట్టంలోని సెక్షన్ 144ని ఈ శ్రేణి (రూ. 25,000 నుండి రూ. 50,000 లోపు ఆదాయంకల) దేవాలయాలకు వర్తింపజేయరాదని అభ్యర్థించాయి.



అలాగే, అనేక ఆలయాలలో - కార్యాలయ సిబ్బందికి (గుమాస్తాలు వగైరా) వచ్చే జీతాలకన్నా అల్పమైన జీతాలను అర్చకులకు చెల్లిస్తున్నారు. నిజానికి, ఏ ఆలయం యొక్క లక్ష్యం అయినా భక్తి భావాలను ప్రోత్సహించటం, ఆ భక్తి భావాలను ఉద్దీపింపచేయటం ద్వారా వ్యక్తిలో వుండే భావ కాలుష్యాన్ని నిర్మూలించి, పవిత్రత, సత్సంకల్పాలు నిండిన వ్యక్తిత్వం రూపకల్పనకు మార్గదర్శకత్వం వహించటం. ఇంతటి కీలకమైన కార్యక్రమంలో సంధాత అర్చకుడు. తెల్లవారుఝామున సుప్రభాత సేవ మొదలుకొని, రాత్రి పవళింపు సేవ వరకు అన్ని రకాల సేవలలో ధూపదీప నైవేద్యాది ప్రక్రియలను వేదోక్తంగా భక్తి ప్రపత్తులతో - వారాంతపు శెలవుల కోసం చూడకుండా - నిర్వహించే అర్చకుడికి జీవనభృతిని కల్పించటం ఏ ఆలయంలోనైనా పరిపాలనా పరంగా జరగాల్సిన ప్రధాన కార్యం.

ఈ దృక్పథంలో ఆలోచించి, అల్పాదాయం వచ్చే దేవాలయాలలో - ముఖ్యంగా సెక్షన్ 6(సి) క్రిందకు వచ్చే దేవాలయాలలో - కార్యాలయ సిబ్బందిని క్రమంగా తగ్గించుకుంటూ పోవాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. ఇందువల్ల సిబ్బంది మీద వ్యయం - ఎండోమెంట్‌లోని సెక్షన్ 57లో నిర్దేశించిన విధంగా - 30 శాతానికి పరిమితం అయ్యేలా చూడాలి. అయితే ఈ చర్యను - చిన్న జీతాల మీద పనిచేసే స్వీపర్ల వంటివారికి వర్తింపజేయనక్కర్లేదు.

సరే, రూ. 25,000 - రూ. 50,000 శ్రేణికి చెందిన ఆలయంలో ఒకే అర్చకుడు పనిచేస్తున్నాడనుకుందాం. ఆ ఆలయం యొక్క వార్షికాదాయం రూ. 50,000 అనుకుందాం. అప్పుడు ఎండోమెంట్ చట్టంలోని సెక్షన్ 57 ప్రకారం అక్కడ అనుమతించబడగల సిబ్బంది వ్యయం (30%) ఏడాదికి రూ. 15,000. ప్రభుత్వ స్కేళ్ళ ప్రకారం అలాంటి ఆలయ కార్యాలయంలో పనిచేసే రికార్డు అసిస్టెంట్‌కి చెల్లించే నెల జీతం రూ. 2,200. అంటే రికార్డు అసిస్టెంట్‌కిచ్చే జీతం మొత్తమే ఆ ఆలయ వార్షిక ఆదాయంలో 51 శాతం (రూ. 26,400) అవుతోంది. అయినప్పుడు అర్చకుడి జీతం ఎలా చెల్లిస్తారు? కాని, ఈ "సిబ్బంది వ్యయం 30 శాతానికి మించకూడదు" అన్నది ఒక శాసనం. దాన్ని అతిక్రమించటానికి లేదు.

....ఇలాంటి ఆలయాల విషయంలో అర్చకులకు ఈ 30 శాతం నిబంధనలకు లోబడి జీతాలు నిర్ణయించటం సాధ్యపడదనీ, కనుక అక్కడంతా ఇంతకు (ఈ చట్టం అమల్లోకి రావటానికి) ముందున్న విధానాన్నే కొనసాగించాలని అర్చక సంఘాలు చేసిన సూచనతో ఈ కమిటీ ఏకీభవించింది.

తదనుగుణంగా, ఇలాంటి ప్రత్యేక పరిస్థితులున్న దేవాలయాలను ఎండోమెంట్ చట్టంలోని సెక్షన్ 144 నుంచి మినహాయించాలని కూడా ఈ కమిటీ సిఫార్సు చేస్తోంది...

(పిపి 50-55)

ఈ విశదీకరణతో మనకి ఈ 30/87 దేవాదాయ చట్టం ఎలా ఆచరణ సాధ్యం కానిదిగా వుండిపోయిందో తెలుస్తోంది.

దురదృష్టమేమిటంటే, 6(సి) సెక్షన్ క్రిందకి వచ్చే ఆలయాలని చట్టంలోని సెక్షన్ 144 పరిధి నుండి మినహాయించాలని ఈ కమిటీ చేసిన సిఫార్సుని ఆమోదిస్తూ (ఆరు సంవత్సరాల తరువాత) ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు 2002 జూన్ 20న విడుదలైంది. ఈ ఆరు సంవత్సరాల కాలం పాటు కొనసాగిన అయోమయ పరిస్థితిని అవినీతి శక్తులు విశృంఖలంగా తమ స్వార్థానికి ఉపయోగించుకున్నాయి.

★ ★ ★ ★ ★



# ఆలయాల్లో అల్లకల్లోలం

**ఈ** అవినీతి శక్తుల విజృంభణ రాష్ట్రంలోని దేవాలయ వ్యవస్థని (ముఖ్యంగా సెక్షన్ 6(సి) పరిధిలో) అల్లకల్లోలం చేసిపారేసింది.

'కొత్త చట్టం ప్రకారం వంశపారంపర్య అర్చకత్వం రద్దయింది' అన్న నెపంతో - పాత అర్చక కుటుంబంలో అర్హులైనవారు వున్నప్పటికీ - వారు కొత్త ఖాళీలలో నియమించబడకుండా ఈ శక్తులు ప్రయత్నించాయి.

అక్రమార్జనే పరమావధిగా పెట్టుకుని, ఆచార సాంప్రదాయాలపరంగా తగిన యోగ్యతలు లేనివాళ్ళని సయితం - అర్చకుల పోస్టులలో నియమించటానికి ఈ శక్తులు కుయుక్తుల్ని ప్రయోగించాయి. నియమబద్ధమైన అర్చనలకన్నా స్వార్జనకే ప్రాధాన్యతనిస్తూ వచ్చాయి.

దేవుడి మాన్యం తాలూకు ఆదాయం మీద, ఆర్జిత సేవలు వగైరాల ఆదాయాల మీద అర్చకులకు వస్తున్న వాటాలను నిర్దాక్షిణ్యంగా స్తంభింపచేశాయి.

చట్టంలోని సెక్షన్ 57 బూచిని చూపిస్తూ ఆదాయంలో 30 శాతం కన్నా సిబ్బంది వ్యయం మించకూడదు కాబట్టి మీ "జీతాలు ఇక పెరగవు", "ఒకవేళ పెరిగినా ఈ పావలా అర్ధాకన్నా మించదు.." అంటూ చేతులు దులుపుకున్నాయి.

ఆలయాల్లో నిత్య వేద పారాయణ చేస్తూ వచ్చిన వృద్ధ పండితులకు సయితం ఇదే సెక్షన్ 57 నెపంతో రిక్తహస్తాలని చూపిస్తూ వచ్చాయి.

ఏతావాతా, "అర్చకులు తమ హక్కులన్నీ కోల్పోయారు. వాళ్ళింక నెలజీతగాళ్ళు మాత్రమే" అని ప్రచారం చేస్తూ హారతి పళ్ళెంలో కానుకలు, కొబ్బరి చిప్పల దగ్గర్నుంచి అర్చకుల భూముల మీద ఆదాయం దాకా ఎక్కడెక్కడ అవకాశముంటే అక్కడంతా స్వాహా చేస్తూ వచ్చాయి...

ఈ స్వార్థ శక్తుల కారణంగా ఈ ఆరేళ్ళ కాలంలో దేవాలయ వ్యవస్థ ఎంత కలుషితమైపోయిందంటే - చాలా చోట్ల ఆలయాలతో ఎలాంటి అనుబంధంలేని, ఆచార వ్యవహారాలతో సంబంధంలేని కొత్త వ్యక్తులు - ఈ స్వార్థ శక్తుల్ని 'సంతృప్తి పరచటం' ద్వారా - ఆలయ ధర్మకర్తలుగా, అర్చకులుగా నియమితులయ్యే ప్రమాదం ఏర్పడింది. ఇక్కడ్నుంచీ అంతా - దిగజారుడుతనమే. స్వార్థ శక్తుల విజృంభణకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. చట్టంలో దూరదృష్టిలోపించటం, ఆ చట్టం అమలు కోసం జారీ అయిన సర్క్యులర్‌లలో వాస్తవ పరిస్థితి పట్ల అవగాహన కొరవడటం - ఈ స్వార్థశక్తులకు మరింత ఊతమిచ్చి, ఆలయ వ్యవస్థ - సంక్షోభం సాగరంలోకి నెట్టివేయబడటానికి కారణమయ్యాయి.

అర్చకుల వేతనాల హేతుబద్ధీకరణ కమిటీకి ఇచ్చిన పలు అభ్యర్థనలలో అర్చకులు ఎత్తి చూపించిన కొన్ని వాస్తవిక అంశాలు ఇలా వున్నాయి :

"... వంశపారంపర్య అర్చకత్వం ఇప్పుడు రద్దయిందంటున్నారు. ఇదే వారసత్వం ఆధారంగా అర్చకుల నియామకం జరగదు. అంటే, ఇప్పటిదాకా అర్చకత్వం నెరపుతున్న అదే వంశానికి చెందిన వ్యక్తి నియమితులు కానక్కర్లేదు. కాని అదే ఆగమానికి చెందిన వేరొక వ్యక్తి ఎవరన్నా (యోగ్యతలనుబట్టి) నియమింపబడవచ్చు. అయితే ఈ కొత్తచట్టం అమల్లోకి వచ్చి, అర్చకుల సర్వీసులకుసంబంధించిన సూత్రావళి వర్తింపజేయబడే వరకూ, ప్రస్తుత పరిస్థితినే కొనసాగనివ్వండి.."

ఈ అభ్యర్థనకు తగినట్లుగా కమిటీ ఏం సూచించిందంటే, అర్చకుల నియామకం విషయంలో - అంతవరకూ అర్చకత్వాన్ని నిర్వహిస్తూ వచ్చిన కుటుంబంలోని (అర్హత కల) సభ్యులకు ప్రథమావకాశం ఇవ్వాలని, 1987 నాటి రిట్ పిటీషన్ నెం. 638 మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దృష్ట్యా చట్టంలోని సంబంధిత సూత్రావళిలో 'చేర్పు' అవసరం.

అంటే ఇప్పటికే అర్చకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారి కుటుంబంలో ఎవరన్నా యోగ్యత కలవాడు ముందుకొచ్చి, "అర్చకత్వాన్ని నావృత్తిగా స్వీకరిస్తాను" అని ప్రకటిస్తే, (అసలు అర్చకత్వం పట్ల ఆసక్తి చూపించేవాళ్ళే కరువవుతున్న ఈ రోజుల్లో) అలాంటి వారికి ప్రథమావకాశం ఇచ్చి ప్రోత్సహించాలి అని కమిటీ అభిప్రాయపడింది. స్థాపక ధర్మకర్తల కుటుంబాల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని స్ఫూర్తికి ఇది అనుగుణంగా కూడా వుంటుంది.

అలాగే, ఇప్పుడు అర్చకుల పదవీ విరమణ వయస్సు 65 సంవత్సరాలు. అయితే, వారు పాటిస్తున్న నియమబద్ధమైన జీవితం, క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లు కారణంగా అనేకమంది అర్చకుల, ఆలయ పండితుల జీవనకాలం 80-85 సంవత్సరాలు దాకా వెళ్తోంది. ఇలాంటి అర్చకులు, వేద పండితుల సేవలు - వారి వయసు పైబడిన కొద్దీ పరిణత, పరిశుద్ధత, పవిత్రతా పరిమళాలు వెదజల్లుతున్నాయి. కనుక వారిలో తగిన శారీరక దార్ఢ్యం కలవారిని - ఆచారపరులైన కొత్త అర్చకులు, సాంప్రదాయబద్ధమైన వేద పఠనాసక్తి పరులు తయారయ్యేలా శిక్షణనివ్వటానికి వినియోగించుకోవాలి. అలాగే ఆలయాల్లో సయితం వారి పదవీ విరమణ వయోపరిమితిని 75 ఏళ్ళ దాకా పొడిగించాలి.

దేవాలయాల నిర్వహణలో అనేక చిక్కుముడుల్ని సృష్టించటం ద్వారా అనేక అనర్థాలకి మూలహేతువుగా తయారైంది చట్టంలోని సెక్షన్ 144. ఈ సెక్షన్ ఆలయ వ్యవస్థకి ఉనికికే ప్రమాదకరంగా తయారైంది. అర్చకులకూ, ఆలయ యాజమాన్యానికీ మధ్య అగాధాలూ,



వివాదాలూ ఏర్పడటానికి కారణమైంది. ఎండోమెంట్ శాఖలో అవినీతి దెయ్యం జడలు విప్పుకుని విజృంభించడానికి అవకాశమిచ్చింది.

ఈ దురవస్థకి చట్టం, చట్టంలోని సెక్షన్ 144 మూలమైతే, ఒక సాంఘిక సంస్కరణగా ఈ చట్టాన్ని అమలు చేసే విషయంలో పాలనా యంత్రాంగం పనితీరుని ఓ కంట కనిపెట్టి చూడటంలో రాజకీయ నాయకత్వం, ఉన్నతాధికారవర్గం ఘోరంగా విఫలమయ్యాయి. ఇందుకు తార్కాణంగా దేవాదాయ శాఖ మంత్రి రాసిన లేఖని చెప్పుకోవాలి. ఆయన 2001 మే నెలలో ఎండోమెంట్ కమిషనర్‌కి ఓ లేఖ రాస్తూ, 1987 నాటి చట్టాన్ని తగు విధంగా సవరించటానికి ప్రతిపాదనలు పంపించవలసిందిగా కోరారు. అంతే! ఆ లేఖ బుట్ట దాఖలైపోయింది.

6(సి) శ్రేణి దేవాలయాలలో అర్చకులకు నెల జీతాలను నిర్ణయించటంలో గల అనౌచిత్యాన్ని, దుస్సాధ్యాన్ని ఎత్తి చూపిస్తూ, ఆ కారణంగా ఈ శ్రేణి ఆలయాలను సెక్షన్ 144 పరిధి నుంచి తప్పించేలా 1987 చట్టం (30/87)లోని 154 సెక్షన్‌లో గల సూత్రావళిని వర్తింపజేయాలని 1996 అక్టోబరు 4 నాడు 'అర్చకుల వేతనాల హేతుబద్ధీకరణ కమిటీ' చేసిన సిఫార్సుకి సయితం అడ్రసు లేకుండా పోయింది.

సుప్రీంకోర్టుకి సయితం ఆమోదయోగ్యంగా కనుపించిన ఈ కమిటీ సూచనలు, సిఫార్సులు తుంగలో త్రొక్కి వేయబడ్డాయి. బదులుగా, అర్చకులపై వేధింపు చర్యలు ఆరంభమయ్యాయి.

తమ మనుగడని, అస్తిత్వాన్ని, ఆలయ వ్యవస్థ స్ఫూర్తిని దెబ్బ తీసేలా తలెత్తిన ఈ వేధింపు చర్యల్ని నిరసిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయ అర్చకులు వీధిన పడ్డారు. అనునిత్యం ఆలయంలో మూలవిరాట్‌ని ఆరాధించడానికీ, ఆ దైవాన్ని సేవించే భక్తుల్ని ఆశీర్వదించటానికి మాత్రమే తమ గళాన్ని వినియోగిస్తూ వచ్చిన అర్చకులు - తొలిసారిగా ఆలయాల మహద్వారాలు దాటి వీధిల్లోకొచ్చి, మంత్ర పఠనం చేసే గొంతుల్లో నిరసన ధ్వనులు నింపి 2001 నవంబరు 12న ఆందోళనకు దిగాల్సి వచ్చింది.

ఇంత గందరగోళం జరిగాక -

2001 నవంబరు 19 నాడు ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఆ జీవో ప్రకారం - 2000 డిసెంబరు 8 నాటి ఉత్తర్వులకు లోబడి నియమింపబడిన వారికి మాత్రమే రిటైర్‌మెంట్ విధానం వర్తిస్తుంది.

తిరిగి 2001 డిశెంబరు 4న 6(సి) శ్రేణిలోని ఆలయాలన్నింటినీ సెక్షన్ 144 పరిధి నుండి మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. "ఆలయాలలో సిబ్బంది సంఖ్యను స్థిరీకరించేవరకూ, అర్చకులకు వేతనాల స్కేళ్ళు వర్తింపజేసేవరకూ 6(ఎ), 6(బి) ఆలయాల

తాలూకు భూముల అజమాయిషీ నుండి అర్చకులను తొలగించరాదు" అని కూడా ఆ జీవో పేర్కొంది. నిరాశా, నిస్పృహలకు గురవుతున్న అర్చకులకు అది కొంత ఊరట కలిగిస్తుంది - ఖచ్చితంగా అమలు జరిగిన పక్షంలో!!

ఆ తరువాత కూడా 2003 ఫిబ్రవరి 2నాడు రాష్ట్ర ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటనలో ఈ చట్టంలో కొన్ని మార్పులు చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించింది. అయినా సందిగ్ధస్థితి, అస్పష్టత, అయోమయం, 2001 డిసెంబరు 4 నాటి ఉత్తర్వుని అమలు చేయటంలో ఉదాసీనత (నిర్లక్ష్యం) పలు చోట్ల కొనసాగుతూనే వచ్చాయి. ఈ పుస్తక రచయిత 2003 జూలై 4 నాడు ముఖ్యమంత్రిని కలిసి, ఈ సమస్యకు ఆచరణ సాధ్యమైన ఒక పరిష్కారాన్ని సూచించారు. దానికి కొనసాగింపుగా ప్రిన్సిపల్ సెక్రటరీతోనూ, ఎండోమెంట్ కమిషనర్‌తోనూ కూడా చర్చించటం జరిగింది.

చివరికి 2003 అక్టోబరు 21న ఎండోమెంట్ కమిషనరు ఆధ్వర్యంలో అర్చకులతో అధికారులు జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులు వ్యక్తం చేసిన అభిప్రాయం - " ఈ 37/80 చట్టం - దాని లక్ష్య సాధనలో ఘోరంగా విఫలమైంది..."

ఆ సమావేశం జరిగాక ఎండోమెంట్ కమిషనరు జారీ చేసిన సర్క్యులర్ ఏం చెప్పిందంటే-

"... కొంతమంది ఎగ్జిక్యూటివ్ అధికారులు పైన పేర్కొన్న ఆదేశాలకు బద్ధులై వుండటంలేదని అర్చక సంఘాల ప్రతినిధులు కమిషనరు దృష్టికి తీసుకువచ్చారు. కనుక అన్ని ఆలయాల్లోనూ ఆయా ఎగ్జిక్యూటివ్ అధికారులు పై ఆదేశాలను విధిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని రీజినల్ జాయింట్ కమిషనర్లను, డిప్యూటీ కమిషనర్లను, అసిస్టెంట్ కమిషనర్లను, ఎగ్జిక్యూటివ్ అధికార్లను ఆదేశించడమైంది... ఈ విషయంలో ఎలాంటి ఉల్లంఘన జరిగినా దాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, అలాంటివారిపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం జరుగుతుంది..."

**ఇలాంటి ఆదేశాలు, హెచ్చరికలు ఎన్ని జారీ అయినా చట్టంలో అసంబద్ధత, అస్పష్టత, అసమగ్రత కొనసాగినంతకాలం మన సనాతన ఆలయ వ్యవస్థ స్ఫూర్తికి ఈ పాశవిక చట్టం కోరల్లోని విష వాయువులు సోకుతూనే వుంటాయి.**

తాత్కాలికంగా 168 ఆలయాలు ఈ చట్టం ధాటిని తట్టుకుని మనగలిగినట్లుగా కనుపించినప్పటికీ, 31,969 దేవాలయాలు ప్రమాదం అంచున వ్రేలాడుతూనే వున్నాయి.

చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సులతో మొదలుపెట్టి - కోర్టు ఆదేశాలు, ఎండోమెంట్ కమిషనరు జారీ చేసిన సర్క్యులర్‌లూ, సుప్రీంకోర్టు సూచించిన సంక్షేమ పథకం అమలులో



ఉదాసీనత... అన్నీ వెరసి - ఆలయ వ్యవస్థని నమ్ముకుని సమాజ శ్రేయస్సే లక్ష్యంగా జీవిస్తున్న సుమారు ఒక లక్ష అర్చక కుటుంబాల్ని అమాంతంగా నిరాశా, నిస్పృహ, నిస్సత్తువలలో ముంచేశాయి. వారి జీవితాల్ని అంధకార బంధురం చేసేశాయి.

1987లో చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సుల్ని గుడ్డిగా నమ్మి అత్యంత ఆర్భాటంగా, హడావుడిగా, ఆఘమేఘాల మీద అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టం (30/87) ఈ 16 సంవత్సరాల కాలంలో ఎన్నెన్నో మలుపులు తిరిగింది. పలు క్రింద కోర్టుల్లో పిటీషన్‌లు, హైకోర్టులో లిటిగేషన్‌లు, సుప్రీంకోర్టులో లిటిగేషన్‌లు, తాత్కాలిక ఇంజెంక్షన్‌లు, కొన్ని సమర్ధనలు, కొన్ని రద్దులు, కోర్టు నుంచి కొత్త ఆదేశాలు, ఎండోమెంట్ కమిషనర్‌ల అత్యుత్సాహభరిత సర్క్యులర్‌లు... ఇవన్నీ చవిచూస్తూనే ఈ చట్టం - దేవాలయ వ్యవస్థలో కీలకమైన అర్చక వ్యవస్థకి మాత్రం భయంకరమైన చేదు అనుభవాన్ని చవిచూపించింది.

ఈ పదహారు సంవత్సరాలలో రాష్ట్రంలో నాలుగు ప్రభుత్వాలు మారాయి. కానీ హిందూ సమాజానికి పట్టుకొమ్మ అయిన ఆలయ సంస్కృతిని ఈ చట్టం చట్రంలోంచి కాపాడటానికి మాత్రం ఏ ప్రభుత్వమూ చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు.

ఒక లక్షకు పైగా గల అర్చక కుటుంబాలలో - చల్లా కొండయ్య కమిషన్ నివేదిక 'ఫలం'లో జనించిన '30/87 చట్టం' అనే విష సర్పం కోరల్లోంచి వెలువడిన విషవాయువుల ప్రభావం ఎంతటి ఘోరకలిని సృష్టించిందంటే..

సెక్షన్ 34 : తరతరాలుగా గుడినీ, గుడిలో దేవుడ్నీ నమ్ముకుని, సమాజ శ్రేయస్సు కోసం - తాను తిన్నా తినకపోయినా - దేవుడికి మాత్రం నిత్య ధూపదీప నైవేద్యాలతో సేవలందిస్తున్న అర్చకుడికి 'అనువంశిక అర్చకత్వ హక్కు'ని రద్దు చేసేసింది.

సెక్షన్ 39 : ఆగమ శాస్త్రానుసారం, సాంప్రదాయబద్ధంగా ఆయా ఆలయ ఆచారాలతో ముడివేసుకున్న జీవనంతో దేవుడ్ని సేవిస్తున్న అర్చకులకూ, ఇతర సేవకులకూ స్థానభ్రంశం కల్పించి, ఏ ఆలయం నుంచి ఏ ఆలయానికైనా బదిలీ చేసే పర్వానికి శ్రీకారం చుట్టింది.

సెక్షన్ 76, 82(1), 82(2) : కొన్ని వందల వేల సంవత్సరాల క్రితం ఆలయ స్థాపకులైన రాజులు, వదాన్యులు ఆలయ సేవలకోసం కేటాయించిన భూములపై అర్చకుల అజమాయిషీని రద్దు చేశాయి.

సెక్షన్ 144 : హారతి పళ్ళెంలో భక్తులు వేసే కానుకలు, నైవేద్య ప్రసాదాలతో సహా ఎందులోగానీ అర్చకులకు ఇంతకాలం వస్తున్న వాటాల్ని రద్దు చేసింది.

అత్యంత అమానుషంగా అర్చకుల పొట్టకొట్టే ఆయుధంగా తయారైంది.

సెక్షన్ 57 : ఆలయ సిబ్బంది (కార్యాలయ సిబ్బందితో కలిపి, వ్యయం - ఆదాయంలో 30 శాతానికి మించని విధంగా అర్చకులకు చెల్లించాల్సిన జీతాలపై శాసన పరిమితిని విధించింది.

ఈ గరళం నిండిన గుళికల్లాంటి సెక్షన్‌లతో కూడిన ఈ చట్టం ప్రభావం ఏమిటంటే- హారతి పళ్ళెంలో కానుకలతో సహా హరించి వేస్తూ ఇది అర్చక వ్యవస్థ ఉనికినే సవాల్ చేసేలా బుసలు కొడ్తుంటే, భగవంతుడికీ, భక్తుడికీమధ్య సంధానకర్తలా వ్యవహరించే అర్చక కుటుంబాలు - తమ కడుపుమాడిన ఆక్రోశంతో ఈ అరాచకపు ప్రజాస్వామ్య ప్రభుత్వాల కన్నా ఆలయాల్ని స్థాపించి, పోషించిన ఆ రాచరిక పాలనే మెరుగేమోననిపించేలా ఆవేదనలతో రోదించే దౌర్భాగ్య స్థితి ఏర్పడింది.

.... ఈ చట్టం, దాని ప్రకారం జారీ అయిన సర్క్యులర్‌లు అవకాశంగా తీసుకుని అనేక ఆలయాల్లో - స్వార్థశక్తులు విజృంభించాయి... పర్యవసానం?

**1987-1996 కాలంలో అర్చకులకు జరిగిన వాటాల చెల్లింపుల్ని వారికి ఇవ్వబడిన జీతాల్లోంచి కర్కశంగా వసూలు చేసే ప్రయత్నాలు జరిగాయి....**

**ప్రసాదాలు, హారతిపళ్ళెంలో వాటాలు సహా అన్ని వాటాలకు అర్చకులు "చట్టప్రకారం అనర్హులు... అనర్హులు" అని ఎత్తిచూపుతూ, వారిని నిస్సహాయుల్ని చేసే, దౌర్జన్యాలు జరిగాయి...**

**స్వార్థంతో అనర్హుల్ని అర్చకుల్ని చేసే ప్రయత్నంలో వృద్ధ పూజారుల్ని సయితం దుర్భాషలతో అవమాన పరిచిన దుర్ఘటనలు జరిగాయి...**

**జీతగాళ్ళపేరుతో అర్చకుల శ్రమను సొంత ప్రయోజనాల కోసం దోచుకునే దుస్సాహసాలు జరిగాయి... ఎక్కడ్నుంచి ఎక్కడికైనా బదిలీ చేసెయ్యొచ్చునంటూ అర్చక కుటుంబాల్ని భయోత్పాతానికి గురిచేసే కుయుక్తులు ప్రయోగించబడ్డాయి...**

**తమ అక్రమార్జనలకి సహకరించే దుష్టశక్తుల్ని ధర్మకర్తలుగా నియమింపజేసే దురాగతాలు జరిగాయి...**

అవమానభారంతో, ఆకలి బాధతో, కళ్ళలోంచి రక్తం చిమ్మేటంతటి ఆక్రోశంతో ఒకరిద్దరు అర్చకులు ఆత్మహత్యలు చేసుకున్నారు!!

చల్లా కొండయ్య కమీషన్ నివేదిక ఆధారంగా - ఆలయ వ్యవస్థకి జీవకర్ర లాంటి అర్చక కుటుంబాల మీద గత పదహారు సంవత్సరాలుగా సాగిన, ఇంకా సాగుతున్న ఈ దాడితో



శారీరక, మానసిక క్షోభకి గురవుతున్న నిస్సహాయ అర్చక కుటుంబాల సమస్యకి 2003 అక్టోబరు 24 నాటి ఒక్క ఉత్తర్వు పరిష్కారం కాదు, కాబోదు.

అర్చక కుటుంబాల సంక్షేమం కోసం సుప్రీంకోర్టు సూచించిన సమీకృత పథకాన్ని అమలు చేయకుండా, వాళ్ళ అర్చక స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తూ, అర్చక కుటుంబాల ఆక్రోశాల మధ్య వారిని శాశ్వతంగా ఆలయాల్నుంచి తరిమివేసేలా - తద్వారా ఆలయ సంస్కృతి అంతరించిపోయేలా చేస్తున్న ఈ హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టం (30/87) సమూలంగా సవరింపబడటం ఒక్కటే ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం.

ఈ లక్ష్యాలకి కట్టుబడి పనిచేసే ప్రభుత్వం మాత్రమే పదికాలల పాటు వర్ధిల్లాలని ఆలయ సంస్కృతీ పరిరక్షణాభిలాషులందరం ఆశిద్దాం.

అందుకోసం నడుంకట్టి, కలిసికట్టుగా పనిచేద్దాం. మనం నమ్ముకున్న దైవాన్ని మనసారా ప్రార్థిద్దాం...

**॥లోకాస్సమస్తాః సుఖినోభవంతు॥**

# అనుబంధాలు

'వాక్' (దేవాలయాల వాణి) అనే త్రిభాషా మాసపత్రిక సహకారంతో ఈ పుస్తకం ప్రచురించబడుతోంది. ఆలయ వ్యవస్థకి సంబంధించి అన్ని వర్గాలవారిని చైతన్యవంతుల్ని చేసే కరదీపికగా **'వాక్'** పనిచేస్తోంది.

30/87 చట్టం వల్ల ఉత్పన్నమైన, ఇంకా కొనసాగుతున్న దురాగతాలను ఎండగడుతూ నాటి నుంచీ **'వాక్'** ప్రచురించిన సంపాదకీయాలలో కొన్నింటిని ఇక్కడ ప్రచురిస్తున్నాం.

## అనుబంధం - 1

*అర్చక సంక్షేమనిధి గురించి 2001 ఫిబ్రవరిలో 'వాక్'....*

......సుప్రీమ్‌కోర్టు ఒకప్రక్క అర్చకుల నియామకాలను క్రమబద్ధీకరించే సెక్యులర్ హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి వున్నదనే విషయాన్ని అంగీకరిస్తూ మరోప్రక్క, ఇలా తన అభిప్రాయాన్ని ప్రకటించింది. "...అర్చకులను, వారి కుటుంబాలతో సహా, దైనందిన జీవన సమరాన్ని కొనసాగించే స్థితిలో వుంచడం అవసరమనీ, అలా జరిగినప్పుడే దేవాలయాలలోని దేవతామూర్తుల అర్చనకు, అర్చకులు ఏకాగ్రతతో తమ జీవితాలను అంకితం చేసుకుంటారనీ" భావించింది. రాష్ట్రప్రభుత్వహక్కుకు ఏ స్థాయిలో ప్రాముఖ్యమివ్వాలో అదే సమాన స్థాయిలో అర్చక సంక్షేమాన్ని పరిగణించాలని అభిప్రాయ పడింది.

పై అభిప్రాయాన్ని ఆచరణ సాధ్యం చేయడానికి సుప్రీమ్‌కోర్టు, అర్చకుల జీతాల స్కేళ్ళను హేతుబద్ధీకరించే విషయంతో పాటు అర్చక సంక్షేమ నిధి గురించి స్పష్టమైన సూచనలు చేసింది. అర్చక సంక్షేమ నిధికై, రూ. 75 కోట్లనిధిని సేకరించే బాధ్యత రాష్ట్రప్రభుత్వం వహించాలని పేర్కొనింది. దీనికై, తిరుమల తిరుపతి దేవస్థానం జూన్ 1996తో అంతమయ్యే ఆర్థిక సంవత్సరం లోపు రూ.20 కోట్లు డిపాజిట్టు చేయాలని, ఆదేశించారు. ఆ తదుపరి, నిధి మొత్తం రూ.75 కోట్లకు చేరేవరకు ప్రతిసంవత్సరం రూ. 10కోట్ల వంతున డిపాజిట్ చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలోని మరో ఐదు పెద్ద దేవాలయాలు కూడా నిధిలో తమవంతు మొత్తాలను డిపాజిట్ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. 1996-97 ఆర్థిక సంవత్సరంలో ఈ ఐదు దేవాలయాలూ ఒక్కొక్కరు రూ.5 కోట్ల వంతున డిపాజిట్ చేయాలనీ, ఆ తదుపరి నాలుగు సంవత్సరాలలో ప్రతి సంవత్సరమూ రూ.1 కోటి వంతున, ఈ ఐదు దేవాలయాలూ డిపాజిట్ చేసేలా చూడాలనీ కూడ సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పై లెక్కల సారాంశమేమంటే, టిటిడి తమ వంతుగా రూ. 40 కోట్లను సమకూర్చాలనీ, ఇతర పెద్ద దేవాలయాలు రూ.35 కోట్లను జమచేయాలనీ ఆదేశించినట్లయ్యింది. అంటే, సుప్రీంకోర్టు దృష్టిలో కనీసం రూ.75 కోట్ల నిధి వుంటే తప్ప, అర్చక సంక్షేమ బాధ్యత కష్టమని తేటతెల్లమయ్యింది. సుప్రీంకోర్టువారి ఈ చర్య ఎంతో విజ్ఞతతో, దూరదృష్టితో కూడిన చర్య. ముఖ్యంగా, ఎవరు ఎంతెంత మొత్తాలను, ఏ నిర్ణీత సమయంలోపు సమకూర్చాలో, ఎవరు బాధ్యత వహించాలో, చాలా స్పష్టంగా పేర్కొనడం అత్యంత అభినందనీయ అంశం.

సుప్రీంకోర్టు ఆదేశాల అమలు గురించి ప్రస్తుత స్థితి గురించి నేడు దృష్టి సారించవలసిన అవసరం వుంది. 'వాక్' పత్రిక పాఠకులైన మీకు, పేస్కేళ్ళ అమలు విఫలమైందన్న విషయం తెలుసు. అర్చక సంక్షేమ నిధికి పట్టిన దుర్గతి గురించి ప్రస్తావించవలసిన అవసరం వుంది.

1997వ సంవత్సరంలో (జూన్ 1, 1997) అర్చక సంక్షేమ నిధి రూ.9.9 కోట్లతో ప్రారంభించబడింది. ఇందులో టిటిడి వారు సమకూర్చినది రూ.6 కోట్లు మాత్రమే. (సుప్రీంకోర్టు టిటిడి బాధ్యతగా ప్రస్తావించిన మొత్తం రూ.20 కోట్లు అని గమనించవలసిన అవసరంవుంది.) సుప్రీంకోర్టు పేర్కొన్న ఐదు పెద్ద దేవాలయాలనుండి నిధుల సమీకరణలోని సాధక బాధకాలను గుర్తెరిగిన రాష్ట్రప్రభుత్వం, మరో ఐదు దేవాలయాలను అదనంగా చేర్చి, ఆ పదిదేవాలయాల తరఫున రూ.3.9 కోట్లు మాత్రమే సమకూర్చగలిగింది. ఈ విధంగా సమకూర్చిన మొత్తం కేవలం రూ.9.9 కోట్లు మాత్రమే. ఈ మొత్తంతో ఈ నిధిని భారత రాష్ట్రపతి, గౌరవనీయులు శ్రీశంకర్ దయాళ్‌శర్మ గారు తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరుని క్షేత్రంలో ప్రారంభించారు.

దిగ్భ్రాంతి కలిగించే వాస్తవమేమిటంటే - ప్రారంభం మాత్రమే నోచుకున్న అర్చక సంక్షేమనిధి ఆ తర్వాత కుంటుపడింది. టిటిడి గాని మరే యితర దేవాలయం గానీ, ఇంకా ఏ మొత్తాలూ సమకూర్చలేదు. సరిగదా, టిటిడి వారు 17-1-1998 నాడు సుప్రీంకోర్టుని, తమను అర్చకనిధికి మొత్తాలను సమకూర్చే బాధ్యతనుండి తప్పించాలని, తామిచ్చిన రూ.6 కోట్లను వాపసు ఇవ్వాలనీ పిటీషను దాఖలు చేశారు. మిగిలిన పెద్ద దేవాలయాలు

టిటిడి బాటనే అనుసరించాయి. మౌనం వహించాయి. కోర్టువారి నిర్ణయమేదైనా, టిటిడితోపాటు తమకూ వర్తిస్తుందన్న నమ్మకంతో నిమ్మకు నీరెత్తినట్లు పూరుకుండిపోయాయి. ఈ విధంగా అర్చక సంక్షేమ నిధి ఆదినుండీ శాపగ్రస్తమై, ఆచరణకు, అమలుకు నోచుకోని విషాదగాథ అయ్యింది.

సర్వసాక్షి అయిన శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ విషయాలు తెలియవని ఎలా భావించగలం! స్వామికి, సర్వోన్నత న్యాయస్థానం వారి, సమంజస నిర్ణయంలోని ఆంతర్యం తెలుసు. తననూ, తన రూపాలైన ఇతర దేవతామూర్తుల అర్చనకూ, తరతరాలుగా తమ జీవితాలను అంకితం చేసుకున్న అర్చక కుటుంబాల సంక్షేమం ఎంత ముఖ్యమో, ఆ సంక్షేమానికి సంబంధించిన భయాలు లేనప్పుడే అర్చకత్వంపై పూర్తి దృష్టి నిలుపగలరనీ తెలుసు. స్వామివారు, ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించే పెద్దలు ఎందుకని వాగ్దానభంగం చేయ సాహసిస్తారో అని ఆశ్చర్యపోతూ వుండవచ్చు. తమ కర్తవ్యాన్ని నిర్వహించకుండా ఎందుకు వెనకడుగు వేయ నిర్ణయిస్తారో, మాట ఇచ్చిన మేరకు నిధులను సమకూర్చకుండా ఎందుకు తమ బాధ్యతలను విస్మరిస్తారో అని విచారిస్తూ వుండవచ్చు.

అధికారవర్గం వారి తెలివితేటలు, న్యాయబుద్ధి సరియైన దారిలో పయనించి విధాన కర్తలకు సరియైన సలహాలను ఇచ్చేలా చేస్తాయని ఆశిద్దాం. ప్రభుత్వచర్యలు, దురదృష్ట ప్రకంపనలకు సంకేతాలు కాకూడదనీ, భగవంతుని సేవలో నిమగ్నమైన అర్చకులు, అనాథలుకాకూడదనీ విశ్వసిద్దాం.

## అనుబంధం - 2

*ఆలయ ధర్మకర్తల మండళ్ళు, కమిటీలు, రాజకీయ పునరావాస కేంద్రాలుగా తయారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, 2001 జూలైలో 'వాక్'...*

దేవాలయాల నిర్వహణలో ట్రస్టీ పదవి ప్రముఖమైనది. కనుక, ఈ పదవిని చేపట్టేవారు అత్యున్నతస్థాయిగల సత్యప్రవర్తనతో తమ బాధ్యతలను క్రమశిక్షణతో, భక్తితో, సావధానతతో, పరిశుద్ధతతో, దేవాలయం పట్ల, ప్రజల పట్ల అంకితభావంతో కృషిచేసేవారై ఉండాలి. కానీ, ఆచరణలో ఇది జరగటం లేదు. దేవాదాయ, ధర్మాదాయ సంస్థల ట్రస్ట్ బోర్డులకు నియామకాలు జరిగేటప్పుడు ఆయా సంస్థల బాగోగుల విషయం పట్టించుకోక పోవడం, అన్య విషయాలకు అనవసర ప్రాముఖ్యం ఇవ్వబడటం చేత ఈ నియామకాలు



కళంకితమవుతున్నాయని ఫిర్యాదులున్నాయి.

క్రమం తప్పకుండా దేవాలయానికి వచ్చేవారు, గ్రామంలోని భజన మండలులు భక్తమండలులు-ట్రస్టీలుగా నియమింపబడటానికి అర్హులైన మంచి వ్యక్తుల పేర్లను సూచించగలరు.

ఈ ట్రస్టీలనియామకాల్లో మనకు తరచు వినిపించే ఫిర్యాదుల్లో మొదటిది (*1) సరైన, తగిన వ్యక్తిని నియమించకుండా, రాజకీయ లేక వ్యక్తిగత కారణాల వల్ల దక్షతలేని, చిత్తశుద్ధిలేని వ్యక్తిని ట్రస్టీగా చేస్తున్నారని, తద్వారా ఈ రకంగా నియమించబడ్డ ట్రస్టీలు ఆయా సంస్థల అభివృద్ధికై పాటుపడటం లేదని, ఈ రకంగా నియమించబడ్డ ట్రస్టీలు సంస్థ బాగోగులను విస్మరిస్తూ రాజకీయ కార్యకలాపాలకు మద్దతు నిస్తున్నారని కూడా నివేదించబడింది. ఇలాంటి రాజకీయ తదితర అసంబద్ధ కారణాలవల్ల జరుగుతున్న నియామకాలు పెరగటం పట్ల, దేవాలయాల నిర్వహణలో వారి జోక్యం పట్ల, తమ తీవ్ర ఆవేదనను ఎందరో హైందవభక్తులు వ్యక్తపరుస్తున్నారు.

దేవాలయాలు, తదితర సంస్థల నిర్వహణ ఆయా సంస్థల మూలాలను నిర్వీర్యపరిచేలా, రెండు విధాలుగా వ్యాధికారకంగా బిగిపిడికిట ఇరుక్కున్నట్లు రికార్డులలో ఉన్న సాక్ష్యాధారాల వలన మనం గమనిస్తాం. ఒకవైపు సంస్థల బాగోగుల విషయపరంగా కాక, వాటి నిర్వహణలో రాజకీయ కార్యకర్తల ప్రమేయాన్ని చొప్పించటానికి ఇది దోహదపడుతుంది. రెండవవైపు ఈ ట్రస్టీలు సంస్థల బాగోగులనుకాక ప్రజలలో తమ వ్యక్తిగత, రాజకీయ పలుకుబడిని మెరుగుపర్చుకొనేందుకు అవకాశం కల్పిస్తోంది.

ట్రస్టీల నియామకం విషయంలో ఆయా సంబంధిత అధికారుల ఇష్టానుసారం ఎవరినైనా నియమించవచ్చు. దీనికి వారు ఎవరికీ జవాబుదారీ కారు. ఏ కారణాల వలన నియమించడం జరిగిందో, ఆ కారణాలు లిఖితపూర్వకంగా చూపబడటంలేదు. ఈ నియామకాన్ని ఎదిరిస్తూ కమీషనర్‌కు అప్పీలు చేయడానికి చట్టంలో అవకాశం ఉన్నా కూడా లిఖితపూర్వకంగా కారణాలు లేకపోవడం వలన కుదరడం లేదు అని (*2) ఫిర్యాదు అందింది.

సెక్షన్ 15 ప్రకారం ఇలా నియామక ఉత్తర్వులు ఇచ్చినప్పుడు, నియమించడానికి గల కారణాలను పేర్కొనడం ధర్మబద్ధంగాను న్యాయబద్ధంగాను ఉంటుంది. ఈ విధంగా చేయటం వలన ఆ అనర్హుల నియామకాన్ని నిరోధించటానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా నియామకాలను సరియైన, న్యాయబద్ధమైన కారణాలను పేర్కొంటూ చేయాలి అనే నియమం రాజకీయ జోక్యానికి అడ్డుకట్టగా నిలుస్తుంది.....

ఇప్పటి వరకు మీరు చదివినది 'వాక్' సంపాదకీయ వ్యాఖ్యకాదు. గతంలో 15 సంత్సరాల క్రిందటి పరిస్థితుల దుస్థితిని ప్రతిబింబిస్తున్న వ్యాఖ్యలు అవి. నిజానికి ఆ శక్తివంతమైన వ్యాఖ్యలు పరిస్థితులలో మార్పును తీసుకువచ్చి ఉండవలసింది. కానీ, దురదృష్టవశాత్తూ, ఆ పరిస్థితులు మరింతగా క్షీణించిన వాస్తవాన్నే నేడు మనం చూస్తున్నాం.

పై సంపాదకీయంలోని మొదటి ఆరుపేరాలు చల్లా కొండయ్య కమీషన్ 1986 నివేదిక నుండి యథాతథంగా తీసుకోబడ్డవి. (Vol. 2, Pages 75, 76, 79 to 81, 83) (గమనిక : *1 కు బదులుగా "కమిషనుకు అందించిన", 2 కు బదులుగా "కమిషన్ ద్వారా" అని చదువుకుంటే, ఇది అసలు నివేదికకు సరియైన ప్రతిబింబం కాగలదు.

## అనుబంధం - 3

*పేద దేవాలయాలు, అతిపేద అర్చకులు ఎందుకు పన్ను కట్టాలి?* - 'వాక్' మార్చి *2001*

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా రూ.5000/- ఆదాయంకన్నా ఎక్కువగల దేవాలయాలు, ధర్మసంస్థల నుండి క్రింది విధంగా రుసుము వసూలు చేస్తుంది.

1) తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వార్షికాదాయంలో .7% కానీ, 50 లక్షలుకానీ (ఎక్కువ మొత్తం ఏదైతే అది)

2) ఇతర దేవాలయాల నుండీ, సంస్థలనుండీ వార్షికాదాయంలో 15% (సెక్షన్ 65(1), 65(2) – Endowments Act, 1987)

ఈ మొత్తం ఎండోమెంట్స్ ఎడ్మినిస్ట్రేషన్ ఫండ్‌లో జమ చేయబడి, ఎండోమెంట్ శాఖ ఉద్యోగుల జీతభత్యాలకూ, పెన్షన్లకూ, ఇతర ఖర్చులకూ ఉపయోగ పడుతుంది.

ఈ నిధి యొక్క ఆదాయవ్యయ వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. (ఆధారం : ఎండోమెంట్స్ మంత్రి 12.3.2001న శాసనసభలో సమర్పించిన బడ్జెట్‌నోట్‌లోని ఏడోపేజీ)

| Year | Receipts | Charges | Surplus (Worked out by VAK) |
|---|---|---|---|
| | Rs. | Rs. | Rs. |
| 1996-97 | 8,11,62,590-30 | 7,28,76,094 | 82,86,496-30 |
| 1997-98 | 10,26,78,037-00 | 8,66,78,550 | 1,59,99,487-00 |
| 1998-99 | 14,42,95,593-00 | 10,48,81,896 | 3,94,13,697-00 |
| 1999-00 | 17,45,58,581-53 | 12,91,10,143 | 4,54,48,438-53 |
| **Total** | **50,26,94,801-83** | **39,35,46,683** | **10,91,48,118-83** |



పై పట్టిక పరిశీలిస్తే, 1996 - 2000లో ఆదాయం 50.27 కోట్లనీ, వ్యయం 39.36 కోట్లనీ 10.91 కోట్లు మిగులు ధనమనీ తెలుస్తోంది. ప్రతి సంవత్సరమూ, ఈ మిగులుధనం పెరుగుదలలోనే ఉంది.

చట్ట ప్రకారం, వ్యయాన్ని అనుసరించి వసూలు ఉండాలి; మిగులు ధనం ఏదైనా ఉంటే, అది తరువాతి సంవత్సరానికి బదిలీ చేసి, వసూలు రుసుము ఆమేరకు తగ్గించాలి. అలా జరగలేదనేది నిర్వివాదాంశం.

ప్రస్తుతం టి.టి.డి. వార్షికాదాయం 500 కోట్లు. తక్కువలో తక్కువగా, ఈ నాలుగేళ్ళలో ఆదాయం 1000 కోట్లు (50%) అనుకోవచ్చు. దీంట్లో 7% డెబ్బై (70) కోట్లు.

టిటిడి కాకుండా పన్ను కట్టవలిసిన దేవాలయాలు 2985 ఉన్నాయి. వీటి సామూహిక వార్షికాదాయం 170 కోట్ల దాకా ఉంది. ఈ నాలుగేళ్ళలో కనీసం 340 కోట్ల ఆదాయం ఉంటుంది. దీంట్లో 15% అంటే 51 కోట్లు. ఇది యించుమించుగా పట్టికలోని సంఖ్యకు సరిపోతోంది. రాష్ట్రంలోని 34,310 దేవాలయాల్లో 31,325 దేవాలయాల వార్షికాదాయం 5000 రూ॥ కన్నా తక్కువనీ కేవలం 2985 దేవాలయాలు పన్నుపరిధిలో ఉన్నాయనేది శోచనీయమైన విషయం. ఇంకా చెప్పుకోవాలంటే 24,440 దేవాలయల వార్షికాదాయం రూ.1000/- కన్నా తక్కువ.

పై లెఖ్ఖ ప్రకారం కనీసం 121 కోట్లు పైనిధిలో జమ కావల్సి ఉంది. అయితే పట్టికలో కేవలం 50 కోట్లు జమ చూపబడింది. కేవలము టిటిడి నుండే 70 కోట్లు వసూలు అయి ఉండాలి. దీన్ని బట్టి చూస్తే, టిటిడి వసూళ్లు లెక్కలోకి తీసుకోలేదేమోననిపిస్తుంది.

జీవనభృతిగా భూములు అనుభవిస్తున్న అర్చకులు వారి అదాయంలో 15 శాతం జమ చేయవల్సి ఉంది. విచిత్రం ఏమంటే డబ్బు రూపేణా జీతం అందుకుంటున్న అర్చకులు పన్ను జమ చేయవల్సిన అవసరం లేదు.

పై ఆదాయ వ్యయ వివరాలు పరిశీలిస్తే, వసూళ్ళు రానురానూ పెరుగుతున్నాయినీ, నిజానికి పట్టికలో చూపినదానికన్నా ఎక్కువ వసూళ్ళు కావచ్చునీ, ఆ రూపేణా, క్రమక్రమంగా శిస్తు తగ్గించవచ్చునీ అవగతమౌతోంది. ఈ నేపథ్యంలో పేద దేవాలయాలను అతిపేద అర్చకులనూ ఇంకా డబ్బు కట్టమనడం భావ్యమా అనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది.

టిటిడి మరియు 14 ప్రముఖ దేవాలయాలకూ మాత్రమే ఈ చట్టాన్ని పరిమితం చేసి, యితర దేవాలయాలను వదిలేయాలని, **'వాక్'** ప్రతిపాదిస్తోంది.

## అనుబంధం - 4

*ఎండోమెంట్ శాఖలో విశృంఖలమైపోయిన అవినీతిని ఎండగడుతూ 2002 మే నెలలో 'వాక్'....*

ఇది కలియుగం కనుక, ఎన్నో లెక్క లేనన్ని సర్దుబాట్లు చేసుకోవాల్సి ఉంటుంది కనుక, కనీసం మతపరమైన కార్యక్రమాల్లోనైనా ఈ అవినీతి పిశాచాన్ని తరిమిగొట్టలేమా? దీన్ని గురించి ఆలోచించడానికి, కొద్ది నిమిషాలైనా మనం వినియోగించకూడదా? మనం ఈ అవినీతికి, లంచగొండితనానికి వ్యతిరేకంగా గొంతువిప్పకూడదా? ముఖ్యంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖల్లో ప్రబలుతున్న అవినీతికి వ్యతిరేకంగా నోరు ఎందుకు విప్పకూడదు? పారదర్శకమైన ప్రభుత్వాన్ని నిర్వహించడం కోసం, సమధికోత్సాహంతో కృషిచేస్తున్న, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కట్టుబడి ఉన్న, మన గౌరవనీయ ముఖ్యమంత్రి గారికి దీని గురించి విన్నపం చేయరాదా?

**మే నెల 7వ తారీఖు హిందూ దినపత్రికలో అవినీతి నిరోధక శాఖవారు జరిపిన దాడుల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఒక ఉన్నత అధికారి ఇంటినుంచి రూ. 2.30 కోట్లు విలువగల ఆస్తులు పట్టుబడ్డాయని ప్రకటన వెలువడింది.**

తరతమ బేధాలతో, అంటే కొంచం ఎక్కువగానో లేక కొంచం తక్కువగానో, ప్రతిదీ, సాపేక్షికంగా ఉంటుంది. బహుశ; ఇంతకన్నా ఎక్కువ లెక్కచూపలేని మొత్తాలు సంపాదించిన వాళ్ళు ఉండి ఉండవచ్చు. లేదా ఇంతకన్నా తక్కువ స్థాయిలో మాత్రమే సంపాదించుకున్నవారు ఉండవచ్చు. ఇలా అన్ని రంగాల్లోనూ ఉండవచ్చు. గమనించవలసిన ముఖ్యవిషయం ఏమిటంటే అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం చేసే తొలి ప్రయత్నం దేవాదాయ ధర్మాదాయ శాఖతో ఎందుకు ప్రారంభం కాకూడదు?!

ఇలా అవినీతిరహిత సమాజ స్థాపనకోసం ఉద్యమం ప్రారంభిస్తే భక్తులు తప్పకుండా సంతోషిస్తారు; భక్త సులభుడైన భగవంతుడు కూడా అవినీతి రహిత సమాజ నిర్మాణ ప్రయత్నాన్ని ఆశీర్వదిస్తాడు. మన రాష్ట్రంలో ఉన్న దేవాలయాలలోని దౌర్భాగ్య పరిస్థితుల మూలకారణాల్ని అర్థం చేసుకోవడానికి, మన గౌరవనీయ ముఖ్యమంత్రిగారి దృఢ సంకల్పాలను మరింత బలోపేతం చేయడానికి ఈ అవినీతి సంఘటన తోడ్పడుతుందని ఆశిద్దాం.

**ఈ ప్రస్తుత పరిస్థితులన్నింటికీ దేవాదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన (30/87) రాక్షస చట్టమే మూలకారణమని నిర్వీరామంగా, స్పష్టంగా, గొంతెత్తి చాటుతూ**



**వచ్చింది 'వాక్'. ఈ చట్టమే అవినీతి బీజాలను నాటింది. వేళ్ళూనుకొని నిలబడేలా చేసింది. పెంచి పోషించింది. ప్రజ్వలింపచేసింది; నీడను, ఆధారాన్ని కల్పించి రాష్ట్రంలోని దేవాలయాల వ్యవస్థ చెదపుట్టలమయం కావటానికి, చీడ పురుగుల బారిన పడటానికి, సర్వభ్రష్టత్వానికి మూలకారణమైంది! ఈ చట్టం ఇంకా ఇలానే కొనసాగుతే అవినీతి ఇంకా లోతుగా చొచ్చుకుపోతుంది; మరింత బరితెగిస్తుంది. ఈ చట్టాన్ని త్రోసిపారేస్తే దేవాదాయ శాఖలో, దేవాలయాల వ్యవస్థలో అవినీతిని తీసిపారేయడానికి నాంది పలికినట్లు అవుతుంది.**

ఈ చట్టం ప్రభావం ఎంతటి బలవంతమైనదో!?! నిజమైన భక్తులను దూరంగా ఉంచుతుంది. భగవంతుడ్ని దగ్గరకు రానివ్వకుండా, భక్తి భావనలు దరిచేరకుండా చెయ్యి అడ్డంపెడ్తుంది; ప్రభుత్వ యంత్రాంగానికి పైచేయి అందిస్తుంది; రాజకీయ ప్రమేయం శ్రుతిమించుతుంది; అవినీతి స్థాయి, లంచగొండితనం తమ వికృత విశ్వరూపాన్ని, పచ్చిగా, నిర్లజ్జగా, ప్రదర్శిస్తుంది. ఈ రాక్షస చట్టం యొక్క బలమైన చేతుల గొంతునులిమేసే వికృత చేష్టకు భీమసేనాచారి (ఆలంపూర్ దేవాలయ అర్చకులు) ఆత్మహత్య ఒక తార్కాణం. ఈ చట్టం ఆధారంగా అవినీతి ఆయనకు విధించిన ఉరిశిక్ష ఇది.....

## అనుబంధం - 5

*'వ్యవస్థాపక ధర్మకర్తల' స్థానాలలో ఎవరిని పడితే వారిని నియమిస్తూ, సుప్రీంకోర్టు తీర్పుని ప్రభుత్వం నీరు గార్చటం పట్ల విస్మయం వ్యక్తం చేస్తూ, 2002 డిశెంబరులో 'వాక్'...*

అజమాయిషీ సులభతరం కావడం కొరకు, ఆలయాలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. పురాతన ఆలయాలు మరియు సిమెంటు దేవాలయాలు. ఒక మహాభక్తునిచే అంకురార్పణ చేయబడి, అతని కాలాన్ని, ధనాన్ని వెచ్చించి, అనేక కష్టనష్టాలను ఓర్చి, గొప్ప కట్టడాలుగా రూపుదాల్చబడి, అతి కొద్ది గత చరిత్రకల ఆలయాలు సిమెంటు టైపు దేవాలయాలు. ఇటువంటి ఆలయాలలో నిర్మాణానికి కారణభూతుడైన వ్యక్తిని గుర్తించటం ఎంతో సులభం. ఎందుకంటే వీటి స్మృతులు ఎంతో తాజాగా మన మేథస్సులో నిక్షిప్తమై ఉంటాయి. అదే పురాతన ఆలయాలను తీసుకుంటే, ఆలయాన్ని నిర్మించిన వ్యక్తిని గుర్తించడం కష్టం. ఎందుకంటే కొన్ని వేల సంవత్సరాల నుంచి ఇక్కడ భగవంతుడు వెలసి తన భక్తులను తరతరాలుగా ఆశీర్వదిస్తున్నాడు. ఆలయాల రకాలు ఏమైనా, అది నూతనంగా నిర్మించిన

ఆలయమైనా లేక కొన్ని వేల సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయమైనా, వాటిని నిర్మించిన నిర్మాతల భక్తి భావంలో అణువంత తేడా కూడా లేదు. ఈ ఆలయాల నిర్మాతలు ఎప్పుడు కూడా అజమాయిషీ కాని పెత్తనాన్ని కానీ ఆశించలేదు. ఒకసారి ఆలయ నిర్మాణం పూర్తి కాగానే, అది భక్తులకే చెందుతుందనే నిజం ఆ స్థాపకులకు బాగా తెలుసు.

తరాలు అంతరించ సాగాయి. ఆలయాలు కూడా చేతులు మారసాగాయి. వీటి స్థాపకులు కూడా కాలానుగుణంగా అంతర్ధానం అయ్యారు. వ్యవస్థాపక కుటుంబీకుల వారసులు కూడా ఆలయ దినదినాభివృద్ధిని, గమనిస్తూ దీనికి కారణం తమ తాతముత్తాతలే కదా అనే నిష్కల్మషమైన సంతృప్తితో ఉంటున్నారు. భద్రాచలాలయ పునరుద్ధరణకు నడుం కట్టుకుని శ్రమించి సాధించినది భక్త రామదాసు అన్నది జగమెరిగిన సత్యం. కానీ ఈ భక్తుడు ఎన్నడు కూడా ఆలయం తనదని భావించలేదు. అందుకే కాబోలు భక్త రామదాసు యొక్క వంశం వారు ఆలయ అధికారాన్ని ఆశించలేదు. ఇటువంటిదే ప్రతి పురాతన ఆలయానికి వర్తిస్తుంది. రాజులు ఆలయాలు నిర్మించే కాలం ఎప్పుడో పోయింది. ఒకే ప్రదేశంలోని భక్తులో లేక ఒకే వర్గానికి చెందిన భక్తులో కలిసి చందాలు వేసుకుని, విరాళాలు సేకరించి కావలసిన ఆలయాలు నిర్మించారు.

దానం చేసిన దాతలు కానీ విరాళాలు సేకరించిన భక్తులు కానీ ఆలయ అధికారాన్ని కోరలేదు. ఒకసారి ఆలయం నిర్మించబడిన తరువాత అది పూర్తిగా సమాజానికి చెందిన ఆస్తి, దాన్ని ఎవరూ కూడా తమ వ్యక్తిగత ఆస్తిగా ఆశించరాదు. ఈ తత్వాన్ని ప్రస్తుతం ఆమోదించడం సంతోషించదగ్గ విషయం.

1987వ సంవత్సరంలో, 30/87 దేవాదాయ చట్టం అర్చకుల మరియు ధర్మకర్తల వంశపారంపర్య హక్కును రద్దు చేసింది. 1996లో ఈ చట్టాన్ని ఆమోదించిన సుప్రీంకోర్టు కూడా, ఈ వ్యవస్థాపకుల కుటుంబీకులలో ఆలయంపట్ల అంకితభావం ఎక్కువగా ఉంటుందని, వెలుపలి మనుష్యులకంటే అధ్యక్ష పదవికి ఇలాంటివారే అర్హులవుతారని ఆమోదించింది. ఈ పై సూచనలు, ఆలోచనలు నూతనంగా నిర్మించిన ఆలయాలకు మరియు ధార్మిక సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే ఇక్కడ వ్యవస్థాపకులు గుర్తించబడతారు కనుక. కాని మరి పురాతన ఆలయాల మాటేమిటి? ఇక్కడ వ్యవస్థాపకులను గుర్తించడం కష్టం. సుప్రీంకోర్టు తీర్పుయొక్క అంతర్లీన భావాన్ని దృష్టిలో ఉంచుకుని, అందుకు అనుగుణంగా చట్టాన్ని అమలు చేయకుండా, దేవాదాయశాఖలోని అవినీతి పరులైన కొందరు అధికారులు తీర్పును, స్వార్థప్రయోజనానికై తమకనుగుణంగా మార్చుకుని,



ఆ తీర్పును డబ్బు సంపాదించే సాధనంగా చేసుకుని వ్యవస్థాపక ట్రస్టీలను "నియమించడం" చేస్తున్నారు. ఈ పద్ధతిని అమలు పరచటం వలన ఎన్నో సంవత్సరాల నుండి ధర్మాదాయ శాఖ రికార్డులో ఖాళీగా ఉన్న ఒక కాలమ్ (Column 4) ఇప్పటి వంశపారంపర్య ధర్మకర్తలు మరియు వ్యవస్థాపకులు ధర్మకర్తల పేర్లతో భర్తీ అయ్యింది. ఇందువల్ల చాలామంది అసిస్టెంట్ కమీషనర్ల అక్రమార్జనలు విశేషంగా పెరిగాయి.

ఇలాగే అందరు కూడా వ్యవస్థాపక ధర్మకర్తలుగా మార్చబడ్డారు, ఎక్కడో ఒకరిని ఇద్దరిని మినహాయిస్తే. ఇలాంటి ఆలయాలకు వ్యవస్థాపక ధర్మకర్త నియామకమే తప్పు. "ఒక వ్యవస్థాపకుని ఎవరైనా ఎలా నియమించగలం?" వ్యవస్థాపకులు స్వయంగా ఉంటారు కానీ నియమించబడరు.

కొత్తగా సవరింపబడిన బిల్లు - వ్యవస్థాపకులు అంటే ఎవరు అని నిర్వచించలేదు. ఎటువంటి వారు వ్యవస్థాపకులు కాజాలరు అని మాత్రం చెప్పింది. ఎవరెవరు వ్యవస్థాపకులు కారు అనే దాన్ని అమలులోకి తీసుకువస్తే కూడా, అసిస్టెంట్ కమీషనరు ద్వారా నియమించబడ్డ వ్యవస్థాపకులు తమ ఉనికిని కోల్పోగలరు. ఇప్పటి వరకు జరిగిన నియామకాలకు ఇది వర్తించదు అని చెప్పకపోయినా కూడా, సెక్షన్ 87ను సవరించడం ద్వారా కొత్త తలుపులు తెరిచింది. దీని ద్వారా డిప్యూటీ కమీషనర్లకు - వ్యవస్థాపక ధర్మకర్తలకు సంబంధించిన తగాదాల దర్యాప్తు చేసే అవకాశం కల్పించింది. ఇది తేనెతుట్టను కదిలించిన వైనం. ఇప్పటి వరకు అసిస్టెంట్ కమీషనర్లకు సులభ ధనార్జన కల్పించిన చట్టం, ఇకపై డిప్యూటీ కమీషనరులకు అక్రమార్జన చేయడానికి వీలు కల్పించింది. ఏదైతేనేం? కొత్తకొత్త లిటిగేషన్ల వలన ఆలయాలు అనేక కష్టాలకు గురి అవుతాయి. ఇప్పటి 30/87 చట్టం అవినీతి పెరుగుదలకు చక్కని వేదికని చెప్పడానికి ఇది ఉదాహరణ.

ఒకసారి ధర్మకర్తల వయోపరిమితిని పెంచి, ఇంకొకసారి వారి వయోపరిమితిని తగ్గించి, అర్చకుల ఉద్యోగ విరమణ కాలాన్ని తగ్గించి, ఒకసారి ధర్మకర్తల ఆఫీసు కాలాన్ని పెంచి వారి ఉద్యోగ కాలాన్ని కుదించి.... ఇలా ప్రభుత్వం 30/87 దేవాదాయ ధర్మాదాయ చట్టానికి ఎన్నో రకాల ప్రయోగాత్మకమైన సవరింపులు చేసింది. ఇలా మొత్తానికి ఈ చట్టం తన తరపునుంచి చేసిన మేలు ఏమంటే మొత్తం రాష్ట్ర దేవాలయ వ్యవస్థయొక్క వినాశనం. అమలులోకి తీసుకురాలేని, ఆధారపడలేనటువంటి సవరింపులు ఎన్నో ఇటువంటి నిర్వీర్యమైన చట్టానికి చేసేందుకు బదులుగా, 30/87 చట్టాన్ని తీసి అవతల పెట్టి, నిర్మాణాత్మకమైన, ప్రయోజనాత్మకమైన ఆచరణయోగ్యమైన కొత్త చట్టం తీసుకు రావడం ఎంతో అవసరం! అత్యవసరం!.......

# అనుబంధం - 6

*చిలుకూరు బాలాజీ ఆలయం కేంద్ర స్థానంగా సాగుతున్న ఆలయ పరిరక్షణ ఉద్యమానికి కరదీపిక 'వాక్'. 2001 డిశెంబరులో భక్తులకు 'వాక్' ఇచ్చిన పిలుపుకి లభించిన స్పందనతో, భక్తులు ఏకమై ఉపక్రమిస్తే 30/87 లాంటి చట్టాలు అడ్రసు లేకుండా పోతాయని నిరూపణయింది....*

ఆంధ్రప్రదేశ్‌లోని 34000 పై చిలుకు ఆలయాలను కాపాడే ఉద్యమంలో నడుం బిగించి ముందుకు నడిచిన ఈ 500 సంవత్సరాల కాలంనాటి ఆలయం, 30/87 ఎండోమెంట్సు చట్టం అనే రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది.

## దీనికి కారణాలు ఏమై ఉండవచ్చు?

1. మన దేశంలోని ఆలయాలను వినాశపరచడానికే పుట్టినటువంటి 30/87 ఎండోమెంట్సు యాక్టు అధికారాన్ని ఎదురించి నిరోధించినది ఈ చిలుకూరు దేవాలయమే; ముఖ్యంగా "వాక్" (ఆలయాల వాణి) అనే మాసపత్రిక ద్వారా తన భావాలను నలుగురికి పంచుతోంది.
2. ఆగమాలకు, రామానుజ సాంప్రదాయానికి, వల్లభ సాంప్రదాయానికి ఒక చక్కని వినూత్న సమన్వయం చేసి దానికి తగు రీతిలో పూజా విధులను ఆచరించడంలో ఈ చిలుకూరు దేవాలయం మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోనే ఒకే ఒక్క ఆలయం అని నొక్కి వక్కాణించవచ్చు
3. ఆలయాల్లో మనకు సాధారణంగా కనిపించే టిక్కెట్ల అమ్మకం, ప్రసాదాల విక్రయం వంటి వ్యాపారీకరణ లేని ఒకే ఒక్క దేవాలయం ఈ చిలుకూరు బాలాజీ ఆలయం.
4. భక్తుల యొక్క విరాళాల ద్వారా మాత్రమే ఈ ఆలయం పునరుద్ధరించబడి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. ఇక్కడ చేసినవన్నీ గుప్త దానాలే అన్నట్టుగా విరాళాలిచ్చిన భక్తుల పేర్లు వగైరా మీకు ఎక్కడ కూడా కనిపించవు. ఈ విరాళాలిచ్చిన వాళ్ళలో కొన్నివేల రూపాయలు ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు, వందలు ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు అలాగే కొన్ని రూపాయలు ఇచ్చిన వాళ్ళూ ఉన్నారు. కాని వీరందరిలోని భక్తిభావం, పురాతన కట్టడాలను కాపాడాలనే వారి ఆరాటం మాత్రం అందరిలో సమానమే.
5. ఈ ఆలయంలో మాత్రమే సమాజ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబడటం దారిద్ర్యంతో అలమటిస్తున్న వారిని పైకి తీసుకువచ్చేలా పనిచేసే తోవలలో నడుస్తోంది. జనోద్ధరణ కార్యక్రమంలో ముఖ్యంగా రాజకీయ నాయకులందరు మరియు గ్రామ ప్రజల మన్ననలు పొందినది.
6. ఇక్కడ మాత్రమే ఆలయ భూములు ఒక్క అంగుళం కూడా భూకబ్జాదారులకు పోకుండా రక్షించబడుతున్నది. కంటికి రెప్పవలె కాపాడబడింది.



7. మొయినాబాద్ మండలంలోని ప్రజల సమైక్యతను కాపాడే విషయంలో తను ఒక నిష్పాక్షిక ధోరణిని అవలంభించి రజాకార్ ఉద్యమం మరియు అనేక ఇతర ఉద్యమాలలో ప్రజలకు రక్షణ యిచ్చింది ఈ చిలుకూరు ఆలయం.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, (తేది 27/11/2001) ప్రకారం "... ప్రస్తుత యాజమాన్యం దేవాలయంలో ఏ కైంకర్యం కూడా చేయడానికి, మరియు దేవాలయాన్ని డెవలప్ చేయడానికి వీలులేని పరిస్థితులలో ఉన్నందువలన దేవాదాయ కమీషనర్‌గారి ఉత్తర్వుల మేరకు ఈ దేవాలయాన్ని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం దత్తతు తీసుకోవడానికి నిర్ణయించడమైనది..." ఈ మేరకు అధికారులు 29/11/2001 నాడు బాలాజీ దేవాలయాన్ని తమ అధీనంలోకి తీసుకోవడానికి వచ్చారు.

ఈ దేవాలయాన్ని కూడా వ్యాపార సంస్థగా మార్చడమే ధ్యేయంగా పెట్టుకున్న, ప్రస్తుత చట్టం ప్రకారం పై చెప్పబడిన యాదగిరిగుట్ట దేవాలయ అధికారులు హుండీతో, టిక్కెట్లతో, సెక్యులర్ సిబ్బందితో బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంపై 30/87 చట్టం యొక్క కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి రావడం జరిగింది.

1/12/2001 నాడు కమిషనరు గారి, 31/10/2001 నాటి చిల్కూరు బాలాజీ దేవాలయాన్ని యాదగిరిగుట్ట దేవాలయానికి దత్తతు ఇచ్చినట్లు జారీ చేసిన, ఉత్తర్వుల ప్రతిని శ్రీ సౌందరరాజన్ గారికి అందించబడింది. 3/12/2001 నాడు శ్రీ సౌందరరాజన్‌గారు కమిషనర్ గారిని కలిసి దత్తతు ఉత్తర్వులను నిలిపివేయమని, మరియు ఇద్దరు అధికారులద్వారా దేవాలయ పరిస్థితిని సమీక్షించి - ఒక నివేదిక తయారు చేయమని ప్రార్థించడమైనది.

8/12/2001 నాడు ఈ దేవాలయాన్ని 30/87 చట్టం యొక్క రక్కసి కోరలనుండి కాపాడడానికి భక్తులు ఒక అసమానమైన నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయం ప్రకారం హుండీలోకాని, హారతి పళ్ళెంలోకాని, దేవాలయ ప్రాంగణంలో ఎక్కడకూడా ఏవిధమైన కానుకలు సమర్పించకూడదు. దీనితో దేవాలయ వ్యవస్థలోని వ్యాపార ధోరణిని సమూలంగా నిలిపి వేయడం జరిగింది. ఈ నిర్ణయాన్ని భక్తులు, అర్చకుల సహకారంతో చిత్తశుద్ధితో అమలు పరుస్తున్నారు.

12/12/2001 నాడు అడిషనల్ కమిషనర్, రీజనల్ జాయింట్ కమిషనర్ ఇ.ఓ. యాదగిరిగుట్ట దేవాలయం, సంబంధిత అసిస్టెంట్ కమీషనర్ మరియు దేవాలయ ఇన్స్‌పెక్టర్‌తో కూడిన బృందం దేవాలయాన్ని సందర్శించి, అనువంశిక అర్చకులతో చర్చించారు. దీనిపై ఒక నివేదిక కూడా సమర్పించనున్నారు.

భక్తులు స్పందించి తాము నిత్యము ఆరాధించే, పూజించే, ప్రేమించే చిలుకూరు బాలాజి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఈ చట్టం ఉచ్చులనుంచి కాపాడుకోవాలని ప్రార్థిస్తున్నాము.

*ఓ బాలాజీ! నీ దేవాలయాన్ని నీవే కాపాడుకోవాలి.*

## అనుబంధం - 7

*ఆలంపూర్ (మహబూబ్‌నగర్ జిల్లా) ఆలయ అర్చకులు శ్రీ భీమసేనాచారి ఆత్మార్పణ దుర్ఘటనపై 2001 అక్టోబర్‌లో 'వాక్'...*

## ఆమ్యామ్యాకు ఆహుతి అయిన అర్చకుడు

*అర్చకులను, భక్తులను కుదిపించే రీతిలో ఒక దేవాదాయ శాఖాధికారి వేధింపులకు, అంతులేని ఆమ్యామ్యా కొరకు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకొన్న ఉదంతం. మే 28న ఈ అర్చకుడు వాక్ పత్రికకు ఒక లేఖ మూలాన తనను ఆ దేవాలయ ఇ.ఓ. విపరీతంగా వేధిస్తున్నట్లు వ్రాశాడు. ఆలేఖలోని మొదటి వాక్యాలను వాక్‌లో ప్రచురించడం కూడా జరిగింది. కాని ఎవరూ ఊహించని విధంగా సెప్టెంబరు 17న చేసేదిలేక తను ఆరాధించే దేవుడి ముందు ఉన్న గంటకు ఉరివేసుకొని ఆత్మాహుతి చేసుకున్నాడు. మన ప్రభుత్వం అర్చకుల రిటైర్‌మెంట్‌పై జారీ చేసిన ఉత్తర్వులు, అన్ని దేవాలయాల ఇ.ఓ.లకు అర్చకులనుండి ఆమ్యామ్యాలు వసూలు చేయడానికి ఉపయోగపడుతున్నట్లు 'వాక్'కు సమాచారం అందుతుంది. ఒక దేవాలయంలో వాక్ పత్రికలో మేము ప్రచురించిన ఇన్‌టరిమ్ ఆర్డర్‌ను చూపించి కొందరు అర్చకులు రిటైర్‌మెంటు నోటీసు ఇచ్చిన ఇ.ఓ.ల బారినుండి తప్పించుకున్నారు.*

*కాని, చాల చోట్ల అమాయకపు అర్చకులను వేధించడానికి ఈ జీవోను ఇ.ఓ.లు వాడుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకోకపోతే అసహాయులు, దారిద్ర్యంలో ఉన్న వేల సంఖ్యలో ఉన్న అర్చకులు భీమసేనాచారి దారినే అవలంభించవలసి వస్తుంది!*

## వీధిన పడిన పూజారి కుటుంబం

అలంపూర్ యోగ నరసింహస్వామి ఆలయంలో అర్చకుడు భీమసేనాచారి మృతితో ఆయన కుటుంబం వీధిన పడింది. ఆయన అర్చకునిగా 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. ఆయనకు ఒక తమ్ముడు, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దమ్మాయికి వివాహమైంది. కుమారుడు ఆనంద్‌కు 20 ఏళ్ల వయసు. మహబూబ్‌నగర్‌లో అక్కబావల వద్దనే ఉంటున్నాడు. ఇతను పెద్దగా చదువుకోలేదు. అర్చకునిగా పరీక్ష పాసయ్యాడు. మహబూబ్‌నగర్‌లోని రాఘవేంద్రస్వామి దేవాలయంలో అర్చకునిగా పనిచేస్తున్నాడు. భీమసేనాచారికి నెలకు రూ. 1,300ల వేతనం ఇచ్చేవారు. అది ఏ మూలకూ సరిపోక కుటుంబం అర్థాకలితో కాలం గడిపింది. భీమసేనాచారి కర్నూలు జిల్లా నిడ్జూరు గ్రామానికి చెందినవారు. అలంపూర్‌కు 40 ఏళ్ల కిందట వచ్చారు. రెండో అమ్మాయి అలంపూర్‌లోని ఓ కాన్వెంట్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. చిన్న అమ్మాయి మహబూబ్‌నగర్‌లో కంప్యూటర్ కోర్స్ చేస్తున్నారు. భీమసేనాచారి సంపాదనతోనే చిన్న కూతురు చదువు కొనసాగిస్తున్నారు.



భార్య ఇంటి వద్ద దుకాణం నడుపుతున్నారు. ఒక ఇల్లు ఉంది. పిల్లల పెళ్లిళ్లు చేయాలని చాలా కాలంగా భీమసేనాచారి ఆలోచించారు. చేతిలో డబ్బులేక, సంబంధాలు వచ్చినా చేయలేకపోయాడు. ఇతనికి నిడ్జూరులో రెండెకరాల పొలం ఉండేది. పెద్ద కూతురు పెళ్లికోసం ఆ పొలాన్ని అమ్మివేశాడు. ఒక్క కొడుకుకు శాశ్వత పురోహిత ఉద్యోగం ఇప్పించుకోవాలని ఆలయ ఇ.ఓ. చుట్టూ తిరిగారు. ఆమ్యామ్యా ఇవ్వనిదే ససేమిరా కుదరదని కొందరు పట్టుపట్టినట్లు సమాచారం. భీమసేనాచారికి కళ్ళు సరిగా కనబడవు. వయసు మీద పడింది, అయినప్పటికీ ఇతను యోగనరసింహస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయాలలో పూజలు నిర్వహించారు. అర్చక పరీక్షలు ఉత్తీర్ణుడైనప్పటికీ జీతంలోనూ మార్పురాలేదు. ఆలయ ఇ.ఓ. సిబ్బందిల ప్రవర్తనకు విసిగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

**కనిపించని ఆలయ అధికారి :** ఆలయ అధికారి వేణుగోపాల్ మంగళవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయారు. సిబ్బంది కూడా ఈ విషయంపై సరైన వివరణ ఇవ్వడంలేదు. కొందరు సిబ్బంది సెలవు పెట్టి వెళ్ళారు. అర్చకుని మృతికి కారణమని భావిస్తున్న అధికారి హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. వేణుగోపాల్ ఇ.ఓ.గా ఇక్కడ పదేళ్లుగా పనిచేస్తున్నారు. పూజారి మరణిస్తే తక్షణ సహాయం అందించాలన్న విషయం కూడా పట్టించుకోకుండా వెళ్లిన అధికారిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(**ఈనాడు** సెప్టెంబర్ 18)

## PRIEST'S SUICIDE TOUCHES OFF FURORE

A temple priest, Mr. Bhimasenachari, 60, committed suicide by hanging himself from the temple bell in Narasimhaswamy temple in Alampur, 25 km from here in Mahabubnagar district, on Monday. According to reports, the priest took the extreme step unable to cope with termination of his employment due to retirement age.

Mr. Bhimasenachari was due to retire two years ago but the service was extended on compassionate grounds. However, the Executive Officer of the temple, Mr. Venugopal, served a notice on the priest informing about the retirement recently. As the priest's efforts to get his son appointed for the post failed, he took the extreme step unable to face financial troubles. The devotees who saw the body hanging from the bell alerted others.

The family of the priest alleged that the authorities were demanding money to extend his service. When he failed to offer the bribe, they decided to retire him forcibly. The priest is survived by wife, three daughters and one son. Two daughters were yet to be married off. The police registered as a case of suspicious death and are investigating.

Our Hyderabad Special Correspondent writes:

The Telangana Archaka Samakya demanded that the EO should be asked to go on leave and his office room sealed, to facilitate an enquiry into the suicide.

The archaka committed suicide because he was not paid his meagre salary of Rs.1,200 per month for six months. The archaka also wrote a letter to Mr. M.V. Soundararajan, President of the samakya, in May saying he was being harassed by the EO of the temple, and that he even considered ending his life to escape the harassment.

Mr. Soundararajan met a Deputy Commissioner of the Endowments Department today and urged him to constitute an enquiry committee and arrive at the truth behind the archaka's suicide.

## అనుబంధం - 8

*ఓటర్లయిన భక్తులంతా ఈ పాశవిక (39/87) చట్టం సరిచేయబడేలా తమ ఓటు హక్కుని (శక్తిని) వినియోగించాలని పిలుపునిస్తూ, 2003 డిశెంబర్‌లో 'వాక్'.....*

ఓటు హక్కు కల్గిన జనాభాలో భక్తుల శాతం గణనీయమైనది. ప్రజాస్వామ్యంలో ఓటరులకు తాము ఏవిధంగా పరిపాలింపబడాలని కోరుకుంటారో విస్పష్టంగా తెలియపరచేందుకు అపూర్వమైన అవకాశం వుంది. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీని రద్దు పరచటం వల్ల త్వరలో మళ్లీ ఎన్నికలు నిర్వహించవలసిన అవసరం ఏర్పడింది. దౌర్భాగ్యకరమైన 30/87 దేవాదాయ చట్టం పునః పరిశీలించబడవలసిన అవసరం అత్యవసరంగా ఉంది. ఈ చట్టం కారణంగా ఈ 16 సం॥ల కాలంలో వేలాది దేవాలయాలు మూతబడి, చెప్పనలవి కాని వినాశము జరిగిందనటం నిస్సందేహం. దేవాలయంలోనే కాదు, సమాజ జీవితంలోని ప్రతిరంగంలోనూ చీకట్లు ముసురుకుంటున్నాయి. ఇప్పుడైనా దీపాలను వెలిగించవలసిన అవసరం వుంది. ఈ చీకట్లను పారద్రోలవలసిన అవసరం వుంది. ఈ దేవాదాయ చట్టం సమగ్ర పునః పరిశీలనకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తమ తమ ఎన్నికల మానిఫెస్టోలలో వివిధ రాజకీయ పార్టీలు ప్రస్తావించవలసిన అవసరం వుందని గుర్తించేలా చేయాలి.

దేవాలయాలలో విస్తారంగా పాతుకుపోయిన వ్యాపార ధోరణులను తొలగించవలసిన అవసరాన్ని రాజకీయ పార్టీలు గుర్తించేలా, భక్తులు తమ దృఢ సంకల్పాన్ని తెలియపరిచే సదవకాశం ఇపుడు వచ్చింది. ఇది అత్యంత ప్రాధాన్యత కల అంశం. దౌర్భాగ్యకరమైన 30/87 దేవాదాయ చట్టం పునః పరిశీలనకు వివిధ రాజకీయ పార్టీలు, తమ ఎన్నికల మానిఫెస్టోలలో అత్యంత ప్రాధాన్యత గల అంశంగా చేర్చవలసిన అవసరముంది.

దేవాలయాలు భక్తులకు దక్కాలని మనం భావిస్తే ఇదే సరియైన సమయం.

### సర్వేజనాః సుఖినో భవంతు